
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

గురువారం 24 ఆగస్టు 2017 • 16



కుట్టు మిషన్ తో మంత్రి జవహర్ సందడి

కాకినాడ కిటకిటలాడుతోంది. నేతలంతా ఇక్కడే ఉన్నారు. హోటళ్లు నిండిపోయాయి. స్థానిక నాయకుల ఇళ్లు పార్టీ ముఖ్యులతో సందడిగా మారాయి. పగలు ప్రచారం.. రాత్రి వ్యూహాలతో నేతలు క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు..

జోష్!

వేడెక్కిన ప్రచారం.. వీధివీధినా నేతలు

సామాన్యులు, మంత్రులూ, అగ్ర నేతలంతా ప్రచార పర్వంలోనే

అందరి కన్నా సామాజిక ఓట్లపైనే

ఆయా సామాజిక వర్గాల నేతలతో మంతనాలు

(ఆంధ్రజ్యోతి, కాకినాడ)

కాకినాడలో ఎన్నికల ప్రచారం కాకమీదుంది. పోలింగ్ సమయం సమీపిస్తుండడంతో ప్రచారం హోరెత్తుతోంది. రెండే రోజుల్లో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ వ్యూహాలు మార్చేశాయి. కాకినాడలో సామాజిక వర్గాల ప్రభావం అధికంగా ఉందని అంచనా వేసిన నేతలు ఆయా సామాజిక వర్గాల ఓట్ల కోసం పెద్దఎత్తునే వ్యూహం పన్నాయి. బుధవారం నాడు కాపు, మత్స్యకార, వైశ్య, శెట్టిబలిజ, బ్రాహ్మణ, క్షత్రియ తదితర వర్గాల నేతలను రంగంలోకి దించేశాయి. ఇటు ప్రచారం, అటు మంతనాలతో ఆ ప్రతినిధులంతా హోరెత్తించారు. ఇప్పటికే అన్నింటా తమదే పైచేయి అని ప్రధాన పార్టీలు ప్రకటించేశాయి. అయితే రెండు ప్రధాన పార్టీల అగ్రశ్రేణి నాయకత్వానికి కొన్ని డివిజన్‌లపై ప్రత్యేకాభిమానం ఏర్పడుతున్నట్టు కనిపిస్తోంది. అభ్యర్థుల దగ్గర నుంచి అధినాయకుల వరకూ అందరూ సదరు డివిజన్‌లలో తెగ తిరుగుతున్నారు. అదేంటీ అన్ని డివిజన్‌లతో ఈ డివిజన్‌లు సమానమే కదా అని - మిగతా 15లో



ప్రచారంలో డప్పు వాయిస్తున్న బీజేపీ మంత్రి మాణిక్యాలరావు



ప్రచారంలో వైసీపీ నేత విజయసాయి రెడ్డి



మంత్రి కొల్లు రవీంద్ర..



కాంగ్రెస్ నేత పళ్లంరాజు..



ముగ్గురూ ఒకే రోజు

ఈనెల 26న చంద్రబాబు, జగన్, రఘువీరా రాక

రెండు రోజుల పాటు ఇక్కడే ప్రచారం

29న కాకినాడ కార్పొరేషన్ పోలింగ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-కాకినాడ)

కాకినాడ ఎన్నికలకు గడువు దగ్గరపడుతోంది. ఇక ఐదు రోజులే సమయం ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు టీడీపీ, మిత్రపక్షం బీజేపీ, ప్రతిపక్షం వైసీపీ, కాంగ్రెస్ పార్టీ వారి వారి అభ్యర్థుల తరపున ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నంద్యాల ఉప ఎన్నికలు ముగియడంతో టీడీపీ, వైసీపీ, బీజేపీ తమ నేతలను కాకినాడకు రప్పించారు. ఈనెల 26వ తేదీన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు, వైసీపీ అధ్యక్షుడు జగన్, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కాకినాడకు తరలి వస్తున్నారు. చంద్రబాబు, జగన్‌లు ఈనెల 24నే వస్తారని భావించారు. అయితే - మిగతా 15లో



ఈవీఎంలకు సీల్ వేస్తున్న దృశ్యం

ఈవీఎం బ్యాలెట్ దాటని..

అభ్యర్థుల సంఖ్య

అత్యధికం 12 మంది అభ్యర్థులే..

బోడసకుర్రు - పాశర్లపూడి వంతెన



వేటు పడింది!

వైనతేయ వారధి నిర్మాణంలో అక్రమాల బాధ్యులపై ప్రభుత్వం కొరడా

ఎన్‌హెచ్ ఈఎన్‌సీతో సహా ఏడుగురి ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు

రూ.5.65 కోట్ల నిధుల దుర్వినియోగంపై విచారణ పూర్తి

రిటైర్ అయిన నలుగురు ఇంజనీరింగ్ అధికారులు

బాధ్యులలో డిప్యూటీ సీఈతోపాటు ఎన్‌హెచ్ మేనేజర్, ఏఈ - 15లో

మినీ లోకం



డాక్టర్‌గారు థర్మామీటర్ పెట్టమన్నది నోట్లో..!!



అన్నవరం సమాచారం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో బుధవారం 875 వ్రతాలు జరిగాయి. వివిధ విభాగాల ద్వారా రూ.9లక్షలు ఆదాయం లభించగా అన్నదాన పథకానికి రూ.లక్షా33వేలు విరాళంగా సమకూరింది. దేవస్థానం విచారణ కార్యాలయం నెంబరు 08868-238163.

- అన్నవరం

సత్రం వివరం	గదులు	ఖాళీలు
సీతారామ సత్రం	93	20
ఓల్డ్‌సీసీ	47	17
న్యూసీసీ	47	15
ప్రకాశ్‌సదన్	86	24
ఎస్‌జీహెచ్	59	10
హరిహరసదన్	140	75
సత్యనికేతన్	60	30
వనదుర్గ	12	5



అంతర్వేది సమాచారం

అంతర్వేది: శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదానానికి బుధవారం 586మంది భక్తులు విచ్చేయగా విరాళంగా రూ.30971 ప్రత్యేక టిక్కెట్ల ద్వారా రూ.20550 వచ్చినట్టు ఇన్‌చార్జి ఆలయసహాయ కమిషనర్ ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్	(రూ.)
ఫారం	84
రిటైల్	99
విత్‌స్కిన్	139
స్కిన్‌లెస్	163

నెక్.. కోడి గుడ్డు

గోదావరి జోన్ రైతు ధర రూ.3.59
తూ.గో.జోన్ రైతు ధర రూ.3.59

గణేశా.. నీకూ జీఎస్టీనా?

వినాయక విగ్రహాల తయారీ నిర్వాహకులకు పన్నుపోటు
పెరిగిన ధరలు, తయారీదారుల్లో ఆందోళన



వినాయక విగ్రహాలు

సామర్లకోట: వినాయకచవితి వస్తుందంటే ఆ కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. పండుగంతా తమదే అన్నట్టుగా ఒకరికి ఒకరు ఏకమై నాలుగు నెలల ముందునుంచి విగ్రహాల తయారీకి సిద్ధపడుతుంటారు. వివిధ రూపాల్లో రంగు రంగుల దేవతామూర్తుల విగ్రహాలకు వీళ్ల ప్రాణంపోస్తారు. రాజస్థాన్, చత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలనుంచి మన జిల్లాకు వలస వచ్చిన కుటుంబాలు విగ్రహాల తయారీపైనే జీవిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాలతోపాటు సామర్లకోట ఐదు తూములవద్ద, మాధవపట్నం బస్‌షెల్టర్ వద్ద, సర్పవరం ఆటోనగర్ సమీపాన ఈ వలస కుటుంబాలు ఈ విగ్రహాల తయారీలో నాలుగు నెలల ముందు నుంచి నిమగ్నమవుతూ ఉపాధి పొందుతూ ఉంటారు. వీరి జీవితాలు మాత్రం రోజురోజుకు రంగులు మారుతున్నాయి. తాజాగా జీఎస్‌టీ ప్రభావం ముడిసరుకు ధరపై పడడంతో ధరలు ఆకాశానంటుతున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు అతి తక్కువ ధరకే లభిస్తుండడం వీరి జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

విగ్రహాల తయారీతో జీవనం

దేవుణ్ని చేసిన మనుషులుగా వీరికి బొమ్మలు తయారీనే జీవనాధారం. సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల్లో 7, 8 ఏళ్లుగా వచ్చి ఈ ప్రాంతాల్లో స్థిరపడిన వీరు బొమ్మలనే ఇంటి పేరుగా చేసుకోవడం విశేషం. స్థానికంగా 20మందికి వరకు వీరు ఉపాధి కల్పిస్తున్నారు. వినాయక చవితి, దేవీ నవరాత్రులకు సైతం విగ్రహాలు తయారుచేస్తుంటారు. ఈ పరిసర ప్రాంతాలకు చెందిన వారే కాకుండా పుదుచ్చేరి అంతరభాగమైన యానాం, తెలంగాణ ప్రాంత శివారు గ్రామాలు, చింతూరు పరిసర ప్రాంతాల ప్రజలు సైతం ఇక్కడి నుంచే బొమ్మలను కొనుగోలు చేసి తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో 100 శిబిరాలు వరకు ఈ సీజన్‌లో ఏర్పాటు చేసుకుని 50వేల పైచిలుకు విగ్రహాలను సిద్ధం చేస్తారని సమాచారం ఉంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు వీరి దరిచేరకపోవడంతో సంఘాల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుని వాటితో ఏడాది అంతా బొమ్మలు తయారీపైనే జీవితాలు నెట్టుకొస్తున్నారు. అప్పులకు వడ్డీలు కట్టలేక ఆ పూటకు పొట్ట నిండితే చాలని దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఈ కళాకారులు తొలి రెండు నెలల్లో స్థలసేకరణ, గుడారాలు ఏర్పాటు, ముడి పదార్థాల కొనుగోళ్లు, అచ్చుల రూపకల్పనలో నిమగ్నమవుతారు. ఆ తర్వాత నుంచి విగ్రహాల పనులు ప్రారంభిస్తారు. ఒక్కొక్క కూలీ ఐదునెలలపాటు ఒప్పందం కుదుర్చుకుని రూ.50వేలు చెల్లిస్తున్నారు. ప్రధాన కళాకారులకు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ఇస్తున్నారు. టన్ను కొబ్బరి పీచు రూ.18వేలవరకు ఉండగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ టన్ను రూ.10వేలు, రంగులు, సున్నం, అచ్చులు, కూలీ ఖర్చులకు అదనంగా మరో రూ.60వేలు చెల్లిస్తే వాటి నుంచి ఆరు బొమ్మలు తయారవుతాయి. వీటిని గరిష్ఠంగా రూ.లక్షా20వేల వరకు అమ్ముతారు. అన్ని ఖర్చులు పోను ప్రతి ఆరు విగ్రహాలకు రూ.10వేలకు మించి పరిస్థితి లేదు. అలా 100 విగ్రహాలు తయారుచేస్తే రూ.2లక్షలు ఆదాయం లభిస్తుంది. దీన్ని నలుగురు భాగస్వాములు పంచుకోవాలి. అంటే ఒక్కో కుటుంబానికి రూ.50వేలు మాత్రమే మిగులుతుంది. ఒక పూట పచ్చుటి మెతుకులు, ఒక పూట రొట్టెలతో కాలం వెళ్లదీస్తున్నారు.

ముడి సరుకులపై జీఎస్‌టీ

సాధారణంగా కళాకారులు వినాయక విగ్రహాలను జనవరి నుంచి వినాయకచవితి పండుగ వచ్చే వరకు తయారుచేస్తుంటారు. భారీ విగ్రహాలు నుంచి చిన్న విగ్రహాలు వరకు తయారుచేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్‌టీ విధానం వీరి జీవితాలపై పడింది. మొన్నటి వరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బస్తా 40కిలోల రూ.500 ఉంటే జీఎస్‌టీ అనంతరం రూ.650కి చేరింది. టన్ను కొబ్బరి పీచు, రంగులు, సున్నం ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో గతేడాది కంటే 50శాతం మేర బొమ్మల తయారీ తగ్గించామని కళాకారులు చెబుతున్నారు. గతేడాది పెద్ద విగ్రహాలు రూ.15వేలకు విక్రయిస్తే ఈ ఏడాది అదే విగ్రహం రూ.20వేల చొప్పున విక్రయించాల్సి ఉంటుందని రాజస్థాన్‌కు చెందిన విగ్రహాల తయారీదారుడు కౌరవ్ కుమార్ పేర్కొన్నారు.

మేం కడతామండి..!

- వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యసాధనకోసం అధికారుల పాట్లు
- స్థలం చూపిస్తే ఐఎస్‌ఎల్ నిర్మాణానికి అధికారులు రెఢీ
- నిర్మాణాలకు అడ్వాన్సుగా చెల్లింపులు..

ఉప్పలగుప్తం: జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల లక్ష్యసాధనకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తోంది. జిల్లాను వచ్చే గాంధీ జయంతి నాటికి ఓడీఎఫ్ చేయాలన్నది అధికార ధ్యేయం. ఇది సాధ్యమేనా అని తర్జనభర్జన జరుగుతోంది. జిల్లాకు 1,81,529 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణం నూరుశాతం పూర్తయితే ఓడీఎఫ్ జిల్లాగా తూర్పుగోదావరి నమోదవుతుంది. ఇప్పటికీ 86,280 మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయింది. 11,977నిర్మాణదశలో ఉన్నాయి. లక్ష్యం చేరుకోవాలంటే ఇంకా 46శాతం నిర్మాణాలు జరగాలి. గ్రామాల్లో గతంలో సర్వేలు చేసి అర్హుల జాబితాల ప్రకారం వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరుచేశారు. ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించక జిల్లాస్థాయినుంచి గ్రామస్థాయి వరకు అధికారులు కుస్తీలు పడుతున్నారు. ముందుగా కొంతసొమ్ము ఇస్తాం, మరుగుదొడ్డి నిర్మాణం ప్రారంభించండి అంటూ లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. లేదా స్థలం చూపిస్తే మేమే కట్టిస్తామంటూ భరోసా ఇస్తున్నారు. వాస్తుదోషం లేకుండా సిద్ధాంతులను కూడా తామే తీసుకొచ్చి మరుగుదొడ్డి నిర్మాణం పూర్తిచేస్తామని అధికారులు హామీనిస్తున్నారు. అయినా నిర్మాణాల్లో ప్రగతి అంతంతమాత్రంగానే ఉంది. గతంలో ఐఎస్‌ఎల్ నిర్మాణాలకు క్యూకట్టిన లబ్ధిదారులు నేడు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారన్నది ప్రశ్నగా మిగిలింది.



నిర్మాణంలో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్డి

ఇదీ గతం.. ఐఎస్‌ఎల్ నిర్మాణాలు గతంలో కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరిగింది. మంజూరు జాబితాలో తమ పేరుకోసం లబ్ధిదారులు గట్టి ప్రయత్నాలే చేశారు. అప్పట్లో ఆర్‌డబ్ల్యూఎస్, అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మాణాల పర్యవేక్షణ జరిగింది. తొలుత కొందరు నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. వారికి సకాలంలో బిల్లుల చెల్లింపు జరగలేదు. దీంతో అప్పులపాలైన లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఈ కారణంగా మిగిలిన లబ్ధిదారులు నిర్మాణాలకు వెనుకడుగు వేశారు. ఈ సమయంలో ప్రభుత్వం ప్రతి మండలంలోను కొన్ని గ్రామాలను ఓడీఎఫ్‌గా ప్రకటించి అక్కడే ఐఎస్‌ఎల్ నిర్మాణాలకు అనుమతిచ్చింది. అనుకున్నట్టుగా ప్రకటించిన గ్రామాలు ఓడీఎఫ్ కాలేదు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తికాకపోయినా బిల్లులు చెల్లించి నిర్మాణాలు పూర్తయినట్టు జాబితాలు సిద్ధం చేసిన ఉదంతాలు చోటుచేసుకున్నాయి.

ప్రస్తుతం.. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోను గ్రామాలవారీగా వ్యక్తిగత మరుగుదొడ్డి అవసరమైన కుటుంబాలను సర్వే చేశారు. ఆయా గ్రామాల్లో ఐఎస్‌ఎల్ నిర్మాణాలకు కాలనిర్దేశం చేశారు. నెలలుగడుస్తున్నా లక్ష్యం నెరవేరలేదు. దీనితో ప్రతి మండలానికి ఐఎస్‌ఎల్ నిర్మాణాలపై ప్రత్యేక అధికారులను నియమించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు గ్రామాల్లో లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకునేలా చూసే బాధ్యతను తీసుకున్నారు. ప్రతివారం ప్రత్యేకాధికారులు సమీక్షలు చేసి పురోగతిపై నివేదికలు సమర్పిస్తున్నారు. ఇప్పటికీ కొన్నిమండలాల్లో పురోగతి లేకపోవడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కారణాలు ఏంటి.. ఇటుక, ఇసుక ధరలు అందుబాటులో లేకపోవడం లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. ఉచిత ఇసుక అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రూ.4వేలకు కూడా ట్రాక్టర్ ఇసుక దొరకడంలేదు. ఇటుకల ధర వెయ్యికి రూ.5వేలు పలుకుతోంది. ఈనేపథ్యంలో ఐఎస్‌ఎల్ నిర్మాణాలకు లబ్ధిదారులు వెనుకాడుతున్నారు.

దిగివచ్చిన ప్రభుత్వం.. లక్ష్యం సాధించాలంటే కొన్ని నిబంధనలు సడలించక తప్పదని అధికారులు గ్రహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేవారికి ముందుగా కొంత సొమ్ము ఇచ్చేందుకు వెసులుబాటు కల్పించారు. పంచాయతీల్లో 14వ ఆర్థిక సంఘం నిధులు ముందుగా నిర్మాణాలకు కేటాయించి బిల్లులు వచ్చిన తర్వాత జమ చేసుకునే ఏర్పాట్లు చేశారు. మరికొందరికి డ్వాక్రా సంఘాల స్త్రీశక్తి నిధి నుంచి రుణం ఇచ్చే ఏర్పాటు చేశారు. సెప్టెంబరు నెలాఖరుకు లక్ష్యం సాధించాలన్నది అధికారుల తాపత్రయం.

బాధ్యతను గుర్తించాలి.. వ్యక్తిగత మరుగుదొడ్ల విషయంలో లబ్ధిదారులు తమ బాధ్యతను గుర్తించాలి. ఐఎస్‌ఎల్ నిర్మాణాలు ప్రభుత్వం కోసమే అన్నట్టుగా కొందరు వ్యవహరించడంపై పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఆరోగ్యం, ఆత్మగౌరవం కాపాడుకునే దిశగా కుటుంబ యజమానులు బాధ్యత తీసుకోవాలన్నది గుర్తించాల్సిన విషయం. బహిరంగ మలవిసర్జన నుంచి జిల్లాను బయటపడేసే విధానం అందరూ ఆలోచించాలి. అప్పుడే స్వచ్ఛభారత్ సాధ్యమవుతుంది.

రెడ్‌'రాయల్'!

లాభాలు పంచుతున్న రెడ్‌రాయల్ బొప్పాయి సాగు
ఎకరానికి 60 నుంచి 70టన్నుల దిగుబడి
రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఆదాయం

గండేపల్లి: జిల్లాలోని గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామంలో సాగుచేస్తున్న రెడ్‌రాయల్ బొప్పాయి పంట రైతులు సిరులు కురిపిస్తోంది. రూ.50వేల పెట్టుబడితో ఎకరానికి 60 నుంచి 70టన్నుల వరకు దిగుబడికి వస్తోంది. టన్ను రూ.6వేల వరకు ధర పలుకుతుండగా రూ.3లక్షలనుంచి రూ.4లక్షల వరకు రైతులు లాభం పొందుతున్నారు. ఈ పంట ప్రతినెలా 15రోజులకోసారి పంట చేతికి అందడంతో రైతులు అధిక లాభాలు పొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా 70ఎకరాల్లో ఈసాగు చేపడుతున్నారు. యల్లమిల్లిలో మదిరెడ్డి కృష్ణార్జున అనే రైతు 50 ఎకరాల్లో ఈ పంట సాగుచేస్తున్నారు. మొదట 25ఎకరాల్లో సాగు చేపట్టగా దాని లాభాలు చూసి మరో 25ఎకరాల్లో సాగు ప్రారంభించారు. ఈ బొప్పాయి పంట మొక్క వేసిన ఆరునెలల్లోపు పంట చేతికందడం ఒక్కో కాయ రెండున్నర నుంచి మూడు కిలోల బరువు ఉంటుంది. చేతికందిన పంటను ఇక్కడినుంచి ఒడిస్సా రాష్ట్రానికి భారీ ఎత్తున ఎగుమతులు చేస్తున్నారు. కాని ఈ సాగు చేసేందుకు ఎంతోమంది రైతులు సిద్ధమైనప్పటికీ విత్తనం దొరక్కపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఐదునెలలక్రితం విత్తనాలు దొరికిన సమయంలో కొనుగోలు చేసి నారు వేయడంతో మరో 25 ఎకరాల్లో సాగుకు విత్తనం లభించిందని రైతు తెలిపారు. ఈ విత్తనాలకోసం శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి రైతులు యల్లమిల్లి విచ్చేసి తోటలను పరిశీలిస్తారన్నారు. ఈ పంట రెండేళ్ల వరకు దిగుబడి వస్తూనే ఉంటుందన్నారు. హార్టీకల్చర్ ద్వారా బొప్పాయి పంటకు రూ.19వేలనుంచి రూ.20వేల వరకు రాయితీ కల్పిస్తోంది.

ఆదాయంలో బొప్పాయికి మించిన సాగులేదు..

ప్రస్తుతం మెట్ట సాగులో దుంప, పొగాకు, పత్తి, మిరప అన్నింటి కంటే ఆదాయంలో బొప్పాయికి మించిన సాగు లేదు.



గండేపల్లి మండలం యల్లమిల్లిలో బొప్పాయి తోట

గడిచిన రెండేళ్ల క్రితం బొప్పాయిని శాంపిల్‌గా వేశాను. అధిక లాభాలు తెచ్చిపెట్టడంతో 25ఎకరాల్లో సాగుచేయగా మరో 25ఎకరాల్లో తోట వేసేందుకు పొలం సిద్ధం చేశాను. పెద్ద పెండలంలో రూ.10లక్షల నష్టం వాటిల్లిన ఈ బొప్పాయి సాగు వల్లే నష్టాన్ని నివారించుకున్నా.

-రైతు మదిరెడ్డి కృష్ణార్జున

పింఛన్ మంజూరులో జాప్యం...

మండల పరిషత్ ఉద్యోగులు ఇద్దరిపై వేటు

మండపేట: 2002లో ఉద్యోగ విరమణ చేసిన కేశవరం పంచాయతీ కార్యదర్శికి సంబంధించి పింఛన్, ఇతర అలవెన్సుల చెల్లింపులో జరిగిన జాప్యంపై ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఈ జాప్యానికి గల కారణం ఎవరు? వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదనే దానిపై ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. కార్యదర్శికి సంబంధించి పింఛన్, ఇతర రాయితీల చెల్లింపులు 2002 నుంచి 2017 వరకు పనిచేసిన మండల పరిషత్ అధికారులు 8 మంది, సూపరింటెండెంట్‌లు ముగ్గురు, సీనియర్ అసిస్టెంట్‌లు అయిదుగురి పాత్ర ఉందని గుర్తించింది. ప్రభుత్వం పై అధికారులను బాధ్యులుగా గుర్తించి వారికి తాఖీదులు పంపించింది. అతని పింఛన్, ఇతర అలవెన్సుల చెల్లింపులో జాప్యంపై సీరియస్‌గా పరిగణించిన న్యాయస్థానం అదేశాల మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ చర్యలకు ఉపక్రమించారు. పిటిషన్ దారుడు కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి, మండల అభివృద్ధి అధికారులు, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లను బాధ్యులుగా కేసు వేశారు. దానిపై స్పందించిన అధికారులు అప్పటినుంచి ఇప్పటి వరకు పనిచేసిన అధికారులను తాఖీదులు పంపించి ప్రస్తుతం మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సుగుణకుమారి, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్వరరావులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న సిబ్బంది తమ తప్పిదం లేదని గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం మండపేటలో మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై వేటు పడింది. మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిపై తరచూ వేటుపడటంపై ఉద్యోగులలో అందోళన ప్రారంభమైంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవోలు, ఇవోపీఆర్‌డీలో కూడా సస్పెండ్ అయ్యారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు ఇప్పుడు సస్పెండ్‌కు గురికావటంతో అలజడి ప్రారంభమైంది. ఇక్కడ కార్యాలయం వాస్తు దోషమా? లేక ఉద్యోగులు తప్పిదమా? అనే విషయంపై తోటి ఉద్యోగులు మల్లగుల్లాలు పడుతున్నారు.



రైతులతో పరిహారం చెల్లింపులపై చర్చిస్తున్న ఐవోసీ అధికారులు

ఐవోసీ అధికారుల గ్రామసభ

ఏలేశ్వరం: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీ) పైపులైన్ నిమిత్తం చేపట్టే భూసేకరణకు సంబంధించి తమకు పూర్తిస్థాయి పరిహారం అందించాలని యర్రవరం, సిరిపురం, ఏలూరు గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. బుధవారం ఐవోసీ అధికారులు ఎం.గోపికృష్ణ, త్రినాధ్, సంతోష్, సాగర్, పృధ్వీ పారాదీప్, విశాఖ నుంచి హైదరాబాద్ వరకు పెట్రోల్‌ను తరలించే నిమిత్తం ఏర్పాటు చేయనున్న పైపులైన్ పనుల నిమిత్తం రైతుల వద్ద నుంచి భూములను సేకరించేందుకు గ్రామసభలు నిర్వహించారు. ఏలేశ్వరం ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల పరిధిలోని యర్రవరం, సిరిపురం, చిన్నింపేట, ఏలూరు గ్రామాల రైతులు హాజరయ్యారు. సభలో ఆయిల్ కార్పొరేషన్ అధికారుల బృందం మాట్లాడుతూ ఇంధనం తరలింపు నిమిత్తం యర్రవరం, సిరిపురం, ఏలూరు గ్రామాల్లోని రైతుల భూముల గుండా పైపులైన్ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయే రైతులకు రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు నిర్ధేశించిన భూముల ధర విలువను తీసుకుని ఎకరాకు పదిశాతం వంతున పరిహారం అందిస్తామన్నారు. రైతులు దీన్ని వ్యతిరేకిస్తూ తమ భూములకు మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు 50 శాతం వంతున పరిహారం అందించాలని లేని పక్షంలో పైపులైన్ భూమితో పాటు మిగిలిన మొత్తం భూమిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కోరిన విధంగా అధికారులు పరిహారం చెల్లించేందుకు అంగీకరించకపోవడంతో రైతులు నిరసన వ్యక్తం చేస్తూ గ్రామసభను బహిష్కరించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జూరి సూర్యనారాయణ, బస్సా ప్రసాద్, బీశెట్టి అప్పలరాజు, అల్లం ఆదినారాయణ, దాడిశెట్టి రాజారావు, సోము సూర్యుడు, బేరి రామలింగేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజ్ లో మృత శిశువు లభ్యం

మండపేట: పట్టణంలోని 12వ వార్డు పరిధిలోగల ప్రకాశం మున్సిపల్ పాఠశాల సమీపంలో మున్సిపల్ డ్రైన్‌లో బుధవారం సీసీడ్రైన్ పనిచేసే కార్మికులు మృతశిశువును గుర్తించారు. సంచిలో చుట్టేసి వున్న మగ శిశువు మరణించి ఉండటాన్ని వారు గమనించి వెలికితీశారు. అనంతరం మృత శిశువును స్థానికులు ఖననం చేశారు.

విగ్రహాన్ని అవమానపర్చిన కేసులో...

ఇద్దరు యువకుల అరెస్ట్

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం మండలం అంగర ఊరచెరువు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఈనెల 1వ తేదీన చెప్పులు దండవేసి అవమానపర్చిన కేసులో ఇద్దరు యువకులను బుధవారం అంగర పోలీసులు అరెస్ట్ చేసారు. ఎస్సై బి. రాజేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...అంగర గ్రామానికి చెందిన అడ్డాల శరణ్‌కుమార్, అదే గ్రామానికి చెందిన సంకాబత్తుల నాగేంద్రలను అదుపులోకి తీసుకుని ఆలమూరు ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించామన్నారు. వారికి మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజేష్‌కుమార్ తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక



చిలుకూరి శ్రీనివాసరావు

కడియం: నెంబర్-1 ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ నుంచి తనకు సమాచారం అందినట్లు విలేకరులకు తెలిపారు. వచ్చేనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి కోవింద్, కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్‌ల చేతుల మీదుగా శ్రీనివాసరావు ఈ అవార్డు అందుకోనున్నారు. ఈ అవార్డుతో పాటు బంగారు పతకం, రూ. 50వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందచేయనున్నట్లు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో రాష్ట్రం నుంచి ఆరుగురు ఉపాధ్యాయులను జాతీయ అవార్డుకు ఎంపిక చేయగా జిల్లా నుంచి శ్రీనివాసరావుకు ఈ అవకాశం దక్కింది. ఈయనకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

విజయనగరం సీఈవోగా వెంకటేశ్వరరావుకు పదోన్నతి



సామర్లకోట: విజయనగరం జిల్లా సీఈవోగా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో గెజిటెడ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న టి.వెంకటేశ్వరరావుకు పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. బుధవారం రాత్రి పంచాయతీరాజ్ ప్రత్యేక కమిషనర్ జవహర్‌రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కైలాష్‌గిరీశ్వర్‌ను ప్రకాశం జిల్లా సీఈవోగా బదిలీ చేస్తూ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం నుంచి మరో రెండు రోజుల్లో వీరిద్దరు రిలీవ్ కానుండగా వీరి స్థానంలో ఎవరిని నియమించిందీ తెలియరాలేదు.

ముగిసిన ఉపాధ్యాయుల టెలీకాన్ఫరెన్స్

వై.రామవరం: వై.రామవరం ఎమ్మార్సీ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల టెలీ కాన్ఫరెన్స్ శిక్షణా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. మూడో రోజు ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా శిక్షణిచ్చారు. ఎంఈవో ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కలగాలంటే వారికి అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. విద్యా ప్రమాణాలతో పాటు పాఠశాలల నిర్వహణ సమర్థవంతంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, శిక్షణ నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రగతి లోపిస్తే చర్యలు

కలెక్టర్ కార్తికేయ మిశ్రా అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు కార్తికేయ మిశ్రా, హాజరైన అధికారులు

రంపచోడవరం: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాల అమలులో వెనుకబడ్డ అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కార్తికేయ మిశ్రా జిల్లా అధికారులను హెచ్చరించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్‌లో సుమారు 30 శాఖలకు చెందిన జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి నిర్మాణ పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతి ప్రగతిపై సమీక్షించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించి, నిర్మాణ పనుల్లో ఉన్న తీవ్ర జాప్యాలను రికార్డుల ఆధారంగా గుర్తించి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై మంజూరైన నిర్మాణ పనులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్తలు వహించాలని, లేని పక్షంలో సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ పాలిటెక్నిక్, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిర్మాణ పనులు, నాబార్డు ఆర్ఐడీఎఫ్-22 నిధుల కేటాయింపునకు సంబంధిత నిర్మాణ పనులపై ఆరా తీశారు. 315 నిర్మాణ పనులు మంజూరయ్యాయని, ఈపనులకు టెండర్లు పిలిచి ప్రారంభించాలన్నారు. నిర్మాణ పనుల్లో పురోగతి ఉండేలా తరచూ సమీక్షలు నిర్వహించాలని పీవో దినేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఏజెన్సీ 11 మండలాల్లో ఉపాధి పనులు 62 వేల మంది ఉపాధి కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు వేగవంతం చేసి గిరిజనులకు ఆయా సౌకర్యాలు అందుబాటులోనికి తేవాలన్నారు. ఉద్యానసాగు చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిలో జాప్యాలపై ఆరా తీసి పనుల ప్రగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జియోట్యాగింగ్ ప్రక్రియను పక్కాగా అమలు చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు వివరాలు రేషన్ కార్డుల ఆధారంగా సీడింగ్ చేయాలని ఆదేశించారు. చెత్తా చెదారాల నిర్వహణ యూనిట్ల నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామాలలో పారిశుధ్య నిర్వహణలో పెను మార్పులు తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. చంద్రన్న బీమా వర్తింపులో 95.8 శాతం మాత్రమే నమోదు పూర్తి అయ్యిందని, మిగిలిన 4.2శాతాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు డాక్టరు ఎ.మల్లిఖార్జున, జిల్లా సంయుక్త కలెక్టరు జె.రాధాకృష్ణమూర్తి, ఐటీడీఏ పీవో ఏఎస్ దినేష్‌కుమార్, ఏఎస్పీ నయీమ్ అస్మి, హౌసింగ్ పీడీ జీవీ ప్రసాద్, డ్వామా పీడీ జి.రాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఎస్.మల్లిబాబు, ఆర్డీవోలు ఎల్లారమ్మ, ఎం.రామ్మోహనరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బీవీఎస్ చిరంజీవి, డీపీవో కుమార్, జెడ్పీ సీఈవో కె.పద్మ, డీసీహెచ్‌ఎస్ జి.రమేష్‌కిశోర్, డీఎంఅండ్‌హెచ్‌వో కె.చంద్రయ్య, స్పెషల్ కలెక్టరు భాను ప్రసాద్, ఎస్‌డీసీ మురళీమోహనరావు, పశుసంవర్థక జేడీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రాజేశ్వరరావు, సీపీవో బి.మోహన్‌రావు, జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై బీజేపీ నాయకుల హర్షం

కూనవరం: ముస్లీం మహిళలకు తలాక్ ద్వారా విడాకులు ఇచ్చే ఆచారం సుప్రీం కోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇది రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పడం పట్ల బీజేపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు నోముల రామారావు మాట్లాడుతూ ముస్లీం మహిళలకు ఈతీర్పు ద్వారా గౌరవం దక్కిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముస్లీంలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. నాయకులు కారం దారయ్య, చిట్టూరు వెంకటస్వామి, పునుగుపాటి రామారావు, సోడె బుచ్చిరాజు, కృష్ణార్జునరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛదాన్,స్వచ్ఛత హక్‌ధాన్ పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

వరరామచంద్రాపురం: స్వచ్ఛధాన్, స్వచ్ఛత హక్‌ధాన్‌లో నిర్వహించే పోటీలకు దరకాస్తులు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి కె.రామలింగేశ్వరరావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నివారణకు, ప్రజల ఆరోగ్య జాగ్రత్తలపై తగు సూచనలు సలహాలు ఇచ్చేందుకు తాగునీరు, పారిశుధ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈపోటీలకు ప్రభుత్వ శాఖల నుంచి అధికారులు, కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థులు, ఎన్‌జీవోలు, ఔత్సాహిక యువతి, యువకులు పది మంది సభ్యులు మించకుండా ఒక గ్రూపుగా ఏర్పడి కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. 'మైగవర్నమెంట్ పోర్టల్" ద్వారా ఆగస్టు 25లోగా ఎంపీడీవో కార్యాలయంలో దరకాస్తు చేసుకోవాలన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రగతీ శీల యువజన సంఘం

రంపచోడవరం: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని ప్రగతీ శీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి వి.వాసు అన్నారు. బుధవారం స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవన్‌లో సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లుప్రచారమే తప్పా అభివృద్ధికి జరగడం లేదన్నారు. సమస్యలపై ఆదివాసీలు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతీశీల మహిళా సంఘ జిల్లా కార్యదర్శి పి.అనసూయ, శ్రీదేవి, కంగల బాపన్న, భాను శాంతి, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గృహోపకరణాల ధ్వంసం

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాములో పడిన పిడుగుపాటుకు గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. బుధవారం మండలంలోని ఈదురుగాలులతో పాటు ఓ మోస్తరు వర్షం పడింది. దూసరపాము గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌పై పిడుగు పడింది. ఈసమయంలో ఒక్కసారిగా ఎలక్ట్రికల్ వస్తువుల నుంచి మంటలు రావడంతో ప్రజలు ప్రాణభయంతో రోడ్డుపైకి పరుగులు తీశారు. పలువురి ఇళ్లలోని ఫ్రిజ్, టీవీ, ఇన్వటర్లు తదితర ఎలక్ట్రికల్ సామాన్లు ధ్వంసం కావడంతో బాధితులు లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మాతా, శిశు మరణాల రేటును తగ్గించాలి: పీవో



సమావేశంలో మాట్లాడుతున్న పీవో దినేష్‌కుమార్

రంపచోడవరం: ఏజెన్సీలో మాతా శిశు మరణాల రేటును తగ్గించాలని ఐటీడీఏ పీవో ఏఎస్ దినేష్‌కుమార్ వైద్య సిబ్బందిని అదేశించారు. బుధవారం ఐటీడీఏ సమావేశపు హాల్‌లో రెండు ఐటీడీఏల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో నూరుశాతం తట్టు, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసు కోవాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు పీహెచ్‌సీలో సమర్థవంతంగా నిర్వహించాలని, పీహెచ్‌సీలకు ఈఅం శాల సాధనపట్ల గ్రేడింగ్ ఇస్తామన్నారు. గుర్తేడు, పెదగెద్దాడ, పిడతమామిడి పీహెచ్‌సీలు ఈఅంశాల్లో వెనుకబడటంతో షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. బయోమెట్రిక్ హాజరును సక్రమంగా నిర్వహించాలని, వైద్య సేవల పర్యవేక్షణకు ప్రత్యేక హెల్త్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.చంద్రయ్య, జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, డీఎంవో ప్రసాద్, ఏడీఎంఅండ్‌హెచ్‌వో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు

రాజవొమ్మంగి: ఆంధ్రకేసరి టంగుటూరి వీరేశలింగం పంతులు 148 జయంతి వేడుకలు రాజవొమ్మంగి బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం వార్డెన్ సాయి సూర్యలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో బ్రిటీషు తెల్ల దొరలను దేశం నుంచి తరిమి కొట్టేందుకు టంగులూరి చేసిన సేవలను నేటి యువతి, యువకులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఆయన పోరాట పటిమ విద్యార్థులకు విరించారు. తొలుత టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది సత్యవతి, నర్సవేణి, పల్లి శ్రీనివాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి

గంగవరం: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నర్సయ్యమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తాడ ఆశ్రమ బాలుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల్లో కూడా టంగుటూరి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారత్నం, గంగాభవానీ, పీడీ పోతురాజు, సరస్వతి, వనిత, పాపారత్నం, పీఈటీ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల తనిఖీలు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పోలీస్ సర్కిల్ పరిధిలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్ ఆనుకుని ప్రధాన రహదారి వెంబడి ఉన్న కల్వర్టులను పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. ఎస్ఐ కొండా వెంకట నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం ఏలేశ్వరం నుంచి నర్సీపట్నం వెళ్ళే ప్రధాన రహదారి పొడవునా ఉన్న కల్వర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. బొర్నగూడెం నుంచి సింగంపల్లి వరకు ఉన్న కల్వర్టుల వద్ద పేరుకు పోయిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేశారు. నెల వారీ తనిఖీల్లో భాగంగానే కల్వర్టులను పరిశీలించిన్నట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు వరహాలు, పెద్దబ్బాయి, ఏపీఎస్పీ పోలీసులు తదితర సిబ్బంది ఉన్నారు.



కల్వర్టుల తనిఖీలు చేస్తున్న జడ్డంగి ఎస్ఐ, సిబ్బంది

'జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

కూనవరం: ముంపు మండలాల్లో పనిచేస్తోన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకులు తహసీల్దార్‌ను కోరారు. బుధవారం కూనవరం తహసీల్దార్ రవీంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తానని చెబుతుందని, ఈక్రమంలోనే అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే డివిజన్ కార్యదర్శి పరిటాల వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు గంజి కృష్ణ, సభ్యులు వెంకట్, వీరభద్రం, వినయ్‌ప్రసాద్‌నాయుడు, లోకేష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జియో సెల్‌టవర్ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ

రాజవొమ్మంగి: నేటి కంప్యూటర్ కాలంలో అధునా తన టెక్నాలజీతో దూసుకు పోతున్న జియో సెల్ టవర్ నిర్మాణాలను చేపట్టేందుకు మన్య ప్రాంతంలో దృష్టి సారించారు. రాజవొమ్మంగిలోని ఎంకే రైస్ సమీపంలోని మెట్ట పరిసరాల్లోని జీడి మామిడి తోటల్లో నిర్మిస్తే ఎలా ఉంటుందని పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, సిబ్బంది బుజ్జి తదితరులు బుధవారం సర్వే చేపట్టారు. ఈప్రాంతానికి చుట్టు పక్కల నివాసం ఉంటున్న ప్రజలు భిన్నభిప్రాయాలను వ్యక్తం చేశారు. కొంతమంది నిర్మించాలని, మరి కొంతమంది ఈప్రాంతంలో కాకుండా గ్రామానికి దూరంగా నిర్మించాలని అడ్డు చెబుతూ వినతి పత్రాని. ఈవిషయమై ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పంచాయతీ సిబ్బంది తెలిపారు.



రాజవొమ్మంగి జియో సెల్‌టవర్ మా ప్రాంతంలో వద్దంటూ వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

బ్యాంకులో బంగారు ఆభరణాల వేలం

అడ్డతీగల: అడ్డతీగల యూనియన్ బ్యాంకులో బుధవారం బంగారు ఆభరణాల వేలంపాట నిర్వహించారు. అడ్డతీగల బ్యాంకులో గతంలో ఆభరణాలపై అప్పు తీసుకున్న ఖాతాదారులు ఆ బంగారాన్ని సకాలంలో విడిపించుకోకపోవడంతో 75మంది ఖాతాదారులకు చెందిన బంగారాన్ని వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు. బుధవారం 25మంది ఖాతాదారులకు చెందిన బంగారాన్ని వేలం వేశారు. తదుపరి గురువారం కూడా వేలంపాటలు కొనసాగిస్తామని బ్యాంకు మేనేజర్ తెలిపారు. సంబంధిత ఖాతాదారు మొత్తం సొమ్ములు చెల్లించి నేడు విడిపించుకునే సౌలభ్యం కూడా కల్పించామని బ్యాంకు మేనేజర్ తెలిపారు.

టీడీపీ సీనియర్ నాయకురాలు మృతి

చింతూరు: చింతూరు మండల టీడీపీ సీనియర్ నాయకురాలు సవలం బాయమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. చిడుమూరుకు చెందిన బాయమ్మ టీడీపీ కార్యకర్తగా, మండల మహిళా అధ్యక్షురాలుగా పనిచేశారు. దాదాపు ఇరవై ఏళ్ల ఆమె పార్టీకి సేవలందించారు. ఆమె కుటుంబాన్ని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎండీ జహంగీర్, నాయకులు ముత్తయ్య, జోగయ్య, బొక్కిలి రాంబాబు, చిడుమూరు సర్పంచ్ బొక్కిలి మల్లయ్య తదితరులు పరామర్శించారు. ఈసందర్భంగా జహంగీర్ మాట్లాడుతు ఆమె 20 ఏళ్లుగా చురుకైన కార్యకర్తగా పార్టీకి సేవలందించారన్నారు.

కస్తూర్బా విద్యాలయ ప్రత్యేకాధికారిణి భర్త అరెస్టు

వై.రామవరం: మండలంలో తోటకూర పాలెం కస్తూర్బా బాలికా విద్యాలయంలో పనిచేసి సస్పెన్షన్‌కు గురైన పాఠశాల ప్రత్యేకాధికారిణి విజయకుమారి భర్త కల్లేటి శేఖర్‌ను బుధవారం వై.రామవరం పోలీ సులు అరెస్టు చేశారు. అతన్ని అడ్డతీగల కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈనెల 15న ఆ పాఠశాలలో నిల్వ ఆహారం తినడం ద్వారా సుమారు 46మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై, ఆసుపత్రి పాలైన విషయం విదితమే. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు సర్వశిక్షాభియాన్ జిల్లా ప్రాజెక్టు అధికారి శేషగిరిరావు విచారణ చేపట్టారు. ఆ ఘటనపై బాధ్యురాలైన ప్రత్యేకాధికారిణి విజయ కుమారిపి వెంటనే సస్పెండ్ చేశారు.

పాఠశాలలో సొంత పెత్తనం చేస్తూ విద్యార్థినులను వేధిస్తూ..

ఆ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ భర్త శేఖర్ సొంత పెత్తనంచేస్తూ విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్నారని, పెట్టిందే తినాలంటూ, భార్య నిర్వహిస్తున్న విధులను అతనే నిర్వహిస్తున్నారని విద్యార్థినులు చేసిన ఫిర్యాదుమేరకు అతన్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సతీష్‌బాబు తెలిపారు.

ముంపు గ్రామాలకు పరిహారం ఇవ్వాలి

కలెక్టర్‌కు వినతి

ఎటపాక: పోలవరం ముంపునకు గురవుతున్న మండలంలోని భూములకు, ముంపు గ్రామాలకు పరిహారం, ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందుకూరి మంగరాజు కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఎటపాక పర్యటనకు వచ్చిన కలెక్టర్ కార్తికేయ మిశ్రాను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసంద ర్భంగా మంగరాజు మాట్లాడుతూ పోలవ రంతో ఈప్రాంత వాసులు నష్టపోయే ప్రమాదం ఉందని. ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ, పునరావాసం స్పష్టత లేకపోవడంతో నిర్వాసితులు అయోమాయానికి గురువుతున్నారన్నారు. పోలవరం ప్యాకేజీ, పునరావాసం సరైన స్పష్టత ఇవ్వాలన్నారు. పక్క జిల్లాలోని కుక్కునూరు తరహాలోనే ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలన్నారు. నాలుగు మండలాల్లో పోలవరం భూసేకరణ సర్వేలు వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పూసం రాఘవయ్య, కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

మీ పనితీరు బాగా లేదు, మారకపోతే చర్యలు తప్పవు

పారంఫండ్స్ గ్రౌడింగ్‌లో లక్ష్యాన్ని చేరుకోవడం లేదు! ఉపాధి హామీ కూలీల సంఖ్య పెరగడం లేదేంటి..? ఎటపాకలో పనుల తీరుపై కలెక్టర్ సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మిశ్రా

ఎటపాక: ఎటపాక డివిజనX లోని వివిధ శాఖల అధికారుల పనితీరు బాగా లేదు, అన్ని శాఖల్లో పురోగతి మందగించింది, మొదటిసారిగా వదిలేస్తున్నా, పనితీరు మార్చుకోవాలి లేకుంటే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని కలెక్టర్ కార్తి కేయ మిశ్రా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఎటపాక డివిజనX కేంద్రంలో నాలుగు మండలాల్లోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో కలెక్టర్ మిశ్రా నాలుగు మండలాల్లోని వివిధ శాఖల అభివృద్ధి పనులు, ఉపాధి హామీ అమలు తీరు, పీఎంఏవై పథకం, ఎన్టీఆర్ గృహాల నిర్మాణాల పురోగతి, అంగనX వాడీ మంజూరు, వాటి నిర్మాణాల పురోగతి, సీసీ రోడ్ల మంజూరు, తదితర వాటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల అమలు తీరుపై కలెక్టర్ తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు మండలాల్లో ప్రస్తుతం 30వేల మంది మాత్రమే ఉపాధి హామీ కూలీ పనులు చేస్తున్నారని, కూలీల సంఖ్య తక్కువగా ఉందని, నాలుగు మండలాల్లో మరో 10 వేల మంది కూలీల సంఖ్యను పెంచాలని పీవో చిన్నబాబును ఆదేశించారు. ఉపా ధిహామీ పారంఫండ్స్ మండలాల వారీగా పరిశీలన చేయగా, చింతూరులో మంజూరైన వాటిలో చాలా తక్కువగా గ్రౌండింగ్ చేయడంపై చింతూరు ఎంపీడీవో వెంకటరత్నంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరేం చేస్తున్నారంటూ మండి పడ్డారు. మరో వారంలో మండలంలో లక్ష్యంగా ఇచ్చిన పారంపండ్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ గృహాల నిర్మాణాల పురోగతిపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈమండలాల్లో గృహ నిర్మాణాల్లో కదలిక లేదన్నారు. బిల్లుల సమస్య ఏదైనా ఉందా అంటూ అధికారులను ప్రశ్నించారు. మరి ఎందుకు గృహ నిర్మాణాలు పూర్తి కావడం లేదంటూ మండిపడ్డారు. సెప్టెంబర్ 15లోపు సుమారు 200 ఇళ్ల బీఎల్ లెవల్‌కు తీసుకురావాలన్నారు. ఈక్రమంలో ఎటపాక ఎంపీడీవో రఘురామారావుని ట్రైకార్ రుణాల ఇంటర్వ్యూలు నిర్వహించారా అని ప్రశ్నించి, ఎంత మందిని రుణాలు మంజూరుకు ఎంపిక చేశారని కలెక్టర్ ప్రశ్నించారు. అయితే ఎంపీడీవో ఇంకా లబ్ధిదారులను ఎంపిక చేయలేదని చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహించారు. ఎందుక చేయలేదు, కారణం ఏమిటని ప్రశ్నించారు. మీకు (ఎంపీడీవోకు) అసలు దానిపై అవగాహన ఉందా, అవగాహన లేకపోతే పక్కనే గోదావరిలోకి బోటు వేసుకుని వెళ్లిపోమన్నారు. జోక్‌గా ఉందా అని మందలించారు. ట్రైకార్ రుణాల లబ్ధిదారుల గ్రౌడింగ్ బాధ్యత ఏపీవోకు అప్పగించాలని జేసీని ఆదేశించారు. ఈమండలాల్లో అంగనX వాడీ నూతన భవన నిర్మాణాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 10లోపు అంగనX వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవన్నారు. దీనిపై సీఎస్ గారు సీరియస్ ఉన్నారన్నారు. ఈమండలాల్లో ఎన్ని సీసీ రహదారులు మంజూరు కావాలని, దానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని పీవో చిన్నబాబును ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ మల్లికార్జునX , పీవో చిన్నబాబు, ఆర్డీవో ఎల్లారమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థునుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి



టంగుటూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా మోనటరింగ్ అధికారి నాగేశ్వరరావు

వై.రామవరం: వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్ఎస్ఏ జిల్లా అకడమిక్ అధికారి చామంతి నాగేశ్వర రావు సూచించారు. బుధవారం ఆయన తోటకూరపాలెం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. ఇటీవల నిల్వ ఆహారం తినడంతో అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థినుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. మెనూ, భోజన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినుల సామ ర్థ్యాలు పరిశీలించి పలు సూచనలిచ్చారు. జ్వరంతో వై.రామవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం ఆ పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు చేసిన సేవలను కొనియాడుతూ, టంగుటూరి ఆశయాలు పాటించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రసాద్‌బాబు, పాఠశాల ప్రత్యేకాధికారిణి జ్యోత్స్నదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యను దర్శించిన ఐఏఎస్ అధికారులు

ఎటపాక: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని బుధవారం రాత్రి తెలుగు రాష్ట్రాల ఐఏఎస్ అధికారులు దర్శించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనమంతు, తూర్పుగోదావరి కలెక్టర్ కార్తికేయమిశ్రా, జాయింట్ కలెక్టర్ ఎం.మల్లికార్జునX , రాజమహేంద్రవరం మున్సిపాల్ కమిషనర్ విజయరామరాజు, అసిస్టెంట్ ఓ ఆనంద్‌లు భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఈసందర్భంగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఈక్రమంలో ఆలయ అర్చకులు ఆలయ ప్రాశ్యస్యాన్ని వివరించారు. వారి వెంట చింతూరు ఐటీడీఏ పీవో జి.చిన్నబాబు, భద్రాచలం ఆర్డీవో బి.శివనారాయణరెడ్డి, ఎటపాక ఆర్డీవో ఎల్లారమ్మ, ఎటపాక తహసీల్దార్ చింతామణి, భద్రాద్రి దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు నర్సింహరాజు, ఎటపాక వీఆర్వో పండారామకృష్ణ పాల్గొన్నారు.



రామయ్యను దర్శించిన తెలుగు రాష్ట్రాల ఐఏఎస్‌లు

పోషకాహారం తీసుకోవాలి



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గంగవరం: బాలికలు రక్తహీనత బారిన పడకుండా పోషకాహారం తీసుకోవాలని వేములోవ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జాన్సీ హేన్సన్ సూచించారు. బుధవారం వేములోవ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పిడతమామిడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక మెనూ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'మొక్కల పెంపకంపై ఆసక్తి చూపాలి'



స్పీడ్ బాల్స్ తయారుచేస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

గంగవరం: పిల్లలు చిన్నప్పటి నుంచి మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరచాలని ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నర్సయ్యమ్మ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో కుంకుడు విత్తనాలతో స్పీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం చేపట్టారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు మాట్లాడుతూ సుమారు పదికిలోల కుంకుడు విత్తనాలతో స్పీడ్‌బాల్స్ తయారీచేపట్టామని, వీటిని పాఠశాల ఆవరణలో పెంచడం జరుగుతుందన్నారు. మిగిలిన మొక్కలను అటవీ ప్రాంతంలో, గ్రామకంఠాల్లో నాటేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్లు కిషోర్, రుద్ర, డిప్యూటీ వార్డెన్ సీతారత్నం, పీడీ పోతురాజు, పీఈటీ త్రివేణి తదితరులున్నారు.

వంగడాలను సద్వినియోగం చేసుకోండి: ఎంపీపీ

చింతూరు: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న మినుము వంగడాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిచ్చడి మురళీ పేర్కొన్నారు. బుధవారం చింతూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో మినుము వంగడాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ రైతులకు పలు సూచనలను అందించారు. వ్యవసాయ అధికారులు రైతులకు సేద్యం విషయంలో ఎప్పటికప్పుడు సూచనలిస్తూ అధిక దిగుబడులు సాధించేలా కృషి చేయాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోయం అరుణ, చింతూరు సర్పంచ్ సోడె శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి సంజీవ్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.



మినుము వంగడాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

విద్యారంగాన్ని నీరుగారుస్తున్న ప్రభుత్వాలు

● విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమేష్ పట్నాయక్

అమలాపురంటౌన్: విద్యారంగాన్ని నీరుగార్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డి.రమేష్పట్నాయక్ 1946లో జాతీయ విద్యావిధానం పేరుతో ప్రారంభమైన విద్యా ప్రైవేటీకరణ అంతకంతకూ ఎక్కువైపోయిందన్నారు. 2016నూతన జాతీయ విద్యావిధానం పేరుతో కేంద్రప్రభుత్వం విద్యారంగం ప్రవేటీకరణ, కార్పొరేటీకరణను మరింత వేగవంతం చేసిందని ఆరోపించారు. అమలాపురం అంబేద్కర్ భవన్‌లో రోహిత్‌వేముల ప్రాంగణంలో పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యావైజ్ఞానిక తరగతులు రెండవరోజు బుధవారం నిర్వహించారు. విద్యారంగపరిస్థితులు-కర్తవ్యాలు అనే అంశంపై ముఖ్యవక్త రమేష్‌పట్నాయక్ ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 350 విశ్వవిద్యాలయాలను నీరు గార్చేవిధంగా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తూ



పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యావైజ్ఞానిక సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ రమేష్‌పట్నాయక్

కొత్తగా ప్రపంచశ్రేణి పది విశ్వవిద్యాలయాలు తీసుకొస్తున్నానని మోదీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డిటెన్షన్ విధానం పేరుతో కేంద్రప్రభుత్వం విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరంచేయాలని చూస్తుందన్నారు. కనీస వసతులు, ఉపాధ్యాయులు లేకుండా డిటెక్షన్ విధానాన్ని అమలుచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 6వ తరగతిలోనే ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులను పనిముట్లుగా తయారుచేసేవిధంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు సంఘటితంగా పోరాటం చేయాలని పట్నాయక్ పిలుపునిచ్చారు. జాతీయ-అంతర్జాతీయ పరిస్థితులు అనే అంశంపై ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు ప్రసంగించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ బిల్లు పేరుతో సామాన్య ప్రజానీకంపై కేంద్రం దాడులు చేసిందన్నారు. ప్రజా వ్యతిరేక బిల్లులపై వ్యతిరేకత రాకుండా చైనాతో యుద్ధవాతావరణాన్ని సృష్టిస్తుందని ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్, ఉపాధ్యక్షులు ఆర్.తిరుపతిరావు, బి.శేఖర్, ఇ.భూషణం, సహాయకార్యదర్శి కె.భాస్కర్, రాష్ట్ర నాయకులు కె.నాని, వై.పద్మ, శ్రీదేవి, ఐ.విజయ, యు.వెన్నెల, ఐ.రాజేష్, వర్ధిని, శ్రీను, విజయ్, ప్రతాప్ పాల్గొన్నారు.

చెంచుల సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్మన్ సూరిబాబురాజు

పెద్దాపురం: ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న చెంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ సూరిబాబురాజు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక లూథరన్ హైస్కూలు గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లా ఎస్టీ చెంచులక్ష్మి నరసింహస్వామి చెంచు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్పల సహకారంతో చెంచులకు ఇళ్లస్థలాలు, రుణాలు, రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ చెంచు అనేపదం చెట్టు నుంచి పుట్టిందన్నారు. చెంచులు పండ్లు, కాయలు, పువ్వులు, తేనెలు సేకరించి వాటిని అమ్ముకుని జీవిస్తారన్నారు. నల్లమల అడవుల నుంచి వలస వచ్చిన చెంచులు ప్రస్తుతం రాష్ట్రంలోని 13జిల్లాల్లో ఉన్నారని తెలిపారు. జిల్లాలో 40వేలవరకు చెంచులు ఉన్నారని తెలిపారు. జిల్లాలో పెద్దాపురం, కాకినాడ, అమలా



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ గౌరవాధ్యక్షుడు సూరిబాబు

పురం, టేకిసెట్టిపాలెం, ముగ్గల్లు, కాత్రేనికోన, రొట్నాల పాలెం, బెండమూరిలంక, రావులపాలెం, రాజమహేంద్రవరం, రాజానగరం తదితర ప్రాంతాలలో ఉన్నారని అన్నారు. హైదరాబాద్ ప్రాంతంలోని చెంచులు తప్ప మిగతా ప్రాంతాలకు చెందిన వారు తెలుగు మాట్లాడతారని తెలిపారు. తమకు తెలుగుదేశం ప్రభుత్వం రాజకీయ ప్రాధాన్యాన్ని కల్పించాలని కోరారు. సభలో కాపుగంటి కోటి చెంచులమీద రాసిన పాట సీడీని చైర్మన్ సూరిబాబురాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తెలుగుదేశం అధ్యక్షుడు ఆర్.సత్యన్నారాయణ, సీనియర్ తెలుగుదేశం నాయకుడు అన్నాబత్తుల అంజి బాబు, అయిదు జిల్లాల చెంచు సంఘం ఉపాధ్యక్షుడు గెడ్డం చిన్న, పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లాల చెంచు సంఘం అధ్యక్షుడు ఆవుల పెదవెంకటపతి, ఆవుల కొండయ్య, నక్కా ఏసు, కౌన్సిలర్లు బి.సత్తిబాబు, కె.హరిబాబు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ

జిల్లా చెంచు సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా ఎమ్.సూరిబాబు, అధ్యక్షుడుగా ఆవుల పిచ్చియ్య, ఉపాధ్యక్షుడుగా ఆవుల అబ్రహాం, సెక్రటరీగా ఆవుల పొట్టియ్య, జాయింట్ సెక్రటరీగా నక్కా యేసు, ట్రజరర్‌గా నల్లబోతుల పోసియ్య, జాయింట్ ట్రజరర్‌గా ఆవుల బోడియ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

కిర్లంపూడి: మండలంలోని కృష్ణవరం జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద కారుతో వెనుకనుంచి లారీ ఢీకొట్టిన సంఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి గాయపడగా చికిత్స నిమిత్తం ఆ వ్యక్తిని ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారు విజయవాడకు చెందిన వారిగా గుర్తిస్తున్నారు. విషయం తెలిసిన ఎస్ఐ బాలాజీ సంఘటనా స్థలానికి విచ్చేసి పరిస్థితి సమీక్షించారు. పూర్తిస్థాయి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణవరం టోల్‌గేట్ వద్ద లారీ ఢీకొని మృతి చెందిన యువకుడు

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గల కొత్తూరు గ్రామంలో కుక్కల దాడిలో బుధవారం ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన డొక్కల చంద్రరావు, అన్నిక లక్ష్మి, గోకవరం గ్రామానికి చెందిన గోపిశెట్టి రాంబాబు, ఫజుల్లాబాదుకు చెందిన ఈత రాంబాబు, అగ్రహారపు శ్రీధర్ అనే వ్యక్తులపై కుక్కలు దాడి చేసి గాయపరిచారు. బాధితులకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

గోకవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. గోకవరం గ్రామానికి చెందిన మంగరాతి సత్యనారాయణ (60) అనే ప్రయాణికుడు మధ్యాహ్నం కాంప్లెక్స్‌లో కూర్చొని ఉండగా ఆకస్మాత్తుగా గుండెపోటుకుగురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మోటారు సైకిల్ చోరీ

పి.గన్నవరం రూరల్: పి.గన్నవరం మండలం లంకల గన్నవరం ప్రధాన రహదారి చెంతనే ఉన్న షాపులో మంగళవారం రాత్రి ఒక మోటారుసైకిల్, రూ.5వేలు నగదు చోరీకి గురైనట్టు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకలగన్నవరం గ్రామానికి చెందిన లంకే వెంకట్రావు రోడ్డుచెంతనే ఉన్న తనషాపులో మంగళవారం రాత్రి 10గంటల వరకు ఉండి ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం ఉదయం షాపు తెరిచి చూడగా హీరో మెట్రోప్లస్ మోటారుసైకిల్, బీరువాలో ఉన్న రూ.5వేలు నగదు చోరీకి గురయ్యాయని ఆయన పేర్కొన్నాడు. దీంతో సంఘటనా వివరాలను పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్టు వెంకట్రావు పేర్కొన్నాడు.

అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణం పరిహారం చెల్లించాలి

● రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు

అమలాపురం(ఆంధ్రజ్యోతి): ఎనిమిది రాష్ట్రాలకు విస్తరించిన అగ్రిగోల్డ్ సంస్థ 32 లక్షల మందిని నట్టేట ముంచిందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాల్సిన రాష్ట్రప్రభుత్వం నేటికీ చోద్యం చూస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికే 142 మంది బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త చైతన్యయాత్ర బుధవారం అమలాపురం గడియారస్తంభం సెంటర్‌కు చేరుకుంది. స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో యూనియన్ అధ్యక్షుడు పులవర్తి సురేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడారు. ఆత్మహత్యలకు పాల్పడ్డ బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. చిన్నమొత్తాలను పొదుపుచేసిన ఖాతాదారుల ఆక్రందనలను ఆలకించి రూ.1180 కోట్లు అడ్వాన్సులుగా ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఇప్పటికే ఏళ్లు గడిచిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అగ్రిగోల్డ్ దొంగలు బహిరంగంగా తిరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ విమర్శించారు. బాధితులకు రూ.700 కోట్ల మేర అగ్రిగోల్డ్ యాజమాన్యం చెక్కులు ఇస్తే అవన్నీ బౌన్స్‌కాగా, వారిపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని ఆరోపించారు. అగ్రిగోల్డ్ సంస్థకు ఎటువంటి నష్టం రాలేదని, అయితే వారికి అండగా ప్రజాప్రతినిధులు నిలబడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇంతవరకు అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల గురించి చర్చించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యపదవుల్లో ఉన్న జిల్లాకు చెందిన మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు వంటి వారు సైతం ఎందుకు పట్టించుకోవడంలేదో జవాబు చెప్పాలని ప్రశ్నించారు. అవసరమైతే వారి గృహాలను సైతం ముట్టడించి న్యాయం జరిగేవరకు ఆందోళన చేయాల్సిన అవసరముందన్నారు. బహిరంగసభలో రాష్ట్ర అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, బీవీ చంద్రశేఖర్, జయసింహ, బి.లోవరత్నం, జిల్లాకార్యదర్శి ఎ.రామకృష్ణ, ప్రచార కా



అమలాపురంలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్ర సభలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

ర్యదర్శి బి.రాంబాబు, శీలం లంకేశ్వరుడు, పచ్చిమాల బాబ్జి, పరమట శ్రీరామమూర్తి, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి నీటిమట్టం

ధవళేశ్వరం: ధవళేశ్వరంవద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి 2లక్షల 9వేల 286క్యూసెక్కుల మిగులు ప్రవాహాన్ని ధవళేశ్వరంవద్ద కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో నీటిమట్టం 10.60 అడుగులుగా నమోదైంది. ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పుడెల్టా ప్రధాన పంటకాల్వ ద్వారా 4.100 క్యూసెక్కులు, మధ్యడెల్టా ప్రధాన కాల్వద్వారా 2.100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంటకాల్వ ద్వారా 4000క్యూసెక్కుల చొప్పున సాగునీటీని విడుదల చేస్తున్నారు.

పరిశ్రమల స్థాపనతో

స్వయం ఉపాధి పొందండి

● జిల్లా పరిశ్రమల శాఖ ఉపసంచాలకుడు పి.దొరబాబు

అమలాపురం టౌన్: పరిశ్రమల స్థాపనతో స్వయంఉపాధి పొందడమే కాకుండా మరో పదిమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని జిల్లా పరిశ్రమల శాఖ ఉపసంచాలకుడు పి.దొరబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఔత్సాహికులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అమలాపురం టీటీడీసీలో బుధవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేవారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. 2015-20 సంవత్సరంలో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ సబ్సిడీ, సేల్స్‌ట్యాక్స్ రాయితీలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎస్సీఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తుందని వివరించారు. ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో పురుషులకు 35శాతం, మహిళలకు 45 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని దొరబాబు వివరించారు.

సదస్సుకు హాజరైన 30 మంది సవివరమైన ప్రాజెక్టు రిపోర్టులతో హాజరుకావడంతో వారికి వివిధ బ్యాంకుల ద్వారా రూ.5.45కోట్లు పెట్టుబడి పెట్టేవిధంగా ఆయా బ్యాంకు మేనేజర్లతో ఉపసంచాలకులు చర్చించారు. సహాయ సంచాలకుడు ఐవీ రమణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.లక్ష్మీఆండాళ్లమ్మ, నాబార్డు ఏజీఎం డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, క్వాయర్‌బోర్డు అధికారి కె.రామారావు, బ్యాంకు మేనేజర్లు ఎస్.రామకృష్ణ, ఎం.పద్మరాజు, పీఎంవీ ప్రసాద్ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపసంచాలకుడు దొరబాబు

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదు

● కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం

● వివిధ జిల్లాల నుంచి కిర్లంపూడి తరలివచ్చిన కాపులు

కిర్లంపూడి: రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం కొనసాగించాలని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. నిరవధిక పాదయాత్రను పోలీసులు బుధవారం కూడా అడ్డుకున్నారు. ముద్రగడ దీక్షా శిబిరంలో నిరసన తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు నిరసన దీక్షలో కూర్చున్నారు. అనంతరం ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ తమకు ఇచ్చిన హామీ మేరకు 13 జిల్లాల కాపు జాతి ఉద్యమించాలన్నారు. చంద్రబాబు తమ జాతిపై కక్షకట్టి రాక్షస పాలన చేస్తూ కాపులను అణగదొక్కే పాలన చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు ఇవ్వండి లేకపోతే పాదయాత్రకు అనుమతివ్వండి అంత వరకు ఉద్యమం ఆగదని ఊపిరి ఉన్నంత వరకు పోరాడతానన్నారు. మహిళలు అధిక సంఖ్యలో ముందుండి ఉద్యమాన్ని నడిపించాలని అన్నారు. చంద్రబాబూ.. సిగ్గు, శరం లేదా 2050 వరకు తమరే ముఖ్యమంత్రిగా ఉండాలా అని తీవ్రస్థాయిలో విమర్శించారు. కడప, పశ్చిమగోదావరి తదితర ప్రాంతాల నుంచి కాపులు, మహిళలు తరలివచ్చి ముద్రగడకు సంఘీభావం తెలిపారు. కడప జిల్లా పులివెందుల నుంచి కాపు నేతలు, బలిజ నాయకులు భాను ప్రకాశ్, రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురు తరలివచ్చారు. కొత్తపేట నియోజకవర్గం నుంచి జేఏసీ నేత ఆకుల రామకృష్ణ ఆధ్వర్యంలో వందలాదిగా కాపులు కిర్లంపూడి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. చంద్రబాబుకు ఓట్లు వేసినందుకు లెంపలేసుకుని చెప్పులతో కొట్టుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ డేగ్, కిర్లంపూడి బీసీ నాయకులు సర్పంచ్ పెంటకోట నాగబాబు, కాళ్ల సత్యనారాయణ, రాపేటి పెద్ద, పెంటకోట మూర్తి, శ్రీరాములు మద్దతు తెలిపారు. చిన్నారులు కోలాట నృత్యాలతో నృత్యప్రదర్శన నిర్వహిస్తూ ముద్రగడకు సంఘీభావం తెలిపారు. తణుకు, ఉండ్రాజవరం, కొవ్వూరు, కోనసీమ, కొత్తపేట, ఆలమూరు, రాజమహేంద్రవరం, మంటపేట ప్రాంతాల నుంచి కాపులు వచ్చారు. పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. కాపు జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణుమూర్తి, గౌతు స్వామి, ఆరేటి ప్రకాశ్, గుండా వెంకటరమణ, చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కాపులతో ముద్రగడ

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కాకినాడ క్రైం: నగరంలో ఫాస్ట్‌ఫుడ్ హోటల్‌లో పనిచేసే ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. రామకృష్ణారావుపేట సాడివారి వీధికి చెందిన నందిక కనకరాజు (19) భానుగుడి సమీపంలోని వర్మ ఫాస్ట్‌ఫుడ్ హోటల్‌లో పనిచేసేవాడు. అయితే అతను ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కనకరాజు అమ్మమ్మ ధీరి సూరీడు మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ వెనుక భాగంలో బుధవారం యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారమందించారు. అనంతరం కాకినాడ ఇన్‌చార్జి ఎస్‌డీపీవో ఎం.వెంకటేశ్వరరావు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్ సంఘటనా స్థలానికి చేరుకుని కనకరాజుగా గుర్తించారు. కనకరాజు ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక హత్యకు గురయ్యాడా అనే కోణాల్లో టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



విలీన మండలాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించిన కలెక్టర్

రంపచోడవరం: జిల్లాలో విలీన మండలాలైన చింతూరు, ఏటపాక, కూనవరం, వరరామచంద్రాపురం మండలాల్లో ఇసుక అక్రమ రవాణా అవుతోందన్న సమాచారం అందిందని నిరోధించడానికి చర్యలు చేపట్టామని కలెక్టర్ కార్తికేయమిశ్రా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌కు నివేదించారు. రాష్ట్రంలోని కలెక్టర్లు, అబ్కారీ శాఖాధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఇసుక మైనింగ్, మద్యంపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి పలు సూచనలు అందించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు రంపచోడవరం నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే మలేరియా నమోదు కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. జ్వరపీడితుల నుంచి ఎప్పటికప్పుడు రక్త నమూనాలు సేకరించి, స్క్రీనింగులు నిర్వహించడానికి మొబైల్ బృందాలు, నాన్ మెడికల్ సిబ్బందిని నియమించడంతో పాటు ప్రతి ఆవాసానికి ఒక దత్తత అధికారిని నియమించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన చేపట్టడానికి చర్యలు తీసుకున్నామన్నారు. దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఇసుక మైనింగ్‌పై సమీక్షిస్తూ ఎక్కడా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న, అధిక ధరలకు అమ్ముతున్నా టోల్ ఫ్రీ నెంబరు 1100 కు ఫిర్యాదు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తే వారిపై కేసును నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా సంయుక్త కలెక్టర్ జె.రాధాకృష్ణమూర్తి, ఐటీడీఏ పీవో ఏఎస్ దినేష్‌కుమార్, ఏఎస్పీ నయీమ్ అస్మి తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ కార్తికేయమిశ్రా

ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు సాధ్యం

ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా భూయజమానులతో సమావేశమైన ఇన్‌ చార్జి సబ్‌కలెక్టర్ విజయరామరాజు

రాజమహేంద్రవరం అర్బన్: ప్రజల సహకారంతోనే అభివృద్ధి పనులు జరుగుతాయని రాజమహేంద్రవరం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏడీబీ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి రాజానగరం మండలంలో భూసేకరణ నిమిత్తం అవార్డు ప్రకటించేందుకు సంబంధిత భూముల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాజానగరం నుంచి సామర్లకోట వెళ్లే ఏడీబీ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. రాజానగరం మండలంలోని కానవరం గ్రామశివారు రామస్వామిపేటలో సర్వే నెంబర్లు 705/1ఏ, 708/2ఏ, రాజానగరం గ్రామంలో సర్వే నెంబర్లు 200/1, 201/1ఏ, 122/1బి స్థలాలు అవార్డు ఎంక్వయిరీ నిర్వహించామన్నారు. భూసేకరణ చట్టం 30/2013 అనుసరించి స్థల సేకరణ జరుగుతుందని అన్నారు. యజమానులు సహకరించాలని కోరారు.



ఆ ఇద్దరికి శిక్ష తప్పదు!

● పోలీసు ఇన్‌ ఫార్మర్లగా వ్యవహరించొద్దని చెప్పినా వినలేదు

● యువతను కూడా తప్పుదారి పట్టిస్తున్నారు

● మావోయిస్టు పార్టీ చర్ల, శబరి కమిటీ కార్యదర్శి శారదక్క లేఖ విడుదల

చింతూరు: ఛత్తీస్‌గఢ్‌లోని తీగల, గోర్క గ్రామాల నుంచి చింతూరు మండలం, అల్లిగూడెం, నర్సింగపేటలకు వలస వచ్చి పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్న ఇద్దరి వ్యక్తులకు ప్రజల చేతిలో శిక్ష తప్పదని మావోయిస్టు పార్టీ చర్ల, శబరి ఏరియా కమిటీ కార్యదర్శి శారదక్క హెచ్చరించారు. ఇప్పటికే చాలా సార్లు హెచ్చరించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఆ రెండు గ్రామాలతో పాటు సమీప గ్రామాలకు చెందిన మరికొందరు యువకులను కూడా పోలీసులకు ఇన్‌ఫార్మర్లగా మారుస్తున్నారని అన్నారు. బుధవారం చింతూరు ఆంధ్రజ్యోతి కార్యాలయానికి మావోయిస్టు పార్టీ చర్ల, శబరి ఏరియా కమిటీ కార్యదర్శి శారదక్క పేరిట ఓ లేఖ అందింది. చింతూరు మండలం మారుమూల గ్రామాల్లో పోలీసు ఇంటెలిజెన్స్ ముఠా సంచరిస్తూ యువతీ, యువకులను ఇన్‌ఫార్మర్లుగా మలచుకుంటున్నారని, అమాయక యువకులను మద్యం, మత్తు పానీయాలకు బానిసలుగా మార్చుతున్నారని లేఖలో పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు, మోటారు సైకిళ్లను బహుమతులుగా ఇస్తున్నారని శారదక్క ఆరోపించారు.

దీంతో కొంతమంది యువకులు పోలీసుల ప్రలోభాలకు గురై ఇన్‌ఫార్మర్లగా మారుతూ మావోయిస్టు పార్టీ సంచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారని చెప్పారు. యువతీ యువకులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని కోరారు. చరిత్ర నిర్మాతలుగా యువకులు ఘనత సాధించాలని అన్నారు. పోలీసుల రక్తపు కూటికి ఆశపడి ప్రజా వ్యతిరేకులగా మారుతున్న వారికి ప్రజలే గుణపాఠం చెబుతారని శారదక్క లేఖలో హెచ్చరించారు.

మిస్టరీగా యువతి హత్యకేసు

రాజానగరం: రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోలమూరు కల్యాణనగర్‌లో యువతి హత్యకు సంబంధించిన కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నెల 21న పాడుబడ్డ బావిలో యువతి మృతదేహం లభ్యమైంది. ఈ కేసును సకాలంలో ఛేదించేందుకు రాజానగరం సీఐ కె.వరప్రసాదరావు పర్యవేక్షణలో ఎస్ఐ రాజేష్, జగన్మోహన్ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులు కోసం గాలిస్తున్నారు. యువతిని వేరొక ప్రాంతంలో హత్యచేసి కాళ్లూ చేతులు కట్టి గోనె సంచిలో కుక్కి నూతిలో పడేసినట్లు అనుమానిస్తున్నారు. మూట పైకి తేలకుండా ఉండేలా రాళ్లను కూడా మూటకు కట్టి నూతిలో వదిలివెళ్లారు. ఇదంతా చూస్తుంటే స్థానికులు ప్రమేయం ఉంటే తప్ప ఈ ప్రాంతంలో బావి గురించే తెలిసే అవకాశం ఉండదు. మృతురాలి శరీరంపై ఉన్న దుస్తులు, చేతిపై రాసి ఉన్న పద్మ ఉన్న పచ్చబొట్టు ఆధారంగా నిందితులు వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. యువతి గిరిజన ప్రాంతానికి చెంది ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారు.





ఉలుకు..పలుకు

కాకినాడలో చరిత్ర సృష్టిస్తున్నాం

ఎంపీ రామ్మోహన్‌నాయుడు


మాట్లాడుతున్న ఎంపీ, పక్కన అంబికా కృష్ణ

కాకినాడ సిటీ: కాకినాడలో చరిత్ర సృష్టిస్తున్నామని శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. భరోసాకి, భయానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. టీడీపీ కాకినాడలో సమర్థవంతమైన వారికి సీట్లు కేటాయించిందన్నారు. మూడేళ్లుగా సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తున్నారని, కాకినాడ అభివృద్ధిపై దృష్టి పెట్టారన్నారు. అందులో భాగంగా కాకినాడను తొలి దశలో స్మార్ట్ సిటీగా ఎంపిక చేయించారన్నారు. గత పదేళ్లుగా నగరంలో పాలకులు భూకబ్జాలు చేసి అరాచకాలు సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేశారని విమర్శించారు. టీడీపీ అమలు చేస్తున్న పథకాలే విజయాన్ని చేకూరుస్తాయన్నారు. కాకినాడలో పసుపు జెండా ఎగురవేస్తామన్నారు.జగన్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ...

విశాఖ, కాకినాడ, తిరుపతిలను స్మార్ట్ సిటీలుగా ఎంపిక చేయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సుందర నగరంగా పేరొందిన విశాఖ కంటే అధికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు కాకినాడపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. జగన్‌పై ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ జెండా ఎగురవేస్తాం: ఏపీ ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ అంబికా కృష్ణ

కాకినాడ సిటీ: కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేస్తుందని ఏపీ ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ అంబికా కృష్ణ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం కోసం కాకినాడ వస్తున్న సందర్భంగా నగర ప్రవేశ ద్వారం, పరిసర ప్రాంతాల్లో సర్వే చేయగా చాలా మంది టీడీపీ విజయం సాధిస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారని కృష్ణ చెప్పారు.ఇటీవల సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు జీఎస్టీ నుంచి కొన్నింటిని మినహాయించాలని సూచనల మేరకు విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

విజయవాడలో ఫిలిం కార్పొరేషన్ కార్యాలయం

రాష్ట్రంలో ఫిలిం కార్పొరేషన్ కార్యాలయం ఏర్పాటుకు విజయవాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. నంది అవార్డులు ఇచ్చే విషయమై చర్చిస్తున్నామన్నారు. 100 చిత్రాలను తిలకించి ఎంపిక విషయాలు పరిశీలిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై చేసిన ప్రకటనను అంబికా కృష్ణ స్వాగతించారు. రాష్ట్రంలో 90 లక్షల మంది ఆర్య వైశ్యులు ఉన్నారన్నారు. వీరిలో 20 లక్షల మంది పేదవారు ఉన్నారన్నారు. ఈ ప్రకటనలపై కూడా జగన్ గందరగోళం సృష్టించారని విమర్శించారు.

32వ డివిజన్‌లో అత్యధికంగా 12 మంది అభ్యర్థులు..

14,15, 33 డివిజన్లలో అత్యల్పంగా ఇద్దరు మాత్రమే!

కాకినాడ కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఎన్నికలలో 32వ డివిజన్‌లో అత్యధికంగా 12 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. అత్యల్పంగా 14,15,33 డివిజన్లలో ఇద్దరు మాత్రమే బరిలో ఉన్నారు. మిగిలిన వాటిలో 9, 13 డివిజన్లలో 10 మంది చొప్పున పోటీలో ఉన్నారు. 2వ డివిజన్‌లో 9 మంది, 8, 19 డివిజన్లలో 8 మంది పోటీ చేస్తున్నారు. 5, 10, 24, 35, 36 డివిజన్లలో ఏడుగురు చొప్పున, 1, 16, 39, 46 డివిజన్లలో ఆరుగురు చొప్పున బరిలో ఉన్నారు. 23, 25, 26, 27, 28, 29, డివిజన్లలో ఐదుగురేసి, 3, 11, 12, 18, 38, 41, 45, 47, 50 డివిజన్లలో నలుగురేసి చొప్పున పోటీలో ఉన్నారు. 4, 6, 7, 17, 20, 21, 22, 30, 31, 34, 37 డివిజన్లలో ముగ్గురు చొప్పున పోటీ చేస్తున్నారు.



శిబిరం దగ్గర కూర్చుంటే రూ.100.. ప్రచారంలో పాల్గొంటే రూ.150



కాకినాడ అర్బన్: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలంటే మాటలా... నగరంలో ప్రచారం చేసేందుకు ఎవరు వస్తారు? బయట వ్యక్తులు ఊరికనే వస్తారా ఏమిటి? రారు కదా మరేం చేయాలి.. దానికొక రేటుంది. అదీ సెపరేటు. ఆయా డివిజన్లలో పోటీ చేసే అభ్యర్థులు ఏర్పాటు చేసిన శిబిరాల వద్ద ఆ పార్టీ జెండా చేతబట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చుంటే రోజుకు రూ.100 ఇస్తున్నారు. ఇందులో అధిక శాతం ప్రభుత్వ పింఛను పొందుతున్న వృద్ధులు ఉండటం గమనార్హం. ఇక పార్టీ అభ్యర్థులతో కలిసి ప్రచారంలో పాల్గొంటే రోజుకు రూ.150 చెల్లించాల్సిందే. ఈ రేటు కేవలం పేదలు అధికంగా నివసించే వార్ఫు రోడ్డు, పాతబస్టాండ్ రోడ్డు, కచేరీపేట, ప్రేజరుపేట ప్రాంతాల్లో పరిస్థితి. ఇక అగ్రవర్ణాలు అధికంగా ఉండే డివిజన్లలో ప్రచార తీరు మరో విధంగా ఉంది. పలావు భోజనం, సాయంత్రం మద్యం పంపిణీ మాత్రమే కాదు.. సిగరెట్, గుట్కా, వాటర్ బాటిల్.. ఇలా సమస్త సదుపాయాలు చేయాల్సిందే. అందరినీ కలుపుకొని పోవడం, అడిగినవాళ్లకు కాదనకుండా చేయడం, ప్రస్తుతం ఎంతో ఉత్తమమని అభ్యర్థులు, భార్యల తరఫున భర్తలు ఫిక్స్ అయిపోయారు.

ప్రచారంలో పదనిసలు (చిత్రాలు సూడరో)


బత్తాయిలు బాబు బత్తాయిలు..అలాగే ఓట్లు వేయండి బాబు ఓట్లు!
47వ డివిజన్‌లో ప్రచారంలో మంత్రులు చినరాజప్ప, పుల్లారావు


ఆడపిల్లల ఇంట.. చంద్రన్న పథకాలు
37వ డివిజన్‌లో మంత్రి కొల్లు రవీంద్ర


అమ్మా! మాకు ఒక అవకాశం ఇవ్వండి!
16వ డివిజన్‌లో.. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్


ఓటరు దేవుళ్లారా! కరుణించండి!
ఎంపీ తోట నరసింహం ఇంటింటి ప్రచారం


కమల వికాసం
ఆకట్టుకునే కటౌట్లతో డివిజన్లలో బీజేపీ ప్రచారం


ఇక్కడ ఓటేస్తే.. అక్కడ ఉతికేస్తాం!
37వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైసీపీ అభ్యర్థిని

ఈవీఎం బ్యాలెట్ దాటని..

అభ్యర్థుల సంఖ్య


ఈవీఎంలకు సీల్ వేస్తున్న ఉద్యోగులు

కాకినాడ కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య ఈవీఎం బ్యాలెట్ యూనిట్ సంఖ్య దాటలేదు. 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులతో నిండిన బ్యాలెట్ అమర్చేందుకు మాత్రమే అవకాశం ఉంది. డివిజన్‌లో అంతకు మించి అభ్యర్థులు బరిలో ఉంటే రెండో ఈవీఎం బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 32వ డివిజన్‌లో అత్యధికంగా 12 మంది బరిలో ఉన్నారు. దీంతో 196 పోలింగ్ కేంద్రాల్లో రెండో ఈవీఎం బ్యాలెట్ యూనిట్ అవసరం తప్పింది. 14, 15, 33 డివిజన్ల ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు ఇద్దరేసికి మాత్రమే పరిమితం కానున్నాయి. ఇప్పటికే 400 ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు,400 ఈవీఎం కంట్రోల్ యూనిట్లను సిద్ధం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అదనంగా మరో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ అందుబాటులో ఉంచనున్నారు.ఈవీఎంలలో అమర్చేందుకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి 50 బ్యాలెట్ పత్రాలు అందించనున్నారు.

ఈవీఎంలలో నోటా ఓటు లేదు.. దేశంలో పలుచోట్ల జరిగిన ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్లలో 'నోటా' ఓటు అవకాశం కల్పించారు. కాకినాడ ఎన్నికల్లో ఈ సదుపాయం కల్పించలేదు. అభ్యర్థుల పేర్లు, గుర్తులబ్యాలెట్‌లు అమర్చేందుకు 16 బటన్‌లను ఈవీఎంలో ఉంచారు.

అభ్యర్థుల ప్రచారాల పరిశీలన, ధ్రువీకరణ కమిటీ ఏర్పాటు

కాకినాడ కార్పొరేషన్: కాకినాడ నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లా స్థాయి ప్రసార సాధనాల ధ్రువీకరణ, పరిశీలన కమిటీని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కార్తికేయమిశ్రా ఏర్పాటు చేశారు. దీనికి చైర్‌పర్సన్‌గా జేసీ ఎ.మల్లికార్జున, సభ్యులుగా నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కె.రమేష్‌కుమార్,జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.ఫ్రాన్సిస్ వ్యవహరిస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనల ప్రకారం ఈ కమిటీని నియమించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రచారం నిమిత్తం ఉపయోగించే సాధనాలు, సామాజికమాధ్యమాలు, జనసంచార ప్రదేశాల్లో హోర్డింగులు, ఫ్లెక్సీల ఏర్పాటు వంటి వాటిని వీరు పరిశీలిస్తారు. ప్రసార మాధ్యమాలు, పత్రికల్లో,టీవీల్లో ప్రకటనలు ఇచ్చే రెండు రోజుల ముందు ధ్రువీకరణ పొందాలి. ఇందుకు నిర్దేశిత ఫారంలో దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనలు పాటించని అభ్యర్థులపై కమిటీ నివేదిక తయారుచేస్తుంది.సమాచారంపై కమిటీ సంతృప్తి చెందితేనే నిర్దేశిత ధ్రువపత్రం జారీ చేస్తుంది. పోలింగ్ జరిగే 48 గంటల ముందు కమిటీ ఎటువంటి ధ్రువీకరణ పత్రం ఇవ్వదు. అనుమతి, విభేదించే విషయంలో అభ్యర్థి ఏమైనా అప్పీలు చేసుకోవాలనుకుంటే కమిటీ ధ్రువపత్రం జారీ చేసిన మూడు రోజుల్లోపు ఎన్నికల సంఘానికి విన్నవించుకోవాలి. పత్రికల్లో వచ్చే ప్రకటనలకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విలువ ఆధారిత ప్రకటనలుగా తీసుకోదలచిన ప్రకటనలకు సూచనలు జారీ చేసినందున సూచనల ప్రకారం కాకినాడ కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలనాధికారుల సెల్ ఏర్పాటుచేశారు. రిటర్నింగ్ అధికారులకు ఇచ్చిన సమాచారాన్ని ధ్రువీకరణ పొందిన తర్వాత వారి పరిశీలనలో ప్రకటనలకు విలువను లెక్కిస్తారు. సదరు ప్రకటనల విలువపై అభ్యంతరాలను అభ్యర్థులు వారి సంజాయిషీని 48 గంటల్లోగా కమిటీకి ఇవ్వాలి. ఇవ్వనిపక్షంలో కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుంది. ఈ వివరాలను కమిషనర్ ఎస్.అలీంబాషా ఒక ప్రకటనలో తెలిపారు.

చుట్టాలొస్తున్నారు!

సామాజికవర్గాల ఓట్ల కోసం..బంధువర్గాలను దింపిన పార్టీలు

హోరాహోరీ పోరులో పోటాపోటీ ప్రచారం పలుచోట్ల ఇండిపెండెంట్ల బెడద



కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గెలుపు, ఓటములను ప్రభావితం చేసే ప్రధానాంశం సామాజికవర్గాల ఓటర్లు. ఈ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు రంగంలో ఉన్న అభ్యర్థులు ఆయా పార్టీలకు చెందిన సంబంధిత సామాజికవర్గాల నేతలను ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారు. ఇక పార్టీల అధిష్టానాలుఆయా నేతల ప్రచారాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. నగరంలో అటు కాపు, ఇటు బీసీ, వైశ్య, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఇతర సామాజికవర్గాలకు చెందిన నేతలు సంబంధిత పార్టీల అభ్యర్థుల ప్రచారాల్లో జోరుగా పాల్గొంటున్నారు. కాకినాడ మేయర్ స్థానాన్ని జనరల్ సామాజికవర్గానికి కేటాయించడం తెలిసిందే. దీంతో అధికార ప్రతిపక్ష నేతలు కాపు ప్రజాప్రతినిధులను ఆయా డివిజన్ల అభ్యర్థుల ప్రచారంలోకి దించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం చిన రాజప్ప, తోట నరసింహం, చిక్కాల రామచంద్రరావు, వరుపుల వంటి వారు ప్రచారంలో ఉన్నారు. మరోవైపుబీసీ నేతల్లో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముమ్మర ప్రచారం చేస్తున్నారు.డివిజన్ల వారీ ఓటర్లు అధికంగా ఉన్న సామాజికవర్గాలకు చెందిన నేతలు ఇటు జిల్లా, అటు ఇతర జిల్లాలకు చెందిన నేతలు ప్రచారంలో పాల్గొని ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. అభ్యర్థులు.. మరో అడుగు ముందుకేసి బంధువర్గాలకు సంబంధించి కుల పెద్దలు, సమీప బంధువులను ప్రచారానికి వినియోగిస్తున్నారు. నగర పరిధిలోని 24, 25, 26, 27, 28, 29, 30 డివిజన్లలో బంధువులు ఎన్నికల కదన రంగంలోకి దూకారు.

రెబెల్స్ ఉన్న చోటా.. చుట్టుముట్టిన చుట్టాలు..

24వ డివిజన్‌లో టీడీపీ తరఫున డోకుబుర్ర భద్రం, వైసీపీ తరఫున మీసాల ఉదయ్‌కుమార్ రంగంలో ఉన్నారు. కాంగ్రెస్ తరఫున బత్తిన లలిత, ఇండిపెండెంట్లుగా మీసాల వరలక్ష్మి, లంకా సంజీవ్‌కుమార్, గొల్లపల్లి వరప్రసాద్ పోటీలో పాల్గొన్నారు. 25వ డివిజన్‌లో టీడీపీ తరఫున కామాడి సీత, వైసీపీ తరఫున బత్తిన చినతల్లి, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గంగాభవాని, భువనేశ్వరి, విజయలక్ష్మి పోటీ చేస్తున్నారు. 26వ డివిజన్‌లో టీడీపీ తరఫున సంగాని నందం, వైసీపీ తరఫున మచ్చా లోకేష్‌వర్మ, ఇండిపెండెంట్లుగా రవికుమార్, కర్రి మంగ, ధరణికోట నాగేంద్ర కుమార్ పోటీ చేస్తున్నారు. 29వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థిగా చిట్నీడి శ్రీనివాస్ బరిలో ఉన్నారు. వైసీపీ తరఫున సిరియాల చంద్రరావు పోటీ చేస్తున్నారు. ఇండిపెండెంట్లుగా వాసిరెడ్డి రాంబాబు, యాళ్ళ పట్టాభి, పినిశెట్టి శ్రీని వాసరావు బరిలో ఉన్నారు. ఈ డివిజన్‌లో ప్రధాన పార్టీల అభ్యర్థులు హోరాహోరీగా పోటీ పడుతున్నప్పటికీ టీడీపీ రెబెల్స్ వారి విజయావకాశాలను దెబ్బతీసే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అందుకనే ఇక్కడ ప్రత్యేకంగా చుట్టాలను తీసుకువచ్చి..వారితో ప్రచారం చేయించి, సెంటిమెంటు అస్త్రం ప్రయోగిస్తున్నారు.30వ డివిజన్‌లో తుమ్మల రవికుమార్ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ఈ రెబెల్స్ అందరూ ప్రధాన పార్టీ అభ్యర్థులను ఇబ్బందిపెట్టేవారే అంటున్నారు.


అలంకార రూపంలో బిక్కవోలు వినాయకుడు

చెవిలో చెబితే చాలు!

కోరిన కోర్కెలు తీర్చే..బిక్కవోలు వినాయకుడు

నేటి నుండి బిక్కవోలులో చవితి ఉత్సవాలు ప్రారంభం

బిక్కవోలు: ప్రాచీన ఆలయాలకు పుట్టినిల్లుగా భాసిల్లే బిక్కవోలులో ఆదిదేవునిగా భక్తుల పూజలందుకుంటున్న పురాతన స్వయంభూవినాయకుని ఆలయంలో శుక్రవారం వినాయకచవితి ఉత్సవాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈవినాయకుని చెవిలో భక్తులు తమ కోర్కెలు చెబితే తప్పక నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మండల కేంద్రమైన బిక్కవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పంట పొలాలలో ఈవినాయకుని విగ్రహం బయల్పడింది. ఇది 12వ దశాబ్దానికి చెందినదిన ఏకశిలావిగ్రహమని పురావస్తు శాఖ పరిశీలనలో వెల్లడైంది. బిక్కవోలును రాజధానిగా చేసుకుని 12వ శతాబ్ధంలో తూర్పు చాళుక్యులు ఈప్రాంతాన్ని పాలించారు. వారు యుద్దాలకు వెళ్లే ముందు ఈవినాయకునికి పూజలు చేసి వెళ్లి విజయం సాధించేవారు. కాల క్రమేణ తురుష్కులు, పిండారీలు, మహ్మదీయుల దండయాత్రలలో ఈవిగ్రహం భూమిలోకి కూరుకు పోయిందన్న ప్రచారం కూడ వాడుకలో వుంది.అయితే 1960వ దశకంలో బిక్కవోలుకు చెందిన ఒక భక్తుని కలలో వినాయకుడు కనిపించి తన ఉనికిని తెలిపాడని ప్రతీతి. నిరుపేద అయిన ఆభక్తుడు గ్రామస్తుల సహకారంతో ఈవిగ్రహాన్ని బయటకు తీసే ప్రయత్నం చేసాడని ఎంత తవ్వినా విగ్రహం మొదలు కానరాలేదు. దీంతో అలాగే భక్తులు స్వామిని పూజించడం మొదలు పెట్టారు. ప్రస్తుతం విగ్రహం పది అడుగుల ఎత్తు, ఆరడగుల వెడల్పు వుంది. ఈస్వామికి తొండం కుడివైపుకు వుండడంతో భక్తులు మనస్సులోని ఏకోరికనైనా స్వామికి చెబితే తప్పక నెరవేరుతుందని భక్తుల విశ్వాసం.

చవితి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు: సాయిబాబారెడ్డి




ఈ ఏడాది చవితి ఉత్సవాలను భారీఎత్తున నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణమంతా చలువపందిళ్లు వేశామని, వర్షం వచ్చినా భక్తులు తడవకుండా పందిళ్లపై బరకాలు వేశామన్నారు.స్వామి దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు.25న ఉదయం గం.12-18ని.లకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు.వచ్చేనెల 3 వరకు ఉత్సవాలను నిర్వహిస్తామని, భక్తులందరికీ అన్నదాన ఏర్పాట్లు చేశామని తెలిపారు. 3న మహాన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులందరూ తరలివచ్చి స్వామి ఆశీస్సులు తీసుకోవాలని కోరారు.

చవితి సందర్భంగా ప్రత్యేక వ్రతాలు...

వినాయకచవితి సందర్భంగా లోక కళ్యాణార్థం ఆలయంలో ప్రత్యేక వ్రతాలను ఈనెల 24 నుండి వచ్చేనెల 3 వరకు చేయనున్నట్లు ఆలయ అర్చకులు గొల్లపల్లి వెంకటరమణ తెలిపారు. 24న నెలవారీ పూజతో పాటు లక్షదూర్వాబిల్వార్చన, 25న వినాయకచవితి విశేషపూజలు, 26న రజదోష నివారణార్థం స్త్రీలకు రుషి పంచమి వ్రతం, 27న శనిదోష, నేత్రదోష నివారణ కోసం ప్రత్యేక సూర్య నమస్కారాలు, త్రిచారుణ మహాసౌర హోమాలు,28న విద్యాభివృద్ధికి విద్యాగణపతి వ్రతం, 29న కుజదోషపరిహారార్థం శ్రీకుమారవ్రతం, 30న సంతానంలేని వారికి గర్భదోషం కలవారికి పుత్రగణపతి వ్రతం, 31న అన్యోన్య దాంపత్యం కోసం వ్యాపార ఉద్యోగ వ్యవసాయ అభివృద్ధి కోసం, రుణబాధ నివారణకు అష్టగణపతి సహిత శ్రీలక్ష్మీగణపతి వ్రతం, సెప్టెంబరు 1న నవగ్రహదోషాల కోసం జాతకరీత్యా, గోచారరీత్యా నవగ్రహ దోషం గల వారికి నవగ్రహ పాశుపతం, 2న అపమృత్యు పరిహారార్థం జాతక రీత్యా అష్ట రాహుదోష పరిహారార్థం మహామృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం, 3న మహాపూర్ణాహుతి, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరుగుతుంది.


స్వామి వారి ఆలయ గాలి గోపురం

'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017'విజేత?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 2017కి గాను 'మాలతి చందూర్' సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనారాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ట సేవలందించినందుకు 'మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017'కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్వీమాసున్ (చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన 'అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ' నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. 'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017' పురుషుల సింగిల్స్ విజేత?
ఎ) పీటర్ గ్రేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్ (ఇండియా)
సి) లిన్ డాన్(చైనా)
డి) జ్వోనిమిర్ దుర్కిన్ జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెండర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై 'మూడ్ ఆఫ్ ద నేషన్' పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) నవీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్దిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే 'వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017'కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్)
బి) నితీష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్ (కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచిక్(టెన్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మందన(క్రికెట్)

15. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017'కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జే(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని 'సద్భావన దివస్'గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన 'నావికా సాగర్ పరిక్రమ' ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్ఎస్‌వి తరిణి
బి) ఐఎన్ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్ఎస్‌వి తలాష్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం 'సాంస్కృతిక రథాన్ని' ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హంపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. 'నికోలాయ్ కుదాషెవ్' ఇటీవల ఏ దేశం తరఫున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్థాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సోహెల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మీవిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను 'స్పానిష్ సూపర్ కప్' ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రీమియర్ క్లబ్ డి) రివర్ ప్లేట్ క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని 'పోలియో రహిత దేశం'గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్థాన్

24. 'అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018'కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేధోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన 'ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్' పుస్తక రచయిత?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృతా వర్గీస్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'నమో యువ రోజ్‌గార్ కేంద్ర' ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. 2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ 'ఒరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్' ఏ రాష్ట్రానికి చెందింది?
ఎ) చత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. 'ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సెల్' 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకీబుల్ హసన్
సి) విరాట్ కోహ్లీ డి) ఎవరూ కాదు

33. శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?
ఎ) కదిరగామర్. ఆర్ బి) డబ్ల్యూహెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నియా

34. ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. స్కూల్ టీచర్ల కోసం 'మేఘశాల' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యానా

క్రీడా పురస్కారాలు

36. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ఠక్కర్
సి) మేరీకోం డి) కరణం మల్లీశ్వరి

37. 2017కిగాను 'ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) మేరీకోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపీచంద్

38. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న'కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝారియ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. దేవేంద్రతోపాటు 2017కిగాను 'ఖేల్‌రత్న' పొందిన మరో క్రీడాకారుడు?
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
బి) సర్దార్‌సింగ్ - హాకీ
సి) జ్యోతిసురేఖ - షూటింగ్
డి) విరాట్ కోహ్లి - క్రికెట్

40. 2017కిగాను 'ధ్యాన్‌చంద్' అవార్డుకి ఎంపికైన ముగ్గురిలో లేనిది?
ఎ) సత్యగీత - అథ్లెటిక్స్
బి) భూపేందర్‌సింగ్ - అథ్లెటిక్స్
సి) సయ్యద్ షాహిద్ హకీం - ఫుట్‌బాల్
డి) సుమరయి టెటె - హాకీ

41. 2017కిగాను 'ద్రోణాచార్య' అవార్డుకి ఎంపికైన ఏడుగురిలో మరణానంతరం పొందిన వ్యక్తి?
ఎ) హీరానంద్ కటారియా - కబడ్డీ
బి) బ్రిజ్‌భూషణ్ మహంతి - బాక్సింగ్
సి) పి.ఎ.రాఫెల్ - హాకీ
డి) డాక్టర్ ఆర్.గాంధీ - అథ్లెటిక్స్

42. 2017కిగాను 'అర్జున' అవార్డు పొందిన 17 మందిలో సరైన వారిని గుర్తించండి?
1. ప్రశాంతసింగ్ - బాస్కెట్ బాల్
2. చటేశ్వర్ పుజారా - క్రికెట్
3. ఎస్.వి. సునీల్ - హాకీ
4. మరియప్పన్ తంగవేలు - పారా అథ్లెట్
5. వరుణ్ సింగ్ బాటి - పారా అథ్లెట్
6. సాక్షి మాలిక్ - రెజ్లింగ్
ఎ) అన్నీ సరైనవే
బి) 6 మినహా అన్నీ సరైనవే
సి) 1, 2, 4 సరైనవి డి) 2 మాత్రమే సరైనది

సమాధానాలు

			19) ఎ	27) ఎ	35) సి
1) సి	7) డి	13) సి	20) సి	28) బి	36) బి
2) ఎ	8) డి	14) ఎ	21) డి	29) బి	37) డి
3) డి	9) బి	15) బి	22) ఎ	30) ఎ	38) సి
4) ఎ	10) ఎ	16) బి	23) సి	31) బి	39) బి
5) సి	11) ఎ	17) ఎ	24) బి	32) సి	40) ఎ
6) బి	12) ఎ	18) బి	25) డి	33) డి	41) డి
			26) బి	34) డి	42) బి

JOBS ఉద్యోగాలు

బిసిపిఎల్

గెయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, న్యూమలీఘర్ రిఫైనరీ లిమిటెడ్, అసోం ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న బ్రహ్మపుత్ర క్రాకర్ & పాలిమర్ లిమిటెడ్ (బిసిపిఎల్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

పోస్టులు - ఖాళీలు: సీనియర్ మేనేజర్(హెచ్ ఆర్)2, మేనేజర్(కెమికల్ 2, ఎఫ్& ఎ 1), డిప్యూటీ మేనేజర్(కెమికల్ 2, హెచ్ ఆర్ 1), సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ 1, ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 1), సీనియర్ ఆఫీసర్(లా 1, మార్కెటింగ్ 2)

అర్హత: పోస్టును అనుసరించి 50 శాతం మార్కులతో డిగ్రీ/ ఎంబిఏ/(పీజీ/ పీజీ డిప్లొమా)(పర్సనల్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)/ ఎల్ఎల్‌బి/ ఎల్ఎల్ఎం/ బిటెక్(కెమికల్/ పెట్రో కెమికల్/ కెమికల్ టెక్నాలజీ/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్/మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ & ఆటోమొబైల్)/ సీఏ/ ఐసిడబ్ల్యుఎ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పోస్టును అనుసరించి 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: www.bcplonline.co.in

ఎన్‌బిసిసి

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 94

పోస్టులు - ఖాళీలు: జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 1, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 5, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్ 10, ఎలక్ట్రికల్ 5), డిప్యూటీ మేనేజర్(లా) 2, అసిస్టెంట్ మేనేజర్(లా 2), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్(సివిల్ 10, ఎలక్ట్రికల్ 3), అసిస్టెంట్ మేనేజర్(హెచ్‌ఆర్ఎం 2, రాజ భాష 2), జూనియర్ ఇంజనీర్(సివిల్ 40, ఎలక్ట్రికల్ 4)

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: www.nbccindia.com

సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?

ఆధునిక భారతదేశ చరిత్ర

1. 'నాకు రక్తమివ్వండి. మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ప్రకటించిన జాతీయోద్యమ నేత?
ఎ) భగత్ సింగ్ బి) చంద్రశేఖర్ అజాద్
సి) సుభాష్ చంద్రబోస్ డి) ఖుదీరాంబోస్

2. 1897 జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించిన ప్రాంతం?
ఎ) కలకత్తా బి) కాన్పూర్ సి) ఢాకా డి) కటక్

3. సుభాష్ చంద్రబోస్ జన్మించిన భవనం నేడు చారిత్రక ప్రాధాన్యత పొందింది. దాని పేరు?
ఎ) ప్రగతి భవన్ బి) జానకీనాథ్ భవన్
సి) జనని భవన్ డి) జాగృతి భవన్

4. ఐసిఎస్ ఉద్యోగాన్ని వదులుకొని సుభాష్ చంద్రబోస్ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన సంవత్సరం?
ఎ) 1919 బి) 1920 సి) 1921 డి) 1922

5. సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వంపై ప్రభావం చూపిన జాతీయోద్యమ నేత?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) చిత్తరంజన్ దాస్
సి) బిపిన్ చంద్రపాల్ డి) గాంధీజీ

6. గాంధీజీని జాతిపితగా అభివర్ణించిన జాతీయ నాయకుడు?
ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) రవీంద్రనాథ్ ఠాగూర్
సి) సిఆర్.దాస్ డి) సుభాష్ చంద్రబోస్


7. సుభాష్ చంద్రబోస్ ఏ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు?
ఎ) చంపారన్ సత్యాగ్రహం
బి) ఖిలాఫత్ ఉద్యమం
సి) సహాయనిరాకరణ ఉద్యమం
డి) ఉప్పు సత్యాగ్రహం

8. గాంధీజీ ఏ ఉద్యమంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రను సుభాష్ చంద్రబోస్ నెపోలియన్స్ ఎల్బాదీవి నుంచి చేపట్టిన యాత్రతో పోల్చారు?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) ఉప్పు సత్యాగ్రహం సి) వ్యక్తి సత్యాగ్రహం
డి) క్విట్ ఇండియా ఉద్యమం

9. సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?
ఎ) గాంధీజీ బి) నెహ్రూ
సి) సి.ఆర్.దాస్ డి) బిపిన్ చంద్రపాల్

10. ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ 1938లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు?
ఎ) కలకత్తా బి) లక్నో
సి) బొంబాయి డి) హరిపురి

11. ప్రణాళిక సంఘాన్ని స్థాపించి, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించింది?
ఎ) గాంధీజీ
బి) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
సి) సుభాష్ చంద్రబోస్
డి) నెహ్రూ


ఎస్. రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

12. గాంధీజీ బలపర్చిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను బోస్ ఏ కాంగ్రెస్ సమావేశంలో ఓడించారు?
ఎ) త్రిపురి బి) హరిపురి
సి) కలకత్తా డి) లక్నో

13. సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' రాజకీయ పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1937 బి) 1938 సి) 1939 డి) 1940



14. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు బోస్ గృహనిర్బంధం నుంచి తప్పించుకొని భారత్‌ను వదిలిన సంవత్సరం?
ఎ) 1939 బి) 1940 సి) 1941 డి) 1942

15. కాబూల్, మాస్కో మీదుగా బోస్ ఏ నగరానికి చేరుకొన్నాడు?
ఎ) బెర్లిన్ బి) పారిస్ సి) లిస్బన్ డి) జెనీవా

16. సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలోని రేడియో కేంద్రం ద్వారా భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు?
ఎ) రష్యా బి) ఫ్రాన్స్ సి) జర్మనీ డి) జపాన్

17. భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సాయం చేస్తామని బోస్‌కు హామీ ఇచ్చిన దేశం?
ఎ) జర్మనీ బి) జపాన్ సి) రష్యా డి) ఏదీకాదు

18. టోక్యోలో సుభాష్ చంద్రబోస్‌తో చర్చలు జరిపిన 'టోజో' ఏ పదవిలో ఉన్నారు?
ఎ) జపాన్ అధ్యక్షుడు బి) ప్రధాన మంత్రి
సి) సైన్యాధికారి డి) విదేశాంగ మంత్రి

19. 1943 నుంచి సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలో తన సైనిక కార్యక్రమాలు ప్రారంభించారు?
ఎ) జర్మనీ బి) జపాన్
సి) సింగపూర్ డి) ఇండోనేషియా

20. 'భారత జాతీయ సైన్యం' ఏర్పాటుకు పునాది వేసింది?
ఎ) కెప్టెన్ మోహన్ సింగ్
బి) రాజ్‌బిహారీ బోస్
సి) ఖుదీరాంబోస్ డి) ఎవరూ కాదు

21. 1942లో టోక్యోలో ప్రవాస భారతీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) కెప్టెన్ మోహన్ సింగ్ బి) లాల్ హరిదయాళ్
సి) సుభాష్ చంద్రబోస్ డి) రాజ్‌బిహారీ బోస్

22. సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఎక్కడ వ్యవస్థీకరించారు?
ఎ) టోక్యో బి) బెర్లిన్ సి) సింగపూర్ డి) మాస్కో

జనరల్ స్టడీస్ - ఇండియన్ హిస్టరీ

23. అజాద్ హింద్ ఫౌజ్‌లోని మహిళ రెజిమెంట్‌కి గల పేరు?
ఎ) ఝాన్సీరాణి రెజిమెంట్
బి) దుర్గావతి రెజిమెంట్
సి) రాణి అబ్బక్క రెజిమెంట్
డి) మహిళశక్తి రెజిమెంట్

24. భారత జాతికి సుభాష్ చంద్రబోస్ అందించిన నినాదాలు?
ఎ) జైహింద్ బి) చలో ఢిల్లీ సి) డూ ఆర్ డై డి) ఎ, బి

25. మొట్టమొదటి భారత ప్రభుత్వాన్ని నేతాజీ ఎక్కడ ఏర్పాటు చేశారు?
ఎ) టోక్యో బి) రంగూన్
సి) సింగపూర్ డి) మలేషియా

26. నేతాజీ ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశం?
ఎ) రష్యా బి) జర్మనీ సి) జపాన్ డి) ఏదీకాదు

27. 1943లో టోక్యోలో జరిగిన తూర్పు ఆసియా దేశాల సమావేశానికి సుభాష్ చంద్రబోస్ ఏ హోదాలో హాజరయ్యారు?
ఎ) భారత సైన్యాధినేత బి) విదేశాంగ ప్రతినిధి
సి) భారత ప్రభుత్వాధినేత డి) ఏదీకాదు

28. అజాద్ హింద్ ఫౌజ్ పాలన కిందకి వచ్చిన తొలి భారత భూభాగం?
ఎ) అండమాన్ నికోబార్ దీవులు బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) సిక్కిం

29. అండమాన్ నికోబార్ దీవులకు సుభాష్ చంద్రబోస్ పెట్టిన పేరు?
ఎ) స్వరాజ్ దీవులు బి) షాహీద్ దీవులు
సి) అజాదీ దీవులు డి) ఎ, బి

30. సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో జాతీయ సేనకు, బ్రిటీష్‌వారికి మధ్య ప్రత్యక్ష యుద్ధం జరిగిన సంవత్సరం?
ఎ) 1943 బి) 1944 సి) 1945 డి) 1946

31. బ్రిటీష్‌వారిని ఓడించి ఆజాంద్ హింద్‌ఫౌజ్ జాతీయ పతాకాన్ని ఎక్కడ ఎగురవేసింది?
ఎ) మౌడక్ బి) మయన్మార్
సి) అండమాన్ దీవులు డి) ఏదీకాదు

32. ఆంగ్లేయుల నుంచి జాతీయ సైనం స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలు?
ఎ) మౌడక్ బి) కోహిమా సి) ఇంఫాల్ డి) పైవన్నీ

33. భారత జాతీయ సైన్యం సాగించిన సమరం ఆగిపోవడానికి కారణం?
ఎ) జపాన్ పై అమెరికా అణుదాడి
బి) బ్రిటీషర్లు రంగూన్ ను ఆక్రమించడం
సి) జపాన్ సైనికుల తిరోగమనం
డి) పైవన్నీ

34. తైవాన్ దీవుల్లో సుభాష్ చంద్రబోస్ ప్రయాణించే విమానం ప్రమాదానికి గురైన సంవత్సరం?
ఎ) 1945 ఆగస్టు 15 బి) 1946 ఆగస్టు 16
సి) 1946 ఆగస్టు 17 డి) 1946 ఆగస్టు 18

35. బ్రిటీషర్లకు బంధీలుగా చిక్కి ఎర్రకోటలో న్యాయ విచారణ ఎదుర్కొన్న జాతీయ సైన్యం ప్రతినిధులు?
ఎ) షాన్ వాజ్‌ఖాన్ బి) కల్నల్ టి.కె.షెనగల్
సి) బి.ఎస్.ధిల్లాన్ డి) పైవారందరూ

36. భారత సైనికాధికారుల తరపున వాదించి, వారి విడుదలకు తోడ్పడినవారు?
ఎ) బల్లూభాయ్ దేశాయ్ బి) అసఫ్ అలీ
సి) తేజ్ బహదూర్ సప్రూ డి) పైవారందరూ

సమాధానాలు

			16) సి	23) ఎ	30) బి
			17) బి	24) డి	31) ఎ
1) సి	6) డి	11) సి	18) బి	25) సి	32) డి
2) డి	7) సి	12) ఎ	19) సి	26) సి	33) డి
3) బి	8) బి	13) సి	20) ఎ	27) సి	34) డి
4) ఎ	9) ఎ	14) సి	21) డి	28) ఎ	35) సి
5) బి	10) డి	15) ఎ	22) సి	29) డి	36) డి

JOBS ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ - **గ్రౌండ్ డ్యూటీ** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

ఖాళీలు: 28 **కాంట్రాక్ట్ వ్యవధి:** అయిదేళ్లు

పోస్టులు - ఖాళీలు: మేనేజర్(ఫ్లయిట్ డిస్పాచ్) 14, మేనేజర్(ఆపరేషన్ ఎక్స్‌ప్యాట్ సెల్) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ డిస్పాచ్) 6, ఆఫీసర్ - కాక్ పిట్ 1, అసిస్టెంట్ టెక్నికల్ (లైబ్రరి) 1, డిప్యూటీ మేనేజర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సింథటిక్ ఫ్లయిట్ (ఇన్ స్ట్రక్టర్) 2, అసిస్టెంట్ ట్రైనింగ్ 1

వయసు: 21 ఏళ్లు

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్(ఎంపిసి) / డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అదనపు అర్హతల వివరాలకోసం వెబ్‌సైట్‌లోని ప్రకటన చూడవచ్చు.

ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపాలి

దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: ఆగస్టు 31

చిరునామా: The Chief of HR, Air India Express Limited, Airlines House, Durbar Hall Road, Near Gandhi Square, Kochi 682016

వెబ్‌సైట్: www.airindiaexpress.in

సిఇఐఎల్

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సిఇఐఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 23

పోస్టులు - ఖాళీలు: ఇంజనీర్స్(క్యూసీ/ క్యూఏ) 4, సీనియర్ ఇంజనీర్స్ (క్యూసీ/ క్యూఏ) 5, డిప్యూటీ మేనేజర్ (క్యూసీ/ క్యూఏ) 5, ఇంజనీర్ స్పెషలిస్ట్ 6, సీనియర్ ఇంజనీర్ స్పెషలిస్ట్ 2, ఆఫీసర్ 1

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్(మెకానికల్/ ప్రొడక్షన్ / మెటలర్జికల్)/ఎంబిఏ(హెచ్ ఆర్)/ పీజీ(పర్సనల్ మేనేజ్‌మెంట్ & లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి

వెబ్‌సైట్: www.ceil.co.in

ఎన్ ఐసిఇడి

కోల్కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా & ఎంటరిక్ డిసీజెస్(ఎన్ ఐసిఇడి)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 19

మెడికల్ ఎపిడెమియోలజిస్ట్(సైంటిస్ట్ సి)
ఖాళీలు: 1
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ విభాగంలో ఆరేళ్ల అనుభవం ఉండాలి.

సీనియర్ రీసెర్చ్ ఫెలో(మెడికల్) **ఖాళీలు:** 12
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి

సీనియర్ రీసెర్చ్ ఫెలో(నాన్ మెడికల్) **ఖాళీలు:** 1
అర్హత: 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఫీల్డ్ కన్సల్టెంట్ / మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

డేటా మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: (డిగ్రీ/ పీజీ)(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో అయిదేళ్ల అనుభవం ఉండాలి.

అసిస్టెంట్ డేటా మేనేజర్/ డేటా సెక్రటరీ
ఖాళీలు: 1
అర్హత: డిగ్రీ(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత + కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి.

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ / అకౌంటెంట్ **ఖాళీలు:** 2
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత విభాగంలో అయిదేళ్ల అనుభవం ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 5

వేదిక: National Institute of Cholera & Enteric Diseases, (NICED II Building within ID & BG Hospital Campus), 57, Beliaghata Main Road, Kolkata - 700010

వెబ్‌సైట్: www.niced.org.in/

ఎన్ సిఇఆర్‌టి - డిఇఇ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్ సిఇఆర్‌టి) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఇ)- తాత్కాలిక ప్రాతిపదికన **జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో**ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు: 6**

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఎడ్యుకేషన్ / ఇంగ్లిష్/ మేథమెటిక్స్/ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్ / ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి.

వయసు: 40 ఏళ్లలోపు ఉండాలి.

వేతనం: నెట్ అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000 కాగా నెట్ స్కోరు లేని అభ్యర్థులకు రూ.14000

ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29

వేదిక: Department of Elementary Education(DEE), 4th Floor, Room No. 415, G.B Pant Block, NCERT, Sri Aurobindo Marg, New Delhi- 110016

వెబ్‌సైట్: www.ncert.nic.in

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కోర్టు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. 2012 ముందు కేసులన్నీ పరిష్కరించాలనే హైకోర్టు ఆదేశాలు ఉపసంహరించుకోవాలని పలువురు న్యాయవాదులు ఆందోళన జరిపారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బార్ అధ్యక్షుడు కొల్లా వీర్రాజు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల వల్ల న్యాయవాదులపై ఒత్తిడులు పెరిగే అవకాశాలున్న దృష్ట్యా ఈ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు బుగతా శివ, ఆడారి సుగుణ, జగన్నాధం, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్



రౌతులపూడిలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో ఎస్‌వీ నాయుడు



శంఖవరంలో చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు



ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

టంగుటూరి ఆదర్శప్రాయుడు

ప్రత్తిపాడు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. మినర్వా ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. మినర్వాలో జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజబాబు, ప్రిన్సిపాల్ ఆనంద్‌జోసికుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఎంఈవో ఎస్‌వీ నాయుడు, హెచ్ఎం గాడి కొండబాబు, ప్రకాశం పంతులకు నివాళులర్పించారు.

శంఖవరం: టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని శంఖవరం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. బుధవారం పాఠశాలలో టంగుటూరి జయంతిని నిర్వహించారు. పాఠశాల సాంఘిక ఉపాధ్యాయులు ఎన్.రమేష్‌బాబు టంగుటూరి విజయగాధను విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు, రమేష్, కిరణ్, ప్రసాద్, కృష్ణ, గిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బోను రామకృష్ణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో లెక్చరర్లు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.జానకిరాం, పలివెల శివాజీ, అమరకల్యాణ్, డాక్టర్ వి.కనకరాజు, వాగు మాదవ్, అనిల్‌కిరణ్, సీహెచ్ గోపి, ఎన్.రాజేంద్రప్రసాద్, కె.అనిత, ఎ.ప్రకాశ్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కాపు ఉద్యమనేత ముద్రగడ

కాపు రిజర్వేషన్ సాధించేంత వరకు నిద్రపోం

ప్రత్తిపాడు: కాపులకు బీసీ రిజర్వేషన్లు సాధించేంత వరకు నిద్రబోమని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం తెలిపారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ గ్రామాలకు చెందిన కాపులు జువ్వల చినబాబు, సానా నూకరాజునాయుడు, మాజీ ఎంపీపీ జల్లిగంపల సత్యనారాయణ, దొడ్డిపట్ల సోమన్నదొర, చక్కపల్లి సత్తిబాబు తదితరులు బుధవారం కిర్లంపూడి వెళ్లి ముద్రగడను కలిశారు. ముద్రగడ మాట్లాడుతూ రిజర్వేషన్లు సాధన కోసం జాతి ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కాపు నాయకులు రామిశెట్టి రాజా, సలాది కృష్ణ, నామన భాస్కర్, సాయిబాబా, చల్లా సత్యనారాయణ, సిద్దా విజయబాబు, సలాది భాస్కరరావు తదితరులున్నారు.



వినాయకుని ఉత్సవానికి రాట మహోత్సవం

శంఖవరం: వినాయకుని నవరాత్రి ఉత్సవాలకు కత్తిపూడి, శంఖవరం గ్రామాలతో పాటు మండలంలో ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. కత్తిపూడి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బుధవారం రాటమహోత్సవం నిర్వహించారు. పూజారి శర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కేళంగి నూకరాజు, కె.శివ, త్రిమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 25 నుంచి 11 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించి అనంతరం నిమజ్జనం చేస్తామన్నారు. కార్యక్రమంలో జీలకర్ర లక్ష్మణ్, మాదేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామ్‌మాధవ్

చిరు వ్యాపారుల ఆశాజ్యోతి ప్రధాని మోది

ఎమ్మెల్సీ రామ్‌మాధవ్

రౌతులపూడి: చిరువ్యాపారుల ఆశాజ్యోతి ప్రధాని మోది అని ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ పీవీఎన్ రామ్‌మాధవ్ అన్నారు. రౌతులపూడిలో వ్యాపారులకు ముద్ర యోజన పంపిణీ జరగ్గా, ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం దేవాదాయశాఖ అందించి మైక్‌సెట్‌లు, విద్యార్థులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు సుబ్బారావు ఉపాధ్యక్షుడు కోళ్ళ రవిబాబు, శివాజీ, చిరంజీవి మండల అధ్యక్షుడు ఎ.అప్పలస్వామి, డి.చంటిబాబు, కోళ్ళ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ అమలుతో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ

ఏలేశ్వరం: పట్టణంలో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ ద్వారా స్వచ్ఛ భారత్ అమలుకు కృషి చేస్తున్నామని ఏలేశ్వరం మున్సిపల్ చైర్‌పర్సన్ కొప్పాడ పార్వతి, వైస్ చైర్మన్ పైలా సత్యనారాయణ అన్నారు. బుధవారం పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలతో కలిసి పట్టణంలోని పదో వార్డు ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల పరిసరాలు, రహదారుల వెంబడి మురికినీటి నిల్వాలు, చెత్తా చెదారాలు నిల్వ ఉండకుండా పరిసరాలు పరిశుభ్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై వారు పరిశీలించారు అనంతరం 13వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే సీసీ డ్రైన్ పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుంకర రాంబాబు, గొడతా చంద్ర, పాండ్రంకి సత్యనారాయణ, బూర్లు సత్తిబాబు, కొప్పాడ రమేష్, ముత్యాల నారాయణ, వాడపల్లి శ్రీను, గొడుగు నాగేంద్ర, బజంతుల మణి, సుంకర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో సీసీ డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

అక్టోబర్ 2 నాటికి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా ప్రకటించాలి

ప్రత్తిపాడు: అక్టోబర్ 2వ తేదీ నాటికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా మారాలని బీసీ కార్పొరేషన్ జిల్లా ఈడీ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం.జ్యోతి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈడీ జ్యోతి మాట్లాడుతూ మండలంలో పెదశంకర్లపూడి, బవురువాక గ్రామాలు సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా మారాయని మిగిలిన 18 గ్రామ పంచాయతీలు గాంధీ జయంతి రోజునాటికి ఓడీఎఫ్ గ్రామాలుగా మార్పు చెందాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వి.రామకృష్ణ, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ నాగేశ్వరరావు, ఏపీఎం గ్రేస్, ఏపీవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ జ్యోతి

• సినిమా గైడ్

ఏలేశ్వరం:

వెంకటసూర్య	లై
జయశ్రీ	నేనే రాజు నేనే మంత్రి

కత్తిపూడి:

సత్యనారాయణ	వివేకం

రౌతులపూడి:

శ్రీమహాలక్ష్మి	గురు



రెవెన్యూ సహాయక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

రెవెన్యూ సహాయక కేంద్రం ప్రారంభం

ప్రత్తిపాడు: తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సహాయక కేంద్రాన్ని బుధవారం పెద్దాపురం ఆర్డీవో విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత అంశాలపై ప్రజలకు మరింత సహాయ మందించేందుకు రెవెన్యూ సహాయక కేంద్రాలు దోహదపడతాయని చెప్పారు. ప్రస్తుతం పెద్దాపురం సబ్ డివిజన్‌లో నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కేంద్రాలు ప్రారంభిస్తున్నామని అనంతరం అన్ని మండల కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని ఆర్డీవో తెలిపారు. డివిజన్‌లో తుని, పెద్దాపురం, గండేపల్లి, తొండంగి, జగ్గంపేట మండల రెవెన్యూ కార్యాలయ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. వెలుగు పథకాలకు సంబంధించి ఉద్దండ జగన్నాధపురం ఎంపీటీసీ వట్టికూళ్ల కృష్ణసత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఆర్డీవో విచారణ నిర్వహించారు. చంద్రన్న బీమా రసీదులు ఇవ్వడం లేదని, స్కాలర్‌షిప్‌లు లబ్దిదారుల ఖాతాల్లో జమకాలేదనే తదితర అంశాలపై వెలుగు అధికారులు గ్రేస్, నాయుడును ఆరా తీశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, డీటీ ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

జగ్గంపేట/కిర్లంపూడి/గండేపల్లి: జగ్గంపేట ఎస్‌బీఐ మార్కెట్ రోడ్డు బ్రాంచ్‌లో బుధవారం బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కిర్లంపూడి మండల ప్రజాపరిషత్ కార్యాలయం లో కాపు రుణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రత్తిపాడు డీసీసీబీ బ్యాంకు అధికారి, సూపరింటెండెంట్ ఆచార్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదేవిధంగా గండేపల్లి మండలానికి సంబంధించి కాపు, బీసీలకు పెద్దాపురం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ఎంపీడీవో కె.రమేష్, మేనేజర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి.

కాపుల జలదీక్ష



జగ్గంపేటలో జలదీక్ష చేస్తున్న కాపులు

జగ్గంపేట: కాపు ఉద్యమనేత ముద్రగడకు మద్దతుగా బుధవారం జగ్గంపేటలో కాపులు ఆందోళన నిర్వహించారు. కాపు జేఏసీ నేత తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో కాపులంతా జగ్గంపేట-గుర్రప్పాలెం రోడ్డులోని పుష్కర కాలువలో కాపులు నల్లజెండాలు పట్టుకుని జలదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో మణికంఠ, కురుమళ్ల ఆదిబాబు, అభయ్య, పేపకాయల రాజారాం తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లి చెరువులో చేపలు మృతి



మల్లేపల్లిలో చనిపోయిన చేపలు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి జాతీయరహదారిని ఆనుకుని ఉన్న మంచినీటి చెరువులో చేపలు బుధవారం భారీ సంఖ్యలో చనిపోయి పైకితేలాయి. చెరువు లీజుకు తీసుకున్న కోళ్ల కృష్ణ అయోమయ పరిస్థితిలో పడ్డాడు. చనిపోయిన చేపలు గుట్టలు గుట్టలుగాతీసి బయటపడేస్తున్నారు. చేపల పెంపకానికి ఎంతో పెట్టుబడి పెట్టానని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కృష్ణ కోరుతున్నాడు. పొలంలో మందు చెరువులో చేరిందా లేదా ఎవరైనా కావాలని చెరువులో మందు కలిపారా అని అనుమానిస్తున్నారు.

ముద్రగడను కలిసిన రాజమహేంద్రవరం కాపులు

కిర్లంపూడి: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను బుధవారం రాజమహేంద్రవరం కాపులు కలిసి సంఘీభావం తెలిపారు. జక్కంపూడి రాజా, యాళ్ల సురేష్, ఇసుకపల్లి శ్రీనివాస్, కొత్తపేట రాజు, అడపారాజు, పసుపులేటి చైతన్య తదితరులు ఆధ్వర్యంలో కాపు యువత కార్ర్యాలీగా రాజమహేంద్రవరం నుంచి కిర్లంపూడి చేరుకుని ముద్రగడను కలిసి మద్దతు పలికారు.



కిర్లంపూడి చేరుకున్న రాజమహేంద్రవరం కాపులు

గణపతి నవరాత్రులకు విస్తృత ఏర్పాట్లు

విగ్రహాల కొనుగోలు, పందిళ్ల నిర్వహణపై దృష్టిపెట్టిన నిర్వాహకులు

జగ్గంపేట: జిల్లాలో గణపతి నవరాత్రులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మారుమూల గ్రామంలో ఒక విగ్రహం నెలకొల్పితే పట్టణాల్లోని ప్రతి వీధిలో ఒక్కో విగ్రహం ఏర్పాటుకు నిర్వాహకులు సిద్ధపడుతున్నారు. పోటాపోటీగా వీధికొక గణనాధుని విగ్రహం నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే వీధుల్లో ఏర్పాటుచేసే విగ్రహాలను కొనుగోలు చేయడం, కొన్నింటికి అడ్వర్లు ఇచ్చారు. ప్రస్తుతం ఏ వీధిలో చూసిన గణపతి నవరాత్రుల సందడి కనిపిస్తోంది. కొన్నిచోట్ల ఉత్సవ కమిటీ సభ్యులు తొమ్మిదిరోజులే కదా అని రహదారులకు అడ్డంగా స్టేజీలు ఏర్పాటుచేసి విగ్రహాలను నెలకొల్పుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రహదారులు మూసి వేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా విగ్రహాలు పెద్దవిగా ఉండడంతో పందిరి కూడా దాని కంటే ఎత్తులో నిర్మిస్తున్నారు. దీంతో ఈ పందిళ్ల కాస్త విద్యుత్ తీగలకు తాకేలా ఉండడం గమనార్హం. ప్రమాదవశాత్తూ అనుకోని సంఘటనలు జరుగుతూ ఉన్నాయి. మరోపక్క పరిమితికి మించి సౌండ్ ఎఫెక్ట్, బాక్సులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా బ్యానర్లు, ఫ్లెక్సీలను పెద్దవి ఏర్పాటు చేయడంలో తలమునకలయ్యారు. వాటన్నింటి దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో ఎక్కడ గణపతి నవరాత్రి ఉత్సవాలు జరపాలన్న తప్పనిసరిగా పోలీసు, ఆర్అండ్‌బీ, పంచాయతీ, విద్యుత్ తదితర శాఖల అనుమతి తీసుకోవాలని ప్రకటించారు. అయినప్పటికీ ఉత్సవకమిటీ సభ్యులు ఎవరూ ఇప్పటివరకు ఏశాఖ లోను ఎటువంటి అనుమతి తీసుకోకపోవడం గమనార్హం. కేవలం ఒక్క జగ్గంపేటలోనే 50కిపైగా పందిళ్ల ఏర్పాటు చేశారు.

అనుమతి తప్పనిసరి: సీఐ

గణపతి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహణకు సంబంధించి అనుమతులు తప్పనిసరి. ఎక్కడ ఉత్సవాలు నిర్వహించాలన్న అన్నిశాఖల అనుమతి తీసుకోవాల్సిందే. స్థానికులకు ఇబ్బందిలేకుండా ఉత్సవాలు నిర్వహించాలి. సౌండ్ ఎఫెక్ట్ లేకుండా తక్కువ సౌండ్‌నే ఏర్పాటుచేయాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదు. చట్టానికి విరుద్ధంగా శాంతిభద్రత లకు విఘాతం కల్పిస్తే చర్యలు తీసుకుంటాం.

వేడుకలకు సర్వం సిద్ధం

గండేపల్లి: ఈనెల 25వతేదీ వినాయక చవితి పురస్కరించుకుని మండల గ్రామాల్లో ఉత్సవ నిర్వాహకులు గణపతి నవరాత్రులకు సర్వం సిద్ధం చేశారు. విగ్రహాలను కొనుగోలుచేసి ఇప్పటికే ఏర్పాటుచేసిన స్టేజీలపై నెలకొల్పారు. విగ్రహాలు నెలకొల్పేందుకు భారీ స్టేజీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో గణపతి నవరాత్రులు పురస్కరించుకుని సందడి నెలకొంది. మరోపక్క విగ్రహాలు తయారుచేసిన ప్రదేశం నుంచి విగ్రహాలను తరలించేందుకు బుధవారం నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. బుధవారంనాటికి దాదాపు50శాతం విగ్రహాలను స్టేజీల వద్ద ఉంచారు. పందిళ్ల నిర్వహణ, సౌండ్ బాక్సులు, లైటింగ్ తదితర వాటితో యువత ఉత్సాహంగా కనిపిస్తున్నారు.



జగ్గంపేటలో నిర్మాణంలో పందిళ్లు



జగ్గంపేట గ్రామశివారు రామవరం అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథులు





గండేపల్లి మండలం జెడ్.రాగంపేట గ్రామ శివారున భారీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఎక్కిస్తున్న దృశ్యం

ఘనంగా టంగుటూరి జయంతి

కిర్లంపూడి: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కిర్లంపూడి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌గోపాల్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిగాయి. కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మణమూర్తి అధ్యక్షతన జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఐ వీరవేణి, సీనియర్ అసిస్టెంట్ చలపతి, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, ఇమ్మానియేలు, భాస్కర్,గుర్రయ్య, నూకరాజు, డీలర్లసంఘం అధ్యక్షుడు గౌతుగంగాధర్, చినబాబు, రాంబాబు తదితరులున్నారు.

మట్టి గణపతినే పూజించాలని విద్యార్థుల ర్యాలీ

గోకవరం: చవితి ఉత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ మట్టి గణనాధునే పూజించాలంటూ గోకవరంలో ద్రోణా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పలు వీధులలో విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలతో తిరిగి ప్రజలలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ రసాయనాలతో కూడిన విగ్రహాలు నిమజ్జనం చేయడం వల్ల నదులు కలుషితం అవుతున్నాయన్నారు. రసాయన పదార్థాలు నీటిలో కలవడం వల్ల నీటి కాలుష్యం ఏర్పడి జలరాశుల మనుగడ కష్టసాధ్యమవుతుందని, పంట పొలాలు కూడా రసాయనాల ప్రభావం పడుతుందన్నారు. కావున మట్టి గణపతిని పూజించి మన వనరులను కాపాడుకుంటామని ఈ ర్యాలీ చేపట్టారు.

ప్రియదర్శినిలో ఫ్రెషర్స్ పార్టీ



ప్రియదర్శినిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

జగ్గంపేట: స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కాలేజీలో బుధవారం ఫ్రెషర్స్ డే పార్టీ వేడుకలు ఘనంగా జరిగాయి. కాలేజీ ప్రిన్సిపాల్ తోట వాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ద్వితీయ, తృతీయ తరగతుల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

కిర్లంపూడి: కేంద్రంలో ఉపాధ్యాయ ఉద్యమ సంఘాల ఆధ్వర్యంలో విజయ వాడలో సెప్టెంబర్ 1న జరిగే మిలియన్ మార్చ్‌పోస్టర్‌ను బుధవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీసీపీఎస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాడి నూకరాజు మాట్లాడుతూ 2004లో సెప్టెంబరు 1నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు పింఛన్ లేకుండా చేశారని ఈ వ్యవస్థను వెంటనే రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. సెప్టెంబర్ 1న జరిగేమిలియన్ మార్చ్‌లో ఉపాధ్యాయ సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.వీరబాబు, సూర్యనారాయణ తదితరులున్నారు.

ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించండి

● వైసీపీ నాయకుడు వినతి

గోకవరం: గోకవరం ప్రభుత్వాసుపత్రిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలం టూ స్థానిక వైసీపీ నాయకులు డీసీహెచ్ఎస్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిని పరిశీలించడానికి వచ్చిన డీసీహెచ్ఎస్ రమేష్ కిషోర్ బుధవారం వైసీపీ నాయకులు కలుసుకుని సమస్యలను వివరించారు. రోగాల సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రి లో వైద్యుల నియామకం జరగలేదని గైనకాలజిస్ట్, ఫార్మసిస్ట్, రేడియాలజిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్ఎన్ఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఆసుపత్రిలో 24గంటలు రోగులకు వైద్య సదుపాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబనియంత్రణ ఆపరేషన్లు కూడా ఆసుపత్రిలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయాలపై డీసీహెచ్ఎస్ రమేష్ కిషోర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వరసాల ప్రసాద్, ముత్యం నాని, కర్రి సూరారెడ్డి, దాసరి ధర్మరాజు, మైపాల పండు, కుమ్మరిపూడి అప్పారావు, సుంకర పండు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రయివేట్ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

ఏలేశ్వరం: కర్నూలులో ప్రయివేట్ విద్యాసంస్థల అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులపై విద్యార్థి సంఘం నేతలు జరిపిన దాడికి నిరసనగా ఈనెల 24న చేపట్టే ప్రయివేట్ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతంచేయాలని మండల అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ సుంకర రాంబాబు కోరారు. బుధవారం ఏలేశ్వరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండాతగుచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ చేపట్టే బంద్‌లో పాఠశాలస్థాయి నుంచి అన్ని కళాశాలలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

● సినిమా గైడ్

జగ్గంపేట

శ్రీనివాస -1	ఆనందోబ్రహ్మ
శ్రీనివాస -2	జయ జానకి నాయక
రాజవేణి	ఫిదా
కృష్ణవేణి	గౌతమ్‌నంద
వెంకటరత్నం	మోహనరంగా
శ్రీ నాగేశ్వరా	నేనే రాజు నేనే మంత్రి

సూక్తి

సేవను మించిన ఆనందం లేదు
సంతోషాన్ని మించిన సంపద లేదు

టంగ్ ట్విస్టర్స్

1. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
2. Chester Cheetah chews a chunk of cheep cheddar cheese.
3. Real rock wall, real rock wall, real rock wall
4. A gazillion gigantic grapes gushed gradually giving gophers gooey guts.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయడం ఉత్తముల లక్షణం. అర్థమైందా?

బంటు : అర్థమైంది టీచర్. రేపటి హోంవర్క్ రేపే చేయాలి. ఈ రోజు కాదు!

టీచర్ : !!!!!!!!

ఓటమే లేకుండా..

ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు తప్పవు. కానీ కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. పుణేకు చెందిన జూనియర్ గోల్ఫర్ ఆర్యమన్ సింగ్ అదే చేసి చూపించాడు . నాలుగేళ్లుగా విజయాలే సాధిస్తూ దూసుకుపోతున్నాడు. 'ఇండియన్ గోల్ఫ్ యూనియన్- వెస్ట్ జోన్' అందించే 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను వరుసగా మూడు సార్లు సాధించాడు. జోనల్ లెవల్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ ఈ జూనియర్ గోల్ఫర్‌కు తిరుగులేదు. జూనియర్ గోల్ఫ్ చరిత్రలో 1,266 రోజులుగా ఓటమి ఎరుగని అజేయుడిగా నిలిచి సరికొత్త రికార్డు సాధించాడు.



ఆర్యమన్ సింగ్ వయసు పదేళ్లు. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా గోల్ఫ్ ఆడటం మొదలెట్టి నాలుగేళ్లు అవుతోంది. జోనల్ లెవల్‌లో ఇంతవరకు ఆర్యమన్‌కు తిరుగులేదు. ఈ ఛోటా గోల్ఫర్ తన కెరీర్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడాచేజార్చుకోలేదు. 1,266 రోజులుగా తన విజయ యాత్ర కొనసాగిస్తూ జూనియర్ లెవల్ గోల్ఫ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

'నా నాలుగో ఏట నుంచి గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టాను. రెండు సంవత్సరాల పాటు గోల్ఫ్ సాధన చేశాను. ఆట గురించే ఎప్పుడూ ఆలోచించేవాడిని. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయుల్లో జరిగే ప్రతి గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొనేవాడిని. అహ్మదాబాద్‌లోని 'కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్సు'లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా విజయం సాధించాను. ఆనాటి నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వస్తున్నాను. మూడేళ్లుగా 'జస్టిన్ పార్కన్స్' నాకు కోచింగ్ ఇస్తున్నాడు. గోల్ఫ్ క్రీడలో పేరుగాంచిన మార్క్ రోయ్, డేవిడ్ స్టాక్టన్, విజయ్ దివెచ వంటి దిగ్గజాల దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. నేనింకా గోల్ఫ్ నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో ఈ క్రీడలో మరింత రాణించాలని అనుకుంటున్నాను. నాకు గోల్ఫ్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలంటే కూడా ఎంతో ఇష్టం. సమయం చిక్కితే అవి కూడా ఆడుతుంటాను. టీవీ చూస్తాను. స్కూల్‌వర్క్ కంప్లీట్ చేసుకున్న తర్వాతే ఆటలు ఆడతాను'

- ఆర్యమన్



ఔనా!

ఉడుము ఊపిరి తీసుకోకుండా నీటిలో అరగంట పాటు ఉండగలదు.



చుక్కలు కలపండి




మీకు తెలుసా?




58 శాతం మంది మహిళలు ప్రతిరోజూ నెయిల్ పాలిష్ వేసుకుంటారని ఓ అధ్యయనంలో తేలింది.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. KJOE ▸ ....
2. HAET ▸ ....
3. THBA ▸ ....
4. RSHU ▸ ....

చెప్పగలరా?

నాడిలో ఉన్నా కానీ కోడిలో లేను
జూలులో ఉన్నా కానీ జూన్‌లో లేను
గుడిలో ఉన్నా కానీ బడిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



జవాబులు

చెప్పగలరా? : నాలుగు
జంబ్లింగ్ వర్డ్స్ :
1. JOKE 2. HATE/HEAT 3. BATH 4. RUSH

జోష్..!

(ఒకటవ పేజీ తరువాయి)

అనుకుంటే పొరబడినట్టే. పదేపదే పలుమార్లు కొన్ని డివిజన్లలోనే నాయకులు తరచూ పర్యటిస్తున్నారంటే ఆ డివిజన్లలో మాస్ ఓటర్ల ప్రభావం ఎక్కువగా ఉందని అర్థం. ఆయా ఓటర్లను ఆకట్టుకునే అక్కడ విజయం ఈజీగా వస్తుందన్న కారణంగా పేదవర్గాలున్న డివిజన్లలో సందడి చేస్తున్నారు. హడావుడికి హడావుడి, గెలుపు వస్తే తమ ఖాతాలో పడుతుందన్న కోణంలో చూస్తున్నారు. అదీగాకుండా మాస్ ఓటర్లయితే పెద్ద నాయకులొస్తున్నారనగానే పరుగుపరుగున వస్తారు. జెండాలు కడతారు. దండలేస్తారు. ప్రాంతాల ప్రాధాన్యాన్ని గుర్తించి హామీల రూపంలో వరాల జల్లు కురిపిస్తే ఓట్లు దండిగా పడతాయని నాయకుల ఆ బాటలోనే నడుస్తున్నారు. గత ఐదారు రోజుల ప్రచార పర్వాన్ని పరిశీలిస్తే అగ్రనాయకుల అందరిదీ ఇదే తీరు. నగరంలో 15 డివిజన్ల వరకు మురికివాడలుగా ఉన్నాయి. శివారు ప్రాంతాలతోపాటు, కలెక్టరేట్‌కు ఆమడ దూరంలో ఉన్న 37వ డివిజన్ మురికివాడగానే ఉంది. 2005 నుంచి 2010 వరకు కాంగ్రెస్ అభ్యర్థి మేయర్‌గా ఉండడం, ఈ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి కార్పొరేటర్‌గా ఉండడంతో అప్పటి 39వ డివిజన్, ఇప్పుడు 37వ డివిజన్‌లో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. వరదలు వస్తే ఈ డివిజన్ అంతా నీటిలో మునిగిపోతుంది. పక్కనే ఉన్న ఉప్పుటేరు పొంగి ప్రవహిస్తూ డ్రైన్ల నుంచి నీరు కాలనీల్లోకి వచ్చి స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. దీని పరిష్కారమే ధ్యేయంగా ఎన్నికల ప్రచార అస్త్రం అయ్యింది. రేచర్లపేట, గొడారిగుంట, కలరాపాకలు, దుమ్ములపేట, పర్లోపేట, కొత్త కాకినాడ, సాంబమూర్తి నగర్ రైల్వే గేటు, ఏటిమొగ, తూరంగిపేట, జాలారిపేట, మహాలక్ష్మి నగర్, ముగ్గుపేట, జగన్నాధపురం వంటెన కింది ప్రాంతాలు ఈ కోవలోకి వస్తాయి. ఇక్కడ ఓటర్లను ఏదో రకంగా ఆకర్షించి ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని ఊదరగొట్టేస్తున్నాయి. టీడీపీ అతిరథులు యనమల, రాజప్ప, చిక్కాల, కొల్లు రవీంద్ర, ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే కొండబాబు వీటిలో కొన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఇదే క్రమంలో వైసీపీ నాయకులు విజయసాయిరెడ్డి, లక్ష్మి పార్వతి, బొత్స, కన్నబాబు, ముత్తా శశిధర్, తదితరులు ప్రచారం చేస్తున్నారు.

నాయకులంతా తెర మీదకు..

తెలుగుదేశం వ్యూహ ప్రతివ్యూహాలతో వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంది. సామాజిక ఓట్లను ఆకర్షించేందుకు గట్టి ప్రయత్నమే మొదలుపెట్టింది. సామాజిక పరంగా పేరొందిన నేతలను, మంత్రులను రంగంలోకి దింపింది. దాంతో పలు డివిజన్లలో ఎక్కడలేని జోష్ కనబడుతోంది. ముఖ్యంగా మత్స్యకారుల ఓట్లకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని మంత్రి కొల్లి రవీంద్రను రంగంలోకి దించింది. ఇదే దారిలో వైసీపీ కూడా నడుస్తోంది. సామాజిక ఓట్ల కోసం నేతలను రప్పిస్తోంది. మత్స్యకార నేత ప్రతినిధి, మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణను రంగంలోకి తెచ్చింది. అలాగే ఇతర సామాజిక ఓట్ల కోసం ఆయా వర్గాల నేతలంతా క్యూకట్టారు.

ముగ్గురూ ఒకేరోజు

(ఒకటవ పేజీ తరువాయి)

వినాయక చవితికి ముందు రావడం ఎందుకన్న సెంటిమెంట్‌తో ఇరువురు నేతలూ తమ పర్యటన వాయిదా వేసుకున్నట్టు సమాచారం. ఒకేరోజు మూడు పార్టీల అధ్యక్షులు కాకినాడకు వస్తుండడంతో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీభద్రతా ఏర్పాట్లు చేస్తోంది. చంద్రబాబు ఈనెల 26న కాకినాడలో రోడ్‌షో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే 27న మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశమవుతారు. జగన్ ఈనెల 26న కాకినాడకు చేరుకుని, 27నకూడా ఇక్కడే ఉంటారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరారెడ్డి 26ఉదయమే కాకినాడ చేరుకుని కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల తరఫున కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజుతో కలసి ప్రచారం చేస్తారు.

టీడీపీలో జోష్..

ఇప్పటికే టీడీపీ తరఫున నలుగురు మంత్రులు కాకినాడలోనే మకాం వేశారు. బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం దేవాదాయ మంత్రి మాణిక్యాలరావు కాకినాడలోనే మకాం వేశారు. టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలకు డివిజన్లలో గెలుపు బాధ్యతలు అప్పగించారు. 48 వార్డులకుగానూ, 9 చోట్ల బీజేపీకి కేటాయించి..39 డివిజన్లలో టీడీపీ పోటీలో ఉంది. టీడీపీ పోటీలో ఉన్న డివిజన్లకు ఆ పార్టీ తరపున ఇన్‌చార్జిలుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఇతర నేతల వ్యూహాలు, సమన్వయం చేసేందుకు రాజానగరం ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, డీసీసీబీ అధ్యక్షుడు వరుపుల రాజాలకు బాధ్యతలు అప్పగించారు. పార్టీ కార్యాలయంలో ఉండి ఎప్పటికప్పుడు వీరిద్దరూ పరిస్థితిని సమీక్షిస్తారు.

వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం..

నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదని, ఉరి తీయాలని, రాళ్లతో కొట్టండి.. ఇలా చంద్రబాబుపై జగన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం కేసు నమోదు చేయాలని నిర్ణయించడంతో వైసీపీ కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. జగన్ వంటి నేతలు రాజకీయాలలో ఉంటే అరాచకాలు రాజ్యమేలతాయంటూ ఇప్పటికే టీడీపీ మంత్రులు కాకినాడలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ సమయంలో ఎన్నికల సంఘం కఠిన నిర్ణయంతో ఆ పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం ఆవరించింది. ఇదే సమయంలో కాకినాడలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరగణం 17 మంది క్రికెట్ బుకీముఠాను అదుపులోకి తీసుకోవడం కూడా ఆ పార్టీకి పెద్దదెబ్బ అని విశ్లేషకులు చెప్తున్నారు.

కాంగ్రెస్ చీల్చే ఓట్లతో ఎవరికి దెబ్బ..

కాంగ్రెస్‌పార్టీ తరఫున 17వార్డులలో అభ్యర్థులు పోటీ లో ఉన్నారు. కాంగ్రెస్‌కు కూడా ఈఎన్నికలలో ఓట్ల శాతం పెరుగుతుందని ఆ పార్టీ నేతలు, విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ఆ పర్సెంటేజ్ ఎంత అనేదానిపై ఖచ్చితమైన అంచనాలు చెప్పలేకపోతున్నారు. ఇప్పటికే నాలుగైదు వార్డులలో ప్రభావం చూపుతున్న కాంగ్రెస్ పార్టీకి పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి రాకతో మరింత ఊపు వస్తుందని ఆపార్టీ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వేటు పడింది!

వైనతేయ వారధి నిర్మాణంలో అక్రమాల బాధ్యులపై ప్రభుత్వం కొరడా

ఎన్‌హెచ్ ఈఎన్‌సీ సహా ఏడుగురి ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు

(ఆంధ్రజ్యోతి-అమలాపురం)

జిల్లాలో 214 జాతీయరహదారి విస్తరణలో వైనతేయ గోదావరి నదిపాయపై బోడసకుర్రు-పాశర్లపూడిల మధ్య నిర్మించిన వారధి నిర్మాణంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైన అభియోగానికి సంబంధించి అప్పటి ఇంజనీరింగ్ చీఫ్‌తో సహ ఏడుగురు ఇంజనీరింగ్ అధికారులపై చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారన్న అభియోగంతో ఇప్పటికే రిటైర్ అయిన నలుగురు ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పాటు ప్రస్తుతం వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సుమిత్రాదావ్రా బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఆ శాఖకు సంబంధించిన అధికారులపై వచ్చిన అభియోగాలపై మార్చిలో విచారణ పూర్తిచేసిన ఆర్ అండ్‌బీ జాతీయరహదారుల శాఖ అధికారులు చర్యలకు ఆదేశిస్తూ 11 జీవోలను విడుదల చేశారు.

వారధి నిర్మాణంలో వెలుగుచూసిన అక్రమాలు

అప్పట్లో 214 జాతీయరహదారి కత్తిపూడి నుంచి పామర్రు వరకు విస్తరణలో భాగంగా 105 కి.మీ. వద్ద బోడసకుర్రు-పాశర్లపూడి మధ్య వైనతేయనదిపై వారధి నిర్మాణం విషయంలో జరిగిన జాప్యం, అంచనాల పెంపులో జరిగిన అక్రమాలపై 'ఏప్రిల్ ఫూల్' శీర్షికన అప్పట్లో ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. దానిపై స్పందించిన అప్పటి ఎంపీ జీవీ హర్షకుమార్ కేంద్ర ఉపరితల రవాణాశాఖ సహాయమంత్రిగా అప్పట్లో పనిచేసిన సర్వే సత్యనారాయణలు బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించారు. అంచనాలు పెంచిన తీరుతోపాటు నిర్మాణంలో జరిగిన నాణ్యతాలోపాలపై కాంట్రాక్టు సంస్థ గామన్ ఇండియా ప్రతినిధులతోపాటు నేషనల్ హైవే అధికారులపై బహిరంగంగానే విరుచుకుపడ్డారు. అయితే ఈ వారధి నిర్మాణం విషయంలో అప్పటి ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన కె.శివారెడ్డి రూ.5,64,51,817 ప్రభుత్వ నిధులను అదనంగా కాంట్రాక్టర్‌కు చెల్లించినట్టు అభియోగాలు వచ్చాయి. అదేవిధంగా అప్పట్లో డీఈగా పనిచేసిన ఎన్.అమ్మిరెడ్డి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి అగ్రిమెంట్‌తో సంబంధం లేకుండా రూ.4.66 లక్షలు బిల్లులు చేసినట్టు అభియోగాలు వచ్చాయి. నాణ్యతాప్రమాణాలతోపాటు కాంట్రాక్టు సంస్థ వారధి నిర్మాణంలో వ్యవహరించిన నిర్లక్ష్యం, అదనపు బిల్లులు చెల్లింపునకు సహకరించిన అధికారులపై వచ్చిన అభియోగాలను విచారించిన ప్రభుత్వం చర్యలకు ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు..

దీనిలో భాగంగా అప్పటి ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి ప్రస్తుతం పదవీవిరమణ చేసిన కె.శివారెడ్డి పేరిట జీవోనెం.39, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసి రిటైర్ అయిన ఎ.రామకృష్ణారావు పేరిట జీవో నెం.40, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎన్‌హెచ్‌గా పనిచేసి రిటైర్ అయిన ఎన్ఎం పోతురాజు పేరిట 41వ జీవో విడుదల చేసింది. అలాగే అప్పటి వారధి నిర్మాణంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ డీఈ ఎన్.అమ్మిరెడ్డి అప్రోచ్‌రోడ్ల నిర్మాణంలో అనుసరించిన అక్రమాల్లో బాధ్యులను చేస్తూ జీవో నెం.42ను విడుదల చేశారు. ప్రస్తుతం అమ్మిరెడ్డి పదవీవిరమణ చేశారు. పదవీవిరమణ అధికారులపై రివైజ్ పెన్షనరూల్ ప్రకారం బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. అదేవిధంగా విచారణలోని అంశాలను వివరిస్తూ పలు జీవోలు జారీ అయ్యాయి. వీరితోపాటు ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ హోదాలో పనిచేస్తున్న జి.కంతు, ఎన్‌హెచ్ ఏఏ మేనేజర్‌గా సంబల్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్న అప్పటి ఏఈ ఎం.రవీంద్రరావు, ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో ఆర్‌అండ్‌బీ ఏఈగా విధులు నిర్వహిస్తున్న నిక్కీ క్రజ్‌లపై చర్యలకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారం జాతీయ రహదారుల శాఖలో సంచలనమైంది.

యువకుడు అదృశ్యం

కాకినాడ క్రైం: కాకినాడ ప్రేజరుపేటకు చెందిన ఓలేటి ప్రసాద్ (25) గత నెల 28న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో కుటుంబీకులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం ప్రసాద్ తల్లి నూకరత్నం బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9440796539, 0884 2379033 నెంబర్లకు ఫోను చేసి తెలియపరచాలని ఇన్‌స్పెక్టర్ ఏఎస్‌రావు కోరారు.



అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంల పరిశీలన

కాకినాడ కార్పొరేషన్: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఈవీఎం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను పరిశీలించి అభ్యర్థుల సమక్షంలో సీల్ వేశారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ హాలు, కౌన్సిల్ హాలులో వీటిని ఏర్పాటు చేశారు. 1నుంచి 28వ డివిజన్ వరకు ఒక హాలులో, 29నుంచి 50వ డివిజన్ వరకు మరో హాలులో ఈవీఎంల పరిశీలన చేపట్టారు. 48వ డివిజన్లలో ఎన్నికలు జరుగుతుండగా పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఈవీఎంల పరిశీలన చేసి సీల్ వేశారు. ఈ ప్రక్రియలో 17మంది రిటర్నింగ్, 17మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. కాగా అభ్యర్థులతో కార్పొరేషన్ కార్యాలయం కిక్కిరిసింది.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 1, 3, 6



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు భాగస్వామి సహకారం లభిస్తుంది. కృషి రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సంకల్పం నెరవేరుతుంది. ప్రియతములతో విందు వినోదాల్లో పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వైద్యం, హోటల్స్, క్యాటరింగ్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం.






మిథునరాశి: (మే21-జూన్21): ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల రాకతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం. సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.





సింహరాశి: (జూలై24-ఆగస్టు23): రవాణా, ఏజెన్సీలు, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం. సంకల్పం నెరవేరుతుంది. సినీ రాజకీయ రంగాలవారికి ప్రోత్సాహకరం.





తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారికి ఉల్లాసంగా ఉంటుంది. ఒక సమాచారం ఆహ్లాదం కలిగిస్తుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ, ఫొటోగ్రఫీ, ఎగుమతుల రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఒక సమాచారం ఉత్సాహం కలిగిస్తుంది.





ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన పనులు పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

మకరరాశి:(డిసెంబర్22-జనవరి21): వేడుకలు, సమావేశాల్లో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.





కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రులతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పూర్వమిత్రులను కలుసుకుంటారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం లభిస్తుంది. భాగస్వామి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో పాల్గొంటారు.



-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

రావయ్యా.. యజ్ఞకాయ..

మూషిక వాహనుడి మహోత్సవాలకు జిల్లా ముస్తాబవుతోంది. అందరికీ ఎంతో ప్రీతి పాత్రమైన వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు ఏర్పాట్లు ముమ్మరం అయ్యాయి. బాల గణపతిని పూజించి తరించేందుకు సర్వం సిద్ధమవుతోంది.



రామచంద్రపురం : డఫేదార్ సెంటర్లో బాలభక్త సమాజం ఆధ్వర్యంలో సిద్ధమైన వినాయకుడి

మండపేట : హైదరాబాద్ ఫిలింనగర్ ఉత్సవాలకు సిద్ధమైన తాపేశ్వరం సురుచి వారి 500 కిలోల లడ్డు





పిఠాపురం : వినాయక విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

పిఠాపురం: ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వర్మ





దివాన్‌చెరువు : రైట్ కళాశాలలో విద్యార్థులకు మట్టి ప్రతిమలను అందజేస్తున్న కళాశాల కరస్పాండెంట్ సాయి రాధాకృష్ణ

జగ్గంపేట : పందిళ్లు వేసి విగ్రహాలను ఏర్పాటుచేసిన ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు





కాకినాడ : నివాసంలో లంబోదరుడి మట్టి ప్రతిమతో ఆధ్యాత్మిక ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు

తుని : ఉత్సవాలకు పట్టణంలో సిద్ధమైన గణనాథుడి విగ్రహాలు





మలికిపురం : భాష్యం పాఠశాలలో వినాయక చవితి ముందస్తు వేడుకలు



కడియం : తయారు చేసిన మట్టి వినాయకుడి విగ్రహాలతో షిర్డీ సాయి విద్యార్థులు



ధవళేశ్వరం : డ్రీమ్స్ స్కూల్లో మట్టి వినాయకుడి విగ్రహాలతో విద్యార్థులు

భావితరాలకు ఆదర్శం టంగుటూరి

ఎస్పీ విశాల్ గున్ని

కాకినాడ క్రైం: సామాన్యుడి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగినా నిస్వార్థంగా ప్రజలకు సేవలందించిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు భావితరాలకు ఆదర్శప్రాయుడని జిల్లా ఎస్పీ విశాల్ గున్ని పేర్కొన్నారు. టంగుటూరి జయంతిని పురస్కరించుకుని బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో గల ఆయన విగ్రహానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఆంధ్రకేసరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ గున్ని

అర్హులైన బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు

చైర్మన్ వేమూరి ఆనందసూర్య

కరప: బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు ఆ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య పేర్కొన్నారు. కరపలో రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న బ్రాహ్మణ భవన్‌కు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరపలో బ్రాహ్మణ సామాజిక భవనం అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీసత్తిబాబు విలువైన స్థలంతోపాటు నిధులివ్వడం ముదావహమన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ కాకినాడ కో-ఆర్డినేటర్ డీహెచ్‌వీ సాంబశివరావు, కార్పొరేషన్ డైరెక్టర్ దువ్వూరి సురేష్, పీఆర్వో ఈమన సూర్యనారాయణ, బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రాణి శ్రీనివాసశర్మ, ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు బుంగా సింహాద్రి పాల్గొన్నారు.



చైర్మన్ వేమూరి ఆనందసూర్యను సత్కరిస్తున్న దృశ్యం

ఔరా! 13 అడుగుల బెండ చెట్టు!

పి.గన్నవరం రూరల్: పి.గన్నవరం మండలం అంబేద్కర్ కాలనీలో సుమారు 13అడుగుల బెండమొక్క అబ్బురపరుస్తుంది. నాగాబత్తుల ఏడుకొండలు తన పెరట్లో సేంద్రియ ఎరువులతో బెండమొక్కలను పెంచాడు. అందులో ఒక మొక్క సుమారు 13 అడుగులు పెరిగింది. అంతేకాకుండా ఆకుకు ఒక కాయచొప్పున కాసి అబ్బురపరుస్తోంది. ఈ బెండమొక్కను చూడడానికి పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు.



ఏడుకొండలు ఇంటి ఆవరణలో 13అడుగుల బెండమొక్క

రుణాల ఎంపికకు ఇంటర్వ్యూలు

కోరుకొండ: ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా పశ్చిమగోనగూడెం ఆంధ్రాబ్యాంక్, గాడాల చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్, బూరుగుపూడి విజయబ్యాంక్ పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బుద్దానూకరత్నం, జెడ్పీటీసీ మళ్లా వెంకటరత్నం, జన్మభూమి కమిటీ సభ్యులు అడపా వీరబాబు, ఇసుపాటి ప్రదీప్‌కుమార్, బూసి ధర్మారావు, తెలగంశెట్టి వెంకటలక్ష్మీ, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సీతానగరం ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20న సీతానగరం లంకూరు గ్రామానికి చెందిన ఈలి భాస్కరరావు 60అనే వ్యక్తి ఉదయం లఘుశంక తీర్చుకోవడానికిగాను రోడ్డు పక్కన కూర్చోగా సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వెడుతున్న ట్రాక్టరు గుద్దుకుని తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు బంధువులు చికిత్స నిమిత్తం రాజమండ్రి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జనరల్ హాస్పటల్‌కు తీసుకుని వెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాకినాడలో ఎన్నికలపై సర్వే



ఓటర్ల అభిప్రాయాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు

దివాన్‌చెరువు: కాకినాడలో నగరపాలక సంస్థకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ తరుపున పోటీచేస్తున్న అభ్యర్థుల విజయావకాశాలపై రాజనగరం టీడీపీ మండలం అధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లు నూనె వెంకన్న, సూరపరెడ్డి నారాయణస్వామి సర్వే నిర్వహిస్తున్నారు. బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ వారీ విషయాన్ని తెలిపారు. రోజుకు మూడు వార్డుల వంతున ఇప్పటివరకు 15వార్డుల్లో తాము సర్వే జరిపి నివేదికలను టీడీపీ కార్యాలయానికి అందజేశామన్నారు. ఈ సర్వేలో ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించడంతోపాటు టీడీపీ అభ్యర్థుల విజయావకాశాలపై కూడా సర్వే నిర్వహించామని చెప్పారు. తమ పార్టీ అభ్యర్థులు విజయదుందుభీ మోగించడం ఖాయమన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

దివాన్‌చెరువు: ప్రాథమిక వైద్యులకు చట్టబద్దమైన హక్కులు కల్పిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫస్ట్ ఎయిడెడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఏడీ కామాచార్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనేక సంవత్సరాలుగా ప్రాథమిక వైద్యులకు శిక్షణ తరగతులు చట్టబద్దమైన గుర్తింపు కోసం ఆధునిక అనుభవ వైద్యులు సంఘం ద్వారా చేస్తున్న కృషి ఫలించిందని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రితో జరిపిన చర్చలు విజయవంతం అయ్యాయన్న హర్షం వ్యక్తం చేశారు. అక్టోబరు 2న విజయవాడలో రాష్ట్రంలోని 50వేల మంది ప్రాథమిక వైద్యులచే సీఎంకు పౌర సన్మానం చేయాలని కార్యవర్గ సమావేశం తీర్మానించామని కామాచార్యులు తెలిపారు.

మోటారు సైకిల్ చోరీ

పి.గన్నవరం రూరల్: పి.గన్నవరం మండలం లంకలగన్నవరం ప్రధాన రహదారి చెంతనే ఉన్న షాపులో మంగళవారం రాత్రి ఒక మోటారుసైకిల్, రూ.5వేలు నగదు చోరీకి గురైనట్టు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకలగన్నవరం గ్రామానికి చెందిన లంకే వెంకట్రావు రోడ్డుచెంతనే ఉన్న తనషాపులో మంగళవారం రాత్రి 10గంటల వరకు ఉండి ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం ఉదయం షాపు తెరిచి చూడగా హీరో మెట్రోప్లస్ మోటారుసైకిల్, బీరువాలో ఉన్న రూ.5వే లు నగదు చోరీకి గురయ్యాయని ఆయన పేర్కొన్నాడు. దీంతో సంఘటనా వివరాలను పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించినట్టు వెంకట్రావు పేర్కొన్నాడు.

ఆదర్శనీయుడు ఆంధ్రకేసరి టంగుటూరి

దివాన్‌చెరువు: ఆంధ్రకేశరి టంగుటూరి ప్రకాశం పంతులును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పి.మురళీధర్ అన్నారు. నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఆంధ్రకేశరి టంగుటూరి జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రిగా టంగుటూరి రాష్ట్రాభివృద్ధికి పునాదులు వేశారన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేఖంగా ఉద్యమించిన గొప్పనాయకుడు టంగుటూరి అని కొనియాడారు. స్వాతంత్రోద్యమం సమయంలో ఆంధ్రరాష్ట్రం నుంచి పోరాటం చేసిన అనేక మంది మహనీయులలో టంగుటూరి ఒకరు అన్నారు. వీరి ధైర్యసాహసాలను విద్యార్థులు అలవర్చుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్‌లు ఆచార్య పి.సురేష్‌వర్మ, ఆచార్య వై.శ్రీనివాసరావు, సహయ డీన్ డాక్టర్ పి.విజయనిర్మల, అధ్యాపకులు డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, డాక్టర్ ఆర్ఎస్.వరహాలదొర, డాక్టర్ జి.ఎలీషాబాబు, ఆర్.సుబ్బారావు, వి.రామకృష్ణ, డాక్టర్ పద్మావతి, కేఎస్ఆర్ దేవి తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నన్నయ్య ఇన్‌చార్జి రిజిస్ట్రార్ తదితరులు



తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్

టంగుటూరికి ఘన నివాళి

రాజానగరం: ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం రాజానగరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రకాశం చిత్రపటానికి తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులును ప్రజలంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టంగుటూరి ప్రకాశం రాష్ట్ర అభివృద్ధికి అందించిన సేవలను మరో మారు గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్రీధర్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో...

నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా టంగుటూరి ప్రకాశం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావు, సిబ్బంది, జన్మభూమి కమిటీ సభ్యులు దొండపాటి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రామసత్యం

రాజానగరం: వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లిన తన తండ్రి ఇంటికి తిరిగి రాలేదంటూ కుమారుడు బుధవారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన లోశెట్టి రామసత్యం(51) అనే వ్యక్తి ఈనెల 20న ఉదయం 10గంటలు సమయంలో వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాస్పత్రికి బయలుదేరి వెళ్లాడు. ఇలా వెళ్లిన తన తండ్రి నేటి వరకు ఇంటికి తిరిగి రాలేదని, ఆచూకీ తెలపాలంటూ కుమారుడు నాగార్జున పోలీసులు ఫిర్యాదు చేశారు. రామసత్యం కుమారుడు నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.వరప్రసాద్ ఆదేశాల మేరకు కేసు నమోదుచేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వరరావు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కోరుకొండ: ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి టి.కుసలవదర తెలిపారు. సంబంధిత ప్రోఫార్మాప్రకారం అవార్డు కోసం ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక మండల విద్యావనరులు కేంద్రంలో నిర్ణిత గడువులోగా అందజేయాలని పేర్కొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పూజించండి

రైట్ కళాశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ

దివాన్‌చెరువు: మట్టి వినాయక ప్రతిమను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని భూపాలపట్నంలో రాజమహేంద్రి(రైట్) ఇంజనీరింగ్ కళాశాల కార్యిదర్శి, కరస్పాండెంట్ జి.సాయి రాధాకృష్ణ కోరారు. బుధవారం రైట్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో 2 వేల మంది విద్యార్థులకు, రెండు వందల మంది ఫ్యాకల్టీకి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి హానికరమని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం మాట్లాడుతూ మట్టితో తయారుచేసిన విగ్రహాలకు పూజలు చేయడం ద్వారా పర్యావరణహిత వినాయకచవితి వేడుకలు జరుపుకోవాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించండి, మొక్కలను పెంచండి అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన ప్రతిమలను వినియోగించడం, వాటిని నిమజ్జనం చేయడం వల్ల కలిగే దుష్ఫలితాలనును వివరించారు. ఈకార్యక్రమంలో రైట్ కళాశాల యాజమాన్య సభ్యులు టి.ఆంజనేయులు, ఏవో నాని, హెచ్‌వోడీలు పీబీ చౌదరి, ఆర్.శ్రీనివాస్, ఆర్.రాంబాబురెడ్డి, ఎ.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలచర్ల ఉన్నత పాఠశాలకు క్రీడా మైదానం సమకూర్చాలి



పాలచర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల భవనం

దివాన్‌చెరువు: క్రీడలను మరింత ప్రొత్సహించేందుకు వీలుగా తమ పాఠశాలకు కనీసం అర ఎకరమైన క్రీడా మైదానాన్ని సమకూర్చాలని పాలచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలువురు కోరుతున్నారు. పాలచర్ల గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలల ప్రాంగణంలోనే దాదాపు 18ఏళ్ల క్రితం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటుచేశారు. దీనితో ఉన్నత పాఠశాలకు సుమారు 30సెంట్లు స్థలం మాత్రమే మిగిలిందని స్థానికులు తెలిపారు. దీనికి తోడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆ పక్కనే గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల మధ్య నుంచి సీసీ రోడ్డు కూడా ఏర్పాటుచేశారు. దీంతో ఉన్నత పాఠశాలకు ఉన్న కొద్దిపాటి స్థలం మరింత కుచించుకుపోయింది. ఆ స్థలంలోనే న్యూట్రీగార్డెన్ పెంపకం చేపట్టడంతో విద్యార్థినీ విద్యార్థులకు ఆటలు ఆడుకునేందుకు అసలు మైదానమే లేకుండా పోయింది. అయితే ఆట స్థలం లేకపోయినా పాలచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే తమ ప్రతిభను ప్రదర్శించగా, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను ఈ పాఠశాల సాధిస్తూ వస్తుంది. గ్రామ పెద్దలు దృష్టిసారించి కనీసం ఒక అర ఎకరం అయినా ఆట స్థలాన్ని సమకూర్చితే తమకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని కొంత మంది విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయమై పాలచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.ఆదినారాయణను ప్రశ్నించగా పాఠశాలకు క్రీడామైదానం నిమిత్తం స్థలం సమకూర్చేందుకు గ్రామపెద్దలు హామీ ఇచ్చారన్నారు. అయితే తమ పాఠశాల విద్యార్థులు ఇప్పటికే రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలలో ప్రతిభ చూపారని, మరిన్ని సదుపాయాలుంటే మరింతగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా ఐదుగురు పాలచర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐఐఐటీలో చదువుతున్నారని తెలిపారు.

మొబైల్ బెల్ట్ దుకాణం నిర్వాహకులు అరెస్టు



మద్యం బాటిళ్లతో పట్టుడిన నిందితులు

రాజానగరం: మండలంలో కొండగుంటూరు గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా మొబైల్ బెల్ట్ దుకాణం ద్వారా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఏజీఎస్ పోలీసులు బుధవారం పట్టుబడ్డారు. గ్రామంలో మోటార్ సైకిల్‌పై మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమా చారం మేరకు యాంటీ గూండా స్కేడ్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఈసందర్భంగా వీరి వద్ద నుంచి 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు కూడా తాగునీటి సరఫరా బంద్

ఉప్పలగుప్తం: జగ్గరాజుపేట ఓఎన్జీసీ సైట్ సమీపంలో ప్రధాన పైపు దెబ్బతిన్న కారణంగా బుధవారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అయితే బుధవారం సాయంత్రానికి కూడా పైపు మరమ్మతులు పూర్తికాలేదు. ఈకారణంగా చల్లపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా ఈనెల 24వ తేదీ గురువారం కూడా నిలిచిపోతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ప్రధానంగా గొల్లవిల్లి, సన్నవిల్లి, ఉప్పలగుప్తం పంచాయతీల పరిధిలో తాగునీటి సరఫరా జరగదన్నారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

● మినీ ఇంటర్వ్యూ



నెలాఖరునాటికి ఓడీఎఫ్ గ్రామంగా తీర్చిదిద్దుతాం

ఎండీ అబ్బాస్‌ఆలీ,
పంచాయతీ కార్యదర్శి

● ఓడీఎఫ్ గ్రామంగా తీర్చిదిద్దుతున్నారా?

గ్రామంలో 175 ఐఎస్ఎల్ నిర్మాణాలు పూర్తిచేస్తే ఓడీఎఫ్‌గా ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే 103 ఐఎస్ఎల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. నెలాఖరునాటికి మిగిలిన వాటిని పూర్తిచేసి ఓడీఎఫ్‌గా ప్రకటిస్తాం.

● ఇంటి పన్నుల లక్ష్యం పెరిగిందా?

గత ఏడాది రూ.5.35 లక్షల ఇంటిపన్నులు డిమాండ్ కాగా, నూరు శాతం వసూళ్లు చేసి ప్రథమస్థానంలో నిలిచాం. కొత్తగా నిర్మించిన ఇళ్లకు పన్నులు వేయడం ద్వారా ఈ ఏడాది రూ.6.25 లక్షలకు డిమాండ్ పెరిగింది.

● గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయా?

14వ ఆర్థికసంఘం, ఉపాధి హామీనిధులు రూ.20 లక్షలతో ఇప్పటికే ఇంటర్నల్ సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాం. మరో రూ.20 లక్షలతో రోడ్లు, డ్రైన్లకు ప్రతిపాదనలు పంపించాం.

● అమలాపురం రూరల్

వినాయక ప్రతిమల పంపిణీ



వినాయక ప్రతిమల పంపిణీ

అమలాపురంటౌన్: పర్యావరణ పరిరక్షణకు అమలాపురం శ్రీనంద్ స్కూలు యాజమాన్యం నడుంబిగించింది. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వినాయకచవితిని పురస్కరించుకుని మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. కౌన్సిలర్ యాళ్ల నాగసతీష్ విగ్రహాలను అందజేయగా కార్యక్రమంలో కరస్పాండెంట్ యెనుముల కనకదుర్గావిశ్వం, డైరెక్టర్ యెనుముల విశ్వం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

అమలాపురం

శ్రీవెంకటపద్మావతి
స్క్రీన్-1 లై
స్క్రీన్-2 ఆనబెల్
గణపతి నిన్నుకోరి
రమా నేనే రోజు నేనే మంత్రి
శేఖర్ స్క్రీన్-1 ఆనందోబ్రహ్మ
స్క్రీన్-2 దర్శకుడు
శ్రీలలిత ప్రతిక్షణం
వెంకటరామ జయ జానకి నాయక
వెంకటరమణ ఫిదా

'టంగుటూరి' సేవలు చిరస్మరణీయం

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

అమలాపురం టౌన్/రూరల్: దేశభక్తితో పాటు మానవతా విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు అన్నారు. ఆంధ్రకేసరి జయంతిని పురస్కరించుకుని మల్లేశ్వరరావు అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.కోటిలింగం, పద్మ, పెద్దిరాజు, పొగాకు వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అదే విధంగా తాండవపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కేకేవీ నాయుడు అధ్యక్షతన టంగుటూరి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో

నిస్వార్థమైన దేశభక్తికి, త్యాగనిరతికి ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు ప్రతీకగా నిలుస్తారని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ పి.చలపతిరావు, ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వక్కలంక కృష్ణమోహన్ అన్నారు. ఆయా కళాశాలల్లో బుధవారం ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డాక్టర్ కె.దయాసాగర్‌బాబు, పెచ్చెట్టి కృష్ణకిశోర్, బి.ఆశీష్‌బాబు, సీహెచ్ నాగరాణి, డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి పాల్గొన్నారు.

అల్లవరంలో

ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బ్రిటిష్‌వారిని గడగడలాడించిన ధైర్యశాలి టంగుటూరి ప్రకాశం పంతులు దేశభక్తి ఆదర్శనీయమని అమలాపురం ఆర్డీవో జి.గణేష్‌కుమార్ అన్నారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వడ్డి సత్యవతి, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆర్ఐ దుర్గాశ్రీరామచంద్రమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎంపీపీ చింతా ఝాన్సీలక్ష్మీ గౌరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శాంతామణి, మండల విద్యాశాఖాధికారి కె.కిరణ్‌బాబు, కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్ఎస్ కరుణాకర్, ఎంహెచ్ శ్రీనివాస్, ఏపీవో ఎం.నాగప్రసాద్ పాల్గొన్నారు.



తాండవపల్లిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తంలో

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలాది సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీ, సీనియర్ అసిస్టెంట్ కుమారి దేవి, వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు నాగులపల్లి పల్లంరాజు, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు నేదునూరి పట్టాభిరామయ్య, వినోద్‌కుమార్, ఎన్.బాబ్జి పాల్గొన్నారు. గోపవరం జిల్లాప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం జయంతిని జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎంవీవీ సత్యసాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్లవరంలో నివాళులర్పిస్తున్న ఆర్డీవో



నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు

మున్సిపల్ కార్మికుల ధర్నా

అమలాపురంటౌన్: ఏడేళ్లుగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెం.244ను అమలుచేయకుండా పీహెచ్ వర్కర్లకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. అమలాపురం పురపాలక సంఘంలో పనిచేస్తున్న పీహెచ్ వర్కర్లు, వాటర్ వర్క్స్ కార్మికులు, కాంట్రాక్టు శానిటేషన్ కార్మికులు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు తొమ్మండ్రు గోపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జీవో నెం.151 అమలుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజుకు వినతిపత్రం అందజేయగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన సానుకూలంగా స్పందించారు. కె.సాహెబ్, ఎం.సత్యనారాయణ, ఎ.అమ్మాజీ, వి.సరోజిని, ఎం.సుబ్బలక్ష్మి, పి.కోటేశ్వరరావు, ఎం.రాంబాబు, పి.దావీదు, ఎం.రామారావు, దుర్గాఅర్జునరావు, నాగారపు శ్రీనివాసరావు, ఎం.మధుసూదనరావు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

'చిట్టిబాబు సేవలు స్ఫూర్తిదాయకం'

అమలాపురంరూరల్: తహసీల్దార్‌గా నక్కా చిట్టిబాబు అందించిన సేవలు చిరస్మరణీయమని అమలాపురం ఆర్డీవో జి.గణేష్‌కుమార్ అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో ఇసుకపట్ల రఘుబాబు అధ్యక్షతన జరిగిన సంతాప సభకు ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై చిట్టిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమస్ఫూర్తితో పనిచేసిన ఘనత చిట్టిబాబుకు దక్కుతుందని పలువురు వక్తలు కొనియాడారు. సంతాప సభలో కోనసీమ జేఏసీ ఛైర్మన్ వాసా ఎస్ దివాకర్, కన్వీనర్ బండారు రామ్మోహనరావు, కోకన్వీనర్ ఇళ్ల భక్తవత్సలం, జంగా బాబూరావు, పెయ్యల శ్రీనివాసరావు, పెనుమాల చిట్టిబాబు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఎంఏకే భీమారావు, చిల్లా పురుషోత్తం, బొంతు బాలరాజు, దేవరపల్లి శాంతికుమార్, కేశవదాసు రాంబాబు, కల్వకొలను బాబు, రాయుడు సత్యరుషి, వివిధ మండలాల తహసీల్దార్లు, విశ్రాంత తహసీల్దార్లు పాల్గొన్నారు.



సంస్మరణ సభకు హాజరైన ఆర్డీవో

తపాలా శాఖలో పోస్టులను భర్తీ చేయాలి

అమలాపురం టౌన్: తపాలాశాఖలో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అలాగే ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తపాలా ఉద్యోగులు ఒకరోజు సమ్మెకు దిగారు. అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తించి సివిల్ సర్వెంట్స్ హోదా కల్పించాలని అన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలతో హోరెత్తించారు. అమలాపురంతో పాటు కొత్తపేట, రాజోలు పోస్టల్ కార్యాలయాల వద్ద సమ్మె విజయవంతమైనట్టు డివిజన్ కార్యదర్శి కె.మధుసూదనరావు తెలిపారు. సమ్మె శిబిరంలో ఎన్ఎఫ్‌పీఈ డివిజనల్ అధ్యక్షుడు సీహెచ్‌వీవీ ప్రసాదరాజు, సీహెచ్ కోటయ్య, సీహెచ్ సత్తెన్న, రాష్ట్రకోశాధికారి వీవీ రామకృష్ణ, కె.జాన్సన్, ఎస్‌జీకే ఆచార్యులు, కేడీవీవీఎస్ఎస్ వీరభద్రరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నేడు ప్రైవేటు విద్యాసంస్థల బంద్

అమలాపురంటౌన్: కర్నూలులో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులపై విద్యార్థి సంఘాల నాయకుల దాడిని ఖండిస్తూ గురువారం ప్రైవేటు విద్యాసంస్థల బంద్ పాటించనున్నారు. బంద్‌ను విజయవంతం చేయాలని అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేవీఆర్ఎన్ నరసింహారావు విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ పాటించేలా ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుందన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఎఫిలియేటెడ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కూడా బంద్‌లో పాల్గొనేందుకు నిర్ణయించిందని నరసింహారావు తెలిపారు.

శరవేగంగా లోయర్ కౌశిక డ్రైన్ ఆధునికీకరణ

● ఆటంకాలు కల్పిస్తున్న తూర్పులంక-మొగళ్లమూరి వద్ద ఆక్రమణలు
● విద్యుత్ లైన్లతో తవ్వకాలకు ఇబ్బందులు


తూర్పులంక-మొగళ్లమూరి మధ్య డ్రైన్ తవ్వకాలు

అల్లవరం: ప్రతి ఏటా పంటపొలాలు ముంపుబారిన పడుతుండటంతో ఏళ్ల తరబడి తవ్వకాలు జరగని డ్రైన్లకు ఆధునికీకరణ పనులతో మోక్షం కలిగింది. రూ1.20 కోట్ల డ్రైనేజీ నిధులతో చేపట్టిన 17 కి.మీ. పొడవుగల లోయర్ కౌశిక మేజర్ డ్రైన్ తవ్వకాలు శరవేగంగా జరుగుతున్నాయి. డ్రైనేజీ శాఖ అధికారుల పర్యవేక్షణలో తూర్పులంక, మొగళ్లమూరి గ్రామాల మధ్య ప్రొక్లెయినర్లతో డ్రైన్ ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్నారు. సామంతకుర్రు పల్లిపాలెం నుంచి ప్రారంభమైన లోయర్ కౌశిక డ్రైన్ గోడివరకు 15 కి.మీ. మేర తవ్వకాలు జరుపుతారు. 2.002 కి.మీ. నుంచి 17.00 కి.మీ వరకు కాంట్రాక్టర్ తవ్వాల్సి ఉండగా, సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర తవ్వకాలు పూర్తయ్యాయి. డ్రైన్ బెర్మ్ లోపల ఉన్న కొబ్బరిచెట్లను తొలగించారు. 20 మీటర్ల వెడల్పున డ్రైన్ తవ్వి మట్టి గట్టుగా వేస్తున్నారు. 200 ప్రొక్లెయినర్ మిషన్లు రావడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

డ్రైన్‌కు ఆక్రమణ కట్టడాల బెడద

లోయర్ కౌశిక మేజర్ డ్రైన్‌లో ఆక్రమణల బెడద ఉంది. ఈ డ్రైన్ లోపల స్థలాలను ఆక్రమించుకుని కొందరు అక్రమ కట్టడాలు నిర్మించుకున్నారు. నివాస గృహాలతో పాటు వ్యాపార నిర్వహణకు షెడ్డు నిర్మించారు. తూర్పులంక మలుపు వద్ద ఒక నివాసస్థలం అడ్డంకిగా మారింది. మొగళ్లమూరి వంతెనకు ఇరువైపులా డ్రైన్ లోపల స్థలంలో అక్రమ నిర్మాణాలు డ్రైన్ తవ్వకాలకు అడ్డంకిగా మారాయి. ఫలసాయం అందిస్తున్న కొబ్బరిచెట్లు తొలగించారు, డ్రైన్‌లో అక్రమ నిర్మాణాలు కూడా తొలగించాలని పలువురు రైతులు కలెక్టర్, ఆర్డీవోతోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులకు విజ్ఞప్తిచేస్తున్నారు.


ఆక్రమించి షెడ్డు నిర్మించిన దృశ్యం

విద్యుత్ లైన్లతో తవ్వకాలకు ఇబ్బంది

డ్రైన్ గట్టు వెంబడి విద్యుత్‌లైన్లు ఉండటంతో ప్రమాద పరిస్థితుల నడుమ 200 ప్రొక్లెయినర్ మిషన్ల ఆపరేటర్లు తవ్వకాలు సాగిస్తున్నారు. డ్రైన్ తవ్వకాలు జరుగుతుండగా విద్యుత్ తీగలు మిషన్ భాగాలకు తగలడంతో ఇబ్బందిగా ఉంది. ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరా నిలిపివేసి తవ్వకాలు సాగిస్తున్నారు. డ్రైన్ వెంబడి రొయ్యల చెరువుల విద్యుత్‌లైన్లు, గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే లైన్లు ఉన్నాయి.

ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చాం

లోయర్ కౌశిక డ్రైన్‌లో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చామని, అక్రమ కట్టడాలు తొలగించాలని పేర్కొన్నామని డ్రైన్స్ ఏఈ ఆర్.సుబ్బారావు అన్నారు. విద్యుత్ తీగలు తగులుతున్నందున సరఫరా నిలిపివేసిన సమయంలో లోయర్ కౌశిక మేజర్ డ్రైన్ తవ్వకాలు జరుగుతున్నాయి. సకాలంలో తవ్వకాలు పూర్తిచేసేందుకు భారీ మిషన్లు పెట్టి తవ్విస్తున్నామన్నారు.

రికార్డులు తనిఖీ చేసిన ఆర్డీవో గణేష్‌కుమార్


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో

అల్లవరం: అమలాపురం ఆర్డీవో జి.గణేష్‌కుమార్ అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రికార్డులు తనిఖీ చేశారు. ఆఫీసురూము, రికార్డు రూములను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. తహసీల్దార్ వడ్డి సత్యవతి, కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆర్ఐ దుర్గాశ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఎస్‌కేబీఆర్‌లో ఎయిర్‌మెన్ శిక్షణ

అమలాపురంటౌన్: ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మెన్ ఉద్యోగాల కోసం ఏర్పాటుచేసిన శిక్షణా శిబిరం అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైంది. నైపుణ్యాభివృద్ధి సంస్థ, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణకు 131 మంది విద్యార్థులు హాజరయ్యారు. సెప్టెంబరు 9 వరకు 20 రోజులపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, వ్యాయామం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వక్కలంక కృష్ణమోహన్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ పెచ్చెట్టి కృష్ణకిశోర్ విజ్ఞప్తి చేశారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ కె.యశోద కృష్ణ, టి.గణేష్‌కుమార్, రిసోర్స్‌పర్సన్లు ఎ.సాయిప్రసాద్, ఎ.జాయ్‌కలింగ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ చినసత్యనారాయణ, డాక్టర్ ఎస్.ప్రసాదరావు, డాక్టర్ బి.ఆశీష్‌బాబు, డాక్టర్ ఎస్ఎన్ మద్దులేటి, డాక్టర్ ఎం.బాలాస్వామి, ఫిజికల్ డైరెక్టర్ డి.రమణ పాల్గొన్నారు.

కాపుల నిరసనలు

కూరగాయలు అమ్మి.. మోకాళ్లపై నిల్చుని..

అమలాపురం టౌన్: కాపులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ కాపు ఉద్యమనేత కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో యువకులు బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అమలాపురం కూరగాయల మార్కెట్ సెంటర్‌కు చేరుకుని కాపు యువకుల పరిస్థితిని వివరిస్తూ కూరగాయలు విక్రయిస్తూ నిరసన తెలిపారు. కాపుల బతుకులు బాగుపడాలంటే బీసీ రిజర్వేషన్లు వెంటనే అమలుచేయాలని నినాదాలు చేశారు. బోనం సత్తిబాబు, కోడూరి బాబి, వర్రే శేషు, చిక్కం కిట్టు, వాకపల్లి శ్రీను, వేమన సూర్యనారాయణ, కల్వకొలను బాబి, అరళ్లపల్లి ముత్యం, మద్దింశెట్టి ప్రసాద్, మన్నే కృష్ణ, పినిశెట్టి భాను, కొమ్మూరి త్రిమూర్తులు, నిమ్మకాయల రాంబాబు, నల్లా చిన్న, కల్వకొలను పుల్లయ్యనాయుడు, మెండారవి, అరళ్లపల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


కూరగాయల అమ్మి నిరసన తెలుపుతున్న దృశ్యం

మోకాళ్లపై నిలబడి కంచాలు, గరిటెలతో నిరసన

కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు నల్లా సూర్యచంద్రరావు తనయుడు సంజయ్ ఆధ్వర్యంలో కాపులు నిరసన తెలిపారు. కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై మోకాళ్లపై నడుస్తూ కంచాలు,గరిటెలతో నిరసన తెలిపారు. మామిడిపల్లి రాజు, సుంకర నందరాజు, రవణం వేణు, గండు మధు, కైరం చిన్న, రవణం బాబులు, రంకిరెడ్డి రాజు, నల్లా రామకృష్ణ, గారపాటి అంజి, గొలకోటి బుజ్జి, గుర్రాల వీరబాబు, మామిడిపల్లి కల్యాణ్ పాల్గొన్నారు.


మోకాళ్లపై నిల్చుని కంచాలు మోగిస్తున్న కాపులు

మట్టి వినాయక విగ్రహాలతో మేలు


వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఉప్పలగుప్తం: వినాయక చవితి పూజలకు మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని ఎంఈవో ఆకుల మంగపతిరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాలుష్య నివారణకు మునిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టితో వినాయక విగ్రహాలను తయారుచేశారు. బుధవారం ఈ ప్రతిమలను గ్రామంలో ఎంఈవో ద్వారా పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యాగా ఏడుకొండలు, సహ ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాడికోన మాజీ సర్పంచ్ అనంతరావు మృతి

అల్లవరం: తాడికోన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు సాధనాల అనంతరావు(68) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తాడికోన గ్రామాభివృద్ధికి కృషిచేసిన ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. గ్రామసర్పంచ్ దాసరి అప్పలస్వామి, ఎంపీటీసీ సభ్యుడు గోసంగి సత్యనారాయణమ్మ, టీడీపీ నాయకులు గోసంగి స్టాలిన్‌బాబు, సుంకర వెంకటేశ్వరరావు, ముత్యాల శ్రీనివాస్ తదితరులు అనంతరావు కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి(క్వింటాల్)	8000-8500
కొత్తకొబ్బరి (రెండవరకం)	6500
కురిడీ కొబ్బరి(పాతవి)	
గండేరా (వెయ్యి)	10000
గటగట (వెయ్యి)	6500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	9000
గటగట (వెయ్యి)	6,000
నీటికాయ	
పాత(ముక్కుడు)(వెయ్యి)	7000-7500
కొత్త(పచ్చి) (వెయ్యి)	8000-8500
కొబ్బరి నూనె (15 కిలోలు)	2,500
ఒక కిలో	170

- అంబాజీపేట

అధ్వానంగా కూనవరం-సన్నవిల్లి ఆర్అండ్‌బీ రహదారి

ఉప్పలగుప్తం: కూనవరం-సన్నవిల్లి ఆర్అండ్‌బీ రహదారి అధ్వాన స్థితికి చేరింది. అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారి నుంచి కూనవరంలో ప్రారంభమయ్యే ఈ రహదారి సన్నవిల్లి వరకు అయిదు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అయితే కూనవరం గ్రామంలో రోడ్డు పూర్తిగా శిథిలస్థితికి చేరింది. రహదారి దిగబడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. స్వల్ప వర్షానికి సైతం రహదారిపై రోజుల తరబడి నీరు నిల్వ ఉండి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. కూనవరం మేజర్ డ్రైన్ నుంచి గొల్లవిల్లి సెంటర్‌లో రహదారి ఆక్రమణలకు గురైంది. దీనికితోడు ఇటీవల సిరిపిల్లి-మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారి పరిధిలో కల్వర్టుల నిర్మాణం జరుగుతున్న కారణంగా ట్రాఫిక్‌ను కూనవరం మీదుగా మళ్లించారు. ఫలితంగా రహదారి పంటకాల్వ వైపునకు దిగబడి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఈరహదారి ఆధునికీకరణ చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న రహదారి

సమాచారం...

అరటి మార్కెట్

(గెల రేటు)

రకం	కనిష్ఠ రూ.	గరిష్ఠ రూ.
కర్పూర	100	200
చక్రకేళి (తెలుపు)	150	350
ఎర్రచక్కర కేళి	200	400
అమృతపాణి	100	300
బుషావళి	100	200
అరటి (బొంత)	100	200

- రావులపాలెం

ముగిసిన టెలీ కాన్ఫరెన్సు

రంగంపేట: నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే సందర్భంగా ఉపాధ్యాయులకు గత మూడు రోజులుగా నిర్వహిస్తోన్న టెలీ కాన్ఫరెన్సు పూర్తయింది. బుధవారం ఉన్నత పాఠశాల ఉపా ధ్యాయలకు కాన్ఫరెన్సు నిర్వహించినట్టు రంగంపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఒ.వేంకటేశ్వరరావు తెలిపారు. సింగంపల్లి, ఈలకొలను కాంప్లెక్స్‌లో టెలీ కాన్ఫరెన్సు పూర్తయినట్టు ఎంఈవో తెలిపారు.



టంగుటూరి సేవలు ప్రశంసనీయం



కొంకుదురులో టంగుటూరికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

బిక్కవోలు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 126వ జయంతి ఉత్సవాలను మండలంలోని పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కొంకుదురులోని కొవ్వూరి సత్తిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి టంగుటూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు జీవిత విశేషాలను గొలుగూరి వెంకట రామారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఉపా.ద్యాయులు వల్లీషా, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పందలపాక, మెళ్లూరు, బిక్కవోలు, బలభద్రపురం, ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో టంగుటూరి జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో టంగుటూరు పాత్ర కీలకం

అనపర్తి : స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలొడ్డి బ్రిటిష్ వారితో పోరాడిన యోధుడు టంగుటూరు ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని తెలుగు భాషాభిమానుల సంఘం అధ్యక్షుడు జేవీవీ రామారావు అన్నారు. బుధవారం జిల్లా షరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషాభిమానుల సంఘం ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు సీహెచ్‌వీ సోమిరెడ్డి టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం ఉపాధ్యక్షుడు కె. రవికిషోర్ మాట్లాడుతూ స్వరాజ్యం కోసం తన ఆస్తిని త్యాగం చేసి ఉద్యమాన్ని నడిపించారని అన్నారు. కార్యదర్శి వైబీఎస్ ఆచార్యులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి తెలుగు భాష అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనపర్తిలో నివాళులర్పిస్తున్న తెలుగు భాషాభిమానుల సంఘం సభ్యులు



రైతులకు కందులు పంపిణీ

రంగంపేట: ప్రభుత్వం ఉచితంగా అందజేసిన కందులను వరి పొలాల గట్లపై పండించాలని ఎంపీపీ ఎన్ వీరవేణి రైతులను కోరారు. మండల వ్యవసాయాధికారిణి గౌరీదేవి ప్రభు త్వం ఉచితంగా అందించిన కందుల ప్యాకెట్లను బుధవారం ఎంపీపీ ద్వారా రైతులకు అందజేశారు. రైతులు కంది పంటను వేసుకుని లబ్ధి పొందాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎన్. త్రిమూర్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో గౌరీదేవి, రైతులు పాల్గొన్నారు. అనంతరం వరి పంట పొలాలను పరిశీలించారు. అపరాల విత్తనాలను ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తోందని, వాటిని వినియోగించుకోవాలని ఏవో సూచించారు.



ఉపాధి సిబ్బంది నుంచి రూ. 29వేల రికవరీ

బిక్కవోలు: బిక్కవోలులో బుధవారం ఉపాధి హామీ పనుల ఆడిట్‌పై ఎంపీపీ బేరా వేణమ్మ అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2016 జూలై ఒకటి నుంచి 2017 జూన్ 30 వరకు మండలంలో రూ. 5కోట్ల 34 లక్షల పనులు జరిగినట్టు ఎస్ఆర్‌పీ మాధవరావు సభలో తెలిపారు. వీటిని తనిఖీ చేయగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు పదకొండు మంది, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వల్ల కూలీలకు వేతనాలు, పనులు జరగకపోయినా జరిగినట్టు చూపడం వల్ల వారి వేతనాల నుంచి రూ. 29వేల 750లు రికవరీ చేస్తున్నట్టు అడిషనల్ పీడీ శ్యామల తెలిపారు. వీరికి రూ. 15వేల 500లు జరిమానా కూడా విధిస్తున్నట్టు అన్నారు. పెండింగ్ పనులు 15 రోజులలో పూర్తికాకపోతే, వీరికి మరలా రూ. 2లక్షల 31వేల 877 రికవరీ విధించనున్నట్టు హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గొర్రెల త్రిమూర్తులు, సర్పంచ్ మందపల్లి జ్యోతి, డీవీవీవో కేశవరావు, ఏపీడీ రంగనాయకులు, ఈఓపీఆర్‌డీ అశోక్ కుమార్, ఏపీవో అగస్టీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

అనపర్తి:

సూర్యశ్రీ — **లై**

సత్యగౌరి — **నేనేరాజు నేనే మంత్రి**



అచ్యుతాపురం అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

రంగంపేట: మండల పరిధిలోని అచ్యుతాపురంలో అంగన్‌వాడీ సెంటర్ 22లో బుధవారం ఐసీడీఎస్ పీవో సీహెచ్ లక్ష్మి, సూపర్‌వైజర్ జయలక్ష్మి తనిఖీ చేశారు. హాజరు వేసిన దాని కంటే తక్కువ మంది పిల్లలు ఉన్నట్టు గుర్తించారు. ఈ కేంద్రంలో రోజూ 15 నుంచి 18 మంది ప్రీస్కూల్ విద్యార్థులున్నట్టు నమోదు చేస్తున్నారని, వాస్తవంగా అక్కడ నలుగురు పిల్లలు మాత్రమే ఉన్నారని పీవో లక్ష్మి తెలిపారు .సెంటర్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, సెంటర్‌లో ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించకపోవటం గుర్తించినట్టు తెలిపారు. స్టాకు అవకతవకలపై కార్యకర్త ఎల్. దుర్గా భవానీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోకపోతే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎల్ఐ బాల నాయక్‌ను సత్కరిస్తున్న అధికారులు

బాలనాయక్ సేవలు అభినందనీయం

అనపర్తి : విద్యుత్ శాఖలో నిరంతర సేవలందిస్తూ, ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్న ఎల్ఐ బాల నాయక్ సేవలు అభినందనీయమని ఏడీఏ రాజబాబు అన్నారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సీఎండీ ఎంఎం నాయక్ చేతుల మీదుగా సేవా పురస్కారం అందుకున్న బాల నాయక్‌ను బుధవారం రాత్రి దుప్పలపూడి సబ్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఈ అన్నవరం మాట్లాడుతూ నాయక్ సేవలు అభినందనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగిన కాలంలో ఆయన సేవలకు ఎనలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎల్ఐ సత్యనారాయణ, సుధాకరెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో పాడైన గుడ్లు పంపిణీ ?

రంగంపేట: మండల పరిధిలోని జి.దొంతమూరులో అంగన్‌వాడీ సెంటర్ 23లో కార్యకర్త టి గంగాభవాని పాడైపోయిన కోడిగుడ్లను అందజేస్తుందని, ఆమెకు ఇష్టం వచ్చినపుడు ఇస్తున్నారంటూ గ్రామానికి చెందిన కె.వెంకటలక్ష్మి, కొండ్రు దుర్గ, మరో 30 మంది మహిళలు ఐసీడీఎస్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం అందజేస్తోన్న అన్న అమృత హస్తం, పాలు ఈ కేం ద్రంలో ఇవ్వటం లేదన్నారు. ఎవరైనా గట్టిగా అడిగితే వారికి మాత్రమే అందిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. గుడ్లను ఉడకపెట్టటాదనికి గ్యాస్ అందించినా , పుల్లలపై మాత్రమే గుడ్లను ఉడికిస్తున్నట్టు తెలిపారు. ఆగస్టు 22 వతేదీ అందించిన గుడ్లను అధికారులకు చూపించారు. వెంటనే ఈ సెంటర్‌పై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని దళిత మహిళలు కోరుతున్నారు. ఫిర్యాదు కాపీలను ఐసీడీఎస్ పీడీకి, కలెక్టర్‌కు పంపుతున్నట్టు తెలిపారు. కాగా, గతంలో దొంతమూరులోని ఒక అంగన్‌వాడీ సెం టర్‌లో కోడి గుడ్లు తిని ఇద్దరు పిల్లలు మరణించారంటూ వివాదం చెలరేగటంతో ఆ సెంటర్ కార్యకర్త, ఆయా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, రం గంపేట సీడీపీవోను కూడా ప్రభు త్వం సస్పెండ్ చేసింది. అయినా గ్రామంలో పరిస్థితి మారలేదు. అచ్యుతాపురంలోని 22వ కేంద్రం తనిఖీ చేసిన అధికారులు , దొంతమూరులోని 23 కేంద్రం తనిఖీ చేయక పోవటాన్ని గ్రామస్థులు తప్పు పడుతున్నారు. అంగన్‌వాడీ కేం ద్రాలపై సరైన పర్యవేక్షణ లేకపోవటం వల్లే ఇటువంటి అనర్థాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చంద్రన్న బీమా సహాయం అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

పేద కుటుంబానికి చంద్రన్న బీమా భరోసా

అనపర్తి : ప్రతి పేద కుటుంబారికి చేయూత ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం ప్రవేశపెట్టిన్నటు ఎంపీటీసీ సభ్యుడు వోగిరెడ్డి రాధాకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లంకే ప్రసాద్ కుటుంబానికి చంద్రన్న బీమా తక్షణ సహాయంగా మృతుని తల్లి సత్యవేణికి రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చింతా ప్రకాశరెడ్డి, పడాల కళ్యాణ్‌రెడ్డి, బీమా మిత్ర ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ రామగుర్రెడ్డి

మట్టి గణనాధుల పంపిణీ

అనపర్తి: పర్యావరణ పరిరక్షణకు మట్టితో చేసిన గణనాధులనే పూజించాలని ప్రచారం చేస్తూ బుధవారం మండలంలో మట్టి గణనాధుల పం పిణీ కార్యక్రమం నిర్వహించారు. అనపర్తిలోని కేబీఆర్ ఫ్రెండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి తాడి రామగుర్రెడ్డి, వైద్యులు ఎఎస్ ఎన్‌మూర్తి మట్టి ప్రతిమలను పం పిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డిని వైద్యులు అభినందించారు. పొలమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. అనపర్తి మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ద్వారంపూడి బంగార్రెడ్డి, అంగర వంశీకృష్ణ ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులే మేలు

బిక్కవోలు: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను పూజించాలంటూ కొమరిపాలెం మెయిన్ పాఠశాల విద్యార్థులు బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకులను నిమజ్జనం చేసినప్పుడు నీరు కాలుష్యం అవ్వ దని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి మట్టి వినాయకులను పూజించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాటూరి అప్పారావు, తాడి రామచంద్రారెడ్డి, బి. వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కొమరిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గణనాథులు..

ఉత్సవానికి సిద్ధం



అమ్మకానికి సిద్ధం చేసిన గణనాథులు విగ్రహాలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రతిఏడాది అంగరంగ వైభవంగా జరుగుతాయి. వీధివీధిలో ముఖ్యమైన కూడళ్లు, అపార్టుమెంట్‌లలో, వ్యాపార సముదాయాల్లో ఇలా అన్నిచోట్ల గణపతి ఉత్సవాలకు ఈ నగరం ప్రసిద్ధి. చిన్నా, పెద్దా విగ్రహాలు కలిపి ప్రతిఏటా 2వేల విగ్రహాలకు పైబడి భక్తుల పూజలు అందుకుంటాయి. మళ్లీ ఈనెల 25న గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నందున నగరానికి ముందుగానే





మూడడుగుల బుల్లి గణపతి విగ్రహం.. మట్టితో తయారు చేసిన గణపతి

రాజమహేంద్రవరం కేంద్రంగా గణపతి విగ్రహాల వ్యాపారం
మట్టి గణపతులను వినియోగించాలంటూ ప్రచారం

వినాయక చవితి శోభ వచ్చేసింది. అప్పుడే కూడళ్లలో పందిరి రాటలు వేసి ఉత్సవాల పందిళ్లు నిర్మించేశారు.

● రాజమహేంద్రవరం కేంద్రంగా విగ్రహాల విక్రయాలు...

రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రజలంతా గణపతి విగ్రహాలను గతంలో విజయవాడ నుంచి కొనుగోలు చేసుకుని తెచ్చుకునేవారు. మూడేళ్లుగా రాజస్థాన్‌కు చెందిన కొన్ని కుటుంబాలు రాజమహేంద్రవరం, కడియం, ధవళేశ్వరం పరిసర ప్రాంతాల్లో 3 నుంచి 15 అడుగుల ఎత్తుగల గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. 6 నెలల ముందు నుంచే ఈ విగ్రహాలను తయారు చేసి రంగు రంగుల వాటర్ కలర్స్‌ను వేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. సైజును బట్టి విగ్రహానికి ఖరీదు నిర్ణయించారు. రూ.1500 నుంచి రూ.15 వేల వరకు వివిధ మోడల్స్‌లో గణపతి విగ్రహాలను సిద్ధం చేశారు. ఇప్పటికే వీటి విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఒక్క రాజమహేంద్రవరంలోనే 3 వేల విగ్రహాలు సిద్ధమయ్యాయి.

● మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేషన్

గణపతి ఉత్సవాలు నిర్వహించే ప్రజలు, ఆలయ కమిటీలు సాధ్యమైనంత వరకు మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఇప్పటికే ఆలయ కమిటీలకు, ప్రజలకు తెలియజేసింది. ప్రతి ఏడాది మట్టి విగ్రహాలను వినియోగించాలని కార్పొరేషన్ స్కూల్స్‌లోని విద్యార్థులతో మట్టి ప్రతిమలను చేయించడం, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో వినాయక చవితికి ముందు నుంచే చవితిరోజు ఉదయం వరకు పలు ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను పంపిణీ చేయించడం వంటివి చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నిమజ్జనం సమయంలో నదీ జలాలు కలుషితమవుతాయని, విగ్రహాలు త్వరగా కరిగే పరిస్థితి ఉండదని, దానికి వినియోగించిన రసాయనాలవల్ల నదీ జలాల్లో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించరాదని పర్యావరణ నిపుణులు ఎప్పటికప్పుడు చెబుతున్నారు. ప్రభుత్వం కూడా అదే విషయాన్ని ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. రాజమహేంద్రవరంలో చారిత్రాత్మక గణేష్‌చౌక్ మహాగణపతి నవరాత్రి ఉత్సవాలకు 9అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయం తీసుకుంది. నగర ప్రజలు కూడా మట్టి విగ్రహాలనే వినియోగిస్తారు. మిగిలిన ఉత్సవ కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా విగ్రహాలను వినియోగించే ఆలోచనలో ఉన్నారు. మొత్తం మీద రాజమహేంద్రవరంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందడి, విగ్రహాల కొనుగోళ్ల హడావిడి ప్రారంభమైంది.



విగ్రహానికి రంగులు వేసి మెరుగులు దిద్దుతున్న మహిళ

సీతారామకథాసుధ పుస్తకావిష్కరణ

గోదావరి సిటీ: చిరపురాతనమైనది, నిత్యనూతనమైనది రామాయణ మహాకావ్యమని, అందుకే ఎన్నిసార్లు చదివినా రామాయణ చదవాలనిపిస్తుందని, అదే రామాయణ విశిష్టత అని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖా మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్‌లో బుధవారం సాయంత్రం సీనియర్ జర్నలిస్టు దీక్షితుల సుబ్రహ్మణ్యం అందించిన సీతారామ కథాసుధ (సుందరకాండ) పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాణిక్యాలరావు మాట్లాడుతూ మన జీవితంలో ఉండే అన్ని పాత్రలు రామాయణంలో ఉన్నాయని, ఈ మహాకావ్యాన్ని వాయిస్ రూపేణ కూడా అందిస్తే బాగుంటుందని అన్నారు. ప్రముఖ రోటేరియన్ పట్టపగలు వెంకట్రావు సభాధ్యక్షత వహించగా విశిష్టఅతిథి సామవేదం షణ్ముఖ శర్మ గ్రంథావిష్కరణ గావించారు. ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త డాక్టర్ టివి. నారాయణరావు గ్రంథ సమీక్ష చేశారు. కొత్త నాగేశ్వరరావు మొదటి కొనుగోలు చేశారు. గౌరవఅతిథిగా దుబాయ్ తెలుగుసంఘం ఉపాధ్యక్షుడు జాఫర్‌ఆలీ, ఆత్మీయ అతిథులుగా విశ్రాంత న్యాయాధికార వెంపాటి విశ్వనాథం, విశ్వహిందూ పరిషత్ గొల్లపూడి



సీతారామ కథాసుధ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పైడికొండల మాణిక్యాలరావు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, సాయి విద్యాసంస్థ డైరెక్టర్ డి.సుబ్బారావు, ట్రిప్స్ ఇంటర్నేషన్ స్కూల్ డైరెక్టర్ బాలాత్రిపురసుందరి, గంగరాజు డైయిరీ అధినేత నిమ్మలపూడి గోవింద్, గౌతమి కోపరేటివ్ సూపర్ బజార్ చైర్మన్ ప్రసాదుల హరినాథ్ పాల్గొన్నారు. సమీక్షకులు టీవీ నారాయణరావు మాట్లాడుతూ ఎలా రాస్తే ప్రజలు చదువుతారో దీక్షితులు అర్థం చేసుకుని రచించారన్నారు. జీవ సంస్కారం వ్యవహారిక భాషతోపాటు, గ్రాంథికం కూడా ఈ గ్రంథంలో ఉందన్నారు. ఎవరితో ఎలా మాట్లాడాలి.. ఎలా వ్యవహరించాలి అనేది తెలియాలంటే రామాయణం చదవాలన్నారు. రామాయణం రాయడం రాని వారు రామకోటి రాసుకుంటే చాలన్నారు. ఈ సందర్భంగా కె.పార్థసారది మాట్లాడుతూ గతంలో దీక్షితులు అందించిన బాలకాండ ఆవిష్కరణకు మంత్రి విచ్చేశారని, మళ్లీ సుందరకాండ ఆవిష్కరణకు వారు విచ్చేయడం ఆనందదాయకమని అన్నారు. గతంలో అందిచిన అయోధ్య కాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ గ్రంథాలు సోషల్ మీడియా ద్వారా లక్షలాది మందికి చేరువయ్యాయన్నారు. ప్రముఖ నక చిత్రకారుడు రవిపరస గీసిన శ్రీరాముడు చిత్రాన్ని టీవీ నారాయణరావు దీక్షితుల సుబ్రహ్మణ్యానికి అందజేశారు. మంత్రి పైడికొండల మాణిక్యాలరావును ఘనంగా సత్కరించారు. ఇతర వక్తలు మాట్లాడుతూ దీక్షితుల సుబ్రహ్మణ్యాన్ని అభినందించారు.

అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్ర

గోదావరి సిటీ: ఆగస్టు 16న ఇచ్ఛాపురంలో ప్రారంభించిన అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర సెప్టెంబర్ 17కి అనంతపురం చేరుకుంటుందని ఈ యాత్రలో బాధితులందరినీ చైతన్యవంతులుగా చేసి మరింత ముందుకు తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాడతామని అగ్రిగోల్డ్ బాధితలు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మధ్యాహ్నం చైతన్యయాత్రలో భాగంలో రాజమహేంద్రవరం చేరుకుని సీపీఐ కార్యాలయం వద్ద బాధితులంతా సమావేశమయ్యారు. యాత్రలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. సభలో బాధితులను చైతన్యవంతులుగా చేసేలా జానపద గీతాలను ఆలపించారు. సీపీఐ రాష్ట్ర నా యకులు రావులవెంకయ్య, వి.తిరుపతిరావు, విశ్వనాధరెడ్డి, కె.జయసింహా, నల్లారామారావు, మీసాల సత్యనారాయణ, వి.శేషుకుమార్‌రెడ్డి, ఎ.రామకృష్ణ, ఎన్.నాగు, జి.లోవరాజు బాధితులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు.. సమావేశంలో పాల్గొన్న బాధితులు



టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగశీలి

కలెక్టరేట్: సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో ధైర్యసాహసాలు చూపిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగశీలి అని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య అన్నారు. టంగుటూరి జయంతి సందర్భంగా బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనందసూర్య మాట్లాడుతూ రాష్ట్రానికి టంగుటూరి చేసిన సేవలను గుర్తిస్తూ జయంతిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణ

టీడీపీకి ఎన్నికలంటే భయం

ఆ పార్టీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను మాపై మోపుతున్నారు

సంక్షేమం.. అభివృద్ధి అని గొంతు చించుకోవడం కాదు చేతల్లో చూపాలి

వైసీపీ నాయకుడు మోపిదేవి వెంకటరమణ

కాకినాడ (ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసం చేసి 2014 ఎన్నికల్లో గద్దెనెక్కిన టీడీపీ నాయకులకు ఎన్నికలంటే భయమని, తమ అభ్యర్థులు గెలవరనే ఉద్దేశంతో మొన్నటి వరకు నంద్యాల, ఇప్పుడు కాకినాడలో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వైసీపీ నాయకుడు మోపిదేవి వెంకటరమణ ఆరోపించారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకులు ఓటర్లను మభ్యపెడుతున్న విధానం గమనిస్తుంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. కాకినాడలో అభి వృద్ధి ఏ కోశాన జరగలేదని, కానీ ఆ పార్టీల నాయకులు ప్రచారంలో అభివృద్ధి గురించి మాట్లాడుతుండటం శోచనీయమన్నారు. గొంతు చించుకుని అభివృద్ధి గురించి మాట్లాడే ముందు చేతల్లో ఏం చేశారో ఓటర్లకు చెప్పలేకపోతున్నారని విమర్శించారు. కుల రాజకీయాలకు ఆజ్యం పోసింది టీడీపీయేనని, ఇది తమపై రుద్దుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. మత్స్య సంపద వేటాడి జీవిస్తున్న మత్స్యకారులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో వేటాడి తెచ్చిన ఉత్పత్తిపై జీఎస్టీ పన్నును 15 శాతం నుంచి 18 శాతానికి కేంద్రం పెంచితే నోరు మెద పని ఈ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక హక్కు టీడీపీ నాయకులకు లేదన్నారు.

మరో నాయకుడు పార్థసారధి మాట్లాడుతూ నంద్యాలలో రూ.1,200 కోట్ల అభివృద్ధి జరిగిందని చెప్పుకుంటున్న టీడీపీ నాయకులు కాకినాడ అభివృద్ధికి ఈ మూడేళ్లలో ఎంత ఖర్చు పెట్టారో చెప్పలేకపోతున్నారన్నారు. మోసం చేసి ఎంతో కాలంలో అధికారంలో ఉండలేమనే విషయాన్ని టీడీపీ గమనించాలన్నారు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిశేషగిరిరావు, విజయచందర్

కార్పొరేషన్‌లో పాగా వేసిది వైసీపీయే

ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇస్తాం

కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆదిశేషగిరిరావు

కాకినాడ (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థులకు కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల మద్దతు ఉంటుందని, ఇక్కడ పాగా వేసేది తామేనని కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, వైసీపీ నాయకుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడానికి తమ అభిమానులు ఆహ్వానించిన మేరకు వచ్చానన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఒకప్పుడు ఇందిరా గాంధీ అని, కాలక్రమేణా రాష్ట్రంలో కాంగ్రెస్ అంటే వైఎస్ రాజశేఖరరెడ్డి అనే అభిప్రాయంలో ప్రజలు ఉండేవారన్నారు. తండ్రి మరణించి దుఃఖంలో ఉంటే సోనియా గాంధీ జగన్‌ను ఇరకాటంటంలో పెట్టేందుకు చేసిన యత్నాలకు జగన్ చెక్‌పెట్టి మధ్యంతర ఎన్నికల్లో కడప ఎంపీగా ఐదు లక్షల మెజారిటీతో గెలిచారన్నారు. అప్పటి నుంచి 2019 ఎన్నికలే లక్ష్యంగా ఆయన పనిచేస్తూ ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ఆయనకు వస్తున్న ప్రజాభిమానం చూసి తట్టుకోలేని టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నేరం చేశాడని సీబీఐ కేసులు నమోదు చేసి ఆయన్ను ఇరకాటంలో పెట్టడానికి రకరకాల దొడ్డిదారి ప్రయత్నాలు చేస్తున్న టీడీపీ వక్ర బుద్ధిని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. నంద్యాల ప్రచారంలో చంద్రబాబుపై జగన్ చేసిన కామెంట్‌లను తప్పుపడుతున్న టీడీపీ నాయకులు, ఈ మూడేళ్లలో ఏ రోజైనా జగన్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకుండా ఉన్నారా అని ప్రశ్నించారు. వైసీపీలో గెలిచి టీడీపీలోకి వెళ్లిన 21 మంది ఎమ్మెల్యేలను రాజకీయ వ్యభిచారులుగా అభివర్ణించారు. విలేకరుల సమావేశంలో సినీ నటుడు విజయచందర్ పాల్గొన్నారు.



50వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి త్రిమూర్తులు, ఓట్లు అభ్యర్థిస్తున్న వైసీపీ అభ్యర్థి శ్రీనివాస్

ఇంటింటికీ ముమ్మర ప్రచారం

రమణయ్యపేట (ప్రతాప్‌నగర్): కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రచారానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉంది. దీంతో వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు ప్రచారంపై దృష్టి కేంద్రీకరించారు. ప్రచారం ఎంత బాగా చేస్తే అంత బాగా ఓట్లు సాధించవచ్చనే అంచనాలతో ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 1,2,3,47,49,50 డివిజన్లలో అభ్యర్థులు బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. 49వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి పాలిక ఉషారాణికి మద్దతుగా డిప్యూటీ సీఎం చినరాజప్ప, ఎమ్మెల్యే అనంతలక్ష్మీసత్తిబాబు, నేతలు సీతయ్యదొర, వీరన్న, ప్రకాష్ ఇంటింటికీ తిరిగి ప్రచా రం చేశారు. 1వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల లోవబాబు, 2వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి కాలా భీమశంకర్ సత్తిబాబులకు మద్దతుగా గుడా డైరెక్టర్ పిల్లి రవికుమార్, సాయి, తాతపూడి రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. 2వ డివిజన్‌లో వైసీపీ అభ్యర్థి సంగిశెట్టి జాహ్నవి తరపున వైద్యనగర్‌లో వైసీపీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పుప్పాల వాసుబాబు, సుబ్బారావు, రాజశేఖర్, మురళీకృష్ణ ప్రచారం చేపట్టారు. 50వ డివిజన్‌లో వైసీపీ అభ్యర్థి ఐ.శ్రీనివాస్, 49వ డివిజన్‌లో వైసీపీ అభ్యర్థి రమణాతి మురళి, 3వ డివిజన్‌లో వైసీపీ అభ్యర్థి గుర్రాల వెంకటేష్ జోరుగా ప్రచారం నిర్వహించారు. 3వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థిని గుత్తుల అచ్చియమ్మ పలువురు మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. 50వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి గుత్తుల త్రిమూర్తులుకు మద్దతుగా జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మట్టా ప్రకాష్‌గౌడ్, పలువురు టీడీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. ఇదే డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పిల్లి సతీష్‌కు మద్దతుగా కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు, డీసీసీ అధ్యక్షుడు పంతం నానాజీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు ప్రచారం నిర్వహించారు.




మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న రూరల్ సీఐ పవన్‌కిషోర్, శ్రీచైతన్య కళాశాల విద్యార్థినులు

మట్టి గణపతే మహా గణపతి

కొవ్వాడ (ప్రతాప్‌నగర్): మట్టి గణపతే మహాగణపతని, ప్రతీ ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కాకినాడ రూరల్ సీఐ వి.పవన్‌కిషోర్ కోరారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలో ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. సుమారు వెయ్యి ప్రతిమలను పంపిణీ చేసినట్టు ధరిత్రి రక్షిత సమితి నిర్వాహకురాలు సురేఖ తెలిపారు. సీఐ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన వినాయక విగ్రహాలను వాడరాదన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, నరసింగరావు, పెదకాపు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేట (ప్రతాప్‌నగర్): శ్రీచైతన్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కాకినాడ రూరల్ మండలం వలసపాకల, గ్రామ పరిసర ప్రాంతాల్లో వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూజకు వినియోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు,వాటి తయారీలో వినియోగించే రంగులు, పర్యావరణానికి ఎంతో హాని చేస్తాయన్నారు. కాబట్టి ప్రజలందరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి లలితకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య ప్రైమరీ-1లో ఎన్నికల ప్రమాణ స్వీకారోత్సవం

కాకినాడ సిటీ: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించే కార్యక్రమంలో భాగంగా స్థానిక శాంతినగర్‌లోని శ్రీ చైతన్య ప్రైమరీ విభాగంలో ఎన్నికల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ చైతన్య పాఠశాలల ఆర్.ఐ. గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉత్తమ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, అందువల్ల వాటిని ప్రోత్సహించాలనే సదుద్దేశంతో శ్రీచైతన్య పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కేబినేట్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రిన్సిపాల్ మణిమాల నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో పి.నాగేశ్వరరావు, ప్రైమరీ ఇన్‌చార్జి పి.మంగాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యాభివృద్ధికి పేదరికం ఆటంకం కాదు

నాగమల్లితోట జంక్షన్: విద్యాభివృద్ధికి పేదరికం ఎన్నడూ ఆటంకం కాదని కాకినాడ అర్బన్ పాఠశాల విద్యా ఉప తనిఖీ అధికారి వీపీజీ వాణీకుమారి తెలిపారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం గాంధీనగర్ మహాత్మాగాంధీ కార్పొరేషన్ హైస్కూలులో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సందేశమిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకొండి సూర్యనారాయణ, ఫస్ట్ అసిస్టెంట్ ఎన్ఎస్ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించాలి

ఉద్యోగ సంఘాల నేతలతో ఏపీ టీడీపీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు



కాకినాడ సిటీ: ఉద్యోగుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ వారి సమస్యల పరిష్కారంలో సీఎం చంద్రబాబు చూపిస్తున్న చొరవ దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని ఏపీ టీడీపీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి కాకినాడ చైతన్యనగర్‌లో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించి ఉద్యోగులసేవలను గుర్తించిన చంద్రబాబు మరిన్ని అంశాలను పరిష్కరించాలన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఉద్యోగ సంఘాలు టీడీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలన్నారు. కాకినాడ ఎంపీ తోట నరసింహం మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విభజన అనంతరం రూ. 16 వేల కోట్ల ఆర్థిక భారం పడినప్పటికీ అన్ని రంగాలనూ అభివృద్ధిపథంలోకి తీసుకొచ్చిన విషయాన్ని మరచిపోకూడదన్నారు. సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీగా తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, గొల్లపల్లి సూర్యారావు, పిల్లి అనంతలక్ష్మి, ఎమ్మెల్సీ రవికిరణ్‌వర్మ, మాజీ ఎమ్మెల్సీలు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సత్తిబాబు, తెలుగు యువత నాయకుడు మెట్ల రమణబాబు పాల్గొన్నారు.





23వ డివిజన్‌లో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పుల్లారావు, 21వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి సుల్తానాబేగంకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

అభివృద్ధిని చూసి ఓటేయండి: మంత్రి ప్రత్తిపాటి

జగన్నాథపురం (పోర్టు సిటీ): అభివృద్ధికి ఓటేసి టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. బుధవారం ఆయన 23వ డివిజన్ టీడీపీ అభ్యర్థి గుత్తుల జగదాంబకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి మాయమాటలు నమ్మితే నగరం అధోగతి పాలవుతుందన్నారు. అనంతరం రెల్లిపేటలో సమావేశం నిర్వహించి టీడీపీకి మద్దతు పలకాలని కోరారు. ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డివిజన్ ఇన్‌చార్జి యనమల కృష్ణుడు, గుత్తుల రమణ, డి.రాజా (బేతాళుడు) తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థి సుల్తానా బేగం పోటీ చేస్తున్న 21వ డివిజన్‌లో టీడీపీ ఇన్‌చార్జి, గజపతినగరం ఎమ్మెల్యే కె.అప్పలనాయుడు ప్రచారం నిర్వహించారు. జె.రామారావుపేటలో ఇంటింటికీ తిరిగి బేగానికి ఓటేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంట్యాడ మండల టీడీపీ అధ్యక్షుడు భాస్కర్, మైనార్టీ సెల్ నాయకులు షేక్ ఇమామ్ సాహెబ్, సలీం పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



పర్లోవపేటలో టీడీపీ అభ్యర్థి సునీత ప్రచార ర్యాలీలో పాల్గొన్న మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర



38వ డివిజన్‌లో టీడీపీ అభ్యర్థి మాకినీడి శేషుకుమారికి మద్దతుగా ప్రచారం చేస్తున్న మంత్రి జవహర్, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు



కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, డీసీసీ అధ్యక్షుడు పంతం నానాజీ

హోరెత్తించారు

డ్రైవర్‌పేట సెంటర్ (కార్పొరేషన్): టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 12వ డివిజన్ టీడీపీ అభ్యర్థి తుమ్మల సునీత నిర్వహించిన ప్రచార ర్యాలీలో వారు పాల్గొన్నారు. పర్లోవపేట, నూకాలమ్మ మాన్యం ప్రాంతాల్లో పర్యటించి ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. మంత్రులు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే పేదలకు సొంతింటి కల నెరవేరిందన్నారు. పేదల వాడల్లో సౌకర్యాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాకినాడను స్మార్ట్ సిటీ చేసి ప్రగతిపథంలో నడిపిస్తున్న టీడీపీకి కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం చేకూర్చాలన్నారు. ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, గద్దేపల్లి దాసు, తుమ్మల కొండలరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గాంధీనగర్ (నాగమల్లితోట జంక్షన్): కార్పొరేషన్ ఎన్నికల్లో 38వ డివిజన్ టీడీపీ అభ్యర్థి మాకినీడి శేషుకుమారికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఎక్సైజ్ మంత్రి కేఎస్ జవహర్ ఆ డివిజన్‌లో ప్రచారం చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ విజయశేఖర్ పాల్గొన్నారు. డివిజన్‌లోని ఓటర్లను టీడీపీ అభివృద్ధి చూసి ఓటేయ్యాలని కోరారు. మేయర్ పీఠం టీడీపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు.



49వ డివిజన్‌లోని ఓ దుకాణంలో హోం మంత్రి చినరాజప్ప ప్రచారం

జడ్పీ సెంటర్ (నాగమల్లితోట జంక్షన్): కార్పొరేషన్ ఎన్నికల్లో 37వ డివిజన్ టీడీపీ అభ్యర్థి లంకే హేమలత ఓటు వేసి గెలిపించి డివిజన్‌ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సాంకేతిక విద్య, న్యాయ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. బుధవారం ఆయన వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు 37వ డివిజన్‌లోని ప్రజరుపేట, వార్ఫురోడ్డులో అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. గతంలో కార్పొరేటర్‌గా హేమలత చేసిన అభివృద్ధి పనులను చూసి అభివృద్ధే మంత్రంగా ముందుకు వెళుతున్న టీడీపీకే ఓటు వేసి గెలిపించాలని రవీంద్ర కోరారు.

కాకినాడ సిటీ: కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అన్ని విభాగాలను రంగంలోకి దించింది. ఆ పార్టీ యువజన విభాగం సేవలను వినియోగించుకుంటోంది. 39 వార్డుల్లో పోటీ చేస్తున్న టీడీపీ తెలుగు యువతలో కీలక పదవుల్లో ఉన్న నేతలను కాకినాడ రప్పించింది. 12 బృందాలుగా ఏర్పాటుచేసి ఒక్కో బృందానికి మూడేసి వార్డుల బాధ్యతలు అప్పగించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కె.సత్యప్రభాకర్, ఉపాధ్యక్షుడు పి.సుభాష్‌రెడ్డి శ్రీనివాస్, బి.రాజశేఖర్, చెరుకూరి సాయిరామ్, కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ ఈ బృందాలకు నాయకత్వం వహిస్తున్నారు. బుధవారం ఒకటో వార్డులో ఈ బృందం తరపున ప్రచారం నిర్వహించారు. ఈనెల 25వ తేదీ నుంచి సినీ హీరోలు, ప్రముఖుల డూప్‌లతో ప్రచారం చేయించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు వెంకటరమణ తెలిపారు.

కార్పొరేషన్: ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు ఓటర్లను కోరారు. బుధవారం ఆయన డీసీసీ అధ్యక్షుడు పంతం నానాజీతో కలిసి ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. పీసీసీ కార్యదర్శులు మార్టిన్ లూథర్, తూము బన్ను, నాయకులు మచ్చా అప్పాజీ, సిరంగు శ్రీనివాసు, రోకళ్ల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



1వ డివిజన్‌లో ప్రచారంలో పాల్గొన్న తెలుగు యువత నాయకులు

● సినిమా గైడ్

ఆనంద్	ఫిదా
అంజని	దండుపాళ్యం-2
గీత్	ముబారకన్
సంగీత్	గౌతమ్‌నంద
దేవీప్లెక్స్ 1	గౌతమ్‌నంద
దేవీప్లెక్స్ 2	ఫిదా
దేవీప్లెక్స్ 3	నిన్నుకోరి
శ్రీప్రియ	వాసుకి
పద్మప్రియ	శమంతకమణి
సీ1	డీజే దువ్వాడ జగన్నాథం
సీ2	వాసుకి
మయూరి	దండుపాళ్యం-2
సత్యగౌరి	అమీతుమీ
తిరుమల	గౌతమ్‌నంద
వీర్‌కమల్	రారండోయ్ వేడుక చూద్దాం
లక్ష్మి	గౌతమ్‌నంద

సెంటాక్ కౌన్సెలింగ్‌లో సాయి జూనియర్ కళాశాల విద్యార్థులకు సీట్లు

యానాం: పుదుచ్చేరిలో 2017-18 విద్యా సంవత్సరానికి జరిగిన సెంటాక్ కౌన్సెలింగ్‌లో శ్రీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ ఎం.లోవరాజు తెలిపారు. ఆయుర్వేదిక్ విభాగంలో వి.భారతీప్రసన్న, పి.పావని, వెటర్నరీ విభాగంలో పి.హరికృష్ణ, నర్సింగ్ విభాగంలో ఒ.సాయిభారతి, పి.ధనకుమారి, ఎం.మరియరాణి, బీఎస్సీ అగ్రికల్చర్ విభాగంలో ఎం.శ్రీలత సీట్లు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ నల్లం నాగబాబు, గౌరవ చైర్మన్ మంగా సత్యనారాయణ, డైరెక్టర్ నల్లం రాము, ప్రిన్సిపాల్ మట్టపర్తి లోవరాజు, అధ్యాపకులు అభినందించారు.




కరప మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, వేళంగి ప్రభుత్వ కళాశాలలో ప్రకాశంపంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెర్ల వీరయ్యచౌదరి

ఘనంగా ప్రకాశంపంతులు జయంతి

కరప: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కరప మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో గుత్తుల భీమశంకరరావు, వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ నాయకుడు మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నరావు, ప్రిన్సిపాల్ మేడూరి సూర్యమోహన్, లైబ్రేరియన్ డీవీకే వర్మ తదితరులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి సేవలు, ఆయన గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ సీహెచ్ బాలాజీవెంకటరమణ, శ్రీనివాస్, పి.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేట (ప్రతాప్‌నగర్): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఎంతో కృషి చేసిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు 145వ జయంతి సందర్భంగా కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విశ్వనాథరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన టంగుటూరి చిత్రపటానికి ఎమ్మెల్యే అనంతలక్ష్మి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సత్తిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆంధ్రకేసరి చిత్రపటానికి ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సమన్వయకర్త బీఈవీఎల్ నాయుడు, బీఈడీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.జయసుధాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ టంగుటూరి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో ముఖ్య పాత్ర పోషించారన్నారు.




కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంతలక్ష్మి, ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త నాయుడు, అధ్యాపకులు

జోరుగా ఇండిపెండెంట్ల ప్రచారం

డైరీఫారం సెంటర్ (కార్పొరేషన్): నగరపాలక సంస్థ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా పలు డివిజన్లలో ఇండిపెండెంట్లు ప్రచార జోరు పెంచారు. 9వ డివిజన్ నుంచి సీకోటి అప్పలకొండ, 13వ డివిజన్ నుంచి బొక్కా వెంకటరమణ, 28వ డివిజన్ నుంచి యర్రంశెట్టి సునీత, పినిశెట్టి మోహనకుమారి, 29వ డివిజన్ నుంచి వాసిరెడ్డి రాంబాబు, యాళ్ల పట్టాభిరామయ్య, 32వ డివిజన్ నుంచి నీలాపు శ్రీనుశివరామ్‌కుమార్, ఎండీ వల్లీబాషా, 35వ డివిజన్ నుంచి దూసర్లపూడి రమణ రాజు, బలువూరి రామకృష్ణ, 47వ డివిజన్ నుంచి కొల్లాబత్తుల రాజ్యలక్ష్మి ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు.

● సినిమా గైడ్

యానాం

శ్రీపద్మ	లై
శ్రీవీరేశ్వర	నేనే రాజు నేనే మంత్రి
సత్య (నీలపల్లి)	జయ జానకి నాయక
దేవీమహల్(తాళ్లరేవు)	నేనే రాజు నేనే మంత్రి

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాకినాడ క్రైం: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఆవరణలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన పురుషుడు జీజీహెచ్ ప్రాంగణంలోని జన్మభూమి సత్రం వద్ద మంగళవారం పడి ఉండటాన్ని ఆసుపత్రి సిబ్బంది గమనించారు. అనంతరం అతడిని వారు అత్యవసర విభాగానికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మరణించినట్టుగా ధ్రువీకరించారు. బంధువులు గుర్తించేందుకుగాను మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడు వైద్యం నిమిత్తం జీజీహెచ్‌కు వచ్చి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు ఆచూకీ కోసం 94407 96539, 0884 2379033 నెంబర్లలో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ ఏఎస్ రావ్ కోరారు.

వివాహిత అదృశ్యం



మల్లేశ్వరి (పాత చిత్రం)

యానాం: స్థానిక వంకాయల వారి వీధికి చెందిన బి.వీరవెంకటలక్ష్మణ్ భార్య సత్యదుర్గామల్లేశ్వరి అదృశ్యమయినట్టు ఎస్ఐ కట్టా సుబ్బరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... మల్లేశ్వరి మానసిక వికలాంగులకు సంబంధించి పారా టీచర్‌గా పని చేస్తోంది. ఈమెకు అత్తగారితో చిన్న చిన్న మనస్పర్థలు ఉన్నాయి. సోమవారం స్కూలుకు వెళ్లిన మల్లేశ్వరి ఉదయం 11.40 గంటలకు భర్తకు ఫోను చేసి మధ్యాహ్నం కేరేజ్ పెట్టినట్టు చెప్పింది. ఆమె మధ్యాహ్నం భోజనానికి రాకపోవడం సాయంత్రానికి ఇంటికి కూడా రాకపోవడంతో గాలించారు. మల్లేశ్వరి అదృశ్యంపై తండ్రి కాళ్ల శేషవత్రం అలియాస్ నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు. మల్లేశ్వరి వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్, యానాం పోలీస్ స్టేషన్ 0884- 2321233 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

యానాం సమాచారం



నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

విజయ గణపతి ద్వాదశ
నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

యానాం: సుబ్రహ్మణ్యభారతి వీధిలోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద శ్రీవిజయగణపతి ద్వాదశ నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం పందిరి రాట పాతి ముహూర్తం చేశారు. ఈ సంవత్సరం తొమ్మిది అడుగుల విజయగణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అత్యంత వైభవంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడానికి ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఉత్సవాలు పూర్తయిన అనంతరం భారీ ఎత్తున అన్నదానం చేస్తారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గాజుల బ్రహ్మానందం (బాబీ), కార్యదర్శి యర్రా జగన్నాథరావు (జగ్గు), గుత్తుల సూర్యనారాయణమూర్తి, చింతా అప్పారావు, వాసిరెడ్డి వేణు, కంచర్ల రాంపండు, దంగేటి వెంకటేశ్వర్లు, కరకా రామకృష్ణ, చెట్టిపోతుల జయరాం, కె.నాగేశ్వరరావు, రాయపురెడ్డి బాబి, రెడ్డి అమృత్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులందరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలకు 28 మంది క్రీడాకారులు

యానాం: పుదుచ్చేరిలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు యానాం విద్యార్థులు గురువారం బయల్దేరనున్నట్టు ప్రాంతీయ విద్యా శాఖాధికారి కాలే సాయినాథ్ తెలిపారు. వివిధ క్రీడాంశాల్లో ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో 45 మంది విద్యార్థులను రాష్ట్ర పోటీలకు జట్ల ఎంపిక నిమిత్తం పంపుతామన్నారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) యానాంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రంలో శిక్షణ పొందుతున్న 28 మంది క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలకు పంపిస్తున్నారు. ఇందుకోసం శాయ్ ఇన్‌చార్జి రాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

ఎనిమిది మంది పోలీసులకు స్థానచలనం

యానాం: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పోలీసు శాఖలో పనిచేస్తున్న నలుగురు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్ఐలకు స్థానచలనం కల్పిస్తూ హెడ్‌క్వార్టర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) కొండా వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. యానాంకు సంబంధించి కోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గూటం శివగణేష్‌ను పుదుచ్చేరిలోని బాహూర్ సర్కిల్ శాఖకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పి.అరివుసెల్వన్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. త్వరలో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు.

పరంపేటలో నేటి నుంచి
పేరంటాలమ్మ జాతర మహోత్సవాలు

యానాం: పరంపేట గ్రామంలో గల పేరంటాలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు రామాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బుధవారం ప్రకటనలో తెలిపారు. రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయం వద్ద దుర్గ, లక్ష్మి, సరస్వతి త్రిశక్తి హోమం నిర్వహిస్తారు. ఎన్నో వందల సంవత్సరాల నుంచి పరిసర ప్రాంతాల ప్రజలను రక్షిస్తున్న గ్రామ దేవత పేరంటాలమ్మ అమ్మవారి ఆలయంలో జరిగే ఈ హోమంలో భక్తులందరూ పాల్గొనాలని కోరారు. శుక్రవారం అమ్మవారిని అవిరేడుతో పరంపేట నుంచి యానాం పురవీధుల్లో ఊరేగిస్తూ గుడి వద్దకు తీసుకువెళ్లనున్నారు. భక్తులందరూ పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ఎన్టీఆర్ గృహనిర్మాణాలకు శంకుస్థాపన

కొత్తపేట: ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని తహసీల్దార్ ఎన్.శ్రీధర్ కోరారు. బుధవారం మండల పరిధి అవిడి, కంద్రిగ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి తహసీల్దార్ శ్రీధర్ శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం నిధులు మంజూరు చేస్తోందని, త్వరితగతిన పనులు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వై.ఎల్లంరాజు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాపునేతలను అడ్డుకున్న పోలీసులు

కొత్తపేట: ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న కాపు నేతలను బుధవారం పోలీసులు మందపల్లి సమీపంలో అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు కాపునేతలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.విజయకుమార్ తెలిపారు. వీరిలో చీకట్ల ప్రసాద్, సలాది చిన్ని, పాయసం సతీష్, సలాది వెంకటేశ్వరరావుతో పాటు మరో ముగ్గురిపై కేసునమోదు చేశామన్నారు.

వినాయకచవితికి ఏర్పాట్లు

ఆత్రేయపురం: వినాయకచవితి పర్వదినం సందర్భంగా పుణ్యక్షేత్రాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గణపతి ఆలయాల వద్ద సందడి నెలకొంది. పచ్చని పందిళ్లు నెలకొలిపి విద్యుద్దీపాలంకరణ నిర్వహిస్తున్నారు. ముఖ్యకూడళ్ల వద్ద వినాయకుని ప్రతిష్ఠించి తొమ్మిదిరోజులు పూజలు చేసేందుకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

అ.ఆ. ఫౌండేషన్ సమావేశానికి తరలిరండి

ఆలమూరు: ఈ నెల 26న అంబేద్కర్ ఆశయసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగే సమావేశానికి ఎస్సీ ఎస్టీ, గిరిజన న్యాయవాదులు తరలిరావాలని పలువురు న్యాయవాదులు పిలుపు నిచ్చారు. ఆలమూరు మండల ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొల్లి రాజారత్నం అధ్యక్షతన ఎస్సీ న్యాయవాదుల సమావేశం బుధవారం జరిగింది. కాకినాడ సమావేశానికి తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు పినిపే రామకృష్ణ, కె.సునీల్‌కుమార్, ఎం.కృపావరం, జి.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై చర్య తీసుకోవాలి

● మంత్రి ఆనందబాబు

రావులపాలెం రూరల్: నంద్యాల ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ 15రోజులు అక్కడ బసచేసి కులాలమధ్య వర్గాల మధ్య చిచ్చురేపారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు.కాకినాడ వెళ్తున్న ఆయన బుధవారం రాత్రి పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రభివృద్ధికి ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి చూసి ఓర్వలేక జగన్ విమర్శలు చేస్తున్నారన్నారు. నంద్యాల ఎన్నికల్లో చిచ్చురేపిన జగన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కేవీ. సత్యనారాయణరెడ్డి, సర్పంచి పోతు మూడి విజయలక్ష్మి, ఉపసర్పంచి కొవ్వూరి జగన్నాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

రావులపాలెం:

అక్షర-1	ఆనందో బ్రహ్మ
అక్షర-2	నక్షత్రం
పద్మశ్రీ	జయ జానకి నాయక
వెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి

టంగుటూరి ఆశయాలు స్ఫూర్తిదాయకం



ఆత్రేయపురంలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు ఎంపీడీవో పి.వీణాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కోలా వెంకటేశ్వరరావు, విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.అరుణకుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ఎంఈవో ఎం.హరిప్రసాద్, ఈవోపీఆర్డీ ఓవీవీ సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎన్.ఆనందకుమార్, కంచు స్తంభం శ్రీనివాస్, ముద్రగడ సుబ్బారావు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ప్రకాశం పంతులుకు నివాళుర్పిస్తున్న ఎంపీపీ

టంగుటూరి జయంతి వేడుకలు

ఆత్రేయపురం: ఆంధ్రకేసరి టంటుగూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పీఎస్ రాజు అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ప్రిన్సిపాల్ దేవమణి, హెచ్ఎం నంబూరి సత్యనారాయణరాజు, పీఈటీ రవి రాజు తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వరదా సుబ్బారావు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ పద్మ పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చేపట్టాలి

కొత్తపేట:రైతులు భూసార ఫలితాలను బట్టి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి వై.మధుబాబు పేర్కొన్నారు. అవిడి, గంటి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆకు ఎండుతెగులు, పొడ తెగులు కనిపిస్తున్నాయని, వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. అనంతరం అవిడిలో రైతులకు భూసార పరీక్షాఫలితాల కార్డులను మధుబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో జి.కృష్ణమోహన్, ఎంపీఈవోలు సీహెచ్ వెంకటరమణ, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



భూసార పరీక్షా ఫలితాల కార్డులను పంపిణీ చేస్తున్న ఏవో

నిరుద్యోగులకు ఉపాధి

ఆత్రేయపురం:నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ పేర్కొన్నారు. బుధవారం ఆత్రేయపురం ఐడీబీఐ బ్యాంకులో ఎస్సీ మైనారిటీలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, బ్రాంచిమేనేజర్ నరేష్ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక నిర్వహించారు. గురువారం పులిదిండి ఆంధ్రా బ్యాంకులో ఎస్సీఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.



ఉపాధి పనులు వేగవంతం చేయాలి

ఆత్రేయపురం:ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఉపాధి కూలీలు బ్యాంకు అక్కౌంట్లకు సంబంధించి ఆధార్‌లింక్ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పథకాలను వివరించి, ఆ దిశగా యూనిట్లు అందించాలని కోరారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. వర్మీ కంపోస్టు యూనిట్లు రైతులను ఏర్పాటుచేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో సత్యవతి, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అయ్యప్పకు పంచామృతాభిషేకం

ఆత్రేయపురం: శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ర్యాలి, వెలిచేరు గ్రామాల్లో కొలువైన అయ్యప్ప ఆలయంలో వేకువజామునే సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయాల్లో అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మట్టి వినాయకుడిని పూజించాలి

ఆత్రేయపురం: వినాయక చవితి పండుగ సందర్భంగా సంప్రదాయాలను కాపాడుకోవాలని కోరుతూ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆత్రేయపురం విద్యా విద్యానికేతన్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకుడిని పూజించాలని ఫ్లెక్సీలు చేతపట్టుకుని ఇంటింటావెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కాలుష్యరహిత సమాజస్థాపనకు ప్రతిఒక్కరూ నడుంబిగించాలని కోరారు. చైర్మన్ ముదునూరి రామరాజు, ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో విద్యార్థుల ర్యాలీ

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ఆత్రేయపురం: ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయాధికారిణి కె.సునీత పేర్కొన్నారు. బుధవారం ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో డీసీ చైర్మన్ కుదప కృష్ణమూర్తి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంటపొలాలను ఆమె పరిశీలించారు. రాజీలేని సూత్రాలతో ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం ద్వారా ఎలా సాగుచేస్తున్నారో వంటి అంశాలను పరిశీలించారు. కరుటూరి నరసింహ మూర్తి చేపడుతున్న అరటిసాగును పరిశీలించారు. వరిలో శత్రుపురుగులను తొలగించాలంటే పక్షిస్థావరాలు ఏర్పాటుచేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు వెంకటరమణ, శోభన్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



అంకంపాలెంలో పక్షిస్థావరాలను పరిశీలిస్తున్న దృశ్యం

'బీజేపీకి విశేష ఆదరణ'

రావులపాలెం రూరల్: బీజేపీ కి అన్ని వర్గాల ప్రజలనుంచి ఆదరణ లభిస్తోందని, దీంతో పార్టీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ కార్యవర్గ సభ్యుడు కంకటాల వెంకటరత్నం(నాని) అన్నారు. రావులపాలెం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధికి ఎంత గానో కృషి చేస్తున్నారన్నారు. పేదప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఈసందర్భంగా పలువురు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.





పంటపొలాలను సందర్శిస్తున్న ఏవో

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

రావులపాలెం రూరల్: ఖరీఫ్‌నాట్లు వేసిన రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి, పంటను సాగు చేసుకోవడం ద్వారా ఆశించిన దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారి ఎ.భార్గవమహేష్ అన్నారు. ఈసందర్భంగా ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఎంటీయూ-1184, 1194, 1226 తదితర వరి వంగడాల పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.



పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

రావులపాలెం రూరల్: నేటి టెక్నాలజీ యుగంలో ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని డైరెక్టర్ సీహెచ్ సూరిబాబు అన్నారు. రావులపాలెం సంహిత డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీ.డీ. శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు పోటీపరీక్షలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ డైరెక్టర్ సీహెచ్ సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బి.వెంకటరత్నం, కె.వెంకటేష్, ఎ.దినేష్‌బాబు, సీహెచ్ సూరిబాబు, కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు టంగుటూరి

రావులపాలెం రూరల్: టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ ఉదయభాస్కర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీ సత్యనారాయణ అన్నారు. టంగుటూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ కళాశాలల్లో టంగుటూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రాయవరం: సంక్షేమ పథకాలకు సంబంధించి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం పసలపూడి గ్రామంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పసలపూడి ఆంధ్రాబ్యాంక్, ఎస్‌బీఐ శాఖల్లో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు రాజు, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రాబ్యాంక్ ద్వారా రుణాల కోసం 72 మంది దరఖాస్తు చేసుకోగా 40 మంది, ఎస్‌బీఐలో 59 మందికిగాను 34 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్‌వీవీఎస్ఎన్ మూర్తి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఆచారి, సిబ్బంది ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ మెజేస్

ఘనంగా టంగుటూరి జయంతి

మండపేట: దివంగత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఆయన సేవలను ప్రిన్సిపాల్ డాక్టర్ మెజేస్ వివరించారు. యువత ఆయనను అదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని జరుపుకున్నారు. టంగుటూరి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులతో పాటు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

మండపేట: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుకున్న వెనకబడిన తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం మంజురు చేసిన ఉపకార వేతనాలను ప్రిన్సిపాల్ మెజేస్ బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నారాయణరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో బుధవారం కురిసిన వర్షానికి కూలిన చెట్టు

మండపేటలో భారీవాన

మండపేట: పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం పడింది. పట్టణంలో కురిసిన వాన, ఈదురు గాలులకు పలుచోట్ల పట్టణంలో చెట్లు నేలకూలాయి. పట్టణంలో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు చెట్లు నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పట్టణంలోని కోండపల్లివారి వీధిలో విద్యుత్ లైను, రోడ్డుపై నుంచి వస్తున్న ఇసుక లారీపై రెండు చెట్లుపడటంతో విద్యుత్ స్థంభం విరిగింది. లారీస్వల్పంగా దెబ్బతింది. విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలంకు హుటాహుటీన చేరుకుని యుద్ధ ప్రాతికపతికన చెట్టులను తొలగించి విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించారు.



మట్టి విగ్రహాల వాడకంపై ర్యాలీ నిర్వహిస్తున్న సాయితేజా విద్యార్థులు

మట్టి వినాయక విగ్రహాల వాడకంపై ర్యాలీ

రాయవరం: పర్యావరణ పరిరక్షణకు మట్టితో చేసిన వినాయకుడి విగ్రహాలనే వాడాలని కోరుతూ బుధవారం సాయితేజా స్కూల్ విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ భానురేఖ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కర్రి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 25న వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామస్తులకు, విద్యార్థులకు 1000 వినాయకుడి మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. తొలుత పోలీస్ స్టేషన్X వద్ద ఎస్ఐ వి.సురేష్‌కు, డిప్యూటీ తహసీల్దారు టి.దుర్గాప్రసాద్‌కు, మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఈవో పి.ముక్తేశ్వరరావుకు విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పి.సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన కాపు నాయకులు

మండపేట: కాపు ఉద్యమనేత ముద్రగడను బుధవారం పట్టణానికి చెందిన కాపు అభ్యుదయ సంఘ నాయకులు కిర్లంపూడిలో కలిసి తమ సంఘీభావం తెలిపారు. కాపు ఉద్యమనేత ముద్రగడ బాటలోనే తామంతా నడుస్తామని వారు అన్నారు. ముద్రగను కలిసిన వారిలో మండపేట పట్టణ కాపు అభ్యుదయ సంఘ నాయకులు జిన్నూరిసాయి బాబా, పడాల సతీష్, అధికారి శ్రీను, శిరంగు శ్రీను, శెట్టి నాగేశ్వరరరావు, పలువురు కాపు సంఘ నాయకులు కలిసిన వారిలో వున్నారు.





సోమేశ్వరంలో మోడల్ నాడెప్‌ను పరిశీలిస్తున్న జిల్లా రిసోర్సుపర్సన్ సత్యనారాయణరెడ్డి

సోమేశ్వరంలో మోడల్ నాడెప్ పిట్ ప్రారంభం

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మోడల్ నాడెప్ పిట్‌ను బుధవారం సర్పంచ్ వై.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వర్మికంపోస్టు యూనిట్ వద్ద నూతన మోడల్ నాట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా రిసోర్సుపర్సన్ ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన ఆదర్శ రైతు నారాయణదేవ్ పటోడి ఈ మోడల్ నాడెప్‌ను కనిపెట్టినట్లు చెప్పారు. ఈ విధానం ద్వారా తడిచెత్తను నేరుగా వర్మికంపోస్టులో వేయడంద్వారా 20 రోజుల్లో వానపాములకు కావాల్సిన ఎరువు తయారు చేయవచ్చన్నారు. తొలుతగా మోడల్ నాడెప్ పిట్‌ను సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వై.ఆర్కేపరమహంస, ఎఫ్‌టీసీ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర రెమాపెంతెకోస్తు చర్చి ప్రాంగణంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విలస గ్రామానికి చెందిన కేఎస్ జోషప్ మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో, అంగర గ్రామానికి చెందిన జాకబ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిభిరంలో 80 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి కేటరాక్ట్ అవసరాన్ని గుర్తించి విలస కంటి ఆసుపత్రికి తరలించినట్లు నిర్వాహకులు కె. జయబాబు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కపిలేశ్వరపురం: ఎస్సీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి బుధవారం లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రతాప్, సీనియర్ అసిస్టెంట్ త్యాగరాజు ఆధ్వర్యంలో మండపేట సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావు, కపిలేశ్వరపురం ఆంధ్రాబ్యాంకు మేనేజర్ జి.దివాకర్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ రిప్రజంటేటివ్ పిఎన్ స్వామి, కమిటీ సభ్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మండపేట సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 9 మందికి, బీసీ కార్పొరేషన్ 115 మంది, కాపు కార్పొరేషన్‌కు ఒకరు, మొత్తం 125 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో కపిలేశ్వరపురం ఆంధ్రా బ్యాంకు పరిధిలో ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 51 మందికి, బీసీ కార్పొరేషన్ 126 మందికి, కాపు కార్పొరేషన్ 223 మందికి మొత్తం 400 మందికి, ఆలమూరు ఇండియన్ బ్యాంకు పరిధిలోని ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 17 మందికి, బీసీ కార్పొరేషన్ 15 మందికి, మొత్తం 32 మందికి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండేటి నాగేశ్వర్రావు, పుత్సల శ్రీనివాస్, తదితరులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

పంచాయతీలలో శానిటేషన్ మెరుగుకు చర్యలు

రాజమహేంద్రవరం డీఎల్‌పీవో వరప్రసాద్

మండపేట: పంచాయతీలో శానిటేషన్ మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం డివిజన్ పంచాయతీ అధికారి ఎం.వరప్రసాధరావు అన్నారు. మండపేట మండలంలో ద్వారపూడి ఏడిద గ్రామ పంచాయతీలకు పరిశీలించారు. తమ డివిజన్‌పరిధిలో వున్న పంచాయతీలో అనధికార లేఅవుట్‌లను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. అనధికారిక లేఅవుట్‌ల ద్వారా ప్రభుత్వానికి రూ.8 కోట్ల వరకు ఫెనాల్టీ రావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ 1.10 కోట్లుమేర అసరాధ రుసుంను వసూలు చేశామని ఆయన తెలిపారు. పంచాయతీల్లో శానిటేషన్ సిబ్బంది కొరత ఉందని ఆయన అన్నారు. వానాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన రెండు పంచాయతీలలో రికార్డులను పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట ద్వారపూడి ,ఏడిద పంచాయతీ కార్యదర్శులు సుబ్బారావు, వెంటురి అమర్‌నాథ్‌చౌధరి తదితరులు వున్నారు.

● సినిమా గైడ్

మండపేట

సత్యశ్రీ	లై
రాజారత్న	జయ జానకి నాయక
రాజారత్న	లై
అంబికా	జయ జానకి నాయక
సప్తగిరి	నేనే రాజు నేనే మంత్రి
సప్తగిరి	నేనే రాజు నేనే మంత్రి
కృష్ణ	---
విజయమహల్	ఫిదా

కపిలేశ్వరపురం

అంగర: శ్రీభీమేశ్వర	నేనే రాజు నేనే మంత్రి
శ్రీవెంకట మాణిక్యాంబ	లై

అన్నసమారాధన



ఐ.పోలవరం: గుత్తెనదీవి గ్రామంలో వేంచేసియున్న శ్రీకృష్ణ ఆలయం వద్ద బుధవారం భారీస్థాయిలో అన్నసమారాధన నిర్వహించారు. గత ఎనిమిది రోజుల నుంచి జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆఖరి రోజు బుధవారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణ యువచైతన్య యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

'ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి'

ముమ్మిడివరం: ఖాతాదారులకు మేలైన సేవలందించేందుకు యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలో నూతనంగా ఏర్పాటుచేసిన బండారు హోండా షోరూమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. షోరూమ్ చైర్మన్ బండారు సత్యానందరావు అధ్యక్షతనజరిగిన కార్యక్రమంలో నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ముమ్మిడివరంలో హోండా షోరూమ్ ఏర్పాటుచేయడం వల్ల వాటి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. షోరూమ్‌ను జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే బుచ్చిబాబు ప్రారంభించారు. మొదటి వాహనాన్ని గ్రంధి వెంకట్రావుకు విక్రయించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఏఎంసీ చైర్మన్ గొలకోటి దొరబాబు, ఎంపీపీ పితాని సత్యనారాయణ, నాయకులు అర్ధాని శ్రీనివాసరావు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పెన్మెత్స జగ్గప్పరాజు, తాడి జానకిరామ్, దాట్ల బాబు, గుద్దటి జమ్మి, యాళ్ల ఉదయ్, విళ్ల వీరాస్వామినాయుడు, గోదశి పుండరీష్, శాగా రాజేష్ పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

ముమ్మిడివరం: పుట్టింటి దగ్గరనుంచి అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, అత్త మామలు తనను మానసికంగా, శారీరకంగా వేధింపులకుగురిచేస్తున్నారని మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ బి.ప్రభాకరరావు తెలిపారు. మహిపాలచెరువుకు చెందిన సునీతకు మల్లయ్యపాలెంకు చెందిన రమనాతి రమాకాంత్‌తో 2006లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు కూడా ఉన్నారు. అయితే భర్త రమాకాంత్, అత్త అనంతలక్ష్మి, మామ కేశవలు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని సునీత పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



ఆత్రేయపురం: ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయాధికారిణి కె.సునీత పేర్కొన్నారు. బుధవారం ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో డీసీ చైర్మన్ కుదప కృష్ణమూర్తి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంట పొలాలను ఆమె పరిశీలించారు. రాజీలేని సూత్రాలతో ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం ద్వారా ఎలా సాగుచేస్తున్నారో వంటి అంశాలను పరిశీలించారు. కరుటూరి నరసింహ మూర్తి చేపడుతున్న అరటిసాగును పరిశీలించారు. వరిలో శత్రుపురుగులను తొలగించాలంటే పక్షిస్థావరాలు ఏర్పాటుచేసుకోవాలని ఆమె సూచించారు. సీఆర్‌పీలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

ముమ్మిడివరం:

శ్రీవెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి
శ్రీకృష్ణ	లై

అగ్రిబాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతాం



అగ్రిబాధితులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ముమ్మిడివరం: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని చేపట్టిన చైతన్య బస్సు యాత్ర బుధవారం ముమ్మిడివరం చేరుకుంది.

ముమ్మిడివరం చేరుకున్న చైతన్య బస్సు యాత్ర

ఈసందర్భంగా స్థానిక అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్లు ముమ్మిడివరంలో స్వాగతం పలికారు. కస్టమర్స్, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్యబస్సుయాత్ర శ్రీకాకుళం నుంచి ప్రారంభమై ముమ్మిడివరం చేరుకుంది. ఈసందర్భంగా ముమ్మిడివరం జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లో నాగేశ్వరరావు అగ్రిగోల్డ్ బాధితులనుద్దేశించి మాట్లాడారు. అగ్రిగోల్డ్‌లో డిపాజిట్లు చేసిన కష్టమర్లు అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. సంస్థ ఆస్తులను జప్తుచేసి బాధితులకు ప్రతిపైసా ఇచ్చేవరకు తమపోరాటం ఆపేదిలేదన్నారు. అగ్రిగోల్డ్ ఏజెంట్లకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. వనచర్ల వెంకటేశ్వరరావు, శీలం వెంకటేష్, మట్టపర్తి నారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నీలపల్లి ఎక్సైజ్ సీఐ లక్ష్మి తులసి బుధవారం తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన పోలీసు కానిస్టేబుల్ గోడి అనిల్‌కుమార్, పోలీస్ నిఘా రిపోర్టర్ మగ్బల్‌పాషా, జైభీమ్‌పేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గెడ్డం భూషణం యానాం నుంచి కారులో మద్యం బాటిల్స్‌ను తరలిస్తుండగా నీలపల్లి ఎక్సైజ్ అధికారులు పట్టుకుని, తాళ్లరేవు ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ నాగవల్లి కారును సీజ్‌చేసి, మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీపీ



రైటప్: మండల పరిషత్‌కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూల్లో మాట్లాడుతున్న ఎంపీపీ ఇందుకూరి పద్మ

ఐ.పోలవరం: కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎంపీపీ ఇందుకూరి పద్మ లబ్ధిదారులకు సూచించారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్‌లకు సంబంధించి రుణాలు అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ ఇందుకూరి పద్మ మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకున్న లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటుచేసుకుని జీవనోపాధి పొందాలని సూచించారు. ఎస్‌బీఐ మురమళ్ల, విజయ బ్యాంకు మురమళ్ల, డీసీసీబీ బ్యాంకు మురమళ్ల, ఐఎన్‌జీ వైశ్యా బ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో కేసీహెచ్ అప్పారావు, మురమళ్ల డీసీ సాగిరాజు సూరిబాబు, ఇందుకూరి కేశవరామరాజు, జన్మభూమికమిటీ సభ్యులు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, చెయ్యేటి శ్రీను బాబు, కాశి పరివాజ్‌కుమార్, చోడిశెట్టి నాగదేవిబ్రహ్మానందం, వనచర్ల వెంకటేశ్వరరావు, బ్రాంచి మేనేజర్లు ఎన్.దుర్గాప్రసాద్, పి.సందీప్, వి.హనుమంతరావు, సూపరింటిండెంట్ వీహెచ్‌ఎస్.సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్‌డీ పి.హరికృష్ణారెడ్డిపాల్గొన్నారు.

రాయితీపై కంది విత్తనాలు



రైతులకు కంది విత్తనాలు అందిస్తున్న ఏవో వై.మధుకుమార్

ముమ్మిడివరం: పొలాల్లోని వరి చేలగట్లపై కంది పైరును సాగు చేసుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా కంది విత్తనాలను నూరుశాతం రాయితీపై అందజేస్తున్నట్టు వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా ఎల్‌ఆర్‌జీ-41 రకం కంది విత్తనాలను హెక్టారుకు కిలో చొప్పున ఉచితంగా అందిస్తామన్నారు. ఈరకం ఖరీఫ్‌లో 180 రోజులకు, రబీలో 120-130 రోజులకు పంట చేతికొస్తుందన్నారు. ఒకేసారి పూతపూసి ఒకేసారి పంట కోతకొస్తుందన్నారు. ఎకరాకు 8నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఈరకం కందిపైరును శనగ పచ్చపురుగును తట్టుకుంటుందని, నల్లరేగడి భూములకు అనుకూలమన్నారు. కొద్దిపాటి నీటివసతి ఉన్నా సరిపోతుందన్నారు. చేలగట్లపై అయితే హెక్టారుకు కిలో, ప్రధానపంటగా అయితే ఎకరాకు 3 కిలోలు విత్తుకోవాలన్నారు. మొక్క రెండు మీటర్లు పెరిగి అధిగ దిగుబడి ఇస్తుందన్నారు. ముమ్మిడివరం మండలానికి 480 కిలోల విత్తనాలు వ్యవసాయశాఖకు సరఫరా అయ్యాయన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఇస్తామన్నారు. విత్తనశుద్ధి నిమిత్తం 50శాతం రాయితీపై ఇమిడిక్రోఫిడ్ మందును అందిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు వ్యవసాయశాఖను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫిజియోథెరపి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈవో



చెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరిపీ క్యాంపును పర్యవేక్షిస్తున్న ఎంఈవో చిక్కం ప్రసాద్

కాట్రేనికోన: ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి చిక్కం వీరవెంకట సత్యప్రసాద్ కోరారు. బుధవారం ప్రత్యేకావసరాలు గల పిల్లల కోసం చెయ్యేరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ వై.కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజియోథెరిపీ క్యాంపును ఆయన పర్యవేక్షించారు. క్యాంపులో 15మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరిపీ చేశారు. క్యాంపు ద్వారా ఫిజియోథెరిపీతోపాటు స్పీచ్ థెరపీ చేసి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. భవితసెంటర్‌కు రాలేని పిల్లలకు ప్రతి శనివారం ఆయా గ్రామాల్లో వారి ఇళ్లకు వెళ్లి ఫిజియోథెరిపీ చేస్తారని ఎంఈవో తెలిపారు. పిల్లలను భవిత సెంటర్‌కు తీసుకొచ్చేవారికి నెలకు రూ.250 సంరక్షణ భత్యం క్రింద ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. కార్యక్రమానికి రీసోర్స్ టీచర్స్ వి.సుందరం, ఎం.స్వర్ణలత సహకరిస్తారన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'



కొమరగిరిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దాట్ల

ఐ.పోలవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే కొమరగిరిలో ప్రారంభించారు. భూగర్భజలాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం నీరు-చెట్టు పథకంలో భాగంగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మాజీ సర్పంచ్ గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, పెన్మెత్స శరత్, కంకిపాటి దొరబాబు, ఏపీఎం కె.నరేష్, సఖిలే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

తాళ్లరేవు: ఇంజరం ఆంధ్రాబ్యాంకు పరిధిలో గ్రామాల లబ్ధిదారులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు అధికారులు, మండలప్రజాపరిషత్ అధికారులు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, బీసీ, కాపు, క్రిష్టియన్, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలను పొందే లబ్ధిదారులను ఇంటర్వ్యూ చేశారు. ఇంజరం, లచ్చిపాలెం, సుంకరపాలెం, పిల్లంక, గోవలంక, ఉప్పంగల గ్రామాల నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు.



ఇంజరంలో ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

పెద్దాపురం రూరల్: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఈ నెల 26 నుంచి వచ్చే నెల 25 వరకు టీకాలు వేయనున్నట్టు సామర్లకోట పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ తెలిపారు. పశువులకు వచ్చే ఈ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని, దీని నివారణకు టీకాలు వేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పెద్దాపురం మండల పరిధిలోని సుమారు 15 వేల పశువులకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. మండలానికి 18 వేల మందు డోసులు వచ్చినట్టు చెప్పారు. వ్యాధి బారిన పడిన పశువుల్లో పాల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయన్నారు. దీనిని అధిగమించేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు.

25 నుంచి భీమేశ్వరాలయంలో
గణపతి నవరాత్రులు

సామర్లకోట: సామర్లకోట కుమారా రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 2 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, ఈవో నారాయణమూర్తి తెలిపారు. 25న ఉత్సవాలు ప్రారంభం పురస్కరించుకొని మహా గణపతిస్వామిని మూషిక వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని చైర్మన్ తెలిపారు.



విద్యార్థులకు
దంత పరీక్షలు

సామర్లకోట: సామర్లకోట పట్టణ పరిధి భాష్యం విద్యాసంస్థల్లో బుధవారం విద్యార్థులకు దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంతాలను పరిరక్షించుకోవాలని అన్నారు. సుమారు 200 మంది విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష, జోనల్ ఇన్‌ఛార్జి వి.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల
సమస్యలు పరిష్కరించాలి

సామర్లకోట: అఖిల భారత తపాలా ఉద్యోగుల సమ్మె పిలుపు మేరకు సామర్లకోట ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట బుధవారం సిబ్బంది ధర్నా నిర్వహించి ఒక రోజు సమ్మెలో పాల్గొన్నారు. తపాలా శాఖలో పోస్టులు భర్తీ చేయాలని, టార్గెట్ల పేరుతో సిబ్బందిపై వేధింపులు మానుకోవాలని, జీడీఎస్ పే కమిషన్ వెంటనే ఆమోదించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌పీఈ యూనియన్ నాయకులు బి.అప్పారావు, ఎన్.దిలీప్, పి.గంగాధర్, వి.చింతామణి, ఎస్ఆర్ఎల్ఎస్.మూర్తి, రమణమూర్తి, సాగర్, ఎ.వి.రాఘవ, బీపీవీ ఆర్.సత్యనారాయణ, ఎ.వి.వి.స్వామిజీ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

సామర్లకోట:

జయలక్ష్మి1	ఆనందో బ్రహ్మ
జయలక్ష్మి2	జయ జానకీనాయక
సత్యకృష్ణ	నేనే రాజు నేనే మంత్రి
విఘ్నేశ్వర	---

పెద్దాపురం:

లలిత	ఆనందోబ్రహ్మ
శ్రీలలిత	జయ జానకీనాయక
అరుణ	లై
వీరభద్ర	నేనే రాజు నేనే మంత్రి

బిల్లుల చెల్లింపులో ఇంత జాప్యమా?



ఇరిగేషన్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏఎంసీ చైర్మన్

పెద్దాపురం రూరల్ : నీరు చెట్టు పథకంలో చెరువుల అభివృద్ధికి ఖర్చు చేసిన మొత్తానికి ఇంత వరకు బిల్లులు చెల్లింపులో జరిగిన తీవ్ర జాప్యంపై ఏఎంసీ చైర్మన్ ముత్యాల వీరభద్రరావు (రాజబ్బాయి) ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుడాల రమేష్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ ఈ.పద్మజపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్బీ పట్నంలో రామువమ్మ చెరువుల అభివృద్ధి పేరుతో రూ.12 లక్షలు ఖర్చు చేశామని, రెండేళ్ల గడిచినా

ఇరిగేషన్ అధికారులపై ఏఎంసీ చైర్మన్ ఆగ్రహం

బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం చేయడం ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. బిల్లుల చెల్లింపుపై తక్షణం చర్యలు తీసుకుంటామని ఆమె వివరణ ఇచ్చారు. ఎంపీపీ గుడాల రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పాత్రల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సీడీపీవోను ఆదేశించారు. కొనుగోలుకు సంబంధించి ఆయా పంచాయతీల సర్పంచ్‌ల దృష్టికి తీసుకు వెళ్లకపోవడంపై ఆయన సీడీపీవోపై అసహనం వ్యక్తం చేశారు. రైతు రథాలకు సంబంధించి తమకు సమాచారం అందలేదని వ్యవసాయాధికారిణి కొల్లి ద్వారకాదేవిని ప్రశ్నించారు. ఏపీవో వేదకుమారి ఐకేపీ కార్యాలయం నిర్మించి రెండేళ్ల గడిచినా నీటి సదుపాయం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో పల్లాబత్తుల వసంత మాధవి, తహసీల్దార్ గోగుల వరహాలయ్య, హౌసింగ్ ఏఈ శ్రీరామచంద్రమూర్తి, టీడీపీ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు , బొడ్డు వెంకన్న, పాలచర్ల ఉమామహేశ్వరరావు, పేకేటి వెంకటేశ్వరరావు మొయిళ్ల కృష్ణమూర్తి, అడపా గంగాధరం, గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం జీవితం ఆదర్శప్రాయం



సామర్లకోటలో ఆంధ్రకేసరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, పెద్దాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు, ఆంధ్రకేసరి వేషధారణలో విద్యార్థి

సామర్లకోట: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికి ఆదర్శప్రాయమని మున్సిపల్ కమిషనర్ పి.సోమేశ్వరరావు పేర్కొన్నారు. టంగుటూరి 146వ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆంధ్రకేసరి చిత్రపటానికి కమిషనర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, టీపీఎస్.మంజుల, టీపీబీవో రమ్య, పొడుగు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉన్నత పాఠశాలలో..

స్థానిక అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆంధ్రకేసరి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టంగుటూరి వేషధారణలో ఒక విద్యార్థి ప్రదర్శన విశేషంగా ఆకట్టుకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ షఫీయుల్లా, పి.రామేశ్వరిదేవి, కె.వి.వి.సత్యనారాయణ, డి.వి.వి.సత్యనారాయణ, బి.శ్రీలక్ష్మి, ఎ.సత్యనారాయణ, చంద్రమోహన్, సుబ్రహ్మణ్యం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి

పెద్దాపురం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి మంగళవారం ఇక్కడ ఘనంగా జరిగింది. పాత బస్ స్టాండ్‌లోని టంగుటూరి విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సూరిబాబురాజు పూల మాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ బీఆర్ శేషాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ టంగుటూరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఇక నుంచి ప్రకాశం పంతులు జయంతిని ప్రతి యేటా ప్రభుత్వ వేడుకగా ఘనంగా జరుపుతామని అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె.రాజు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌లో పేదలకు విద్యా బోధన

పెద్దాపురం: చంద్రన్న అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌లో నిరుపేదలయిన పిల్లలకు ఇంగ్లిషులో విద్యా బోధన జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ సూరిబాబురాజు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక గోలివారి వీధిలోని సిద్ధార్థ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ప్రీస్కూలును ప్రారంభించారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా అంగన్‌వాడీ ప్రీస్కూల్స్ ప్రారంభించినట్టు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బీఆర్ శేషాద్రి మాట్లాడుతూ పేదపిల్లల కోసం ప్రారంభించిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సామర్లకోట సీడీపీవో డీఎస్‌టీఆర్ పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె.రాజు, పెద్దాపురం సీడీపీవో విజయలక్ష్మి, కౌన్సిలర్ గోలి ప్రభాకర్, విజరాజశేఖర్, కె.రాజు, అంగన్‌వాడీ కోఆర్డినేటర్ పి.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రీస్కూల్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్



సామూహిక సీమంతాలు నిర్వస్తున్న దృశ్యం

పోషకాహార విలువలపై
అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: పోషకాహార విలువలపై చైతన్యవంతం కావాలని ఐసీడీఎస్ అర్బన్ సూపర్‌వైజర్ మంగ పేర్కొన్నారు. స్థానిక కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు 'అన్న అమృతహస్తం' ఆహారాన్ని అందజేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సామూహిక సీమంతాలు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేశారు. చిన్నారులకు కోడిగుడ్లు అంద జేశారు. కార్పొరేట్ స్థాయిలో అంగ న్‌వాడీ కేంద్రం చిన్నారులకు ప్రీస్కూల్ కేంద్రాలను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు సూపర్‌వైజర్ మంగ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బీవీఎస్.రత్నకుమార్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రకృతి వ్యవసాయంతో
సత్ఫలితాలు సాధించాలి

సామర్లకోట: ప్రకృతి వ్యవసాయంతో అధిక ఉత్పత్తులు సాధించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మజ పేర్కొన్నారు. కాకినాడ వ్యవసాయ సహాయ సంచాలకురాలు పరిధిలో కాకినాడ బ్లాకు ఆధ్వర్యంలో గోలి వారి కొత్తూరులో ప్రకృతి వ్యవసాయంపై ప్రదర్శనా క్షేత్రాన్ని బుధవారం పరిశీలించారు. కాకినాడ ఏడీ భవాని, వ్యవసాయాధికారి సామ్యూల్‌జాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీటీఎం రూప, రైతు ప్రత్తిపాటి త్రినాదరావులతో సమీక్షించారు. పాలేకర్ స్ఫూర్తితో శిక్షణ పొంది రెండు ఎకరాలలో గోఆధారిత వ్యవసాయాన్ని సాగు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సాగులో ఇప్పటి వరకు సత్ఫలితాలు సాధించినట్టు రైతు పేర్కొన్నారు. జీరో బేస్ట్ నేచురల్ ఫార్మింగ్ పేరిట రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా జీవామృతం, ఘనజీవామృతం, నియమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి సేంద్రీయ పదార్థాలతో మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు హాజరయ్యారు.

అగ్నిప్రమాదంలో
రూ.50వేల ఆస్తినష్టం

సామర్లకోట: సామర్లకోట మండలం, మాధవపట్నం వైఎస్ఆర్ కాలనీలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో పంచాయతీ కార్మికుడు పల్లపాటి సుబ్రహ్మణ్యంకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ప్రమాదంలో రూ.50వేల ఆస్తినష్టం సంభవించింది. కాకినాడ అగ్నిమాపక దళ సిబ్బంది హుటాహుటిన మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు.

27న ఉచిత నేత్ర వైద్యశిబిరం

మామిడికుదురు: ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పా టుచేసే ఉచిత కంటివైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని యూనియన్ సభ్యులుపేర్కొంటున్నారు. రాజమండ్రి గౌతమీ నేత్రాల యం ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్యశిబిరాన్ని ఈ నెల 27వ తేదీ ఉదయం 9గంటల నుంచి ఒంటిగంట వరకు మామిడికుదురు జడ్పీహైస్కూలు ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. మామిడికుదురు పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అసమాన త్యాగమూర్తి టంగుటూరి ప్రకాశం

● ఘనంగా ఆంధ్రకేసరి జయంతి వేడుకలు ● నివాళులర్పించిన నాయకులు, అధికారులు



పి.గన్నవరంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



అంబాజీపేటలో విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న రాధమ్మ

పి.గన్నవరం రూరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.గన్నవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నేరేడుమిల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్‌పర్సన్ కొక్కిరి దామోదరం పాల్గొని టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘనంగా నివాళులర్పించారు. ఊడిమూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీనివాస్, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు సాయి, ఎం.ఏడుకొండలు, కె.రాణి, కేఎన్‌వీ నారాయణ, పి.గంగాధరరావు, ఎం.రాధాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ఆంధ్రకేశరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. తొండవరం జడ్పీ హైస్కూల్‌లో ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం హెచ్.ఎం ఎం.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో సామాజికవేత్త బి.ఎస్.రాధమ్మ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవన విశేషాలు, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రను వివరించారు. పేద కుటుంబంలో జన్మించి, అత్యున్నత స్థాయికి ఎదిగిన దేశభక్తుడని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు రాధమ్మ బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడేపల్లి రామలక్ష్మినర్సమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ కేతా రాజు, ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, ఎం.రాంబాబు, కె.గంగాధర్, ఎ.శశికుమార్, బిడి.కుమార్ పాల్గొన్నారు.

అయినవిల్లి: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పతులు అసమాన త్యాగమూర్తి అని టీడీపీ మండలాధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద టంగుటూరి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.లక్ష్మయ్యబాబు, ఈవోపీఆర్‌డీ బండారు సూరన్న, మండల ప్రధాన కార్యదర్శి నేదునూరి వీర్రాజు, నక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

వినాయక చవితికి చురుగ్గా ఏర్పాట్లు



వినాయకచవితిని పురస్కరించుకుని ఆలయం ముందు వేసిన పందిరి

మామిడికుదురు: వినాయకచవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించడానికి పలు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ఆలయాల వద్ద పందిళ్లు వేస్తున్నారు. పలుచోట్ల గణనాథుని విగ్రహాలను ఏర్పాటుచేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిదిరోజులపాటు ఆలయాల వద్ద ప్రత్యేకపూజా కార్యక్రమాలను ఏర్పాటుచేశా రు. నవరాత్రుల అనంతరం వినాయకుడి విగ్రహాలను భారీ ఊరేగింపుగా తరలించి నిమజ్జనం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బాబులను కలిసిన టీడీపీ నేతలు



బాబులును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

అంబాజీపేట: టీడీపీ మండలాధ్యక్షుడు ఇటీవల నియమితులైన గణపతి సత్యనారాయణరావు(బాబులు)ను టీడీపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంబాజీపేటలోని వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద బాబులకు పుష్పగుచ్చాన్ని అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొంతు పెదబాబు, సొసైటీ అధ్యక్షుడు గణపతి వీరరాఘవులు, రవణం రాము, అక్కల సత్తిబాబు, అడపా బాబ్జి, అడపా సత్యనారాయణ, బందన రాంబాబు, వాండ్రపు నారాయణరావు, అరిగెల సూర్యనారాయణ, చిక్కాల సూరిబాబు, నండూరి సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

పి.గన్నవరం రూరల్: నరేంద్రపురంలో హైదరాబాద్ హోప్ ఆర్గనైజేషన్ సహకారంతో స్థానిక చర్చిలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ తరపట్ల సుభాషిణి, ఎంపీటీసీ నేలపూడి సత్యనారాయణ ప్రారంభించారు. ప్రశాంతకుమార్ ఆధ్వర్యంలో జరిగిన వైద్యశిబిరంలో వివిధ వ్యాధులకు సంబంధించి ఆయుర్వేద వైద్యులు ఆర్.ప్రసాదరాజు రోగులను పరీక్షించారు. వందమందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో పి.సజన, పి.సుమ, అభిజాన్, విజయకుమార్, రవి, సంఘసభ్యులు పాల్గొన్నారు.

అభ్యర్థుల జాబితాలను బ్యాంకులకు పంపిస్తాం

ఎంపీడీవో ప్రభాకరరావు

పి.గన్నవరం రూరల్: మండలంలోని వివిధ కార్పొరేషన్లకు సంబంధించి జరిగిన ఇంటర్వ్యూల అభ్యర్థుల జాబితాను బ్యాంకులకు పంపిస్తామని ఎంపీడీవో ఎం.ప్రభాకరరావు తెలిపారు. వివిధ కార్పొరేషన్లకు సంబంధించి స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నాలుగురోజులుగా జరుగుతున్న ఇంటర్వ్యూలు బుధవారంతో ముగిసాయి. 9బ్యాంకుల్లో వివిధ కార్పొరేషన్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ జాబితాను బ్యాంకులకు అందించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో ఊడిమూడి బ్యాంకు మేనేజర్ ఎం.కోటేష్, ఎంపీపీ సంసాని లక్ష్మీగౌరి, ముచ్చెర్ల సాయి, సంసాని పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



మండలపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో

పీహెచ్‌సీలలో మెరుగైన సేవలందించాలి

వైద్యారోగ్యశాఖ జాయింట్‌డైరెక్టర్ జిల్లా నోడల్ అధికారి రాజేంద్రప్రసాద్

మామిడికుదురు: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా మెరుగైన సేవలందించాలని వైద్యారోగ్యశాఖ జాయింట్‌డైరెక్టర్ జిల్లా నోడల్ అధికారి పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన నగరం పీహెచ్‌సీని మొగలికుదురు సబ్‌సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న సంచార కేంద్రాలను పీహెచ్‌సీలకు అనుసంధానం చేసి రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలందించే దిశగా కార్యాచరణ చేయాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్య పెరిగేవిధంగా సిబ్బంది కృషిచేయాలన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, సూచనలందించారు. నిర్మాణం పూర్తిచేసుకుని చాలాకాలమైన మామిడికుదురు సబ్‌సెంటర్ భవనాన్ని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సీహెచ్ పుష్కరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు కాశిన ప్రభాకర్, కె.రవికుమార్, డీపీఎంవో డి.రాజేంద్రకుమార్, ప్రసాద్, సిబ్బంది ఎం.నాగేశ్వరరావు, ఎం.పాల్సన్, మద్దాల శ్రీనివాసరావు, ఐ.విమలకుమారి, కె.నిర్మల పాల్గొన్నారు.



నగరం పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న రాజేంద్రప్రసాద్

'మూడు సంవత్సరాలైనా పదోన్నతులు లేవు'

మామిడికుదురు: జిల్లా ఎస్‌టీయూ శాఖ ఆధ్వర్యంలో డిమాండ్ల సాధన కోసం డీఈవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్‌టీయూ నాయకులు పి.సుబ్బరాజు, కేవీ శేఖర్ అన్నారు. సెప్టెంబరు 4న ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. మూడు సంవత్సరాలుగా జిల్లాలో ప్రమోషన్లు లేవని, ప్రమోషన్ ఇవ్వడానికి మీనమేషాలు లెక్కిస్తున్న విద్యాశాఖ అలసత్వాన్ని నిరసిస్తూ, గతనెలలో బదిలీలైన డీఈవో స్కూలు ఉపాధ్యాయులకు రిలీవర్ ఉన్నప్పటికీ రిలీవ్ చేయకుండా ఉండడంపై సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం 10గంటలకు కాకినాడ జిల్లావిద్యాశాఖ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నామని, అధికసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అయినవిల్లిలో బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం పూజలు



అయినవిల్లిలో పూజలు చేస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం శర్మ

అయినవిల్లి: బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ రామాంజనేయశర్మ బుధవారం అయినవిల్లి సిద్ధివినాయకుని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్ఎంపీ, పీఎంపీల చట్టబద్ధతపై హర్షం

అంబాజీపేట: చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఆర్ఎంపీ, పీఎంపీలకు చట్టబద్ధమైన హక్కులను కల్పిస్తూ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఆ సంఘ కోనసీమ అధ్యక్షుడు కంబాల బాబురావు చెప్పారు. మాచవరం పంచాయతీ పరిధిలోని మెట్లకాలనీ షాదీకాలనీలో కార్యదర్శి రఫీ అధ్యక్షతన ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశం జరిగింది. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను గుర్తించి ప్రభుత్వం తరపున శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లను అందచేజేయనున్నట్లు చంద్రబాబు చెప్పారన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు మెడికల్ కళాశాలలో శిక్షణతో పాటు 3నెలలు ప్రభుత్వాసుత్రుల్లో, మరో మూడు నెలలు 104 చంద్రన్న సంచార వైద్యచికిత్స వాహనాల ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందచేయాలన్నారు. తరువాత పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి గ్రామాల్లో వైద్య సేవలందించేలా గుర్తింపునిస్తూ ప్రభుత్వం సర్టిఫికెట్ అందచేస్తుందని బాబూరావు తెలిపారు. సీఎం చంద్రబాబుకు ఆర్ఎంపీ, పీఎంపీలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నిమ్మకాయల లక్ష్మణరావు, షేక్ వలీ, కె.సత్యనారాయణ, డి.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు రఫీ

● సినిమా గైడ్

తాటిపాక:

శ్రీలక్ష్మి	జయ జానకి నాయక
పద్మప్రియ	రైల్వే ఆంటీ
వెంకటేశ్వర	ఆనందో బ్రహ్మ
శ్రీనివాస	నేనే రాజు నేనే మంత్రి

అంబాజీపేట:

వీరభద్ర	దువ్వాడ జగన్నాథం



మండే ఎండల్లో..

వేడెక్కుతున్న ప్రచారం



29వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి మాణిక్యాలరావు



47వ డివిజన్‌లో ప్రచారంలో మంత్రులు చినరాజప్ప, పుల్లారావు



12వ డివిజన్ లో టీడీపీ అభ్యర్థిని కోసం ప్రచారం చేస్తున్న మంత్రులు, పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే శివ రామరాజు



24వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి



30వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకురాలు లక్ష్మీపార్వతి



కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు ప్రచారం



11వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైసీపీ నేత విజయసాయిరెడ్డి



3వ డివిజన్ టీడీపీ అభ్యర్థిని కోసం ప్రార్థనలు

అరాచకాలకు పాల్పడితే సహించం: హోంమంత్రి



ప్రచారం చేస్తున్న హోం మంత్రి రాజప్ప

కార్పొరేషన్: ప్రశాంత కాకినాడ నగరంలో అరాచకాలకు తావు లేదు, ఎవరైనా పాల్పడితే సహించేంది లేదు.. అటువంటి శక్తులను ఉపేక్షించమని హోంమంత్రి చినరాజప్ప అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక సూర్యనారాయణపురం, మంత్రిప్రగడ వారి వీధి, షాసాహెబ్ గల్లీ ప్రాంతాలలో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. స్థానిక 31వ డివిజన్ అభ్యర్థి బంగారు సూర్యావతి, 34వ డివిజన్ అభ్యర్థి తహీరాలను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ కాకినాడ అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు.తొలి విడతలోనే కాకినాడకు స్మార్ట్ సిటీగా ఎంపిక చేయించి కోట్లాది రూపాయలు మంజూరు చేయించారన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, ఎంఏ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి : ఎంపీ తోట నరసింహం

కార్పొరేషన్ ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టాలని ఎంపీ తోట నరసింహం అన్నారు. స్థానిక 43వ డివిజన్ టీడీపీ అభ్యర్థి జేడీ పవన్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం సాయంత్రం ఎంపీ ప్రతాప్‌నగర్ తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలతో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే గెలిపిస్తాయి..

బీజేపీ జిల్లా అధ్యక్షులు యెనిమిరెడ్డి మాలకొండయ్య



కరపత్రం విడుదల చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాలకొండయ్య, నాయకులు

భానుగుడి: కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థుల విజయాలకు సాధనాలు అవుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య అన్నారు. ఎన్నికల మినీ మేనిఫెస్టో కరపత్రాన్ని బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడను స్మార్ట్‌సిటీగా మొదటి దశలోనే ఎంపికచేసి అభివృద్ధి కోసం రూ. 1000 కోట్లు కేటాయించి రూ.400 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా ప్రతి పేదవానికి సొంత ఇంటికోసం ఇళ్లు మంజూరు చేశారన్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో కాకినాడ నగరంలో రోడ్లు విస్తరణ చేశారన్నారు. కాకినాడ, పిఠాపురం మెయిన్‌లైన్ నిర్మాణం కోసం రూ.250 కోట్లు కేటాయించారన్నారు.

36వ డివిజన్‌లో మంత్రి పుల్లారావు ప్రచారం



మంత్రి పుల్లారావు, ఎమ్మెల్యే కొండబాబు ప్రచారం

జడ్పీ సెంటర్ (నాగమల్లితోట జంక్షన్):36వ డివిజన్ బీజేపీ అభ్యర్థిని సాలగ్రామ లక్ష్మిప్రసన్నకు ఓటేసి గెలిపించాలని కార్పొరేషన్ ఎన్నికల ఇన్‌చార్జ్ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, అర్బన్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఓటర్లను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలుచేసేందుకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

ఖర్చులు ఖాతాకు జమ చేయాలి

కలెక్టరేట్: మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్వహించే ప్రచారాల కోసం జరిగే ఖర్చులలో అభ్యర్థుల వ్యయ అకౌంటుకు జమ అయ్యే అంశాలపై స్పష్టతనిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ వివరణాత్మక సూచనలు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని రాజకీయ పార్టీ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో జనరల్ ప్రచారం కోసం పార్టీ నాయకుల ఫోటోలు, సందేశాలతో ముద్రించిన, రికార్డు చేసిన ప్రచార సామాగ్రి కోసంజరిపే వ్యయాన్ని పార్టీ ఎన్నికల వ్యయం ఖాతాకు జమ చేస్తారని తెలిపారు. ఈ జనరల్ ప్రచార సామగ్రిలో అభ్యర్థి ఫోటో లేదా తనకు ఓటు చేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తే ఆ ఖర్చును అభ్యర్థి ఎన్నికల ఖాతాకు జమ చేస్తామని తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు, స్టిక్కర్లు తదితర ప్రచార సామాగ్రిలో పార్టీ నాయకుల ఫోటోలు, విజ్ఞప్తులు మాత్రమే ఉంటే వాటికయ్యే ఖర్చు అభ్యర్థి ఖాతాకు జమ కాదని తెలిపారు. వాటిలో ఎక్కడైనా అభ్యర్థి ఫోటో, విజ్ఞప్తి ప్రస్తావిస్తే మాత్రం..అది అభ్యర్థి ఖాతాకే జమవుతుందన్నారు.

గాడిలో పడని టీడీపీ ఇన్‌చార్జిల ప్రచారం

డైరీఫారం సెంటర్ (కార్పొరేషన్):టీడీపీకి కంచుకోటగా ఉన్న దుమ్ములపేట, పర్లోవపేట, సంజయ్‌నగర్ డివిజన్లలో ఆ పార్టీ ఇన్‌చార్జిల ప్రచారం గాడిలో పడలేదు. మొత్తం నాలుగు డివిజన్లకుగాను ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి మాత్రమే ప్రచారం సాగిస్తున్నారు. ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ప్రచార రంగంలోకి దిగలేదు. 10వ డివిజన్ దుమ్ములపేటలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పర్యటించారు. 11వ డివిజన్ డైరీఫారం అపార్ట్‌మెంట్ల ఏరియా, 12వ డివిజన్ పర్లోవపేట ఏరియా, 13వ డివిజన్ సంజయ్‌నగర్‌లలో మంత్రులు ఇంకా కాలుపెట్టలేదు. దీంతో అభ్యర్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కోర్టు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. 2012 ముందు కేసులన్నీ పరిష్కరించాలనే హైకోర్టు ఆదేశాలు ఉపసంహరించుకోవాలని పలువురు న్యాయవాదులు ఆందోళన జరిపారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బార్ అధ్యక్షుడు కొల్లా వీర్రాజు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల వల్ల న్యాయవాదులపై ఒత్తిడులు పెరిగే అవకాశాలున్న దృష్ట్యా ఈ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు బుగతా శివ, ఆడారి సుగుణ, జగన్నాధం, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్


రౌతులపూడిలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో ఎస్‌వీ నాయుడు


శంఖవరంలో చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు


ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

టంగుటూరి ఆదర్శప్రాయుడు

ప్రత్తిపాడు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. మినర్వా ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు. మినర్వాలో జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజబాబు, ప్రిన్సిపాల్ ఆనంద్‌జోసికుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఎంఈవో ఎస్‌వీ నాయుడు, హెచ్ఎం గాడి కొండబాబు, ప్రకాశం పంతులకు నివాళులర్పించారు.

శంఖవరం: టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని శంఖవరం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. బుధవారం పాఠశాలలో టంగుటూరి జయంతిని నిర్వహించారు. పాఠశాల సాంఘిక ఉపాధ్యాయులు ఎన్.రమేష్‌బాబు టంగుటూరి విజయగాధను విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు, రమేష్, కిరణ్, ప్రసాద్, కృష్ణ, గిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: మండలంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బోను రామకృష్ణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో లెక్చరర్లు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.జానకిరాం, పలివెల శివాజీ, అమరకల్యాణ్, డాక్టర్ వి.కనకరాజు, వాగు మాదవ్, అనిల్‌కిరణ్, సీహెచ్ గోపి, ఎన్.రాజేంద్రప్రసాద్, కె.అనిత, ఎ.ప్రకాశ్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న కాపు ఉద్యమనేత ముద్రగడ

కాపు రిజర్వేషన్ సాధించేంత వరకు నిద్రపోం

ప్రత్తిపాడు: కాపులకు బీసీ రిజర్వేషన్లు సాధించేంత వరకు నిద్రబోమని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం తెలిపారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ గ్రామాలకు చెందిన కాపులు జువ్వల చినబాబు, సానా నూకరాజునాయుడు, మాజీ ఎంపీపీ జల్లిగంపల సత్యనారాయణ, దొడ్డిపట్ల సోమన్నదొర, చక్కపల్లి సత్తిబాబు తదితరులు బుధవారం కిర్లంపూడి వెళ్లి ముద్రగడను కలిశారు. ముద్రగడ మాట్లాడుతూ రిజర్వేషన్లు సాధన కోసం జాతి ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కాపు నాయకులు రామిశెట్టి రాజా, సలాది కృష్ణ, నామన భాస్కర్, సాయిబాబా, చల్లా సత్యనారాయణ, సిద్దా విజయబాబు, సలాది భాస్కరరావు తదితరులున్నారు.



వినాయకుని ఉత్సవానికి రాట మహోత్సవం

శంఖవరం: వినాయకుని నవరాత్రి ఉత్సవాలకు కత్తిపూడి, శంఖవరం గ్రామాలతో పాటు మండలంలో ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. కత్తిపూడి శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బుధవారం రాటమహోత్సవం నిర్వహించారు. పూజారి శర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కేళంగి నూకరాజు, కె.శివ, త్రిమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 25 నుంచి 11 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించి అనంతరం నిమజ్జనం చేస్తామన్నారు. కార్యక్రమంలో జీలకర్ర లక్ష్మణ్, మాదేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామ్‌మాధవ్

చిరు వ్యాపారుల ఆశాజ్యోతి ప్రధాని మోది

ఎమ్మెల్సీ రామ్‌మాధవ్

రౌతులపూడి: చిరువ్యాపారుల ఆశాజ్యోతి ప్రధాని మోది అని ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ పీవీఎన్ రామ్‌మాధవ్ అన్నారు. రౌతులపూడిలో వ్యాపారులకు ముద్ర యోజన పంపిణీ జరగ్గా, ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం దేవాదాయశాఖ అందించి మైక్‌సెట్‌లు, విద్యార్థులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు సుబ్బారావు ఉపాధ్యక్షుడు కోళ్ళ రవిబాబు, శివాజీ, చిరంజీవి మండల అధ్యక్షుడు ఎ.అప్పలస్వామి, డి.చంటిబాబు, కోళ్ళ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ అమలుతో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ

ఏలేశ్వరం: పట్టణంలో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ ద్వారా స్వచ్ఛభారత్ అమలుకు కృషి చేస్తున్నామని ఏలేశ్వరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కొప్పాడ పార్వతి, వైస్ ఛైర్మన్ పైలా సత్యనారాయణ అన్నారు. బుధవారం పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలతో కలిసి పట్టణంలోని పదో వార్డు ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల పరిసరాలు, రహదారుల వెంబడి మురికినీటి నిల్వలు, చెత్తాచెదారాలు నిల్వ ఉండకుండా పరిసరాలు పరిశుభ్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై వారు పరిశీలించారు అనంతరం 13వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే సీసీ డ్రైన్ పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుంకర రాంబాబు, గొడతా చంద్ర, పాండ్రంకి సత్యనారాయణ, బూర్లు సత్తిబాబు, కొప్పాడ రమేష్, ముత్యాల నారాయణ, వాడపల్లి శ్రీను, గొడుగు నాగేంద్ర, బజంతుల మణి, సుంకర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో సీసీ డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్

అక్టోబర్ 2 నాటికి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా ప్రకటించాలి

ప్రత్తిపాడు: అక్టోబర్ 2వ తేదీ నాటికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా మారాలని బీసీ కార్పొరేషన్ జిల్లా ఈడీ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం.జ్యోతి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈడీ జ్యోతి మాట్లాడుతూ మండలంలో పెదశంకర్లపూడి, బవురువాక గ్రామాలు సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా మారాయని మిగిలిన 18 గ్రామ పంచాయతీలు గాంధీ జయంతి రోజునాటికి ఓడీఎఫ్ గ్రామాలుగా మార్పు చెందాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వి.రామకృష్ణ, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ నాగేశ్వరరావు, ఏపీఎం గ్రేస్, ఏపీవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ జ్యోతి

● సినిమా గైడ్

ఏలేశ్వరం:

వెంకటసూర్య	లై
జయశ్రీ	నేనే రాజు నేనే మంత్రి

కత్తిపూడి:

సత్యనారాయణ	వివేకం

రౌతులపూడి:

శ్రీమహాలక్ష్మి	గురు


రెవెన్యూ సహాయక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు

రెవెన్యూ సహాయక కేంద్రం ప్రారంభం

ప్రత్తిపాడు: తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సహాయక కేంద్రాన్ని బుధవారం పెద్దాపురం ఆర్డీవో విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత అంశాలపై ప్రజలకు మరింత సహాయ మందించేందుకు రెవెన్యూ సహాయక కేంద్రాలు దోహదపడతాయని చెప్పారు. ప్రస్తుతం పెద్దాపురం సబ్ డివిజన్‌లో నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కేంద్రాలు ప్రారంభిస్తున్నామని అనంతరం అన్ని మండల కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేస్తామని ఆర్డీవో తెలిపారు. డివిజన్‌లో తుని, పెద్దాపురం, గండేపల్లి, తొండంగి, జగ్గంపేట మండల రెవెన్యూ కార్యాలయ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. వెలుగు పథకాలకు సంబంధించి ఉద్దండ జగన్నాధపురం ఎంపీటీసీ వట్టికూళ్ల కృష్ణసత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఆర్డీవో విచారణ నిర్వహించారు. చంద్రన్న బీమా రసీదులు ఇవ్వడం లేదని, స్కాలర్‌షిప్‌లు లబ్దిదారుల ఖాతాల్లో జమకాలేదనే తదితర అంశాలపై వెలుగు అధికారులు గ్రేస్, నాయుడును ఆరా తీశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, డీటీ ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి కల సాకారం

కొనపాపపేట(కొత్తపల్లి): ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కాకినాడ ఆర్డీవో ఎంకే రఘుబాబు అన్నారు. కొనపాపపేటలో ఇళ్ళనిర్మాణాలకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలందరికీ ఎన్టీఆర్ గృహ నిర్మాణపథకం ద్వారా ఇళ్లు నిర్మించేందుకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసుకోవాలని ఆర్డీవో రఘుబాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి తహసీల్దార్ కర్నీడి రత్నకుమారి, గృహనిర్మాణశాఖ డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ డీవీ రాజు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి సాయం


సాయం అందిస్తున్న దృశ్యం

పిఠాపురంరూరల్: విరవలో ఇటీవల ఆటోడ్రైవర్ కె.చినబాబు మరణించడంతో ఆ కుటుంబానికి కృష్ణవంశీ ఫౌండేషన్ ద్వారా బియ్యం, ఆర్థికసహాయం అందజేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ తరపున నూతటి ప్రకాష్ ఈ సహాయాన్ని అందించగా నాగార్జున, శ్రీనుబాబు, జయ, అవినాష్, సతీష్, సత్తిబాబు, రాజు, రమేష్, వర్మ యూత్ సభ్యులు పాల్గొన్నారు

నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- చవితి పందిర్ల ఏర్పాట్లలో జనం బిజీబిజీ
- జోరందుకున్న విగ్రహాల అమ్మకాలు

పిఠాపురం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు పిఠాపురం పట్టణం సన్నద్ధమవుతోంది. ఎక్కడికక్కడ చవితి పందిర్లు ఏర్పాట్లు చేయడంలో ఆయా ప్రాంతాల ప్రజలు బిజీబిజీగా ఉన్నారు. గణనాథుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని ఉప్పాడ సెంటర్, మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్సు, అగ్రహారం, ఆర్ఆర్ పార్కు, డ్రైవర్స్ కాలనీ, మోహననగర్, మిరపకాయల వీధి తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను నిలిపేందుకు వీలుగా పందిర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయబద్ధంగా తాటాకులు, కొబ్బరిఆకులతో పందిర్లు ఏర్పాటు చేస్తుండగా మరికొన్ని చోట్ల ఐరన్‌రాడ్స్, క్లాత్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు చవితి వేడుకలకు వినాయక విగ్రహాలు సిద్ధమయ్యాయి. భారీ విగ్రహాలతో పాటు ప్రజల అభిమతం మేరకు రంగురంగుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన పనివారు ఇక్కడ ప్రత్యేకంగా విగ్రహాలు తయారు చేస్తున్నారు. పిఠాపురం పరిసర గ్రామాలు నుంచి వస్తున్న ప్రజలు, వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు వాటిని పరిశీలించి తమకు అనుకూలమైన వాటిని ఎంపిక చేసుకుంటున్నారు. చవితికి రెండురోజుల ముందే ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది.


పందిళ్ల రూపకల్పనలో బిజీ


అమ్మకానికి సిద్ధమయిన విగ్రహాలు

చదువుకున్న వారందరికీ ఉద్యోగావకాశాలు

- ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ
- జాబ్‌మేళాలో 188 మందికి ఉద్యోగాలు

పిఠాపురం: చదువుకున్న యువతీ యువకులందరికీ ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పిఠాపురం ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని మునిసిపల్ కల్యాణమండపంలో వికాస ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మినీజాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి ఆయన నియామక ఉత్తర్వులు అందజేశారు. నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి పథకాలు ద్వారా ఉపాధి పొందాలనుకునేవారికి వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కాకినాడ సెజ్‌లో ఏర్పాటయ్యే పరిశ్రమల్లోనూ స్థానికులకే ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. కార్యక్రమంలో వర్మ తనయుడు గిరీష్‌వర్మ, ఏలేరు ప్రాజెక్టుకమిటీ వైస్‌చైర్మన్ రెడ్డెం భాస్కరరావు, పాదగయ చైర్మన్ కొండేపూడి ప్రకాష్, గుడా డైరెక్టరు పిల్లి రవికుమార్, వికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

తరలివచ్చిన యువతీయువకులు

మునిసిపల్ కల్యాణ మండపంలో నిర్వహించిన మినీజాబ్‌మేళాకు పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు నుంచి యువతీ యువకులు భారీగా తరలివచ్చారు. 700 మంది జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఇంటర్వ్యూల్లో టీవీఎస్ సంస్థకు 121మంది, ఫాక్స్‌కాన్ మొబైల్ కంపెనీకి 67మంది ఎంపికయ్యారు. త్వరలో మరిన్ని కంపెనీలు పిఠాపురంలో జాబ్‌మేళా నిర్వహించనున్నాయని ఎమ్మెల్యే వర్మ తెలిపారు.


నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వర్మ

తీరంలో కొనసాగుతున్న కెరటాల ఉధృతి

ఉప్పాడ(కొత్తపల్లి): ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాల ఉధృతి కొనసాగుతోంది. సుబ్బంపేట నుంచి విద్యుత్ ప్లాంటు సమీపంలో కెరటాలు బీచ్‌రోడ్డుకు పైకి విరుచుకుపడుతున్నాయి. పెద్ద వంతెన పైకి కెరటాలు ఎగసిపడుతున్నాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాలిన గాయాలతో వ్యక్తి మృతి

గొల్లప్రోలురూరల్: గొల్లప్రోలు పట్టణం ఈబీసీ కాలనీకి చెందిన వల్లభశెట్టి అప్పారావు మంగళవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో కిరోసిన్ దీపం పడి మంటలు చెలరేగాయి. ప్రమాదంలో గాయపడిన అప్పారావును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన లారీ



పిఠాపురం రూరల్: కత్తిపూడి వైపు వెళుతున్న ఓ లారీ చిత్రాడ శివారున ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పింది. చెరువులోకి దూసుకుపోయింది. లారీని ఎక్స్‌కవేటర్ సహాయంతో పైకి లాగారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌జామ్ అయింది. రోడ్డుకి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.


నిలిచిపోయిన ట్రాఫిక్

ఘనంగా టంగుటూరి జయంతి

గొల్లప్రోలు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసింగపురంలో....

పిఠాపురం రూరల్: మండలంలోని నరసింగపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో టంగుటూరి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్‌వీ సత్యనారాయణ, పి.సుధామాధురి పాల్గొన్నారు.

లక్ష తులసి అర్చన

పిఠాపురం: పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష తులసి అర్చన నిర్వహించారు. శ్రీపాదవల్లభుడు, దత్తాత్రేయస్వామిలను విశేషంగా అలంకరించారు. అనంతరం మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, వేదపారాయణ, రుత్విక్కులతో దత్త మూల మంత్ర అనుష్టానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. శ్రీపాదవల్లభ మహాసంస్థానం, సేవాసంఘ్ అధ్యక్షులు రెడ్డెం బాబులు, చక్కా చలపతిరావు, కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


లక్ష తులసి అర్చన నిర్వహిస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

పిఠాపురం: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను పూజించాలని పిఠాపురం ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద రాజీవ్‌గాంధీ మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా పాత్రికేయులు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వర్మ తనయుడు గిరీష్‌వర్మ, ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెడ్డెం భాస్కరరావు, మునిసిపల్ కమిషనర్ ఎమ్.రామ్మోహన్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వాతిప్రసాద్, వరప్రసాద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సరిదే నాగేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ మాలధారణ

పిఠాపురం: కోటగుమ్మం సెంటర్‌లోని జైగణేష్ దేవస్థానంలో బుధవారం గణపతి మాలధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి 300 మందికి పైగా భక్తులు మాల ధరించారు. అంతకు ముందు అంకురార్పణ, ధ్వజారోహణం, పుణ్యాహవాచనం జరిగాయి. గణపతి మాలధారణ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు మైలవరపు రామకృష్ణ, అవినాష్, రామా, టీటీడీ వేదపండితులు వారణాసి భార్గవశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కోడిగుడ్డి మాణిక్యాలరావు, సభ్యులు రామోజు సత్యనారాయణమూర్తి, నల్లా గోవిందు, కొత్త నాగేశ్వరరావు, రేపాక దత్తు, శీరం రామజోగి, నందిగ్రామం పద్మజ, ఈవో సీహెచ్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాలధారణ చేస్తున్న దృశ్యం

● సినిమా గైడ్

పిఠాపురం:

పూర్ణా	ఫిదా
అన్నపూర్ణ	లై
వెంకటేశ్వర	--
శివదుర్గ	లై
శ్రీసత్యా	నేనేరాజు నేనేమంత్రి

27న దూర విద్యకు స్పాట్ అడ్మిషన్లు

రామచంద్రపురం:ఆచార్య నాగార్జున యూనివర్శిటీ దూరవిద్య ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంబీఏ, ఎంఎస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లను ఈనెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్టు మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు తెలిపారు. ఆ రోజు ఉదయ 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. యూనివర్శిటీ అధ్యాపకులు నిర్వహించే ఈ స్పాట్ అడ్మిషన్లకు ఫొటో, ఒరిజనల్ ధృవపత్రాలు, ఫీజు డీడీలతో హాజరుకావాలని తెలిపారు. గతంలో దూరవిద్య పరీక్ష పూర్తిచేసిన విద్యార్థులు ఒరిజనల్ ధృవపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవచ్చునని దూరవిద్య కోఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. వివరాలకు 9293164798లో తెలుసుకోవాలని కోరారు.

ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం



ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో

రామచంద్రపురం:సమాజాభ్యుదయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ఆర్డీవో కె. సుబ్బారావు కొనియాడారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో ప్రకాశం చిత్రపటానికి ఆర్డీవో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. సైమన్ కమిషన్‌ను ఎదురించిన మహోన్నత వ్యక్తి ప్రకాశం పంతులని ఆర్డీవో కొనియాడారు. ఆయనను ప్రతీ వ్యక్తి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాయల్ తదితరులు పాల్గొన్నారు.

●మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.రాధాకృష్ణ ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి జీవితాన్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈలు వై.నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కాకినాడ గోవింద, ప్రధాన కార్యదర్శి ఎస్.విజయకుమార్, పద్మ, సరోజిని, జాన్సి బిందు తదితరులు పాల్గొన్నారు.

●పలు విద్యాసంస్థల్లో:

స్థానిక మోడరన్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థ అధినేత జీవీ రావు, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.మాణిక్యం, జి.పద్మావతి తదితరులు ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పించారు. చాకలిపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలల ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వై .అప్పారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శ్రీకృష్ణవేణి విద్యా సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.సూర్యనారాయణ,అధ్యాపకులు పాల్గొన్నారు. రామచంద్రపురం పట్టణంలోని పాఠశాలలు, కార్యాలయాలలో టంగుటూరి జయంతిని ఘనంగా నిర్వహించారు.

టంగుటూరి ప్రకాశం జీవితం ఆదర్శనీయం

కె.గంగవరం: టంగుటూరి ప్రకాశం జీవితం ఆదర్శనీయమని పాణింగపల్లి ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడిశెట్టి పుల్లయ్య అన్నారు. బుధవారం పాఠశాలలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సైమన్ కమిషన్‌కు ఎదురు తిరిగిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పామర్రు కళాశాలలో

ప్రెషర్స్‌డే వేడుకలు

కె.గంగవరం: పామర్రు జూనియర్ కళాశాలలో ప్రెషర్స్‌డే వేడుకలు బుధవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జయంతి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థులు కలసిమెలసి ఉండాలని అన్నారు. కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

కె.గంగవరం: కాపు కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. గంగవరంలోని డీసీసీ బ్యాంకులో బ్యాంకు అధికారులు, మండల పరిషత్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 600 మంది అభ్యర్థులు ఇంట ర్వ్యూలో పాల్గొన్నారు. అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కె.గంగవరం: పదవ తరగతి విద్యార్హత తో నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వెలుగు ఏపీఎం అరుణ తెలిపారు. 19 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారికి ఇంగ్లిష్, కంప్యూటర్, రిటైల్‌లో శిక్షణ తోపాటు ఉపాధి కల్పిస్తారని చెప్పారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. ఈ నెల 30వ తేదీ నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభం అవుతున్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

● సినిమా గైడ్

రామచంద్రపురం:

అన్నపూర్ణ	లై
రాజగోపాల్	పటేల్ సర్
కిషోర్	---
సూర్య స్క్రీన్-1	నేనే రాజు నేనే మంత్రి
సూర్య స్క్రీన్-2	ఫిదా
ద్రాక్షారామ:	
శివరంజని	వాసుకి
శ్రీలక్ష్మి	నేనే రాజు నేనే మంత్రి
సూర్య	లై

అమ్మవారికి బంగారు

మంగళసూత్రాల బహూకరణ



మంగళసూత్రాలను అమ్మవారికి అలంకరిస్తున్న దృశ్యం

రామచంద్రపురం:స్థానిక రాజగోపాల్ సెంటర్‌లోని శ్రీసీతారామ స్వామివారి ఆలయానికి యానంకు చెందిన మంచాల వెంకన్నబాబు, సత్యవతి దంపతులు బంగారు మంగళ సూత్రాలను సమర్పించారు. బుధవారం ఆలయ అర్చకులు శ్రీవిఘ్నేశ్వరపూజ, స్వామివారికి విశేష పూజలను నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

రామచంద్రపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ తనిఖీ చేశారు. బుధవారం ఆయన స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో సీఐ కే.శ్రీధర్‌కుమార్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకుడి

ఉత్సవాలకు ఏర్పాట్లు

రామచంద్రపురం:పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. పలు ప్రాంతాలలో చవితి పందిళ్లను వేశారు. లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజులు భక్తి ప్రపత్తులతో కొలుస్తారు. చివరి రోజున లారీలతో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేస్తారు. బాలభక్త సమాజం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. స్థానిక డఫేదార్ సెంటర్‌లో బాలభక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీవరసిద్ధి వినాయకస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. డఫేదార్ సెంటర్‌లో బాలభక్త సమాజం ప్రతిష్ఠించనున్న వినాయక విగ్రహాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు మట్టితో తయారు చేస్తారు. గత 58 ఏళ్లగా ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. కమిటీ సభ్యులంతా ఉత్సవ ప్రారంభ రోజు నుంచి గణపతి మాలధారణ చేసి స్వామికి పూజలను చేస్తారు. ఎన్నో సంవత్సరం వేడుక జరుపుకొంటే అన్ని కిలోల లడ్డూను ప్రసాదంగా సమర్పిస్తారు. ప్రస్తుతం 58వ వేడుకలను నిర్వహిస్తున్నారు.

భారీ వర్షంతో పొంగిన డ్రైన్లు



గణపతి ఆలయంలోకి చేరిన మురికి నీరు

రామచంద్రపురం:పట్టణంలో బుధవారం కురిసిన వర్షం శ్రీలక్ష్మి గణపతి ఆలయాన్ని ముంచెత్తింది. సాయంత్రం అరగంటకు పైగా కురిసిన వర్షంతో డ్రైన్లు పొంగి పొర్లాయి. దాంతో గణపతి ఆలయాన్ని మురికినీరు ముంచెత్తింది. స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ సమీపంలోని మురికి నీటి కాలువ పొంగడంతో ఆలయ గర్భ గుడిలోకి నీరు చేరింది. వెంటనే ఆలయ కమిటీ గర్భగుడిలో మురికి నీటిని తోడి బయటకు పోశారు. డ్రైన్ సరిగా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆలయ కమిటీ పేర్కొంది. మున్సిపల్ కౌన్సిలర్ వయిట్ల సూర్యప్రకాశరావు ఆలయ కమిటీ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ డ్రైన్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థుల వసతుల కల్పనకు చర్యలు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎస్ఐ షేక్ జబీర్

కాజులూరు: మండలానికి చెందిన గొల్లపాలెం శివారు ఎస్సీ పేటలోని ప్రభుత్వ పాఠశాలను గొల్లపాలెం ఎస్ఐ షేక్ జబీర్ దత్తత తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముచ్చటించి, పాఠశాల అవసరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.40 మంది విద్యార్థులకు అవసరమైన బల్లలు, కుర్చీలు, కంచాలు, పుస్తకాలు, పలకలు, యూనిఫామ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నట్టు ఎస్ఐ జబీర్ ప్రకటించారు. త్వరలోనే వీటన్నిటినీ విద్యార్థులకు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు.

తాళ్లపొలంలో జూదరుల అరెస్టు

ద్రాక్షారామ:రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో జూదం ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను ద్రాక్షారామ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాలు.. తాళ్లపొలం శివారు ఖాళీ స్థలంలో బుధవారం మధ్యాహ్నం తాళ్లపొలం గ్రామానికి చెందిన పలివెల శ్రీని వాస్, పంపన సత్తిబాబు, బొంతు కృష్ణ, కోడి వెంకట హరి ప్రసాద్, పాటి వీరబ్రహ్మాలు జూదం ఆడుతున్నారు. ఎస్ఐ సతీష్‌బాబుకు అందిన సమాచారంతో సిబ్బందితో కలసి వెళ్లగా జూదం ఆడుతూ అయిదుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ 21 వేలునగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సతీష్‌బాబు కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

రామచంద్రపురం: గ్రామీణ తపాలా ఉద్యోగుల వేతన కమిటీ నివేదికను వెంటనే అమలు చేయాలని కోరుతూ అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు రామచంద్రపురం బ్రాంచి పరిధిలోని ఉద్యోగులు బుధవారం ఒక రోజు సమ్మెలో పాల్గొన్నారు. మండపేట, ద్వారపూడి, పందలపాక, తాపేశ్వరం, చింతలూరు, అంగర, కపిలేశ్వరపురం, పామర్రు, ద్రాక్షారామ, దంగేరు ప్రాంతాలలోని సబ్‌పోస్టాఫీసులు, బ్రాంచి కార్యాలయాల సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు బీ .రామగంగాధరమ్, టి.పుల్లేశ్వరరావు, ఎన్. అనిల్‌కుమార్, కె.సూర్యనారాయణ, కె.ఈశ్వరరావు, మహ్మద్ హరీఫ్ పాల్గొన్నారు.



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ద్రాక్షారామ:రామచంద్రపురం మండలం కాపవరంలో బుధవారం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అనంతరం ఓ హిందూ మేలుకో నీ ధర్మం తెలుసుకో ప్రవచనం శ్రీగీతావాని ఆలపించారు. కార్యక్రమంలో కాకినాడ శ్రీపీఠం ఆధ్వర్యంలో జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరి పంటకు

అనుకూలమైన వాతావరణం

కె.గంగవరం: ప్రస్తుత వాతావరణం వరిపంటకు అనుకూలంగా ఉందని మండల వ్యవసాయాధికారి ఎన్. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం దంగేరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో పురుగులు లేనందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా మందులు పిచికారీ చేయాలన్నారు. అనవసర పెట్టుబడులు పెట్టవద్దని సూచించారు. మాగుడుకు సుడోమోనాస్ మందును సబ్సిడీపై ఇస్తున్నామని, రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిశెట్టి పుణ్యమూర్తి, ఎంపీఈవోలు లావణ్య, గణేష్, చంద్రమూర్తి, రైతులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి నీటిమట్టం

ధవళేశ్వరం: ధవళేశ్వరంవద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి 2లక్షల 9వేల 286క్యూసెక్కుల మిగులు ప్రవాహాన్ని ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో నీటిమట్టం 10.60 అడుగులుగా నమోదైంది. ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పుడెల్టా ప్రధాన పంటకాల్వా ద్వారా 4.100 క్యూసెక్కులు, మధ్యడెల్టా ప్రధాన కాల్వాద్వారా 2.100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంటకాల్వా ద్వారా 4000క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ ఆరోపణలు

దివాన్‌చెరువు: ఓటమి భయంతోనే అధికార తెలుగుదేశం పార్టీ వైసీపీపై ఆరోపణలు చేస్తోందని మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు వేమగిరి రమణమ్మ, వైసీపీ నాయకుడు వేమగిరి కృష్ణ అన్నారు. పాలచర్లలో బుధవారం వారు విలేఖర్లతో మాట్లాడారు. నంద్యాల నియోజకవర్గ ఉపఎన్నికతోపాటు, కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికలలో వైసీపీ గెలుపు ఖాయం అయ్యిందని చెప్పారు. ఈ సమాచారం అందుకున్న అధికార పార్టీ నాయకులకు దిక్కుతోచక ప్రజల దృష్టిని మరల్చేందుకు తంటాలు పడుతున్నారని వ్యాఖ్యానించారు. మూడేళ్లలో విస్తృత అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకుంటున్న టీడీపీ నాయకులు తీరు నవ్వు తెప్పిస్తోందన్నారు. విజ్ఞులైన ఓటర్లు వైసీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గల కొత్తూరు గ్రామంలో కుక్కల దాడిలో బుధవారం ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన డొక్కల చంద్రరావు, అన్నిక లక్ష్మీ, గోకవరం గ్రామానికి చెందిన గోపిశెట్టి రాంబాబు, పజ్జులాబాదుకు చెందిన ఈత రాంబాబు, అగ్రహారపు శ్రీధర్ అనే వ్యక్తులపై కుక్కలు దాడి చేసి గాయపరిచారు. బాధితులకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు.


గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

గోకవరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. గోకవరం గ్రామానికి చెందిన మంగరాతి సత్యనారాయణ(60) అనే ప్రయాణికుడు మధ్యాహ్నం కాంప్లెక్స్‌లో కూర్చొని ఉండగా ఆకస్మాత్తుగా గుండెపోటుకుగురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

కిర్లంపూడి: మండలం లోని కృష్ణవరం జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద కారుతో వెనుకనుంచి లారీ ఢీకొట్టిన సంఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి గాయపడగా చికిత్స నిమిత్తం ఆ వ్యక్తిని ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారు విజయవాడకు చెందిన వారిగా గుర్తిస్తున్నారు. విషయం తెలిసిన ఎస్ఐ బాలాజీ సంఘటనా స్థలానికి విచ్చేసి పరిస్థితి సమీక్షించారు. పూర్తిస్థాయి వివరాలు తెలియాల్సి ఉంది. కేసుదర్యాప్తు చేస్తున్నారు.





ఇంకా పిందెల పరిమాణంలో దర్శనమిస్తున్న చాగల్నాడు సీతాఫలాలు

అందని మధుర ఫలాలు

సీతాఫలాల దిగుబడికి ఇంకా నెలరోజులు పడుతుందంటున్న రైతులు

సకాలంలో వర్షాలు లేకపోవడంతోనే జాప్యం అంటున్న వ్యాపారులు

రాజానగరం: రుచిలో సిమ్లా యాపిల్‌ను మైమరపించే చాగల్నాడు సీతాఫలం ఈ ఏడాది అందని ద్రాక్షలా మారింది. దీంతో ఇప్పటికే సొమ్ములు చెల్లించి తోటలు కొనుగోలు చేసిన సీతాఫల వ్యాపారులు దిక్కులు చూస్తున్నారు. ఒకనాడు అందరి ఫలంగా ఉండే చాగల్నాడు సీతాఫలం నేడు అందని ఫలంగా మారిపోయిందని రైతులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా చాగల్నాడు సీతాఫలాలకు మంచి గిరాకీని సంతరించుకుంటున్నాయి. చాగల్నాడు ప్రాంతంలో పండే సీతాఫలాలను సుదూర ప్రాంతాల్లోని బంధువులకు, మిత్రులకు, పలుకుబడి కలిగిన రాజకీయ నేతలకు, ఉన్నత స్థాయి అధికారులకు సమర్పించుకుని ప్రసన్నం చేసుకోవడం ఈ ప్రాంత రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది. చాగల్నాడు సీతాఫలాలు గురించి ఒక్క మాటలో చెప్పాలంటే వరదల ప్రారంభంలో గోదావరినదిలో లభించే పులసల స్థానాన్ని చాగల్నాడు సీతాఫలాలు భర్తీ చేస్తాయని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

అట్లతద్దికి ముమ్మరం

ప్రతి ఏడాది మాదిరిగానే తోటలు విక్రయించవచ్చన్న రైతాంగానికి ఈ ఏడాది తీవ్ర నిరాశను మిగిలిింది. ప్రతి ఏటా అక్టోబరులో వచ్చే అట్లతద్ది పండగ నాటికి ముమ్మరంగా లభించి, దీపావళి పండగ నాటికి పూర్తయ్యేవి. ఈ ఏడాది కనీసం మచ్చుకైనా దిగుబడికి రాకపోవడంతో రైతులు, వ్యాపారులు దిగాలు చెందుతున్నారు. బోరు నీటి వసతి సమృద్ధిగా ఉండే మండలంలో శ్రీకృష్ణపట్నం, శ్రీరాంపురం, పిడింగొయ్యి గ్రామాల్లో ప్రస్తుతం ఇప్పుడిప్పుడే అక్కడక్కడ దిగుబడికి వస్తున్నాయి. నీటి వసతి లేని చక్రద్వారబంధం, పాలచర్ల, రాధేయపాలెం, కానవరం, పరిజెల్లిపేట తదితర ప్రాంతాల్లోని సీతాఫలాలు దిగుబడికి ఇంకా నెలరోజులు పడుతుందని రైతులు, వ్యాపారులు చెప్తున్నారు.

వాతావరణం అనుకూలించక..

సీతాఫలాల చెట్లు సాధారణంగా ఏప్రిల్, మేలలో వర్షాలు పడ్డ సమయంలో చిగురు తొడిగి, పూత దశకు చేరుకుంటాయి. ఈ ఏడాది వేసవిలో వర్షాలు పడి సీతాఫల చెట్లు పూత దశకు చేరుకున్నప్పటికీ అనంతరం చోటుచేసుకున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వేడిగాలులకు పూత కాస్తా మాడి నేలరాలిపోయింది. అనంతరం కురిసిన వర్షాలకు అక్కడక్కడా ఉన్న పూత పిందె దశకు చేరుకున్న కాపు వర్షాలు లేకపోవడంతో దిగుబడిలో జాప్యం జరుగుతుందని వ్యాపారులు అంటున్నారు.

ఏజెన్సీ సీతాఫలాలకు భలే గిరాకీ..

చాగల్నాడు ఫలాలు దిగుబడికి రాకముందే ప్రస్తుతం రాజానగరం సమీపంలోని జాతీయ రహదారి వెంబడి ఏజెన్సీ సీతాఫలాల విక్రయాలు కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్నాయి. అనకాపల్లి, నర్సీపట్నం, మాడుగుల ప్రాంతాల్లో సీతాఫలాలను ఇక్కడి వ్యాపారులు కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు.

రియల్ ఎస్టేట్-చాగల్నాడు ఫలాలు కనుమరుగు

పలు రకాల పండ్ల తోటలకు ప్రసిద్ధి గాంచిన చాగల్నాడు ప్రాంతం ప్రస్తుతం జోరుగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం మూలంగా పండ్ల తోటలు కనుమరుగైపోతున్నాయి. ప్లాట్లు పేరుతో మామిడి, జీడి మామిడి, సీతాఫలం, నిమ్మ, నారింజ, సపోట, నేరేడు వంటి ప్రసిద్ధి గాంచిన పండ్ల చెట్లు నేలకూలుతున్నాయి. దీంతో భవిష్యత్తులో వివిధ రకాలకు చెందిన చాగల్నాడు ఫలాల కనుమరుగైపోయే పరిస్థితులు చేరువులోనే ఉన్నాయి.

పండ్లతోటల పునరుద్ధరణపై అవగాహన సదస్సు

కోరుకొండ: కోరుకొండ మండలం రాఘవాపురంలో మామిడి తోటల పునరుద్ధరణపై అవగాహనా సదస్సును బుధవారం ఉద్యానవన శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సదస్సులో కృషీ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయప్రసాద్ మాట్లాడుతూ వయసుపైబడి దిగుబడి ఘణనీయంగా తగ్గిపోయిన మామిడి, జీడిమామిడి తోటల పునరుద్ధరణ గురించి క్షేత్రప్రదర్శన ద్వారా రైతులకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుపైబడిన మామిడి, జీడిమామిడి చెట్లను నేల నుంచి రెండు మీటర్ల ఎత్తులో కొమ్మలు పగలకుండా తీసివేయాలని కొమ్మను నరికిన చోట కాపర్‌ఆక్సీక్లోరైడ్, ఏదైనా పురుగుమందు కలిపిన ద్రావణం పోయాలన్నారు. ఈవిధంగా చేసిన నెలా, నెలా పదిహేను రోజులకు కొమ్మ చుట్టు కొత్త చిగుళ్ళు వస్తాయన్నారు. వచ్చిన చిగుళ్లలో ఆరోగ్యంగా ఉన్న పది చిగుళ్లను ఎంపిక చేసుకుని వాటిపై మనకు నచ్చిన రకము మామిడిపుల్లతో అంట్లు కట్టుకోవాలన్నారు. అంట్లు కట్టినవాటిలో ముందుగా వచ్చిన బలమైన అంట్లుమొక్కలు నాలుగుపక్కలా నాలుగు ఉంచి మిగతా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

వాటిని కత్తిరించాలన్నారు. ఈవిధంగా అన్ని కొమ్మలకు అంట్లు కట్టుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఉద్యాన అధికారి జి.రమేష్, ఉద్యాన విస్తరణ అధికారి మాట్లాడుతూ ఉద్యానశాఖ అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.వెంటయ్య, వైస్‌ప్రెసిడెంట్ ఎం.హరిచంద్రప్రసాద్, ఎంపీఈవోలు లక్ష్మీ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడికి ప్రత్యేక పూజలు



కోదండరాముడికి పూజలు చేస్తున్న అర్చకులు

కోరుకొండ: స్థానిక ఆర్యవైశ్య కోదండరామాలయంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇరగవరపు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమశాస్త్రప్రకారం స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అంతకు ముందు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి సహస్రకుంకుమార్చన, స్వామివారికి సహస్ర తులసీదళ అర్చన నిర్వహించారు. అనంతరం సేవాకాలు, తీర్థ ప్రసాదగోష్ఠి జరిగింది.

పరిశ్రమల స్థాపనతో స్వయం ఉపాధి పొందండి



అమలాపురం టౌన్: పరిశ్రమల స్థాపనతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరో పదిమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని జిల్లా పరిశ్రమల శాఖ ఉపసంచాలకుడు పి.దొరబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందు కు ఔత్సాహికులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అమలాపురం టీటీడీసీలో బుధవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేవారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. 2015-20 సంవత్సరాలలో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్ సబ్సిడీ, సేల్స్‌ట్యాక్స్ రాయితీలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎస్సీఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తుందని వివరించారు. ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో పురుషులకు 35శాతం, మహిళలకు 45 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందని దొరబాబు వివరించారు. సదస్సుకు హాజరైన 30 మంది సవివరమైన ప్రాజెక్టు రిపోర్టులతో హాజరుకావడంతో వారికి వివిధ బ్యాంకుల ద్వారా రూ.5.45కోట్లు పెట్టుబడి పెట్టేవిధంగా ఆయా బ్యాంకు మేనేజర్లతో ఉపసంచాలకులు చర్చించారు. సహాయ సంచాలకుడు ఐవీ రమణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.లక్ష్మీఅండాళ్ళమ్మ, నాబార్డు ఏజీఎం డాక్టర్ కే వీఎస్ ప్రసాద్, క్వాయర్‌బోర్డు అధికారి కె.రామారావు, బ్యాంకు మేనేజర్లు ఎస్.రామకృష్ణ హాజరయ్యారు.

అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం చెల్లించాలి

అమలాపురం(ఆంధ్రజ్యోతి): ఎనిమిది రాష్ట్రాలకు విస్తరించిన అగ్రిగోల్డ్ సంస్థ 32లక్షల మందిని నట్టేట ముంచిందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాల్సిన రాష్ట్రప్రభుత్వం నేటికీ చోద్యం చూస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికే 142 మంది బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త చైతన్యయాత్ర బుధవారం అమలాపురం గడియారస్తంభం సెంటర్‌కు చేరుకుంది.

● సినిమా గైడ్

సీతానగరం:

గీతా బాలాజీ : నక్షత్రం

రామదుర్గ : పటేల్ సార్

కోరుకొండ:

రామకృష్ణ : నేనే రాజు నేనే మంత్రి, జయ జానకీ నాయక

ఆంధ్రజ్యోతి 4 రాజమహేంద్రవరం సిటీ
గురువారం 24/8/2017
రాజమహేంద్రవరం సిటీ ı అర్బన్ ı దేవీచౌక్ ı ప్రకాష్‌నగర్ ı కల్చరల్ ı లీగల్

31న అల్లూరి కాంస్య విగ్రహానికి భూమిపూజ

దేవిచౌక్(రాజమహేంద్రవరం): రాష్ట్ర అల్లూరి సీతారామరాజు యువజనసంఘం ఆధ్వర్యంలో రూపొందుతున్న అల్లూరి కాంస్య విగ్రహానికి ఈనెల 31న గోదావరి గట్టున పి.వి.నరసింహారావు పార్కువద్ద విగ్రహ కమిటీ అధ్యక్షుడు పంతం కొండలరావు ఆధ్వర్యంలో ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు భూమిపూజ చేస్తారని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ మురళీమోహన్, సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, సోము వీర్రాజు, మేయర్ రజనీశేషసాయి పాల్గొంటారన్నారు. జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బొమ్మన రాజ్‌కుమార్ అల్లూరి కాంస్య విగ్రహానికి రూ.10,116 విరాళం అందజేసినట్లు సంస్థ కోశాధికారి బళ్లా శ్రీనివాస్ తెలిపారు.

సుబాబుల్ కొనుగోలు ధర పెంచాలి

ఇంటర్నేషనల్ పేపర్‌మిల్లు యాజమాన్యంతో మార్కెటింగ్‌శాఖ అధికారుల చర్చలు

రాజమహేంద్రవరం అర్బన్: కృష్ణా, గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాలనుంచి రైతులు తీసుకొచ్చే సుబాబుల్ కలప కొనుగోలు ధర పెంచాలని గుంటూరుకు చెందిన మార్కెటింగ్‌శాఖ అధికారులు, ఆ ప్రాంత వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు రాజమహేంద్రవరంలోని ఇంటర్నేషనల్ పేపర్‌మిల్లు అధికారులను కోరారు. మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ ఇస్రార్ అహ్మద్ ఆధ్వర్యంలో జాయింట్ డైరెక్టర్లు రాజశేఖర్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్లు దాస్, సుభాకర్, జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏడీ కిషోర్, రాజమహేంద్రవరం వ్యవసాయమార్కెట్ కమిటీ సెక్రటరీ ఎన్ఆర్‌జీ చౌదరి, నందిగామ, కంచికచర్ల, మద్దిపాడు ప్రాంతాలకు చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇక్కడి పేపర్‌మిల్లు అధికారులను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఇస్రార్ అహ్మద్ మాట్లాడుతూ సుబాబుల్‌కు మరింత గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం టన్నుకు రూ.4,400 నుంచి రూ.4,600 వరకూ చెల్లిస్తున్నారని, దీనికి అదనంగా మరో రూ.500 పెంచాలని కోరినట్టు సమాచారం. తమప్రాంత రైతులంతా రోజుకు 2వేల టన్నుల వరకూ పేపర్‌మిల్లుకే సుబాబుల్ సరఫరా చేస్తున్నందున, వీరికి గిట్టుబాటు ధర పెంచాలని సూచించారని తెలిసింది. దీనిపై పేపర్ మిల్లు జీఎం శ్యామ్ శ్రీవాత్సవ ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే సుబాబుల్‌కు ఎక్కువ ధర చెల్లిస్తున్నామని, ధర పెంచితే తమపై అదనపుభారం పడుతున్నందున ధర పెంచలేమని అధికారుల బృందానికి చెప్పినట్టు తెలిసింది.

టంగుటూరికి నివాళి..

ముందుగా కోరుకొండ రోడ్డులోని వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చిన మార్కెటింగ్‌శాఖ అధికారులు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఇస్రార్ అహ్మద్, సెక్రటరీ ఎన్ఆర్‌జీ చౌదరి, రైతుబజార్ల జిల్లా ప్రత్యేకాధికారి బి.రామచంద్రరావు, జేడీలు, డీడీలు పాల్గొన్నారు.


టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


క్వారీ మార్కెట్ రైతుబజార్‌ను తనిఖీ చేస్తున్న మార్కెటింగ్‌శాఖ ఏడీ కిషోర్

వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు

రైతుబజార్లను తనిఖీ చేసిన మార్కెటింగ్‌శాఖ ఏడీ

రాజమహేంద్రవరం అర్బన్: నగరంలోని రైతుబజార్లను మార్కెటింగ్‌శాఖ ఏడీ కేవీఆర్ఎన్ కిషోర్ బుధవారం తనిఖీచేశారు. రైతుబజార్ల జిల్లా ప్రత్యేకాధికారి బి.రామచంద్రరావుతో కలసి రైతుబజార్లను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను గమనించారు. కూరగాయల ధరల పట్టికలను పరిశీలించారు. బహిరంగమార్కెట్లో కూరగాయల ధరలు ఎలాఉన్నాయి. ఇక్కడ ఎంత పెట్టారు వంటి వివరాలపై ఆరా తీశారు. క్వారీమార్కెట్ రైతుబజార్‌లో చిన్నసైజు, పెద్దసైజు టమోటా ధరలు రెండూ కిలో రూ.38కు విక్రయించడాన్ని ఆయన తప్పుపట్టారు. చిన్నవి కిలో రూ.30కు విక్రయించాల్సి ఉంది. ఈ రేటు వెంటనే సరిచేయాల్సిందిగా అక్కడి ఎస్టేట్ అధికారిని ఆదేశించారు. మిగిలిన రైతుబజార్లను కూడా తనిఖీచేసిన ఆయన పారిశుద్ధ్యం, ఆర్‌ఓ ప్లాంట్ల పనితీరు, ఇతర సమస్యలపైనా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రైతు బజార్ల నిర్వహణపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించేలా చర్యలు తీసుకుంటామని, టమోటా ధరల నియంత్రణపైనా దృష్టిసారిస్తామని చెప్పారు. వారం, పదిరోజుల్లో అన్ని రైతుబజార్లలోనూ ఎల్ఈడీ డిస్‌ప్లే బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై దాడులు

రాజమహేంద్రవరం సిటీ: వాణిజ్య, వ్యాపార సంస్థల్లో ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను విక్రయిస్తే అటువంటి సంస్థలపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ విజయరామరాజు వెల్లడించారు. నగరంలో ప్లాస్టిక్ వస్తువులను వ్యాపార సంస్థలు అమ్మడం పూర్తిగా నిషేధించామని కమిషనర్ విజయరామరాజు పేర్కొంటూ ప్లాస్టిక్ వస్తువుల నిరోధక చట్టం(2013) 46 ప్రకారం శిక్షార్హులన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై మొదటిగా అపరాధ రుసుమును వసూలు చేస్తామన్నారు. అపరాధ రుసుమును చెల్లించిన తర్వాత కూడా విక్రయాలు జరిపితే అటువంటి వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్‌ను రద్దుపరుస్తామన్నారు. నగరంలో ఈ మేరకు ప్రత్యేక బృందాలు వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహిస్తున్నారని కమిషనర్ తెలిపారు. కాలుష్య రహితనగరంగా తీర్చిదిద్దడంలో అందరూ సహకారం అందించాలన్నారు. కాగితం, గుడ్డతోను చేసిన వస్తువులను వాడకంపై శ్రద్ధ కనబరచాలన్నారు.

● సినిమా గైడ్

అశోక	నేనే రాజు నేనే మంత్రి
స్వామి	జయజానకి నాయక
గీతా అప్సర	జయజానకి నాయక
కుమారి	ఫిదా
నాగదేవి	ప్రతిక్షణం
శ్రీ శివజ్యోతి	జయజానకి నాయక..
రంభ	ఆనందోబ్రహ్మ
ఊర్వశి	ఆనబెల్ క్రియేషన్
మేనక	నిన్ను కోరి
అనూశ్రీ(సాయికృష్ణ)	లై
సూర్యప్యాలెస్	నేనే రాజు నేనే మంత్రి
సూర్యమినీ	ఆనబెల్ క్రియేషన్
శ్యామల	నేనే రాజు నేనే మంత్రి
రాజా	ఆనందోబ్రహ్మ


జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

'అండమాన్‌లో అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయాలి'

దేవిచౌక్(రాజమహేంద్రవరం): కేంద్రపాలిత ప్రాంతం అండమాన్ రాజధాని పోర్టు బ్లేయర్‌లో విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేయాలని అండమాన్‌లోని ఆంధ్ర అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వి.హేమసుందరరావు, రాష్ట్ర అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు నిర్ణయించారు. బుధవారం రాజమహేంద్రవరం వచ్చిన అండమాన్ ఆంధ్ర అసోసియేషన్ బృందం పడాలను కలిసింది. స్థానిక గోరక్షణపేటలోని పడాల రామారావు స్మారక గ్రంథాలయ కార్యాలయంలో సమావేశమై అండమాన్‌లో అల్లూరి విగ్రహ ఏర్పాటుపై చర్చించారు. అండమాన్ రావాలని ఆయనకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పడాల మాట్లాడుతూ అల్లూరి చరిత్రతో అండమాన్ జైలు ముడిపడి ఉందని, తప్పనిసరిగా అండమాన్ వచ్చి అక్కడ ఆ విప్లవవీరుడి విగ్రహన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గోదావరి గట్టున ఏర్పాటు చేస్తున్న 9అడుగుల అల్లూరి విగ్రహాన్ని ఆంధ్ర అసోసియేషన్ బృందం చూశారు. అనంతరం హేమసుందరరావుకు జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో వి.సుబహ్మణ్యం, యిళ్ల శ్రీకాంత్, మాదేటి రవిప్రకాష్, బళ్లా శ్రీనివాస్, వి.నాగార్జున దీపక్ పాల్గొన్నారు.

త్రిబుల్ తలాక్ తీర్పుపై ఎమ్మెల్యే ఆకుల హర్షం

రాజమహేంద్రవరం సిటీ: త్రిబుల్ తలాక్ పై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్యే డాక్టరు ఆకుల సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. దానవాయిపేటలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తలాక్ విషయంలో కోర్టు తీర్పును అందరూ గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రాజమహేంద్రవరం సిటీ: నేతాజినగర్‌కు చెందిన నాగలక్ష్మి అనే మహిళ కడుపు నొప్పి తాళలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించిందని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. కొంతకాలంగా కడుపు, నడుమ నొప్పులతో బాధపడుతున్నా ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగడంతో బంధువులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.

హైటక్ వ్యభిచార ముఠాపై అర్బన్ పోలీసుల దాడి

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'మళ్లీ మొదలయ్యింది' కథనానికి రాజమహేంద్రవరం అర్బన్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు ఎస్పీ రాజకుమారి వేగంగా చర్యలు చేపట్టారు. ఆమె ఆదేశాల మేరకు స్పెషల్ డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో యాంటి గూండా స్క్వాడ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్ఐ రాంబాబు తన సిబ్బందితో కలసి రాజవోలు గాయిత్రినగర్‌లో ఒక ఇంట్లో హైటెక్ వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు యువతులను, మరో ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు యువతులు, విటులు ఉభయగోదావరి జిల్లాలకు చెందినవారే. విటులు బయ్యన్నగూడేనికి చెందిన తోట బసవరాజు, కొయ్యలగూడేనికి చెందిన బత్తుల నాగప్రసాద్ సహా యువతులిద్దరినీ అరెస్టు చేసి వారి నుంచి రూ.20వేలు స్వాధీనం చేసుకుని వారిని ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్బన్ పరిధిలో పలు ప్రాంతాల్లో హైటక్ వ్యభిచారంపై నిఘాపెట్టారు. ఈ మేరకు తనిఖీలు ముమ్మరం చేశారు.


పట్టుబడిన హైటక్ వ్యభిచార ముఠా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

23-8-2017 రేట్లు రూ.(కిలో)

ఉల్లిపాయలు	20-00
టమాట	38-00
వంకాయలు (నలుపు, గులాబి)	20-00
తెల్ల వంకాయలు	26-00
దొమ్మేరు వంకాయలు	28-00
పచ్చిమిర్చి	20-00
బెండకాయలు	20-00
కాకరకాయలు	22-00
బీరకాయలు	14-00
క్యాబేజీ	20-00
క్యారెట్	28-00
దొండకాయలు	22-00
బంగాళాదుంపలు	11-00
గోరుచిక్కుడు	24-00
దోసకాయలు	12-00
ఆనబకాయ	12-00
పొట్లకాయి	12-00
అరటికాయలు	6-00
చిక్కుళ్లు	68-00
చేమదుంపలు	28-00
చిలకడదుంపలు	32-00
పెండలం	22 --00
కంద	18-00
ములక్కాడ	5-00
బీట్‌రూట్	24-00
కీర దోస	24-00
బీన్స్ కాయలు	52-00
బీన్స్ గింజలు	38-00
బొబ్బర్లు	24-00
అల్లం	50-00
మామిడికాయ	6-00
క్యాప్సికమ్	44-00
కొత్తిమీర కట్ట (హైబ్రిడ్)	12-00
ఆకుకూరలు (3 కట్టలు)	10-00

-రాజమహేంద్రవరం అర్బన్

స్వాతంత్ర్య సమరయోధులను మర్చిపోకూడదు: ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ విజయరామరాజు

రాజమహేంద్రవరం అర్బన్: స్వాతంత్ర్య సమర యోధులను మర్చిపోకూడదని, వారి స్ఫూర్తితో ముందుకుసాగాలని ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పంతులుగారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ, ఆంధ్రరాష్ట్రం కోసం ఆయన ఎంతగానో పోరాడారని అన్నారు. ఇలాంటి మహానుభావుల అడుగుజాడలో నడుస్తూ మంచి సేవలు ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో డీఎస్‌శర్మ, జి.వెంకటలక్ష్మి, శేఖర్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

టంగుటూరి పోరాట స్ఫూర్తిని గుర్తుంచుకోవాలి

ప్రకాశం పంతులు జయంతిలో మేయర్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రాత్మక రాజమహేంద్రవరం మునిసిపాలిటీ తొలి చైర్మన్‌గా సేవలందించి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి, దేశభక్తిని, పోరాటపటిమను, రగిల్చిన టంగుటూరి ప్రకాశం పంతులును స్ఫూర్తిని అందరూ గుర్తుంచుకోవాలని నగర మేయర్ పంతం రజనీ శేషసాయి అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో మేయర్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, డాక్టర్ ఆకుల సత్యనారాయణ, కమిషనర్ విజయరామరాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుతగా కార్పొరేషన్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారుచౌదరి, డాక్టర్ ఆకుల సత్యనారాయణ, కమిషనర్ విజయరామరాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలుతగా కార్పొరేషన్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించార్బన్ ఎమ్మెల్యే డాక్టర్ ఆకుల మాట్లాడుతూ న్యాయవాద వృత్తిని తృణప్రాయంగా వదిలి ప్రజాసేవకే అంకితమైన గొప్ప దేశభక్తుడు ప్రకాశం పంతులు అని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు, అల్లూరి సీతారామరాజు శాశ్వత చిహ్నాలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వంతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మహనీయుల పోరాట స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం అధికారికంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహిస్తున్నందున విద్యార్థులకు పోటీలు నిర్వహించి తదుపరి కార్యక్రమాలను చేపడతామని కమిషనర్ విజయరామరాజు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ దిలీ్ ఎకుమార్, స్కూల్స్ సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్, మేనేజర్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రామ్‌కుమార్, ఎస్ఈ ఓంప్రకాష్, పాండురంగారావు పాల్గొన్నారు.

● లోక్‌సత్తా ఆధ్వర్యంలో...

ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కులో ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. లోక్‌సత్తా నగర కన్వీనర్ రాజగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సర్ ఆర్థర్ కాటన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాదినేని బుచ్చయ్య చౌదరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రకాశం పంతు లు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాల్యంలో కటిక పేదరికాన్ని అనుభవించి, స్వశక్తితో కృషి, పట్టుదలతో అత్యున్నతమైన స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులని కొనియాడారు. పసల భీమన్న, కె.ద్వారకా సింగ్, దాడి గంగాధర్, సిఎస్ నాగేశ్వరరావు, శంకర్ యాదవ్, మెండి శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్ట్సు కళాశాలలో ఘనంగా టంగుటూరి జయంతి

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్సుకళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణ ఆర్ట్సు బ్లాకులోని ప్రకాశం విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.డేవిడ్‌కుమార్, అధ్యాపక సి బ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి ప్రథమ ముఖ్యమంత్రిగా పనిచేసిన పంతులుగారు ఆర్ట్సు కళాశాల పూర్వ విద్యార్థి కావడం మనకు గర్వకారణమన్నారు. ప్రధాన వక్త ఎస్‌కేవీటీ కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ పీఏ రాజబాబు మాట్లాడుతూ టంగుటూరి జీవిత చరిత్రను వివరించారు. ఆర్ట్సు కళాశాల చరిత్ర విభాగాధిపతి ఎం.పుష్పాంజలి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరిశ్చంద్రప్రసాద్, డాక్టర్ ఆర్‌వీకే శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రత్నమాణిక్యం, డాక్టర్ బి.గీతాదేవి, శ్రీవల్లి, జె.యాకూబ్, ఆర్.రమేష్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, రుద్ర, గౌతమ్, డాక్టర్ జె.సునీత, కృష్ణ, ఏవో పద్మిని, డాక్టర్ షణ్ముఖరావు, సౌజన్య తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రధాన వక్త రాజబాబును చరిత్ర విభాగం తరపున జ్ఞాపిక, దుశ్శాలువాతో సత్కరించారు.



రౌండ్‌పార్కులో టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎస్‌పీ గంగిరెడ్డి, విద్యార్థులు



జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్



ఆర్ట్సు కళాశాలలో టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



వీటీ కళాశాలలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సీతంపేట గ్రంథాలయంలో టంగుటూరి జయంతి

దేవీచౌక్(రాజమహేంద్రవరం): సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీ ఎదురుగా గుండె చూపించి ఆంధ్రకేసరిగా టంగుటూరి ప్రకాశం పంతులు పేరుపొందారని సీనియర్ పాఠకులు శ్రీఘాకోళ్లపు వెంకటేశ్వరరావు అన్నారు. సీతంపేటశాఖ గ్రంథాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ టంగుటూరి పేద కుటుంబంలో పుట్టినప్పటికీ వారాలబ్బాయిగా జీవిస్తూ న్యాయశాస్త్రంలో బారిస్టరు పట్టా తీసుకుని తెలుగుజాతి ఖ్యాతిని ఇనుమడింపచేశారన్నారు. సామాజిక కార్యకర్త పెద్దాడ ప్రసాద్, కృతి శృతి నిర్వాహకులు కృష్ణశర్మ, సీతంపేట ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు, ఎస్.శ్రీదేవి నిర్మల, పి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆదిత్య' విద్యార్థుల ఆధ్వర్యంలో..

దేవీచౌక్(రాజమహేంద్రవరం): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆదిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రకాశ్‌నగర్ రౌండ్‌పార్కులో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌పి.గంగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రకాశం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతు లు నిస్వార్థ ప్రజా సేవకుడని, నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చి వ్యవసాయాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఆయన అడుగుజాడల్లో యువత నడిచి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆదిత్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

వీటీ జూనియర్ కాలేజీలో టంగుటూరి జయంతి

దేవీచౌక్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతిని వీటీ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులనుద్దేశించి ప్రిన్సిపాల్ కె.రాజా మాట్లాడుతూ త్యాగం, నిర్భీతి, పట్టుదల, దేశభక్తి ప్రకాశం పంతులుకు చరిత్రలో శాశ్వత స్థానాన్ని కల్పించాయన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు పయనించాల్సిన అవసరం ఉందన్నారు. లైబ్రేరియన్ జమ్మి రామారావు మాట్లాడుతూ విద్యనభ్యసించడానికి టంగుటూరికి పేదరికం అడ్డు రాలేదని, పట్టుదలతో ఎన్నో విజయాలు సాధించి త్యాగ నిరతితో, ప్రజల హృదయాల్లో స్థానం పొందారన్నారు. ప్రకాశం పంతులు జీవితంలో ప్రధాన ఘట్టాలను సోదాహరణంగా వివరించారు. తొలుతగా ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ లెక్చరర్ యార్లగడ్డ ప్రభాకరరావు, ఫిజికల్ డైరెక్టర్ డి.రత్నకుమార్, సివిక్స్ లెక్చరర్ ఓజీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



సీతంపేట గ్రంథాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం

'భవిష్యత్‌లో యువజన కాంగ్రెస్‌దే కీలకపాత్ర'

గోదావరి సిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ కార్యాచరణలో పార్టీలో పూర్వవైభవం తీసుకురావడంతో యువజన కాంగ్రెస్ కీలకం కావాలని అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శి అబ్రహం మణిరాయ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోడా వెంకట్ అధ్యక్షతన బుధవారం రాజీవ్ యువజన సమీకరణాల పేరుతో నిర్వహించిన సభలో అబ్రహం మణిరాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన పార్టీ అని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ జెండా రెపరెపలాడుతుందన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాసమస్యలపై పనిచేయాలన్నారు. చంద్రబాబు, కేసీఆర్‌లు ఒక్కప్పుడు కాంగ్రెస్‌లో పనిచేసిన వారేనని, అప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నవారు ఇప్పుడు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగారని, యువజన కాంగ్రెేకులు, కార్యకర్తలు ప్రజాసమస్యలపై పనిచేయాలన్నారు. చంద్రబాబు, కేసీఆర్‌లు ఒక్కప్పుడు కాంగ్రెస్‌లో పనిచేసిన వారేనని, అప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నవారు ఇప్పుడు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగారని, యువజన కాంగ్రెేకులు, కార్యకర్తలు ప్రజాసమస్యలపై పనిచేయాచేసిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్‌వి.శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి బెజవాడరంగా, కార్పొరేటర్ రాయుడు సతీష్, మాజీ అధ్యక్షుడు, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ ముళ్ల మాధవ్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు చాపలరాజు, లీగల్ సెల్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేయడానికి యువజన కాంగ్రెస్ అభివృద్ధికి బోడా కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడిగా అనుదీప్‌ను నియమిస్తూ అబ్రహం మణిరాయ్, వరప్రసాద్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ సభ్యులు అబ్రహం మణిరాయ్, వరప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజానగరం కాంగ్రెస్ ఇన్‌చార్జి అంకం గోపి, నగర మహిళా కాంగ్రెస్ అద్యక్షురాలు నరాల పార్వతి పాల్గొన్నారు.



కార్యక్రమంలో అబ్రహంమణిరాయ్ మాట్లాడుతున్న దృశ్యం

స్వచ్ఛందంగా బంద్ పాటించాలి: రుక్సా

దేవీచౌక్(రాజమహేంద్రవరం): కర్నూలులో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై దాడిని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చిన సందర్భంలో నగరంలోని అన్ని ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు, డిగ్రీ, పిజి కళాశాలలు గురువారం స్వచ్ఛందంగా బంద్ పాటించాలని రాజమహేంద్రి అన్ ఎయిడెడ్ కాలేజెస్ అండ్ స్కూల్స్ అసోషియేషన్ (ఆర్‌యుసీఎస్‌ఏ) తీర్మానించారని అసోసియేషన్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు మూసి వేసి బంద్ పాటించాలని కోరారు.

31న అల్లూరి కాంస్య విగ్రహానికి భూమిపూజ

దేవిచౌక్(రాజమహేంద్రవరం): రాష్ట్ర అల్లూరి సీతారామరాజు యువజనసంఘం ఆధ్వర్యంలో రూపొందుతున్న అల్లూరి కాంస్య విగ్రహానికి ఈనెల 31న గోదావరి గట్టున పి.వి.నరసింహారావు పార్కువద్ద విగ్రహ కమిటీ అధ్యక్షుడు పంతం కొండలరావు ఆధ్వర్యంలో ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు భూమిపూజ చేస్తారని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ మురళీమోహన్, సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, సోము వీర్రాజు, మేయర్ రజనీశేషసాయి పాల్గొంటారన్నారు. జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బొమ్మన రాజ్‌కుమార్ అల్లూరి కాంస్య విగ్రహానికి రూ.10,116 విరాళం అందజేసినట్లు సంస్థ కోశాధికారి బళ్లా శ్రీనివాస్ తెలిపారు.

సుబాబుల్ కొనుగోలు ధర పెంచాలి

ఇంటర్నేషనల్ పేపర్‌మిల్లు యాజమాన్యంతో మార్కెటింగ్‌శాఖ అధికారుల చర్చలు

రాజమహేంద్రవరం అర్బన్: కృష్ణా, గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాలనుంచి రైతులు తీసుకొచ్చే సుబాబుల్ కలప కొనుగోలు ధర పెంచాలని గుంటూరుకు చెందిన మార్కెటింగ్‌శాఖ అధికారులు, ఆ ప్రాంత వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు రాజమహేంద్రవరంలోని ఇంటర్నేషనల్ పేపర్‌మిల్లు అధికారులను కోరారు. మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ ఇస్రార్ అహ్మద్ ఆధ్వర్యంలో జాయింట్ డైరెక్టర్లు రాజశేఖర్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్లు దాస్, సుభాకర్, జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏడీ కిషోర్, రాజమహేంద్రవరం వ్యవసాయమార్కెట్ కమిటీ సెక్రటరీ ఎన్ఆర్‌జీ చౌదరి, నందిగామ, కంచికచర్ల, మద్దిపాడు ప్రాంతాలకు చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇక్కడి పేపర్‌మిల్లు అధికారులను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఇస్రార్ అహ్మద్ మాట్లాడుతూ సుబాబుల్‌కు మరింత గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం టన్నుకు రూ.4,400 నుంచి రూ.4,600 వరకూ చెల్లిస్తున్నారని, దీనికి అదనంగా మరో రూ.500 పెంచాలని కోరినట్టు సమాచారం. తమప్రాంత రైతులంతా రోజుకు 2వేల టన్నుల వరకూ పేపర్‌మిల్లుకే సుబాబుల్ సరఫరా చేస్తున్నందున, వీరికి గిట్టుబాటు ధర పెంచాలని సూచించారని తెలిసింది. దీనిపై పేపర్‌మిల్లు జీఎం శ్యామ్ శ్రీవాత్సవ ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే సుబాబుల్‌కు ఎక్కువ ధర చెల్లిస్తున్నామని, ధర పెంచితే తమపై అదనపుభారం పడుతున్నందున ధర పెంచలేమని అధికారుల బృందానికి చెప్పినట్టు తెలిసింది.

టంగుటూరికి నివాళి..

ముందుగా కోరుకొండ రోడ్డులోని వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చిన మార్కెటింగ్‌శాఖ అధికారులు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఇస్రార్ అహ్మద్, సెక్రటరీ ఎన్ఆర్‌జీ చౌదరి, రైతుబజార్ల జిల్లా ప్రత్యేకాధికారి బి.రామచంద్రరావు, జేడీలు, డీడీలు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



క్వారీ మార్కెట్ రైతుబజార్‌ను తనిఖీ చేస్తున్న మార్కెటింగ్‌శాఖ ఏడీ కిషోర్

వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు

రైతుబజార్లను తనిఖీ చేసిన మార్కెటింగ్‌శాఖ ఏడీ

రాజమహేంద్రవరం అర్బన్: నగరంలోని రైతుబజార్లను మార్కెటింగ్‌శాఖ ఏడీ కేవీఆర్ఎన్ కిషోర్ బుధవారం తనిఖీచేశారు. రైతుబజార్ల జిల్లా ప్రత్యేకాధికారి బి.రామచంద్రరావుతో కలసి రైతుబజార్లను సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను గమనించారు. కూరగాయల ధరల పట్టికలను పరిశీలించారు. బహిరంగమార్కెట్లో కూరగాయల ధరలు ఎలాఉన్నాయి. ఇక్కడ ఎంత పెట్టారు వంటి వివరాలపై ఆరా తీశారు. క్వారీమార్కెట్ రైతుబజార్‌లో చిన్నసైజు, పెద్దసైజు టమోటా ధరలు రెండూ కిలో రూ.38కు విక్రయించడాన్ని ఆయన తప్పుపట్టారు. చిన్నవి కిలో రూ.30కు విక్రయించాల్సి ఉంది. ఈ రేటు వెంటనే సరిచేయాల్సిందిగా అక్కడి ఎస్టేట్ అధికారిని ఆదేశించారు. మిగిలిన రైతుబజార్లను కూడా తనిఖీచేసిన ఆయన పారిశుధ్యం, ఆర్ఓ ప్లాంట్ల పనితీరు, ఇతర సమస్యలపైనా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రైతు బజార్ల నిర్వహణపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించేలా చర్యలు తీసుకుంటామని, టమోటా ధరల నియంత్రణపైనా దృష్టిసారిస్తామని చెప్పారు. వారం, పదిరోజుల్లో అన్ని రైతుబజార్లలోనూ ఎల్ఈడీ డిస్‌ప్లే బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై దాడులు

రాజమహేంద్రవరం సిటీ: వాణిజ్య, వ్యాపార సంస్థల్లో ప్లాస్టిక్‌తో తయారుచేసిన వస్తువులను విక్రయిస్తే అటువంటి సంస్థలపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ విజయరామరాజు వెల్లడించారు. నగరంలో ప్లాస్టిక్ వస్తువులను వ్యాపార సంస్థలు అమ్మడం పూర్తిగా నిషేధించామని కమిషనర్ విజయరామరాజు పేర్కొంటూ ప్లాస్టిక్ వస్తువుల నిరోధక చట్టం(2013) 46 ప్రకారం శిక్షార్హులన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై మొదటిగా అపరాధ రుసుమును వసూలు చేస్తామన్నారు. అపరాధ రుసుమును చెల్లించిన తర్వాత కూడా విక్రయాలు జరిపితే అటువంటి వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్‌ను రద్దుపరుస్తామన్నారు. నగరంలో ఈ మేరకు ప్రత్యేక బృందాలు వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహిస్తున్నారని కమిషనర్ తెలిపారు. కాలుష్య రహితనగరంగా తీర్చిదిద్దడంలో అందరూ సహకారం అందించాలన్నారు. కాగితం, గుడ్డతోను చేసిన వస్తువులను వాడకంపై శ్రద్ధ కనబరచాలన్నారు.

● సినిమా గైడ్

అశోక	నేనే రాజు నేనే మంత్రి
స్వామి	జయజానకి నాయక
గీతా అప్సర	జయజానకి నాయక
కుమారి	ఫిదా
నాగదేవి	ప్రతిక్షణం
శ్రీ శివజ్యోతి	జయజానకి నాయక..
రంభ	ఆనందోబ్రహ్మ
ఊర్వశి	ఆనబెల్ క్రియేషన్
మేనక	నిన్ను కోరి
అనూశ్రీ(సాయికృష్ణ)	లై
సూర్యప్యాలెస్	నేనే రాజు నేనే మంత్రి
సూర్యమినీ	ఆనబెల్ క్రియేషన్
శ్యామల	నేనే రాజు నేనే మంత్రి
రాజా	ఆనందోబ్రహ్మ



జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

'అండమాన్‌లో అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయాలి'

దేవిచౌక్(రాజమహేంద్రవరం): కేంద్రపాలిత ప్రాంతం అండమాన్ రాజధాని పోర్టు బ్లేయర్‌లో విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేయాలని అండమాన్‌లోని ఆంధ్ర అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వి.హేమసుందరరావు, రాష్ట్ర అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు నిర్ణయించారు. బుధవారం రాజమహేంద్రవరం వచ్చిన అండమాన్ ఆంధ్ర అసోసియేషన్ బృందం పడాలను కలిసింది. స్థానిక గోరక్షణపేటలోని పడాల రామారావు స్మారక గ్రంథాలయ కార్యాలయంలో సమావేశమై అండమాన్‌లో అల్లూరి విగ్రహ ఏర్పాటుపై చర్చించారు. అండమాన్ రావాలని ఆయనకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పడాల మాట్లాడుతూ అల్లూరి చరిత్రతో అండమాన్ జైలు ముడిపడి ఉందని, తప్పనిసరిగా అండమాన్ వచ్చి అక్కడ ఆ విప్లవవీరుడి విగ్రహన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గోదావరి గట్టున ఏర్పాటు చేస్తున్న 9అడుగుల అల్లూరి విగ్రహాన్ని ఆంధ్ర అసోసియేషన్ బృందం చూశారు. అనంతరం హేమసుందరరావుకు జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో వి.సుబ్రహ్మణ్యం, యిళ్ల శ్రీకాంత్, మాదేటి రవిప్రకాష్, బళ్లా శ్రీనివాస్, వి.నాగార్జున దీపక్ పాల్గొన్నారు.

త్రిబుల్ తలాక్ తీర్పుపై ఎమ్మెల్యే ఆకుల హర్షం

రాజమహేంద్రవరం సిటీ: త్రిబుల్ తలాక్ పై ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్యే డాక్టరు ఆకుల సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. దానవాయిపేటలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ తలాక్ విషయంలో కోర్టు తీర్పును అందరూ గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రాజమహేంద్రవరం సిటీ: నేతాజినగర్‌కు చెందిన నాగలక్ష్మి అనే మహిళ కడుపు నొప్పి తాళలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించిందని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. కొంతకాలంగా కడుపు, నడుమ నొప్పులతో బాధపడుతున్నా ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగడంతో బంధువులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.

హైటక్ వ్యభిచార ముఠాపై

అర్బన్ పోలీసుల దాడి

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'మళ్లీ మొదలయ్యింది' కథనానికి రాజమహేంద్రవరం అర్బన్ పోలీసులు స్పందించారు. ఈ మేరకు ఎస్పీ రాజకుమారి వేగంగా చర్యలు చేపట్టారు. ఆమె ఆదేశాల మేరకు స్పెషల్ డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో యాంటి గూండా స్క్వాడ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్ఐ రాంబాబు తన సిబ్బందితో కలసి రాజవోలు గాయిత్రినగర్‌లో ఒక ఇంట్లో హైటెక్ వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు యువతులను, మరో ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు యువతులు, విటులు ఉభయగోదావరి జిల్లాలకు చెందినవారే. విటులు బయ్యన్నగూడేనికి చెందిన తోట బసవరాజు, కొయ్యలగూడేనికి చెందిన బత్తుల నాగప్రసాద్ సహా యువతులిద్దరినీ అరెస్టు చేసి వారి నుంచి రూ.20వేలు స్వాధీనం చేసుకుని వారిని ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అర్బన్ పరిధిలో పలు ప్రాంతాల్లో హైటక్ వ్యభిచారంపై నిఘాపెట్టారు. ఈ మేరకు తనిఖీలు ముమ్మరం చేశారు.



పట్టుబడిన హైటక్ వ్యభిచార ముఠా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

23-8-2017 రేట్లు రూ.(కిలో)

ఉల్లిపాయలు	20-00
టమాట	38-00
వంకాయలు (నలుపు, గులాబి)	20-00
తెల్ల వంకాయలు	26-00
దొమ్మేరు వంకాయలు	28-00
పచ్చిమిర్చి	20-00
బెండకాయలు	20-00
కాకరకాయలు	22-00
బీరకాయలు	14-00
క్యాబేజీ	20-00
క్యారెట్	28-00
దొండకాయలు	22-00
బంగాళాదుంపలు	11-00
గోరుచిక్కుడు	24-00
దోసకాయలు	12-00
ఆనబకాయ	12-00
పొట్లకాయి	12-00
అరటికాయలు	6-00
చిక్కుళ్లు	68-00
చేమదుంపలు	28-00
చిలకడదుంపలు	32-00
పెండలం	22 --00
కంద	18-00
ములక్కాడ	5-00
బీట్‌రూట్	24-00
కీర దోస	24-00
బీన్స్ కాయలు	52-00
బీన్స్ గింజలు	38-00
బొబ్బర్లు	24-00
అల్లం	50-00
మామిడికాయ	6-00
క్యాప్సికమ్	44-00
కొత్తిమీర కట్ట (హైబ్రిడ్)	12-00
ఆకుకూరలు (3 కట్టలు)	10-00

-రాజమహేంద్రవరం అర్బన్

వేధింపులపై కేసు నమోదు

ముమ్మిడివరం: పుట్టింటి దగ్గర నుంచి అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, అత్త మామలు తనను మానసికంగా, శారీరకంగా వేధింపులకుగురిచేస్తున్నారని మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ బి.ప్రభాకరరావు తెలిపారు. మహిపాలచెరువుకు చెందిన సునీతకు మల్లయ్యపాలెంకు చెందిన రమనాతి రమాకాంత్‌తో 2006లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కూడా ఉన్నారు. అయితే భర్త రమాకాంత్, అత్త అనంతలక్ష్మి, మామ కేశవలు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని సునీత పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



మలికిపురం డిగ్రీ కళాశాలలో టంగుటూరి జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



అంతర్వేది పల్లిపాలెం బీసీ సంక్షేమ హాస్టల్‌లో టంగుటూరి జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

మలికిపురం: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని మలికిపురం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. యువత ప్రకాశం పంతులు ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మలికిపురం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా జరిపారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాభవానీ, ఎంపీడీవో ప్రసాద్, బాబ్జీరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం బీసీ సంక్షేమ హాస్టల్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సర్పంచ్ చొప్పల చిట్టిబాబు, వార్డెన్ వెంకటరమణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు టంగుటూరి ప్రకాశంపంతులు దేశానికి చేసిన సేవలు, ఆయన ఆశయాలను వివరించారు. విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చొప్పల చిట్టిబాబు, హాస్టల్ వార్డెన్ వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజోలులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలి

రాజోలు: దళిత నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డిని తక్షణమే బర్తరఫ్ చేసి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని జిల్లా ఏఐఎస్ఎఫ్ సమైక్య ఇన్‌చార్జి దేవ రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రాజోలులో ప్రభు త్వ డిగ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు యాండ్ర నాగరాజు, దొమ్మేటి సాయిరాం, కె.భానుప్రకాష్, జేడీఎన్ శేఖర్, యన్నాబత్తుల నవీన్, ఏడీ ఎన్.ఫణికుమార్, వేణుప్రకాష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంక్ ఆఫ్ బరోడాలో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో దరఖాస్తు చేసుకున్న కార్పొరేషన్ రుణాల కొరకు బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆంధ్రా బ్యాంకులలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో గొల్లమందల వరప్రసాద్‌బాబు, మూర్తి, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కిషోర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అన్ని కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూలు సక్రమంగా జరుగుతున్నాయని, లబ్ధిదారుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వరప్రసాద్‌బాబు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఐ.పోలవరం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే కొమరగిరిలో ప్రారంభించారు. భూగర్భజలాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం నీరు-చెట్టు పథకంలో భాగంగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మాజీ సర్పంచ్ గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, పెన్మెత్స శరత్, కంకిపాటి దొరబాబు, ఏపీఎం కె.నరేష్, సఖిలే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కొమరగిరిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దాట్ల



సెమిస్టర్ విధానంపై మాట్లాడుతున్న ప్రభాకర్

విజ్ఞానంతో పాటు...

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

మలికిపురం: విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఉపయోగపడేలా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని అధ్యయనం కోఆర్డినేటర్ ఎస్.ప్రభాకర్ తెలిపారు. 2017-18 సంవత్సరాల్లో ఈ విధానం ద్వారా విద్యార్థులు కొత్త కోర్సుల్లో చేరవచ్చునన్నారు. యూజీసీ ఉత్తర్వుల మేరకు నూతన విధానం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆరునెలలకొకసారి పరీక్షలు రాయవచ్చునని, దీనివల్ల సిలబస్ భారం తగ్గుతుందన్నారు. విద్యార్థులు లోతుగా అధ్యయనం చేయడానికి, విద్యా నైపుణ్యాలు మెరుగుపరచడానికి ఈ విధానం తోడ్పడుతుందన్నారు.



మిలియన్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ

రాజోలు: సీపీఎస్ విధానం రద్దు సెప్టెంబరు 1న విజయవాడలో జరగబోయే మిలియన్‌మార్చ్ పోస్టర్‌ను రాజోలు తహసీల్దార్ జి.లక్ష్మీపతి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎస్ సంఘ నాయకులు కె.శ్రీనివాస్, రాఘవ, జి.శ్రీనివాస్, పండు, ఎన్.శ్రీవాస్, వీఆర్వో సంఘ నాయకులు వేణు, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

మలికిపురం:

వెంకటనారాయణ	ఆనందో బ్రహ్మ
శంకర్	నేనే రాజు నేనే మంత్రి
పద్మజ	జయ జానకి నాయక
సత్యజ్యోతి	ఫిదా ప్రేమ

లక్కవరం:

వేణుగోపాల	జయ జానకీ నాయక

రాయితీపై కంది విత్తనాలు

ముమ్మిడివరం: పొలాల్లోని వరి చేలగట్లపై కంది పైరును సాగు చేసుకునేందుకు రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా కంది విత్తనాలను నూరుశాతం రాయితీపై అందజేస్తున్నట్టు వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా ఎల్ఆర్‌జీ-41 రకం కంది విత్తనాలను హెక్టారుకు కిలో చొప్పున ఉచితంగా అందిస్తామన్నారు. ఈరకం ఖరీఫ్‌లో 180 రోజులకు, రబీలో 120-130 రోజులకు పంట చేతికొస్తుందన్నారు. ఒకేసారి పూతపూసి ఒకేసారి పంట కోతకొస్తుందన్నారు. ఎకరాకు 8నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఈరకం కందిపైరును శనగ పచ్చపురుగును తట్టుకుంటుందని, నల్లరేగడి భూములకు అనుకూలమన్నారు. కొద్దిపాటి నీటివసతి ఉన్నా సరిపోతుందన్నారు. చేలగట్లపై అయితే హెక్టారుకు కిలో, ప్రధానపంటగా అయితే ఎకరాకు 3 కిలోలు విత్తుకోవాలన్నారు. మొక్క రెండు మీటర్లు పెరిగి అధిగ దిగుబడి ఇస్తుందన్నారు. ముమ్మిడివరం మండలానికి 480 కిలోల విత్తనాలు వ్యవసాయశాఖకు సరఫరా అయ్యాయన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఇస్తామన్నారు. విత్తనశుద్ధి నిమిత్తం 50శాతం రాయితీపై ఇమిడిక్రోఫిడ్ మందును అందిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు వ్యవసాయ శాఖను సంప్రదించాలని ఆయన సూచించారు.



రైతులకు కంది విత్తనాలు అందిస్తున్న ఏవో మధుకుమార్

గోదాదేవికి ఘనంగా పాలాభిషేకం

తుని: స్థానిక శ్రీవేంకటేశ్వ రస్వామి దేవస్థానంలో శ్రీ గోదా దేవి అమ్మవారికి పాలాభిషేకం బుధవారం ఘనంగా నిర్వ హిం చారు. దేవస్థానం చైర్మన్ కుక్క డపు బాలాజీ నేతృత్వంలో 108 లీటర్లతో అమ్మవారికి పాలాభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శిం చుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో పులి నారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరి ప్రకాశం సేవలు చిరస్మరణీయం

● ఘనంగా ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి జయంతి వేడుకలు ● విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, అధికారులు



కోటనందూరులో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



తొండంగిలో టంగుటూరి జయంతిలో పాల్గొన్న అధికారులు



తునిలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తుని: టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం పలువురికి స్ఫూరిదాయకమని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన టంగుటూరి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన పోరాటయోధుడు టంగుటూరని ఆయన కొనియాడారు. నేటి విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన జన్మదినాన్ని రాష్ట్ర పండగగా జరపడం అభినందనీయమన్నారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూకరత్నం, ఆంజనేయ ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్ర పటానికి నివాళులర్పించారు. పూలమాలలు వేశారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు రాజేంద్రప్రసాద్, నాగభూషణం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పి.బాబ్జి, యర్ర శేఖర్, ఎం.వరహాల బాబు, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

తొండంగి అర్బన్: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో భమిడి శివమూర్తి, వ్యవసాయశాఖ ఏడీఏ మల్లికార్జునరావు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. బ్రిటిషువారి తూటాలకు ఎదురొడ్డి నిలిచిన ఉక్కు మనిషి టంగుటూరి అన్నారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో టంగుటూరి చేసిన సేవలు నిరపమానమన్నారు. తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి ప్రకాశం పంతులు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో బి.చిరంజీవిరావు యాదవ్, దూలం బుజ్జి, ఆదం బాబ్జి పాల్గొన్నారు.

తొండంగి రూరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకమని ఎంఈవో షేక్ బాబ్జి పేర్కొన్నారు. బుధవారం ఆయన బెండపూడి ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులని ఆయన కొనియాడారు. ప్రభుత్వం టంగుటూరి జయంతిని రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో ప్రతి పాఠశాలలో ఆయన జయంతిని నిర్వహించాలన్నారు. విద్యార్థులు త్యాగమూర్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను అధ్యాయనం చేయడం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరిసాగులో మెలకువలు పాటించాలి

ఏఈవో శివకుమారి



హంసవరంలో వరినాట్లు కత్తిరింపు పద్ధతిని వివరిస్తున్న ఏఈవో

తునిరూరల్: వరిసాగులో మెలకువలు పాటించాలని ఏఈవో శివకుమారి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా హంసవరం, దొండవాక గ్రామాల్లో వరి పంటలో అవలంభించాల్సిన నాట్లు పద్దతిని రైతులకు వివరించారు. గట్లపై చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పంట పోషకాలను వినియోగించుకోవాలన్నారు.

సూక్ష్మ పోషకాలతో అధిక దిగుబడులు



బొద్దవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జరుగుతున్న దృశ్యం

కోటనందూరు: భూసారాన్ని పెంపొందించేందుకు వ్యవసాయశాఖ అందిస్తున్న సూక్ష్మపోషకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎం.వాణి తెలిపారు. బుధవారం టీజే నగరం, బొద్దవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార లోపం ఉన్న భూముల రైతులకు ఉచితంగా పోషకాలు అందించామన్నారు. పొలంలో వరినాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఏవో అప్పారావు, సురేష్, కృష్ణ, రైతులు, ఎం.గోవిందు, బి.వరహాలబాబు రైతులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

మామిడికుదురు: ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఉచిత కంటివైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని యూనియన్ సభ్యులు చెప్పారు. ఉచిత కంటివైద్య శిబిరాన్ని ఈ నెల 27వ తేదీ ఉదయం 9గంటల నుంచి ఒంటిగంట వరకు మామిడికుదురు జడ్పీహైస్కూల్‌లో నిర్వహిస్తామని తెలిపారు.

● సినిమా గైడ్

తుని:	
వీర్రాజు	ఫిదా
శ్రీనివాస	నక్షత్రం
పాయకరావుపేట:	
గౌతమ్	దర్శకుడు
సాయిమహల్	గౌతమ్
సూర్యమహల్	నక్షత్రం
శ్రీ శ్రీలక్ష్మి	ఫిదా

'మధ్యాహ్న భోజనం' నాణ్యంగా ఉండాలి'



బొద్దవరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

కోటనందూరు: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను పెంచేందుకు నిర్వాహకులు కృషి చేయాలని ఎంఈవో ఏవీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం బొద్దవరంలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన రేట్లకు అనుగుణంగా వారానికి మూడు గుడ్లు అందజేయాలన్నారు. విద్యార్థులు నుంచి ఫిర్యాదులు వస్తే నిర్వాహకులు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మారుతున్న కాలానుగుణంగా ఉత్తమ బోధన అందించాలన్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు బాబ్జి, వరహాలబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపే వారెవరు లేరు

● ముద్రగడది బూటకపు దీక్ష ● తొండంగి కాపు జేఏసీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కాపు జేఏసీ నేతలు

తొండంగి అర్బన్: నీ వెనుక ప్రజాదరణ ఉన్న నాయకులు ఎవరున్నారో చెబితే తెలుసుకుంటామని తొండంగి కాపు జేఏసీ నాయకులు ముద్రగడ పద్మనాభాన్ని ప్రశ్నించారు. బుధవారం తొండంగిలో ఏర్పాటుచేసిన సమావేశంలో కాపు నేతలు మురాలశెట్టి సత్యనారాయణ, చీకట్ల చక్రరావు, కామిరెడ్డి సిం హాద్రి, కోట్ని నాగేశ్వరరావు, యన్నా మురళీకృష్ణ, నరహరిశెట్టి సూర్యప్రకాశరావు, పోసిన నందిబాబు మాట్లాడారు. దీక్ష వట్టి బూటకమన్నారు. ఎక్కడెక్కడ నుంచో ఎవరో వచ్చి మద్దతు తెలుపుతున్నారని ప్రకటనలు చేయడంలో నిజమెంతో అందరికీ తెలుసన్నారు. నిన్ను కలిసి సంఘీభావం తెలిపే వారెవరూ లేరని ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడు అబద్ధాలు ఆడుతున్నాడంటున్నావని ఎవరు అబద్ధాలు ఆడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నీ వెనుక ఏ పార్టీ కూడా లేకపోవడానికి కారణం నిన్ను ఎవరూ నమ్మకపోవడమేనన్నారు. నిన్నటి వరకూ మద్దతు తెలిపిన వైసీపీ దూరం జరగడానికి కారణం కూడా నీవైఖరేనన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

టీడీపీ మండల అధ్యక్షుడు బేతాళుడు



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు

తొండంగి అర్బన్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిపుచ్చుకునేందుకు అందరూ పార్టీలోకి రావాలని టీడీపీ మండలాధ్యక్షుడు యడ్ల బేతాళుడు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తొండంగి, శృంగవృక్షం గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అందరి ఉమ్మడి అవసరాలు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం మండలంలో ఉన్నత విద్యావకాశాల మెరుగుకు ప్రభుత్వం తరఫున డిగ్రీకళాశాలతోపాటు ట్రిపుల్ ఐటీ నిర్మాణాలపై దృష్టి సారించారన్నారు. మురాలశెట్టి సత్యనారాయణ, చీకట్ల చక్రరావు, కామిరెడ్డి సింహాద్రి, నరహరిశెట్టి సూర్యప్రకాశరావు తదితరులు మాట్లాడారు. బంటుపల్లి అన్వేష్, యన్నా మురళీకృష్ణ, మొయ్యేటి తారకేశ్వరరావు, నేమాల గోవిందు, ద్రాక్షారపు సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

తొండంగి అర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తహశీల్దారు టీవీ సూర్యనారాయణ ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య సముపార్జనలో ప్రకాశం పంతులు ఎనలేని సేవలందించాలన్నారు. ఆర్.ఐ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి'

తుని: 5ఏళ్ల లోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు. బుధవారం స్థానిక మార్కాండ్రాజుపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లను ప్రీస్కూల్‌గా మెర్జ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీస్కూల్ ఏర్పాటు ద్వారా చిన్నారులకు నర్సరీ విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి వేలాది రూపాయలు నష్టపోకూడదని, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో జె.అమ్మాజీ సూపర్‌వైజర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధతపై హర్షం

అన్నవరం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే బీఎంపీ, ఆర్‌ఎంపీలకు చట్టబద్దత కల్పిస్తూ ప్రభుత్వం 465 జీవో విడుదల చేయడంపై రాష్ట్ర ఉపాధ్యక్షుడు పదిలం బెనబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈజీవో ద్వారా 70వేల మందికి జీవనోపాధి కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, వైద్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటంలో అధ్యక్షుడు కరెళ్ళ గణపతి, ఉపాధ్యక్షుడు వీవీ కృష్ణారావు, వ్యవస్థాపకాధ్యక్షుడు లంక సత్యనారాయణ చేసిన కృషి ప్రశంసనీయమని బెనబాబు అన్నారు.

విద్యుత్‌ సరఫరా నిలిపివేతపై అసహనం

అన్నవరం: శంఖవరం మండలం మండపం గ్రామంలో తరచూ విద్యుత్‌ సరఫరా నిలిపివేతపై విద్యుత్‌ వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిరుగాలులు వీచినా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని రౌతులపూడి సబ్ స్టేషన్ అధికారులను, విద్యుత్‌ శాఖ సిబ్బందిని విషయం అడుగుతుంటే వీరి నుంచి నిర్లక్ష్య సమాధానం వినిపిస్తోందని పేర్కొంటున్నారు. విద్యుత్‌ లైన్ల సమస్య ఉంటే ఫలానా సమయానికి వస్తుందని చెప్పాలిగాని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడమేమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్‌ లైన్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు వినియోగదారులు ఫోన్ చేసిన సమయంలో సంతృప్తికరమైన సమాధానం తెలపాలని కోరుతున్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం పూజలు

అయినవిల్లి: బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ రామాంజనేయశర్మ బుధవారం అయినవిల్లి సిద్ధివినాయకుని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆయనకు స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.



వినాయక ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

● పందిళ్ల ఏర్పాట్లలో నిర్వాహకులు బిజీ ● నిఘా పెంచిన పోలీసులు ● విగ్రహాలను సిద్ధం చేసిన ఉత్సవ కమిటీలు



తునిలో కనువిందు చేస్తున్న గణనాథుని సుందర రూపాలు



విద్యార్థులకు మట్టి విగ్రహాలను అందిస్తున్న ఎంఈవో



తునిలో ఉత్సవాలకు స్టేజీలను వేస్తున్న యువకులు

తుని: వినాయక ఉత్సవాలకు పట్టణంతో పాటు మెట్టలో యువత భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 25న వినాయక చవితి నేపథ్యంలో పట్టణంలో పలు ప్రధాన కూడళ్లలో ఇప్పటికే పందిళ్ళు ఏర్పాటయ్యాయి. ఏటేటా ఉత్సవాల నిర్వహణ భారం అవుతున్నా దాతల సహకారంతో ఉత్సవాలు నిరాటంకంగా సాగుతున్నాయి. రెండు రోజులుగా మెట్టలో వర్షాలు కురుస్తున్నా నిర్వాహకులు ఏర్పాట్లలో వెనక్కి తగ్గడం లేదు. భారీ సెట్టింగులతో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు చోట్ల వినాయక ఉత్సవాలను 21 రోజులు జరిపే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తుని పట్టణంతో పాటు తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే పందిళ్లు వేశారు. తుని పట్టణంలో ఆంధ్రరత్న రోడ్డు, మార్కెట్‌యార్డు సెంటర్, జీఎన్టీ రోడ్డులోని అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఉన్న ఆలయంలో, లయోల విద్యాసంస్థల వీధి ఆలయాల్లో వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. కొన్ని ఆలయాల్లో వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

వినాయక ఉత్సవాల ఏర్పాట్లపై పోలీసులు నిఘా పెట్టారు. ఉత్సవాలు నిర్వహించే వారి సమాచారాన్ని స్వీకరించేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఉత్సవాలకు మైక్ పర్మిషన్ దగ్గర నుంచి అనుపోత్సవం వరకూ నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని పోలీసులు సేకరించనున్నారు. అల్లర్లు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు. ముఖ్యంగా ఉత్సవాలు నిర్వహణ సమయంలో అసభ్య నృత్యాలకు తావులేకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

మట్టి ప్రతిమల పంపిణీ

స్థానిక లయోల విద్యాసంస్థలో మట్టి వినాయక ప్రతిమలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పి.గీతాదేవి హాజరై మాట్లాడారు. మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. లయోల విద్యాసంస్థల యాజమాన్యం మట్టి విగ్రహాలను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు విగ్రహాలను అందించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ దండెం రామకృష్ణ, ప్రిన్సిపాల్ డి.కృష్ణ, ఏవో మధుసూదన్, హెచ్‌ఎం డి.కృష్ణ పాల్గొన్నారు. స్థానిక గొల్ల అప్పారావు సెంటర్‌లో విశ్వహిందూ పరిషత్‌ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను బుధవారం పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్‌ గౌరవాధ్యక్షుడు పంతంజలి శాస్త్రి, అధ్యక్షుడు డీఎస్ మూర్తి నేతృత్వంలో ఈ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి వినాయకుల వాడి, పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. అనంతరం స్థానికులకు వినాయకుడి మట్టి ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో కుందెం సత్యనారాయణ, చదరం నరసింహరావు, పుల్లంరాజు, కాశీ విశ్వనాథ్, కుక్కడపు రత్నాజీ, గేలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తునిరూరల్: వినాయక చవితి వచ్చిందంటే చాలు సందడంతా యువకులదీ చిన్నారులదే. వినాయక చవితి రేపే కావడంతో వారి హడావుడి అంతా ఇంతా కాదు. విగ్రహాల తయారీ ఆర్డర్లు, పందిర్ల ఏర్పాటు, విద్యుత్‌ అలంకరణలు, డీజే సౌండ్స్ ఏర్పాట్లు. మండలంలోని డి.పోలవరం, తేటగుంట, తిమ్మాపురం, వెంకటాపురం, హంసవరం, ఎస్.అన్నవరం గ్రామాల్లో ఇప్పటికే లంబోదరుడుకి లడ్డూ ప్రసాదం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నసమారాధనలకు సన్నాహాలు చేస్తున్నారు. శాంతి భద్రతలకు విగాతం కలిగించకుండా నిబంధనలకు అనుగుణంగా ఆధ్యాత్మిక, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలంటు పోలీసులు ఉత్సవ కమిటీలకు సూచనలిస్తున్నారు.

కోటనందూరు: వినాయక చవితి నవరాత్రులు శుక్రవారం నుంచి ప్రారంభం కానుండడంతో వినాయకుడి విగ్రహాలను మార్కెట్లో సిద్ధం చేశారు. అరడుడు నుంచి 15 అడుగులు వరకు విగ్రహాలను తయారుచేసి, అమ్మకాలకు సిద్ధం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో, వీధి వీధుల్లో నవరాత్రులు ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టారు. ఆలయాలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. నవరాత్రుల ఏర్పాట్లలో యువకుల మధ్య పోటీ నెలకొంది. దీంతో ఉత్సవాలు ఏర్పాటులో యువకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



పందిళ్ల ఏర్పాట్లును నిర్వహిస్తున్న ముత్తైదువులు



కోటనందూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

'ఈవ్‌టీజింగ్ నివారణకు చర్యలు'

తుని: ఈవ్‌టీజింగ్ నివారణకు చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ వి.శ్రీనివాస్ చెప్పారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో కొందరు ఈవ్‌టీచింగ్ చేస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేయడంపై పట్టణ సీఐ వి.శ్రీనివాస్ స్పందించారు. అనంతరం విద్యార్థులకు దాతలు అందించిన యూనిఫారాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి దాతలు సహాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.కామరాజు, గంట్ల సత్యనారాయణ, ఎం.శ్రీరాములు, వై.రాజు, ప్రిన్సిపాల్ నూకరాజు, సింహాద్రి పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులను అందిస్తున్న పట్టణ సీఐ శ్రీనివాస్

రోటరాక్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రోటరాక్ట్ కార్యవర్గం

తుని: స్థానిక వివేకా డిగ్రీ కళాశాలలో వనిత, యువత రోటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం బుధవారం ఎంపికైంది. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డీఏ నాయుడు పర్యవేక్షణలో ఈక్లబ్ ఎన్నిక జరిగింది. యువత అధ్యక్షుడిగా కేదారిశెట్టి కృష్ణ, సెక్రటరీ డి.సాయిగణేష్, ట్రెజరర్‌గా డి.రామగౌరీ ఎన్నికయ్యారు. వనిత అధ్యక్షురాలిగా వి.త్రివేణి, సెక్రటరీ వి.సఫల్య, ట్రెజరర్‌గా కె.అనుష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని రోటరీక్లబ్ అధ్యక్షుడు జి.బుచ్చిరాజు, సెక్రటరీ పెనుగొండ కామరాజు, వి.శ్రీనివాస్, వివేకా డిగ్రీ కళాశాల చైర్మన్ ఏ.రామారావు, డైరెక్టర్ సీహెచ్ రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడియపులంకలో 'వంటా వార్పు'

కడియం: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంకు మద్దతుగా బుధవారం కడియపులంకలో కాపు యువత వినూత్న ప్రదర్శన చేశారు. గ్రామంలో వంటావార్పు నిర్వహించారు. తమజాతికి ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాపు యువత పాల్గొన్నారు.


వంటావార్పు చేస్తున్న కాపు నాయకులు

● మినీ ఇంటర్వ్యూ



కార్పొరేషన్ రుణాలకు 3,125 మంది దరఖాస్తు

కె.సూర్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో, కడియం

● ఈ ఏడాది ఎంతమంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు?

బీసీ కార్పొరేషన్‌కు 695, కాపు కార్పొరేషన్ 1943, ఎస్సీ కార్పొరేషన్ 302లతోపాటు ఇతర కార్పొరేషన్లు, మైనార్టీ సంఘాలు కలిపి మొత్తం 3,125 దరఖాస్తులు వచ్చాయి.

● ఏఏ బ్యాంకులకు దరఖాస్తు చేసుకున్నారు?

కడియం ఎస్‌బీఐ బ్యాంక్, కడియపులంక, మురమండ ఆంధ్రాబ్యాంక్, కడియం కరూర్ వైశ్యాబ్యాంక్, కడియం, జేగురుపాడు కెనరా బ్యాంక్, దుళ్ళ, వేమగిరి కార్పొరేషన్ బ్యాంకు, వీరవరం చైతన్యగ్రామీణబ్యాంక్, కడియం డీసీసీబీ బ్యాంక్‌ల ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

● ఇంటర్వ్యూలు జరుగుతున్నాయా? ఎన్ని దఫాలుగా జరుగుతాయి?

ఈనెల 16నుంచి 24వరకు జరుగుతున్నాయి.

● వేటికోసం అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు?

టెంట్‌హౌస్, కిరాణా, పాన్‌షాపు, సెంట్రింగ్, ఆటోలతో పాటు పలు ఉపాధిపథకాల గురించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

● కడియం

మట్టి వినాయకుడినే పూజిద్దాం

కడియం: రంగులు పూసిన వినాయక విగ్రహాలను వాడకుండా ప్రతిఒక్కరూ మట్టి వినాయకుణ్నే పూజిద్దామంటూ చిన్నారులు తెలిపారు. బుధవారం షిర్డీసాయి విద్యానికేతన్ డేఫ్నీ ఏసియాటిక్ స్కూల్ విద్యార్థులు మట్టి వినాయకుని బొమ్మలను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆశక్తిగా పాల్గొని మట్టితో వినాయకుడి బొమ్మలను తయారు చేసి తమ ప్రతిభ కనబరిచారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రాజమహేంద్రవరంరూరల్: పర్యావరణపరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలతోనే పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని భాష్యం, లిటిల్‌చాంప్స్ ప్రిన్సిపాల్ షఫీ ఉన్నీసాబేగం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో వినాయక చవితి పూజలు నిర్వహించి విద్యార్థులకు చవితి విషేశాలను విద్యార్థులకు వివరించారు. దీనిని పురస్కరించుకుని గ్రామంలో పలు ప్రాంతాల్లో విద్యార్థులు ఇంటింటికీ వెళ్ళి వినాయక ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నంద కిషోర్, జోనల్ ఇన్‌చార్జి జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న విద్యార్థులు

మట్టి విగ్రహాలనే పూజించాలంటూ ర్యాలీ

ధవళేశ్వరం: వినాయక చవితి వేడుకల్లో మట్టి విగ్రహాలనే పూజించాలంటూ ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి 1000 మట్టి గణనాధులను పంపిణీ చేశారు. స్కూల్ ప్రాంగణంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలను ఏర్పాటు చేయకుండా చిన్న విగ్రహాలైన పర్యావరణ హిత మట్టిగణపతిని పూజించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. స్కూల్ ఆవరణలో మట్టి గణనాధుల కొలువుని ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాల్ పి.రిబ్కాదత్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


కడియంలో మట్టి వినాయక విగ్రహాలను తయారుచేస్తున్న షిర్డిసాయి విద్యార్థులు


ధవళేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డ్రీమ్స్ విద్యార్థులు

ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు


ఈ పాస్ యంత్రాలపై శిక్షణ ఇస్తున్న అధికారులు

రాజమహేంద్రవరంరూరల్: రైతులకు ఈ పాస్ యంత్రాల ద్వారా మాత్రమే ఎరువులను సరఫరా చేయాలని రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్‌వీవీ రామసాయి తెలిపారు. ఈ పాస్ యంత్రాలపై రాజమహేంద్రవరం, అనపర్తి, తుని, జగ్గంపేట వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఎరువుల డీలర్లకు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎరువులు, రసాయనాల రీసోర్స్ పర్సన్ కే.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ డీలర్లు విధిగా ఈపాస్ యంత్రాలను ఉపయోగించాలని వీటిపై జిల్లాలోని డీలర్లకు ఎటువంటి సందేశాలున్నా 8886613046లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా డీలర్లు అడిగిన ప్రశ్నలకు సంతోష్‌కుమార్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరంరూరల్, రాజానగరం, కడియం మండలాల వ్యవసాయాధికారులు కే శ్రీనివాస్, సూర్య రమేష్, కళ్యాణ్, సూర్యకుమార్, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పనుల పరిశీలన

కడియం: మురమండ గ్రామాన్ని బుధవారం రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.వరప్రసాదు సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడాలని అందుకోసం ఆయా గ్రామాల కార్యదర్శులకు ఆదేశాలు చేశామని డీఎల్‌పీవో వరప్రసాదు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈదర పాపారావు, పంచాయతీ కార్యదర్శి ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మురమండలో డ్రైన్లు పూడికతీత తీయిస్తున్న డీఎల్‌పీవో వరప్రసాద్

30న పెన్షనర్స్ ధర్నా

గోదావరి సిటీ: ఈనెల 30 పెన్షనర్స్ ధర్నాను విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోషియేషన్ పిలుపునిచ్చింది. బుధవారం కోరుకొండ రోడ్డులోని యుటీఎఫ్ కార్యాలయంలో రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. మోహన్‌రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్‌ఎస్‌ఎన్.రాజు పాల్గొని పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై దానవాయిపేటలోగల ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మినిమం పెన్షన్ రూ.6500 ఇవ్వాలని కరువు భత్యం ఆరునెలలకు ఒకసారి పెంచాలని, 1995 నాటి చట్టాన్ని రివైజ్‌చేయాని 2008లో ఉపసంహరించిన సౌకర్యాలను తిరిగి కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని పెన్షనర్స్‌పట్ల మోదీ, చంద్రబాబు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలు నశించాలని ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

టంగుటూరి సేవలు మరువలేనివి

● మార్గాని సత్యనారాయణ

కడియం: మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు మరువలేనివని మండల టీడీపీ అధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ అన్నారు. కడియంలో టంగుటూరి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ కడియంకు చెందిన స్వాతంత్ర్య సమర యోధురాలు దువ్వూరి సుబ్బమ్మను చూడటానికి టంగుటూరి ప్రకాశం పంతులు వచ్చిన సందర్భాన్ని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగుబంటి నాని, వరగోగుల వెంకటేశ్వరరావు, పాలపర్తి ప్రకాష్, రంపం గోపాలకృష్ణ, షేక్ సిద్ద య్య, నేలపూడి కింగ్‌మోజెస్, మర్రెడ్డి రమేష్, మందపల్లి రత్నరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.సూర్యనారాయణ మూర్తి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


టంగుటూరి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కరాటేలో కొంతమూరు విద్యార్థిని ప్రతిభ


యశ్వంతిని అభినందిస్తున్న మండల విద్యాశాఖాధికారి నరసింహారెడ్డి

రాజమహేంద్రవరంరూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని యశ్వంతి కరాటే పోటీల్లో రెండోస్థానం సాధించి ఆరెంజ్ బెల్ట్ సాధించింది. ఇటీవల గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటేపోటీల్లో ఈ విజయం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యురాలు లలితకుమారి తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ మండల విద్యాశాఖాధికారి నరసింహారెడ్డి పాఠశాలను సందర్శించి యశ్వంతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

1న మిలియన్ మార్చ్

కడియం: ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్ విధానం) రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో మిలియన్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. దీనికి సంబంధించిన కడియం మండల నాయకులు బుధవారం పోస్టర్‌ను విడుదల చేశారు. సీపీఎస్ విధానంలో ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగి వచ్చేనెల 1న విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌కు హాజరుకావాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎస్ సంఘం నాయకులు ఎస్‌వీవీ సత్యనారాయణ, జి.రాజారావు, ప్రకాష్, గనిరాజు, వీరబాబు, దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

● సినిమా గైడ్

వీఎస్ మహల్	ఫిదా
శ్రీవిజయాటాకీస్	జయ జానకి నాయక
శ్రీవెంకటసూర్య	నేనే రాజు నేనే మంత్రి
మురళీకృష్ణ	నేనే రాజు నేనే మంత్రి

మట్టి విగ్రహాలతో విద్యార్థుల ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో హోలీఏంజల్స్ స్కూల్ విద్యార్థులు బుధవారం మట్టి గణపతి విగ్రహాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టరు సుబాష్‌బాబు, ప్రిన్సిపాల్ పి.మహేష్ రెడ్డి, విష్ణుప్రియ పాల్గొన్నారు.



మట్టి విగ్రహలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మట్టి ప్రతిమలను పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి

● **రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి**



మట్టి వినాయక ప్రతిమల్ని పంపిణీ చేస్తున్న గోరంట్ల

గోదావరి సిటీ: వినాయకచవితి సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక వీరభద్రపురం కోదండ రామాలయం దగ్గర స్వాతిప్రమోటర్స్ వారి ఆధ్వర్యంలో భక్తులకు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడవద్దన్నారు. విగ్రహాలు పెద్దగా ఉండడం ముఖ్యం కాదని, భక్తిభావన ముఖ్యమని తెలిపారు. భక్తులకు మట్టి వినాయక ప్రతిమల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 37వవార్డు కార్పొరేటర్ పెనుగొండ విజయభారతి రామకృష్ణ మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి జలకాలుష్యం కాకుండా కాపాడాలన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించిన స్వాతి ప్రమోటర్స్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 500 వినాయక ప్రతిమల్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్వాతి ప్రమోటర్స్ డైరెక్టర్ ఆనందరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయక ప్రతిమలను భక్తులకు పంచుతున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం 10వేల వినాయకప్రతిమలను పంచనున్నామన్నారు. స్వాతి ప్రమోటర్స్ డీజీఎంలు సీవీ సత్యనారాయణ, లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఏజీఎంలు సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎ.ఆలీషా, ఎస్.శ్రీరామమూర్తి, కె.గణపతిరావు, సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యం, సీఎమ్ఎమ్‌లు ఎస్.సుబ్బారాజు, సి.కృష్ణకుమారి, కె.కృష్ణమూర్తి, కిరణ్మయి, ఎంఎం జ్యోతిర్మయి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సీతానగరం ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20న సీతానగరం లంకూరు గ్రామానికి చెందిన ఈలి భాస్కరరావు 60అనే వ్యక్తి ఉదయం లఘుశంక తీర్చుకోవడానికిగాను రోడ్డుపక్కన కూర్చోగా సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వెడుతున్న ట్రాక్టరు గుద్దుకుని తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానికులు బంధువులు చికిత్స నిమిత్తం రాజమండ్రి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జనరల్ హాస్పటల్‌కు తీసుకుని వెళ్లగా చికిత్స పొందు తూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మోటారు సైకిల్ చోరీ

పి.గన్నవరం రూరల్: పి.గన్నవరం మండలం లంకల గన్నవరం ప్రధాన రహదారి చెంతనే ఉన్న షాపులో మంగళవారం రాత్రి ఒక మోటారుసైకిల్, రూ.5వేలు నగదు చోరీకి గురైనట్టు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకలగన్నవరం గ్రామానికి చెందిన లంకే వెంకట్రావు రోడ్డుచెంతనే ఉన్న తనషాపులో మంగళవారం రాత్రి 10గంటల వరకు ఉండి ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం ఉదయం షాపు తెరిచి చూడగా హీరో మెట్రోప్లస్ మోటారుసైకిల్, బీరువాలో ఉన్న రూ.5వే లు నగదు చోరీకి గురయ్యాయని ఆయన పేర్కొన్నాడు. దీంతో సంఘటనా వివరాలను పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించినట్టు వెంకట్రావు పేర్కొన్నాడు.

వ్యక్తి అదృశ్యం

రాజానగరం: వైద్యంనిమిత్తం రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లిన తన తండ్రి ఇంటికి తిరిగి రాలేదంటూ కుమారుడు బుధవారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన లోశెట్టి రామసత్యం(51) అనే వ్యక్తి ఈనెల 20న ఉదయం 10గంటలు సమయంలో వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాస్పత్రికి బయలుదేరి వెళ్లాడు. ఇలా వెళ్లిన తన తండ్రి నేటివరకు ఇంటికి తిరిగి రాలేదని, ఆచూకీ తెలపాలంటూ కుమారుడు నాగార్జున పోలీసులు ఫిర్యాదు చేశారు. రామసత్యం కుమారుడు నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.వరప్రసాద్ ఆదేశాలమేరకు కేసు నమోదుచేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వరరావు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కోరుకొండ: ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి టి.కుసలవదర తెలిపారు. సంబంధిత ప్రోఫార్మా ప్రకారం అవార్డుకోసం ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక మండల విద్యావనరులు కేంద్రంలో నిర్ణీత గడువులోగా అందజేయాలని పేర్కొన్నారు.

రూ.2లక్షలలోపు ఆదాయంగల ఆలయాలను మాకు అప్పగించండి

● **ఏపీ అర్చక సమాఖ్య**

గోదావరిసిటీ: జిల్లాలో 2లక్షలలోపు ఆదాయం కలిగిన ఆలయాలను తమకు అప్పగించాల్సిందిగా ఏపీ అర్చక సమాఖ్య డిమాండ్ చేసింది. బుధవారం రాజమహేంద్రవరం విచ్చేసిన మంత్రి పైడికొండల మాణిక్యాలరావును కలిసి ఏపీ అర్చక సమాఖ్యనాయకులు కె.ఫణికుమార్, కేవీఎస్‌ఆర్‌ఎన్ ఆచార్యులు, పి.మురళీవెంకటరమణ, పి.రంగాచార్యులు వారి సమస్యలను విన్నవించుకుంటూ వినతి పత్రాన్ని అందజేశారు. 5లక్షలలోపు ఆదాయం గల ఆలయాల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాలను సవరించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ఏపీ అర్చక సమాఖ్య మంత్రికి విన్నవించింది.

● **హితకారిణి సమాజం అన్‌ఎయిడెడ్ అధ్యాపకుల గురించి ఆలోచిస్తాం**

హితకారిణి సమాజం ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాలయాల్లో అన్ ఎయిడెడ్ అధ్యాపకుల జీతాలను దేవాదాయ ధర్మాదాయశాఖ నిబంధనలకు లోబడి పెంపుదల చేసేందుకు కృషి చేస్తానని మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. బుధవారం శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలను ఆయన సందర్శించి ప్రిన్సిపాల్‌తో సమావేశమై వివిధ సమస్యలపై చర్చించారు.

రుణాల ఎంపికకు ఇంటర్వ్యూలు

కోరుకొండ: ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు బుదవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా పశ్చిమగోనగూడెం ఆంధ్రాబ్యాంక్, గాడాల చైతన్య గోదావరి గ్రామీణబ్యాంక్, బూరుగుపూడి విజయబ్యాంక్ పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బుద్దానూకరత్నం, జెడ్పీటీసీ మళ్లా వెంకటరత్నం, జన్మభూమి కమిటీ సభ్యులు అడపా వీరబాబు, ఇసుపాటి ప్రదీప్‌కుమార్, బూసి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన రాజమహేంద్రవరం కాపులు



కిర్లంపూడి చేరుకున్న రాజమహేంద్రవరం కాపులు

కిర్లంపూడి: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను బుధవారం రాజమహేంద్రవరం కాపులు కలిసి సంఘీభావం తెలిపారు.

జక్కంపూడి రాజా, యాళ్ల సురేష్, ఇసుకపల్లి శ్రీనివాస్, కొత్తపేట రాజు, అడపారాజు, పసుపులేటి చైతన్య తదితరులు ఆధ్వర్యంలో కాపు యువత కార్ల ర్యాలీగా రాజమహేంద్రవరం నుంచి కిర్లంపూడి చేరుకుని ముద్రగడను కలిసి మద్దతు పలికారు.

నేటితో ముగియనున్న

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంరూరల్ మండలం హుక్కుంపేటలో గల మండల పరిషత్ కార్యాలయంలో సబ్సీడీతో కూడిన కార్పొరేషన్ రుణాలకు ఎంపీడీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో బ్యాంక్ అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఎస్సీ కేటగిరీ కింద 323 మంది, బీసీ కేటగిరీ కింద 303 మంది, కాపు కార్పొరేషన్‌కింద 389మంది, మైనార్టీ కేటగిరీ కింద 18మంది, అభ్యర్థులు ఇంట ర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్‌ఆఫ్ బరోడా హుక్కుంపేట, సెంట్రల్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా కాతేరు, ధవళేశ్వరం, ఇండియన్ ఓవర్‌సీస్‌బ్యాంక్ బాలాజీపేట, కోలమూరు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మోరంపూడి శాఖల మేనేజర్లు, స్రూట్‌మి కమిటీ సభ్యులు మోతా పాపాయమ్మ, కార్యాలయం సుపరింటెండెంట్ సుబ్బారావు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి నీటిమట్టం

ధవళేశ్వరం: ధవళేశ్వరంవద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి 2లక్షల 9వేల 286క్యూసెక్కుల మిగులు ప్రవాహాన్ని ధవళేశ్వరంవద్ద కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో నీటిమట్టం 10.60 అడుగులుగా నమోదైంది. ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పుడెల్టా ప్రధాన పంటకాల్వ ద్వారా 4.100 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన కాల్వద్వారా 2.100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాల్వ ద్వారా 4000క్యూసెక్కుల చొప్పున సాగునీటీని విడుదల చేస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత



అక్రమ మద్యం అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: అర్బన్ రాజకుమారికి వచ్చిన సమాచారంతో మేరకు ఎస్‌బీ డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏజీఎస్ ఎస్ఐ శివాజి తన సిబ్బందితో కలిసి కొండగుంటూరులో ఒక బెల్టుషాపుపై దాడిచేసి అక్రమ మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని 32 మద్యం సీసాలను సీజ్ చేశారు. అనంతరం వారిని రాజానగరం పోలీసులకు అప్పగించారు.

వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ: కంబాలచెరువు సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. అనపర్తికి చెందిన పడాల సూర్యనారయణరెడ్డి(70) మద్యానికి బానిసైన అప్పులపాలయ్యారు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన ఆయన రాజమహేంద్రవరం చేరుకుని పురుగులమందు తాగడు. దీన్ని గమనించిన స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి అతడు గురువారం మృతిచెందారు. త్రీటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.